బుధవారం 15-5-2024


'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్య్రానికి అర్థం లేదు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 241

SIMULTANEOUSLY PRINTED AT CHENNAI | DELHI | VIJAYAWADA | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఢిల్లీ ఆశలు పదిలం!

చివరి లీగ్ మ్యాచ్‌లో 19 పరుగుల తేడాతో లక్నోపై గెలుపు - 12లో



మార్కెట్లకు బ్లూచిప్స్ దన్ను

సెన్సెక్స్ 328 పాయింట్లు అప్.. 22,218 వద్ద ముగిసిన నిఫ్టీ - 13లో



ముంబైలో హోర్డింగ్ విషాదం

భారీ హోర్డింగ్ కూలిన ఘటనలో సహాయ చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య 14కి చేరుకుంది.

వివరాలు 6లో ▸



నిందితుల జాబితాలో ఆప్

ఢిల్లీ మద్యం స్కామ్ మనీ లాండరింగ్ కేసు చార్జ్‌షీటులో ఆమ్ ఆద్మీ పార్టీని నిందితుల జాబితాలో చేర్చుతామని ఈడీ తెలిపింది.

వివరాలు 6లో ▸



మండీలో కంగనా నామినేషన్

ప్రముఖ బాలీవుడ్ నటి కంగనా రనౌత్ హిమాచల్‌ప్రదేశ్‌లోని మండీ నుంచి బీజేపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు.

వివరాలు 6లో ▸



రఫాలో ఇజ్రాయెల్ సైన్యం దాడి

ఇజ్రాయెల్, హమాస్ యుద్ధంలో భారతీయ మాజీ సైనికాధికారి కల్నల్ వైభవ్ బలయ్యాడు. ఘటనపై ఇజ్రాయెల్ విచారం వ్యక్తం చేసింది.

వివరాలు 6లో ▸

కళ్లకు గంతలు కట్టుకున్న ఈసీ...

పచ్చ మూకా స్వైరవిహారం

అవ్వాతాతలను, మహిళలను హడలగొట్టడమే లక్ష్యం.. రాష్ట్రవ్యాప్తంగా పచ్చ మూకల విధ్వంసకాండ

దౌర్జన్యాలకు దారి చూపిన ఎన్నికల కమిషన్

- చంద్రబాబు, పురందేశ్వరి కుట్రలకు తలొగ్గిన వైనం 2లో
- క్షేత్రస్థాయిలో పట్టున్న పోలీసు ఉన్నతాధికారుల ఆకస్మిక బదిలీ
- అవగాహనలేని అధికారులకు సమస్యాత్మక జిల్లాల్లో పోస్టింగ్‌లు
- చిన్నమ్మ జాబితా ప్రకారమే నియామకాలు
- ఫలితంగా యథేచ్ఛగా దాడులకు తెగబడ్డ పచ్చ మూకలు
- చోద్యం చూసిన అధికారులు.. రావణకాష్టంగా మారిన రాష్ట్రం
- ఎన్నికల నిర్వహణ, శాంతి భద్రతల పరిరక్షణలో ఈసీ ఘోర వైఫల్యం


పద్మావతీ మహిళా వర్సిటీ వద్ద వైఎస్సార్‌సీపీ నాయకుల వాహనాలను పెట్రోల్ పోసి తగలబెడుతున్న పచ్చ మూకలు


తాడిపత్రిలో ట్రాక్టరులో రాళ్లు తీసుకువచ్చి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పెద్దారెడ్డి ఇంటిపైకి విసురుతున్న టీడీపీ మూకలు


పెదకూరపాడు నియోజకవర్గం కంభంపాడులో టీడీపీ గూండాల దాడిలో తీవ్రంగా గాయపడిన వైఎస్సార్‌సీపీ సర్పంచ్ ఆర్.నాగేశ్వరరావు

తాడిపత్రిలో బరితెగించిన టీడీపీ శ్రేణులు

ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఇంటిపై టీడీపీ రాళ్ల దాడి.. అనుచరులతో కలిసి జేసీ ప్రభాకర్‌రెడ్డి హింసాకాండ

టీడీపీ రాళ్లదాడిలో సీఐ, బీఎస్ఎఫ్ జవాన్‌కు గాయాలు 5లో

చంద్రగిరిలో టీడీపీ దౌర్జన్యకాండ

వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మోహిత్‌రెడ్డిపై దాడికి యత్నం 2లో

దాడులు.. లూటీలు.. విధ్వంసం

టీడీపీ నేతల మూక దాడులతో అట్టుడికిన పల్నాడు జిల్లా.. భయం గుప్పెట్లో పదుల సంఖ్యలో పల్లెలు 10లో



గురుకుల ప్రవేశ పరీక్ష ఫలితాలు వెల్లడి

ఏపీ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలోని గురుకుల పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో 2024–25 విద్యా సంవత్సరం ప్రవేశాల కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. సంస్థ పరిధిలోని 38 సాధారణ పాఠశాలల్లో 5వ తరగతి సీట్లు, 12 మైనారిటీ పాఠశాలల్లో ఎస్సీ, ఎస్టీ కేటగిరీ సీట్లు, 6 నుంచి 8 తరగతుల్లో మిగిలిన సీట్లతో పాటు, ఇంటర్, డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలకు పరీక్ష నిర్వహించారు.

- వివరాలు 3లో



పాఠశాలలకు ఫ్యూచర్ స్కిల్ నిపుణులు

- 7,071 హైస్కూళ్లకు 2,379 మంది నియామకానికి చర్యలు
- జూన్ నుంచి విద్యార్థులకు సాంకేతిక అంశాలపై శిక్షణ

- వివరాలు 3లో



చంద్రబాబుకు శాశ్వతంగా బైబై

- మహిళలంతా వైఎస్సార్‌సీపీకి జేజేలు పలికారు
- పసుపు పార్టీకి కంట్లో కారం కొట్టారు.. వార్ వన్ సైడ్.. మా పార్టీదే విజయం
- మీడియాతో వాసిరెడ్డి పద్మ

- వివరాలు 2లో

రాష్ట్రంలో 81.3% పోలింగ్!

పోస్టల్ బ్యాలెట్ కలిపితే 82.5 శాతం!

వెల్లడించిన సీఈవో కార్యాలయం వర్గాలు

కొన్ని చోట్ల సోమవారం రాత్రి 2 గంటల వరకు పోలింగ్ : సీఈవో






సాక్షి, అమరావతి: రాష్ట్రంలో సోమవారం జరిగిన అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో 81.3% పోలింగ్ జరిగింది. పోస్టల్ బ్యాలెట్ 1.2 శాతాన్ని కలుపుకొంటే ఇది 82.5 శాతమని రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈవో) కార్యాలయం వర్గాలు మంగళవారం రాత్రి వెల్లడించాయి. ఈ వివరాలను కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) ధృవీకరించాల్సి ఉంది. 2019 ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ 0.6 శాతంతో కలుపుకొని 79.8 శాతం నమోదైంది. ఈసారి ఎన్నికల్లో రాత్రి 12 గంటల వరకు 79.40 శాతం నమోదైనట్లు

మిగతా 5వ పేజీలో ▸

ప్రధాని నామినేషన్



ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి నుంచి ప్రధాని మోదీ నామినేషన్ దాఖలు చేశారు. మోదీకి మద్దతుగా కేంద్ర మంత్రులు, బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఎన్డీఏ కూటమి పార్టీల అగ్ర నేతలు నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం కాశీలో బీజేపీ నేతలు, కార్యకర్తలతో సమావేశమైన మోదీ మాట్లాడుతూ.. ''జమ్మూకశ్మీర్‌లో రద్దయిన ఆర్టికల్ 370కి గుర్తుగా కాశీలోని ప్రతి బూత్‌లో గతంతో పోలిస్తే నాకు 370 ఎక్కువ ఓట్లు పడేలా చేసే బాధ్యత మీదే' అని అన్నారు. 6లో



దేశంలో ఐఐఎం-అహ్మదాబాద్ టాప్

- సెంటర్ ఫర్ వరల్డ్ వర్సిటీ ర్యాంకింగ్స్‌లో 65 భారతీయ వర్సిటీలు
- టాప్ రెండువేల స్థానాల్లో 32 భారతీయ వర్సిటీల స్థానాల మెరుగు.. 33 వర్సిటీల క్షీణత
- ప్రపంచంలో ఈ విద్యా సంస్థకు 410వ స్థానం 3లో
- ఐఐఎస్సీకి 501వ ర్యాంకు, ఐఐటీ–ముంబైకు 568వ ర్యాంకు
- హార్వర్డ్ వర్సిటీకి ప్రపంచంలోనే టాప్
- వరల్డ్ టాప్–10 వర్సిటీలు అన్నీ అమెరికాకు చెందినవే
- ప్రపంచ ర్యాంకింగ్స్‌లో భారత్‌కు చెందిన 65 విద్యా సంస్థలకు చోటు

ఆర్టీసీ బస్ ఢీకొని నలుగురు కూలీలు దుర్మరణం


ఊడిమూడి వద్ద ధాన్యం ట్రాక్టర్‌ను ఢీ కొట్టిన ఆర్టీసీ బస్

మరో ఇద్దరికి తీవ్ర గాయాలు

ధాన్యం బస్తాలను ట్రాక్టర్‌పై లోడ్ చేసి పగ్గాలు కడుతుండగా ప్రమాదం

కోనసీమ జిల్లా ఊడిమూడిలో దుర్ఘటన

పి.గన్నవరం: ధాన్యాన్ని లోడ్ చేస్తుండగా ట్రాక్టర్‌ను ఆర్టీసీ బస్ ఢీకొట్టడంతో నలుగురు వ్యవసాయ కూలీలు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడగా.. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం ఊడిమూడి గ్రామం వద్ద మంగళవారం రాత్రి ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఊడిమూడి గ్రామం వద్ద ట్రాక్టర్‌పై ధాన్యం బస్తాలను 10 మంది కూలీలు లోడ్ చేశారు. అనంతరం వారంతా కలిసి బస్తాలు జారిపోకుండా పగ్గం వేస్తుండగా.. ఆ ట్రాక్టర్‌ను రాజోలు నుంచి రావులపాలెం వెళుతున్న ఆర్టీసీ బస్ వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో జి.పెదపూడికి చెందిన కూలీలు నూకపెయ్యి శివ (35), వాసంశెట్టి సూర్యనారాయణ (45), ఈరి కట్లయ్య (50), ఊడిమూడి శివారు ఆదిమూలంవారిపాలెంకు చెందిన చిలకలపూడి మణిబాబు (30) మృత్యువాత పడ్డారు. ఆదిమూలవారిపాలెంకు చెందిన చిలకలపూడి సురేష్, జి.పెదపూడికి చెందిన బొరుసు నానికి తీవ్ర గాయాలు కాగా.. వారిని అమలాపురం ఆస్పత్రికి తరలించారు. చిలకలపూడి సురేష్ పరిస్థితి విషమంగా ఉందని స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదం నుంచి బొరుసు రాంబాబు, బుజ్జి, వాసంశెట్టి సాయికిరణ్, గూనపాటి పెద్దిరాజు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని స్థానికులు రహదారిపై ఆందోళన చేపట్టారు. జిల్లా పరిషత్ చైర్మన్, పి.గన్నవరం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు ఘటనా స్థలాన్ని పరిశీలించి బాధిత కుటుంబాలను పరామర్శించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం చేయించడంతో పాటు బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని ఉన్నతాధికారులను ఫోన్‌లో కోరారు.

విశాఖలోనే సీఎంగా జగన్ ప్రమాణ స్వీకారం

రెండు మూడు రోజుల్లో తేదీ ప్రకటిస్తాం

రాష్ట్రంలో ఫ్యాన్ గాలి బలంగా వీచింది

- ఐదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమమే విజయం వైపు తీసుకెళుతోంది
- మహిళలంతా వైఎస్సార్‌సీపీ వైపే
- చంద్రబాబు కుయుక్తులు పనిచేయలేదు
- మంత్రి బొత్స సత్యనారాయణ


మీడియాతో మాట్లాడుతున్న మంత్రి బొత్స చిత్రంలో వైఎస్సార్‌సీపీ నేతలు

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో పోలింగ్ సరళి చూస్తుంటే ఫ్యాన్ గాలి బలంగా వీచిందని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా విశాఖలోనే ప్రమాణ స్వీకారం చేస్తారని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ చెప్పారు. రెండు మూడు రోజుల్లో ప్రమాణ స్వీకారానికి తేదీ కూడా ప్రకటిస్తామని చెప్పారు. ఆయన మంగళవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ.. వచ్చే నెల 4వ తేదీన ఊహించని ఫలితాలు రానున్నాయని చెప్పారు. రాజకీయాల్లో నిజాయితీ, హామీల అమలు ముఖ్యమని తెలిపారు. సీఎం వైఎస్ జగన్ ఇలాంటి ప్రమాణాలు పాటిస్తూ రాజకీయాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చారన్నారు. ఈ ఐదేళ్ల పాలనలో సీఎం జగన్ చేసిన సంక్షేమం, అభివృద్ధి వైఎస్సార్‌సీపీని విజయం వైపు

మిగతా 2వ పేజీలో ▸

ఇదండీ సంగతి



ఎందుకయ్యా అంత టెన్షన్! మర్చిపోయింది దూదేగా కత్తెర కాదుగా!

క్లుప్తంగా...

మన సుపరిపాలన మరింత మెరుగ్గా కొనసాగుతుంది

- నాకు ఆశీస్సులు ఇవ్వడానికి సునామీలా తరలివచ్చిన అందరికీ కృతజ్ఞతలు
- ఎక్స్‌లో సీఎం వైఎస్ జగన్ పోస్టు



సాక్షి, అమరావతి: రాష్ట్ర అసెంబ్లీతో పాటు లోక్‌సభ ఎన్నికల కోసం పెద్ద ఎత్తున తరలివచ్చి పోలింగ్‌లో పాల్గొన్న ఓటర్లందరికీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ మేరకు సీఎం జగన్ మంగళవారం పోస్టు చేశారు. ''నిన్న జరిగిన ఎన్నికల్లో మండుటెండలు సైతం లెక్కచేయకుండా నాకు ఆశీస్సులు ఇవ్వడానికి సునామీలా తరలివచ్చిన నా అవ్వాతాతలకు, నా అక్కచెల్లెమ్మలకు, నా అన్నదమ్ములకు, నా రైతన్నలకు, నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనారిటీలకు, నా యువతీయువకులందరికీ పేరుపేరునా శిరస్సు వంచి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. మన వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం చెమటోడ్చి శ్రమించిన నా కార్యకర్తలందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు. ఇప్పటి వరకు సాగిన మన సుపరిపాలన, మరింత మెరుగ్గా కొనసాగుతుందని హామీ ఇస్తున్నాను'' అని సీఎం జగన్ ట్వీట్ చేశారు.

చంద్రబాబుకు శాశ్వతంగా బైబై: వాసిరెడ్డి

సాక్షి, అమరావతి: సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌లో బారులు తీరిన మహిళలంతా పసుపు పార్టీకి కంట్లో కారం కొట్టారని వైఎస్సార్‌సీపీ నాయకురాలు వాసిరెడ్డి పద్మ తెలిపారు. రెండో ఆలోచన అనేది లేకుండా చంద్రబాబుకి శాశ్వతంగా బైబై బాబు చెప్పారన్నారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో మంగళవారం వాసిరెడ్డి పద్మ మాట్లాడారు. మహిళలంతా వైఎస్సార్‌సీపీకే జేజేలు పలికారన్నారు. సీఎం వైఎస్ జగన్ అందజేసిన సంక్షేమ పథకాలకి ఓటు రూపంలో అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతలు రుణం తీర్చుకొన్నారని తెలిపారు. మండే ఎండను సైతం లెక్క చేయకుండా ఫ్యాను గుర్తుకు ఓటేసేందుకు తండోపతండాలుగా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారన్నారు. వార్ వన్ సైడ్ అన్నట్లుగా వైఎస్సార్‌సీపీ విజయం సాధించబోతోందని తెలిపారు. చంద్రబాబు రాజకీయాలు వదిలేసి ఇంటికి పరిమితం కావాల్సిందేనన్నారు. ఎలాగూ గెలవలేమని ఎన్నికల సమయం చివరిలో టీడీపీ నేతలు దాడులు చేశారని మండిపడ్డారు. ఒక ప్రభుత్వానికి మద్దతుగా ఇంత పాజిటివ్ ఓటు ఉప్పెనలా పోటెత్తడం దేశ చరిత్రలో ఇదే ప్రథమమన్నారు.

ఈనాడు కథనం దుర్మార్గం

ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ కార్యదర్శి సుబ్బారావు



తణుకు అర్బన్: ఆర్టీసీ విలీనంపై ఈనాడు దినపత్రికలో గతనెల 28న 'బతుకు చక్రబంధం' శీర్షికన తన ప్రమేయం లేకుండా తన పేరిట కథనం ప్రచురించడం దుర్మార్గమని ఏపీఎస్‌ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ కార్యదర్శి బీవీఎస్ సుబ్బారావు మంగళవారం పేర్కొన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా విధులు నిర్వర్తిస్తున్న తాను చెప్పినట్లు ఈనాడు అసత్య కథనం ప్రచురించిందని మండిపడ్డారు. ప్రభుత్వంపై వ్యతిరేక వార్తల్లో భాగంగా తనకు సంబంధం లేకుండా తాను మాట్లాడినట్టుగా కథనం ప్రచురించారన్నారు. ఈనాడుపై న్యాయపోరాటం చేయదలచుకున్నానని స్పష్టం చేశారు. స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు.

టీడీపీకి ప్రతిపక్ష హోదా కష్టమే: నౌడు



సాక్షి, అమరావతి: 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టారని ఏపీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నౌడు వెంకటరమణ అన్నారు. ఫలితాల్లో ఫ్యాన్ గుర్తు ఒక సునామీ సృష్టించబోతోందని.. టీడీపీకి ప్రతిపక్ష హోదా కూడా దక్కదనిపిస్తోందని చెప్పారు. తాడేపల్లిలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అత్యధిక శాతం ఓటర్లు వైఎస్సార్‌సీపీ వైపే మొగ్గుచూపి ఫ్యాన్ గుర్తుకే ఓట్లేశారన్నారు. సిద్ధం సభల్లో కనిపించిన జనసునామీ ఈనెల 13న కూడా పోలింగ్ బూతుల వద్ద కనిపించిందన్నారు. సిద్ధం సభలకు వచ్చిన జనాన్ని చూసి బస్సులు పెట్టి జనాన్ని తెచ్చారని చంద్రబాబు, పవన్ విమర్శించారని.. అదే జనం ఈరోజు పోలింగ్ కేంద్రల వద్ద బారులుతీరారని వెంకటరమణ చెప్పారు. నిజానికి.. టీడీపీ వాళ్లు హైదరాబాద్ నుంచి ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తరలించారని.. కానీ, సీఎం జగన్ ఒక్క వాహనం కూడా సమకూర్చక పోయినా ఓటర్లు తండోపతండాలుగా వచ్చారన్నారు.

తెలంగాణలో లోక్‌సభ పోలింగ్ 66.3 శాతం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలోని 17 లోక్‌సభ నియోజకవర్గాలకు సోమవారం జరిగిన ఎన్నికల్లో 66.3 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ తుది గణాంకాలను తెలంగాణ సీఈవో మంగళవారం విడుదల చేశారు. మొత్తం 3,32,16,348 మంది ఓటర్లకుగాను 2,20,24,806 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. భువనగిరి లోక్‌సభ స్థానంలో 76.78%, హైదరాబాద్ లోక్‌సభ స్థానంలో 48.48% పోలింగ్ నమోదయ్యాయి.

పచ్చ ముఠా స్వైరవిహారం

సాక్షి, అమరావతి: ఈసీ చేష్టలుడిగి చూస్తుండటంతో పచ్చముఠాలు ఆయుధాలు చేతబట్టి వీధుల్లో వీరంగం వేస్తున్నాయి! ఎన్నికల వేళ తమ మాట వినలేదనే ఉక్రోషంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఇళ్లపై దాడులకు తెగబడుతున్నాయి. టీడీపీ రౌడీ మూకల మారణకాండతో మహిళలు, వృద్ధులు, పిల్లలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. శాంతి భద్రతల పరిస్థితిని సమీక్షించి కఠిన చర్యలు చేపట్టాల్సిన ఈసీ ఈ అరాచకాలకు పరోక్షంగా కొమ్ముకాస్తుండటం విస్మయపరుస్తోంది. ఈ ఎన్నికల ఫలితాలను నిర్దేశించేది గ్రామీణ ప్రజలు, మహిళలు, అవ్వాతాతలేనని పసిగట్టిన పచ్చ ముఠాలు వారిని ఇంటి నుంచి బయటకు రాకుండా చేయడమే లక్ష్యంగా హింసాత్మక ఘటనలకు తెర తీశాయి. వైఎస్సార్ సీపీకి ఓటేస్తారని ఖాయంగా తేలడంతో వారి ఓటింగ్ శాతాన్ని తగ్గించేందుకు ఉద్రికత్తలు రేకెత్తించాయి. 'మనవాళ్లంతా ఉదయం 11 గంటలకల్లా ఓటేసేయాలి' అని చంద్రబాబు పోలింగ్‌కు ముందురోజు పిలుపునివ్వడం చూస్తే.. మధ్యాహ్నం నుంచి హింసకు తెగబడనున్నారని, అవ్వాతాతలను, మహిళలను పోలింగ్ బూత్‌లకు రానీయకుండా చేయాలన్న కుట్ర ఇందులో దాగి ఉందని తేటతెల్లమవుతోంది. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గిన ఈసీ పోలీసు ఉన్నతాధికారులను బదిలీ చేసిన జిల్లాల్లో హింస కొనసాగుతుండటమే దీనికి నిదర్శనం. తాజాగా పల్నాడు జిల్లా కొత్త గణేశునిపాడులో వైఎస్సార్‌సీపీకి ఓటేసేశారనే అనుమానంతో బీసీ సామాజిక వర్గానికి చెందిన వారిపై టీడీపీ మద్దతుదారులు దాడులకు దిగడంతో మహిళలు, పిల్లలు రాత్రంతా ఓ దేవాలయంలో తలదాచుకుని క్షణక్షణం భయంభయంగా గడిపారు.



మహిళా యూనివర్సిటీ స్ట్రాంగ్ రూమ్ వద్ద ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సోదరుడు రఘునాథరెడ్డి ద్విచక్ర వాహనాన్ని ధ్వంసం చేస్తున్న టీడీపీ కార్యకర్తలు

కుట్రలకు పరోక్ష సహకారం

మ్యాచ్ రిఫరీ తరహాలో ఎన్నికల నిర్వహణలో నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన ఈసీ రాజకీయాల కుట్రలకు తలొగ్గింది! పోలింగ్ సందర్భంగా, అనంతరం దాడులకు పాల్పడ్డాలని టీడీపీ రూపొందించిన ముందస్తు కుట్రలకు దాసోహమైంది. సమస్యాత్మక జిల్లాల్లో పోలీసు ఉన్నతాధికారులను హఠాత్తుగా బదిలీ చేసి చంద్రబాబు కుట్రల అమలుకు దారి చూపింది. టీడీపీ అధినేత ఆదేశాలతో పురందేశ్వరి సూచించిన అధికారులను ఆ స్థానాల్లో నియమించి పచ్చ కుట్రలకు పరోక్షంగా సహకరించింది. ఇదే అదునుగా టీడీపీ రౌడీలు బరితెగించి దాడులకు పాల్పడి విధ్వంసం సృష్టిస్తున్నా.. బాంబుల మోత మోగిస్తున్నా ఆ జిల్లాలపై పట్టులేని పోలీసు యంత్రాంగం ప్రేక్షక పాత్ర పోషిస్తోంది.

ఒత్తిడికి తలొగ్గి హఠాత్తుగా బదిలీలు

జిల్లాలపై క్షేత్రస్థాయిలో గట్టి పట్టున్న పోలీసు అధికారులు కొనసాగితే ఎన్నికల వేళ తమ పథకం పారదని చంద్రబాబు ముఠా ఆందోళన చెందింది. ఈ క్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరితో కలసి చంద్రబాబు పన్నిన పన్నాగంలో ఈసీ చిక్కుకుంది. విజ్ఞతతో ఆలోచించకుండా ఒత్తిడితో అసంబద్ధ నిర్ణయాలు తీసుకుంది. సున్నితమైన జిల్లాలు, సమస్యాత్మక నియోజకవర్గాలపై క్షేత్రస్థాయిలో పూర్తి పట్టున్న అధికారులను ఇష్టానుసారంగా బదిలీలు చేసింది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటన తరువాత రాజ్యాంగబద్ధంగా అధికార వ్యవస్థ అంతా ఈసీ ఆధీనంలోకి వెళుతుంది. అధికార యంత్రాంగం ద్వారా ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించాల్సిన పూర్తి బాధ్యత ఈసీదే. అయితే టీడీపీ, బీజేపీ ఫిర్యాదులను సహేతుకంగా విశ్లేషించి నిర్ణయాలు తీసుకోవాల్సిన ఈసీ తన బాధ్యతను విస్మరించి అసంబద్ధంగా వ్యవహరించింది. చంద్రబాబు, పురందేశ్వరి ఫిర్యాదు చేయడమే ఆలస్యం వారు కోరినట్లుగా పోలీసు ఉన్నతాధికారులను బదిలీ చేసేసింది. ఏకంగా 29 మంది అధికారులను బదిలీ చేయడం గమనార్హం. వీరిలో నలుగురు మినహా 25 మంది పోలీసు అధికారులే ఉన్నారు. సమస్యాత్మక నియోజకవర్గాలుగా ఈసీ గుర్తించిన పల్నాడు, ప్రకాశం, వైఎస్సార్ కడప, అన్నమయ్య, తిరుపతి, అనంతపురం జిల్లాల్లోని అధికారులే 90 శాతం మంది ఉన్నారు.

పురందేశ్వరి జాబితా ప్రకారమే అంతా

రాష్ట్ర శాంతి భద్రతలను పర్యవేక్షించాల్సిన డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి, నిఘా విభాగం ఇన్‌చార్జ్ పీఎస్ఆర్ ఆంజనేయులతోపాటు పల్నాడు పరిధిని పర్యవేక్షించే గుంటూరు డీఐజీ పాలరాజు, అనంతపురం, అన్నమయ్య, తిరుపతి, వైఎస్సార్ జిల్లాలను పర్యవేక్షించే అనంతపురం డీఐజీ అమ్మిరెడ్డిని ఈసీ హడావుడిగా బదిలీ చేయడం విస్మయకరం. సమస్యాత్మక నియోజకవర్గాలు అత్యధికంగా ఉన్న పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అనంతపురం ఎస్పీలు, విజయవాడ సీపీలను కూడా ఈసీ హఠాత్తుగా బదిలీ చేసింది. డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు కలిపి మొత్తం 14 మందిని బదిలీ చేయడం గమనార్హం. ఈ అధికారులంతా పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు కొద్ది నెలలుగా కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నారు. అలాంటి వారిని రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి ఈసీ బదిలీ చేయడం విభ్రాంతికరం. పోనీ ఆ స్థానంలో నియమించిన పోలీసు అధికారుల విషయంలోనైనా ఈసీ సహేతుకంగా ఆలోచించి నిర్ణయం తీసుకుందా అంటే అదీ లేదు. చంద్రబాబు ఆదేశాలతో పురందేశ్వరి సమర్పించిన జాబితాలోని పోలీసు అధికారులకే ఈసీ పోస్టింగులు ఇవ్వడం విభ్రాంతికరం. ఎన్నికల వేళ రాజకీయ పార్టీలు పోలీసు అధికారులపై ఫిర్యాదు చేయడం సహజం. కానీ ఆ స్థానాల్లో ఎవరిని నియమించాలో కూడా సూచిస్తూ జాబితాను సమర్పించడం ఇప్పటివరకు దేశ చరిత్రలోనే లేదు. తమ అధికార పరిధిలో జోక్యం చేసుకోవటాన్ని తీవ్రంగా పరిగణించాల్సిన ఈసీ అందుకు విరుద్ధంగా జాబితాను ఆమోదించి చేతులు దులుపుకొంది.

ఈసీ దన్నుతో టీడీపీ విధ్వంసకాండ

తాము చెప్పినట్లుగా ఎన్నికల కమిషన్ ఆడుతుండటంతో టీడీపీ మూకలు యథేచ్ఛగా విధ్వంసానికి దిగాయి. పోలీసు అధికారులను ఈసీ బదిలీ చేసిన జిల్లాల్లోనే హింస చెలరేగడం, పచ్చ ముఠాలు రక్తపాతానికి తెగబడటం గమనార్హం. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలతోపాటు సీఎం జగన్‌కు వెన్నంటి నిలిచిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, మహిళలు, పేద వర్గాలే లక్ష్యంగా టీడీపీ దాడులకు పాల్పడుతోంది. పల్నాడు, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి, అనంతపురం, వైఎస్సార్ జిల్లాల్లో టీడీపీ గూండాలు, రౌడీ మూకలు కర్రలు, కత్తులు, బాంబులతో స్వైర విహారం చేస్తున్నారు.

పల్నాడులో పురి విప్పిన ఫ్యాక్షన్..

పల్నాడులో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, కాసు మహేశ్‌రెడ్డిపై టీడీపీ మూకలు దాడులకు దిగాయి. పిన్నెల్లి కుమారుడు గౌతమ్‌రెడ్డితోపాటు ఆయన అనుచరులకు తీవ్రగాయాలయ్యాయి. నరసరావుపేట వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి నివాసం, ఆసుపత్రులపై టీడీపీ గూండాలు రాళ్ల వర్షం కురిపించారు. వాహనాలను ధ్వంసం చేశారు. ఈ దాడిలో 15 మంది వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు గాయపడ్డారు. గురజాల నియోజకవర్గంలో టీడీపీ నేతలు బాంబు దాడులకు దిగి బీభత్సం సృష్టించారు. పిడుగురాళ్ల శివారు ప్రాంతం, మాచవరం మండలంలోని కొత్త గణేశునిపాడులో ఎస్సీ, బీసీ కుటుంబాలపై టీడీపీ రౌడీలు దాడులకు తెగబడటంతో బాధితులు రాత్రంగా ఓ గుడిలో తలదాచుకున్నారు.

సీమలో చెలరేగిన హింస..

తిరుపతి జిల్లా చంద్రగిరి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి వాహనశ్రేణిపై టీడీపీ మూకలు దాడి చేసి రెండు కార్లను ధ్వంసం చేశాయి. అనంతపురం జిల్లా తాడిపత్రిలో టీడీపీ మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి తన కుమారుడు అస్మిత్‌రెడ్డి, అల్లుడు దీపక్‌రెడ్డితో కలసి విధ్వంసానికి పాల్పడ్డారు. వైఎస్సార్‌సీపీ నేతల ఇళ్లపై రాళ్లతో దాడులు చేయించారు. వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగులో బీజేపీ అభ్యర్థి ఆదినారాయణరెడ్డి ప్రత్యక్షంగా దాడులకు నేతృత్వం వహించారు.

టీడీపీ దాడులపై ఈసీకి వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు

సాక్షి,అమరావతి: పల్నాడు జిల్లా మాచవరం మండలం కొత్తగణేషునిపాడులో టీడీపీ గూండాల దాడుల ఘటనపై ఈసీకి వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు చేసింది. మంగళవారం సచివాలయంలో నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మలసాని మనోహర్ రెడ్డి, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు అంకంరెడ్డి నారాయణమూర్తి ఎన్నికల అధికారులను కలిసి దాడులకు సంబంధించిన ఆధారాలను అందజేశారు. మంత్రి అంబటి మాట్లాడుతూ.. కొత్తగణేషునిపాడులో పోలింగ్ ముగిశాక యాదవ కాలనీ, రజక కాలనీలపై టీడీపీ శ్రేణులు మూకుమ్మడిగా దాడులు చేయడంతో వారు ప్రాణాలు అరచేతిలో పట్టుకుని కాలనీలు వదిలి గంగమ్మ ఆలయంలో రాత్రి తలదాచుకుని బిక్కుబిక్కుమంటూ కాలం గడిపారన్నారు. పోలీసు అధికారులకు సమాచారం అందించినా స్పందించ లేదని ఆరోపించారు. మంగళవారం ఎమ్మెల్యే కాసు కృష్ణారెడ్డి, ఎంపీ అభ్యర్థి అనిల్ కుమార్ యాదవ్ లు బాధితులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారని, గ్రామం నడిబొడ్డులో ఉన్న మరికొంతమందిని పరామర్శించేందుకు వెళ్లిన తమ పార్టీ నేతలపై టీడీపీ శ్రేణులు కర్రలు, మారణాయుధాలతో దాడి చేశాయన్నారు.

సమర్థులను తప్పించి అనుకూలురకు పోస్టింగ్‌లు

ఐజీ పాలరాజు, ఎస్పీ రవిశంకర్‌రెడ్డిపై టీడీపీ తప్పుడు ఫిర్యాదులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఎన్నికల సందర్భంగా పల్నాడులో హింస చెలరేగేందుకు ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయాలే కారణమనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. క్షేత్రస్థాయి పరిస్థితులపై సంపూర్ణ అవగాహన ఉన్న పోలీసు అధికారులను ఆకస్మికంగా బదిలీ చేసి కొత్తవారికి బాధ్యతలు అప్పగించడమే దీనికి కారణమని పేర్కొంటున్నారు. ఎన్నికల రోజే కాకుండా మర్నాడు కూడా హింస కొనసాగుతున్నా అడ్డుకోలేని నిస్సహాయ స్థితిలో పోలీసు యంత్రాంగం ఉండిపోవడం దీనికి నిదర్శనం. ఘర్షణలు జరుగుతున్న ప్రాంతాలకు వెళ్లకుండా పోలీసు సిబ్బందిని ఎవరు నియంత్రించారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. పోలీసు బలగాలు భారీగా అందుబాటులో ఉన్నా తాపీగా గంటన్నర తరువాత చేరుకోవడం, ఈలోగా టీడీపీ నాయకులు విధ్వంసానికి తెగబడటంపై కేంద్ర ఎన్నికల సంఘం నుంచి వచ్చిన పోల్ అబ్జర్వర్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం.

సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసులెక్కడ?

ఎన్నికలకు ముందు గుంటూరు రేంజి ఐజీగా పాలరాజు, పల్నాడు ఎస్పీగా రవిశంకరరెడ్డి లాంటి సమర్థ అధికారులున్నారు. వారు ఉంటే తమ ఆటలు సాగవనే భయంతో టీడీపీ పదేపదే ఫిర్యాదులు చేస్తూ వచ్చింది. పురందేశ్వరి ద్వారా రాజకీయంగా ఒత్తిళ్ల తెచ్చింది. దీంతో ఎన్నికల కమిషన్ వీరి స్థానంలో డీఐజీగా సర్వశ్రేష్ఠ త్రిపాఠీ, ఎస్పీగా బిందుమాధవ్‌ను నియమించింది. ఎన్నికలకు 4 రోజుల ముందు మాచర్ల, కారంపూడి సీఐలతో పాటు వెల్దుర్తి ఎస్ఐలను మార్చి టీడీపీకి అనుకూలంగా ఉండే వారికి పోస్టింగ్ ఇచ్చారు. ఆ తరువాత పచ్చ ముఠాలు రెచ్చిపోయాయి. మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి భార్యతో పాటు కుమారుడిపై కూడా దాడి జరిగింది. ఎన్నికల సమయంలో స్థానిక పరిస్థితులపై అవగాహన ఉన్న వారిని నియమిస్తే రౌడీ మూకలు, నేరగాళ్లను సమర్థంగా అదుపు చేసే అవకాశం ఉంటుంది. బదిలీల తరువాత దీనికి భిన్నంగా జరిగింది.

అంబటిపై రివాల్వర్ ఎక్కుపెట్టి..

సమస్యాత్మక కేంద్రాల గురించి తెలిసినా బందోబస్తు కల్పించకుండా ఒక్క కానిస్టేబుల్‌తో సరిపెట్టారు. మంత్రి అంబటి రాంబాబు ఫోన్ చేసినా, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఫోన్ చేసినా పోలీసు సిబ్బంది కనీసం స్పందించని పరిస్థితి నెలకొంది. మాచర్లలో పోలీసుల తీరు ఆక్షేపణీయంగా ఉంది. వైఎస్సార్‌సీపీ అనుకూల గ్రామాలలో భారీ బందోబస్తు ఏర్పాటు చేసి ఓటర్లు బయటకు రావడానికి భయపడే పరిస్థితి కల్పించారు. టీడీపీ అనుకూల గ్రామాల్లో ఎస్ఐ స్థాయి అధికారి కూడా లేకుండా చేశారు. ఎమ్మెల్యే కుమారుడిపై దాడి చేసినా పోలీసులు స్పందించలేదు. ఈవీఎంలు ధ్వంసం చేసి వైఎస్సార్ సీపీ ఏజెంట్లు లేకుండా చేసి టీడీపీ నేతలు రిగ్గింగ్‌కు దిగారు. మంత్రి అంబటిని హౌస్ అరెస్టు చేసి టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణను పోలింగ్ బూత్‌ల వద్దకు తిరిగేందుకు అనుమతించారు. కన్నా కుమారుడు బెదిరిస్తున్నట్లు ఫిర్యాదులు అందినా సీఐ స్పందించలేదు. ఘటనాస్థలికి వచ్చిన మంత్రి అంబటిపై రివాల్వర్ ఎక్కు పెట్టే ధైర్యం ఎలా వచ్చింది? ఈ ప్రశ్నలకు పోలీసులు సమాధానం చెప్పాల్సి ఉంది. సత్తెనపల్లిలో చీఫ్ ఏజెంట్‌గా ఉన్న మంత్రి అంబటి అల్లుడు ఉపేష్‌పై దాడి చేసినా పోలీసులు స్పందించలేదు. నరసరావుపేటలో ఎమ్మెల్యే ఇంటిపైదాడి చేశారు.

ఎమ్మెల్యే వస్తున్నారని తెలిసినా..

గురజాల నియోజకవర్గంలో టీడీపీ శ్రేణుల అరాచకం అంతా ఇంత కాదు. మాచవరం మండలంలోని కొత్త గణేశునిపాడు, కేసానుపల్లిలో బీసీ, ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన వారిపై దాడులకు తెగబడ్డాయి. తమ మాట వినకుండా వైఎస్సార్ సీపీకి ఓటేశారనే ఆగ్రహంతో టీడీపీ మద్దతుదారులు దాడులకు దిగడంతో బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారు సోమవారం రాత్రి గ్రామంలోని గంగమ్మ గుడిలో తలదాచుకున్నారు. వారిని పరామర్శించడానికి ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్ రావడంతో వారిపై కూడా దాడులకు బరి తెగించారు. దీంతో పోలీసులు గాలిలోకి కాల్పులు జరపాల్సి వచ్చింది. ఘటనా స్థలానికి ఒక ఎమ్మెల్యే వెళ్తున్నారని సమాచారం ఉన్నా సరైన బందోబస్తు కల్పించకపోవడం, పరిస్థితిని నియంత్రించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. గ్రామంలో బీసీలు, ఎస్సీలు ఎస్టీలు పెద్ద ఎత్తున వైఎస్సార్ సీపీలో చేరడంతో తమ ఆధిపత్యానికి గండిపడుతుందని భావించి ఎన్నికలు ముగిసిన వెంటనే ఇళ్లపై దాడులకు తెగబడ్డారు. 2019లో కూడా కాసు మహేష్‌రెడ్డిపై ఇదే గ్రామంలో దాడికి ప్రయత్నించారు. పల్నాడులో గెలవలేమని టీడీపీ నిర్ధారణకు రావడంతో దాడులు, దౌర్జన్యాలు, ఈవీఎంల ధ్వంసానికి పూనుకుంది. ఇదంతా టీడీపీ కేంద్ర కార్యాలయం ఆదేశాల మేరకే జరిగినట్లు చెబుతున్నారు. సస్పెండ్ అయిన పోలీసు అధికారి ఏబీ వెంకటేశ్వరరావు, మాజీ డీజీపీ ఆర్పీ ఠాకూర్ టీడీపీ కేంద్ర కార్యాలయంలో కూర్చుని పోలీసులను నడిపించారన్న ఆరోపణలకు పల్నాడు పోలీసులు వ్యవహారశైలి అద్దం పడుతోంది. కొంతమంది నిజాయితీగా పనిచేసే వారున్నా ఉన్నతాధికారుల తీరు చూసిన తర్వాత అభద్రతా భావంతో విధులను నిర్వహించలేని పరిస్థితిలో ఉండిపోయారు. పల్నాడు చరిత్రలో ఈ తరహాలో పోలీసుల వ్యవహార శైలి ఎప్పుడూ చూడలేదని సీనియర్ సిబ్బంది పేర్కొంటున్నారు.

మాచవరంలో మరో దాడి

పల్నాడు జిల్లా మాచవరం ఎమ్మార్వో కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చౌదరి సింగరయ్యపై మంగళవారం రాత్రి టీడీపీ మూకలు దాడి చేయడంతో కాలు, చేయి విరిగాయి. మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ దారం లచ్చిరెడ్డికి చెయ్యి విరిగింది. ఘటనలో కారు ధ్వంసం కాగా మరో కార్యకర్తకు కూడా గాయాలయ్యాయి.



చంద్రగిరిలో టీడీపీ దౌర్జన్యకాండ

- వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మోహిత్‌రెడ్డిపై దాడికి యత్నం
- రామిరెడ్డిపల్లి సర్పంచి ఇంటికి నిప్పు
- మోహిత్‌రెడ్డి వాహనం అడ్డగింత..
- కారుపై పెట్రోలు పోసి నిప్పంటించిన వైనం
- బండరాళ్లు, కర్రలతో మరో వాహనంపై దాడి
- టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని నేతృత్వంలో విధ్వంసం
- శ్రీపద్మావతి మహిళా వర్సిటీలో స్ట్రాంగ్ రూమ్ వద్ద పేట్రేగిన పచ్చ మూక



మహిళా వర్సిటీలో వైఎస్సార్‌సీపీ నేతల కారును ధ్వంసం చేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు



మహిళా వర్సిటీలో మొదలియార్ రమేష్ అనుచరుడిపై దాడి చేస్తున్న పులివర్తి నాని మనుషులు

తిరుపతి రూరల్: చంద్రగిరి నియోజకవర్గంలో టీడీపీ మూకల ఆగడాలు, రౌడీయిజానికి అంతేలేకుండా పోయింది. పోలింగ్ ముగిసిన అనంతరం సోమవారం రాత్రి 9.45 గంటల నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు వీరి పైశాచిక విధ్వంసకాండ కొనసాగింది. చంద్రగిరి మండలం రామిరెడ్డిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, స్థానిక సర్పంచి కొటాల చంద్రశేఖర్‌రెడ్డి ఇంటిపై టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని కుమారుడు వినీల్ ఆధ్వర్యంలో పచ్చ మంద దాడి చేసింది. సర్పంచి ఇంటికి నిప్పు పెట్టింది. విలువైన వస్తువులు, నగదు, బంగారం, ల్యాప్‌టాప్ వంటి వస్తువులను లూటీ చేసింది. పంచాయతీలో అధిక శాతం ప్రజలు వైఎస్సార్‌సీపీకి అండగా ఓటింగ్‌లో పాల్గొన్నారనే అక్కసుతోనే పచ్చ మంద ఈ దాడికి పాల్పడినట్లు బాధితుడు ఆరోపించారు. దాడికి గురైన సర్పంచి చంద్రశేఖర్‌రెడ్డిని పరామర్శించేందుకు రామిరెడ్డిపల్లికి వస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని టీడీపీ శ్రేణులు, చిత్తూరు నుంచి దిగుమతి చేస్తున్న రౌడీలతో ఉన్న వినీల్ అడ్డుకున్నారు. మోహిత్‌రెడ్డిపై దాడికి ప్రయత్నించారు. ఆయన కారును పెట్రోలు పోసి దగ్ధం చేశారు. మరో కారును రాడ్లు, కర్రలు, బండరాళ్లతో ధ్వంసం చేశారు. కారు డ్రైవర్, మాజీ సైనికుడిని కట్టేసి కొట్టారు. ఈ దాడిలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని ప్రత్యక్షంగా పాల్గొన్నారు. నానీయే మోహిత్‌రెడ్డి అనుచరులను కొట్టారు. బాధితులు చంద్రగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రెచ్చిపోయిన పచ్చ మూకలు

తిరుపతిలో మంగళవారం 'పచ్చ' రౌడీ మూకలు రెచ్చిపోయాయి. మధ్యాహ్నం నుంచి సాయంత్రం 6 గంటల వరకు తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా వర్సిటీలో ఉన్న చంద్రగిరి నియోజకవర్గం స్ట్రాంగ్ రూమ్ వద్ద టీడీపీ అల్లరి మూకలు బీభత్సం సృష్టించాయి. టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని వైఎస్సార్‌సీపీ నేతలపై దాడులకు పచ్చమూకలను రెచ్చగొట్టారు. దీంతో వర్సిటీ ముందు రోడ్డుపై బైఠాయించి ఈ మూకలు ఆందోళన చేశాయి. రోడ్డుపై వెళ్తున్న అమాయకులను సైతం పట్టుకుని 'మీరు వైఎస్సార్‌సీపీ వాళ్లే కదా...' అంటూ విచక్షణా రహితంగా కొట్టాయి. వర్సిటీ రోడ్డు మీదుగా తుమ్మలగుంటకు వెళ్తున్న తిరుపతి రూరల్ మండలం తిరుమల నగర్ పంచాయతీ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మొదలియార్ రమేష్, అతని అనుచరుల కారును అడ్డగించాయి. రమేష్‌తో పాటు కారులో ఉన్న అనుచరులను రోడ్డుపైకి లాగి.. పది మంది కలిసి రాడ్లు, కర్రలతో దాడి చేశారు. కాళ్లతో తన్నుతూ, స్పృహ తప్పిపోయేంతగా కొట్టారు. అంతటితో ఆగక, విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న ఎస్వీయూ, మహిళా వర్సిటీ, పద్మావతి కళాశాల ఉద్యోగులపై సైతం దాడులు చేశారు. పోలీసు వాహనాలను ధ్వంసం చేశారు. చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సోదరుడు రఘునాథరెడ్డికి చెందిన బుల్లెట్, మరో 10 వాహనాలపై వైఎస్సార్‌సీపీ గుర్తులు ఉన్నాయని కాల్చి వేశారు. వీడియోలు తీస్తున్న మీడియాపై సైతం దాడికి పాల్పడ్డారు. 'పులివర్తి నాని అన్న చెప్పాడు.. వైఎస్సార్‌సీపీ నాయకులను, కార్యకర్తలను తరిమి తరిమి కొట్టండి' అంటూ గంజాయి మత్తులో ఉన్న పచ్చమూక రెచ్చిపోయింది. ఈ గూండాల విధ్వంసంతో వర్సిటీ పరిసరాలు హాహాకారాలు.. రక్తపు గాయాలు.. ఎగిసిపడే మంటలతో యుద్ధ వాతావరణాన్ని తలపించాయి. చివరకు పోలీస్ బలగాలు భారీగా తరలివచ్చి లాఠీఛార్జి చేయడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది.

6 కేంద్రాల్లో రీపోలింగ్ నిర్వహించాలి

రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు



సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గంలోని ఆరు పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ నిర్వహించాలని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు డిమాండ్ చేశారు. దమ్మాలపాడు, నార్నెపాడు, చీమలమర్రిల్లో మొత్తం ఆరు కేంద్రాల్లో రీపోలింగ్ జరపాలని కోరారు. సత్తెనపల్లి రూరల్ సీఐ మీసాల రాంబాబు అమ్ముడుపోయారని ఆరోపించారు. మంత్రి మంగళవారం సత్తెనపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. పల్నాడు జిల్లాలో ముందెన్నడూ ఎరుగని రీతిగా పెద్ద ఎత్తున హింస జరగడం బాధాకరమన్నారు. ఎన్నికల ప్రక్రియలో లా అండ్ ఆర్డర్ కాపాడటంలో పోలీసులు విఫలమయ్యారని చెప్పారు. పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తూ నకరికల్లు వెళ్లినప్పుడు తనను హౌస్ అరెస్టు చేసిన పోలీసులు... టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణను ఎందుకు ఆపలేదని ప్రశ్నించారు. ఆ తర్వాత చాగంటివారిపాలెం గ్రామానికి కన్నా లక్ష్మీనారాయణ కొడుకు వచ్చి అంతు తేలుస్తానంటూ తమ వాళ్లకు వార్నింగ్ ఇస్తున్నాడని ఫోన్ రావడంతో తాను అక్కడికి వెళ్లినట్లు తెలిపారు. సీఐ రాంబాబు తన ప్రత్యేక సిబ్బందితో తమ వాళ్లను కొట్టించే ప్రయత్నం చేశారని చెప్పారు. సత్తెనపల్లి రూరల్ సీఐ మీసాల రాంబాబు టీడీపీ అభ్యర్థి కన్నా కొడుకు నాగరాజుకు అమ్ముడుబోయారన్నారు. నాగరాజు దగ్గర ఐదారు లక్షల రూపాయలు తెచ్చుకున్నారని ఆరోపించారు. మరోవైపు పోలీసుల అండతో దమ్మాలపాడులో కన్నా వర్గం రిగ్గింగ్‌కు పాల్పడిందని చెప్పారు. నార్నెపాడులో చీఫ్ ఎలక్షన్ ఏజెంట్‌గా ఉన్న తన అల్లుడు ఉపేష్ కారు అద్దాలు పగులగొట్టారన్నారు. దమ్మాలపాడులో 253, 254, నార్నెపాడులో 236, 237, చీమలమర్రిలో 197, 198 బూత్‌లలోని వెబ్ కెమెరాలను పరిశీలించి, ఆ బూత్‌లలో రీపోలింగ్ నిర్వహించాలని ఆయన కోరారు. ఐదేళ్లపాటు సంక్షేమ కార్యక్రమాలు అందించిన వైఎస్ జగన్ పాలన చూసిన తర్వాత ప్రతి ఒక్కరు జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుకున్నారని చెప్పారు.

విశాఖలోనే సీఎంగా జగన్ ప్రమాణస్వీకారం

▶ మొదటి పేజీ తరువాయి

తీసుకెళ్తోందని తెలిపారు. ముఖ్యంగా రాష్ట్రవ్యాప్తంగా మహిళలందరి మద్దతు సీఎం వైఎస్ జగన్‌కే ఉందని, వారంతా వైఎస్సార్‌సీపీకే ఓటు వేశారని తెలిపారు. లబ్ధి పొందిన ప్రతి మహిళా మళ్లీ సీఎంగా వైఎస్ జగన్ కావాలని కోరుకుంటున్నారన్నారు. మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వస్తే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని, వృద్ధులకు ఇంటికే పింఛన్ అందుతుందని, అవినీతి లేకుండా నేరుగా బ్యాంకు ఖాతాల్లో సంక్షేమ పథకాల ఆర్థిక సహాయం అందుతుందని భావించి ఓట్లు వేశారన్నారు. చంద్రబాబు అధికార దాహంతో అనేక రకాల కుయుక్తులకు పాల్పడ్డాడని, స్థాయికి తగని తప్పుడు భాష వాడారని తెలిపారు. వ్యక్తిగతంగా కుటుంబంపై దూషణలు చేశాడన్నారు. పోలింగ్‌కు ఒక రోజు ముందు తాను వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేసినట్లు సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెట్టించిన దౌర్భాగ్యుడు చంద్రబాబు అని మండిపడ్డారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై ప్రజల్లో ఆందోళన కలిగించేందుకు కుటిల యత్నాలు చేశాడని తెలిపారు. చివరికి పోలింగ్ రోజు కూడా వైఎస్సార్‌సీపీ వారిపై దాడులు చేయించాడన్నారు. ఎన్ని రకాల ప్రయత్నాలు చేసినా చంద్రబాబు ఓటమి ఖాయమైందని, ఆయనకు ఓటమి భయం పట్టుకుందని చెప్పారు. ఫలితాలు వచ్చే వరకూ చాలా విధాలుగా వైఎస్సార్‌సీపీ శ్రేణులను రెచ్చగొట్టేలా టీడీపీ వారితో మాట్లాడిస్తాడని, ఎవరూ ఉద్రిక్తతకు లోనుకాకుండా సంయమనం పాటించాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సత్సంబంధాలు కొనసాగితేనే రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా రాష్ట్రాల అభివృద్ధి గురించి ఆలోచించాలన్నారు. రాష్ట్రానికి అన్యాయం చేస్తే సహించబోమని కరాఖండిగా చెప్పారు.

ఓటర్లలో చైతన్యం చూశాం: బొత్స ఝాన్సీ

వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ లక్ష్మి మాట్లాడుతూ గత 35 రోజులుగా ప్రచారంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, జగనన్న అభిమానులు, విశాఖ ప్రజలు, వైఎస్సార్‌సీపీకి ఓటు వేసిన ప్రతి ఓటరుకూ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సోమవారం జరిగిన పోలింగ్‌లో మహిళా ఓటర్లలో చైతన్యం చూశామని, ఉదయం నుంచే మహిళలు ఓటు హక్కు వినియోగించుకునేందుకు బారులు తీరారని చెప్పారు. గత ఎన్నికలకంటే ఎక్కువగా పోలింగ్ జరిగిందన్నారు. జగనన్న ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తుందనడానికి ఇది సూచిక అని తెలిపారు. విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు కూడా పాల్గొన్నారు.

క్లుప్తంగా...

సీబీఎస్‌ఈ ఫలితాల్లో విశ్వభారతి విద్యార్థుల ప్రతిభ


జి. వర్షిణి


ఎ. జాహ్నవి

గుడివాడ టౌన్: సీబీఎస్‌ఈ 12వ తరగతి ఫలితాల్లో తమ విద్యార్థులు ప్రతిభ చూపి ఉత్తమ ఫలితాలు సాధించారని విశ్వ భారతి వైజ్ ఉడ్స్ అధిపతి పొట్లూరి శ్రీమన్నారాయణ మంగళవారం తెలిపారు. తమ విద్యార్థిని జి.వర్షిణి 487/500, ఎ.జాహ్నవి 475/500 మార్కులతో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులను ఆయన అభినందించారు.

ఏపీఆర్‌జేసీ ఫలితాల్లో తిరుమల ప్రభంజనం

రాజమహేంద్రవరం రూరల్: ఏపీఆర్‌జేసీ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఎంపీసీ విభాగంలో 1, 2 ర్యాంకులు, బైపీసీ విభాగంలో 2వ ర్యాంక్ సాధించారని తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఎంపీసీ, బైపీసీ విభాగాల్లో 1, 2, 2, 3, 4, 5, 6, 6, 7, 7, 8, 9, 10 ర్యాంకులు, పది లోపు 13 మంది, 50 లోపు 44 మంది, 100 లోపు 72 మంది ర్యాంకులు సొంతం చేసుకున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులను తిరుమలరావు అభినందించారు.

సీబీఎస్‌ఈ ఫలితాల్లో నారాయణ రికార్డు

సాక్షి, హైదరాబాద్: సీబీఎస్‌ఈ పది ఫలితాల్లో నారాయణ రికార్డు సృష్టించింది. 500 మార్కులకు 498 మార్కులతో అగస్త్య రేమాని సంచలనం సృష్టించినట్లు నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు పి.సింధూర నారాయణ, పి.శరణి నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. 9 మంది విద్యార్థులు 495కు పైగా మార్కులు సాధించారని, 49 మంది 490కి పైగా మార్కులు పొందారని వెల్లడించారు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ఢిల్లీ, ఒడిశా, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్, అసోం రాష్ట్రాల్లోని 138 కు పైగా బ్రాంచీల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. అద్భుత ఫలితాలు సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, అధ్యాపకేతర సిబ్బందిని నారాయణ డైరెక్టర్ కె.పునీత్ అభినందించారు.

సీబీఎస్‌ఈ పది ఫలితాల్లో శ్రీచైతన్య ప్రభంజనం

సాక్షి, హైదరాబాద్: సీబీఎస్‌ఈ పదవ తరగతి ఫలితాల్లో శ్రీచైతన్య సత్తాచాటింది. తమ విద్యాసంస్థ 496 టాప్ మార్కులతో ఆలిండియా నంబర్‌వన్‌గా నిలిచిందని శ్రీచైతన్య స్కూల్ డైరెక్టర్ సీమ ఒక ప్రకటనలో తెలిపారు. రెండో అత్యధిక మార్కులు 495 ఇద్దరు విద్యార్థులు సాధించారన్నారు. 8 మంది విద్యార్థులు 494 ఆపైన మార్కులు పొందినట్లు చెప్పారు. ఓవరాల్‌గా శ్రీచైతన్య స్కూల్‌లోని 92 శాతం బ్రాంచీలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయని, ఇక స్కూల్ ఉత్తీర్ణత శాతం 99.5 అని వెల్లడించారు. 791 మంది విద్యార్థులు వ్యక్తిగత సబ్జెక్టుల్లో 100కు 100 మార్కులు సాధించారన్నారు. ఇంతటి విజయాలు సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అధ్యాపక బృందానికి శ్రీచైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ నాగేంద్ర అభినందనలు తెలిపారు.

సీబీఎస్‌ఈ ఫలితాల్లో గౌతమ్ విద్యార్థుల ప్రతిభ

గుడివాడ టౌన్: సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్‌ఈ) పదో తరగతి ఫలితాల్లో తమ విద్యార్థులు ప్రతిభ చూపినట్లు డాక్టర్ కేకేఆర్ స్కూల్స్ ప్రిన్సిపాల్ సత్యరామ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 500 మార్కులకు గాను తమ విద్యార్థులు గట్టు జయంత్‌నాగ్ 489, జాగర్లమూడి అర్జున్, వై.చరిష్మా 487 సాధించినట్లు తెలిపారు. 480 మార్కులకు పైగా 16 మంది, 475 మార్కులకుపైగా 33 మంది, 470 మార్కులకుపైగా 61 మంది, 460 మార్కులకుపైగా 113 మంది, 450 మార్కులకుపైగా 205 మంది ఉత్తీర్ణత సాధించారని ఆయన వివరించారు.

వీఐటీ చాన్స్‌లర్ విశ్వనాథన్‌కు డాక్టరేట్

సాక్షి, హైదరాబాద్: వీఐటీ యూనివర్సిటీ వ్యవస్థాపకుడు, చాన్స్‌లర్ విశ్వనాథన్‌ను న్యూయార్క్ స్టేట్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. చిన్నవయసులోనే రాజకీయాల్లోకి వచ్చిన విశ్వనాథన్ ఎంపీగా, మంత్రిగా పలు పదవులు చేపట్టారు. ఈనెల 10వ తేదీన బింగమ్‌టన్ యూనివర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ వర్సిటీ చాన్స్‌లర్ హార్వే స్టింగర్ చేతులమీదుగా విశ్వనాథన్ డాక్టరేట్ స్వీకరించారు. కార్యక్రమంలో వీఐటీ వైస్‌ప్రెసిడెంట్స్ శంకర్ విశ్వనాథన్, శేఖర్ విశ్వనాథన్, జీవీ సెల్వం, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ కాదంబరి విశ్వనాథన్, శ్రీనివాసన్ తదితరులు పాల్గొన్నారు.

దేశంలో ఐఐఎం-అహ్మదాబాద్ టాప్

సెంటర్ ఫర్ వరల్డ్ వర్సిటీ ర్యాంకింగ్స్‌లో 65 భారతీయ వర్సిటీలు

- టాప్ రెండువేల స్థానాల్లో 32 భారతీయ వర్సిటీల స్థానాల మెరుగు.. 33 వర్సిటీల క్షీణత
- ప్రపంచంలో ఈ విద్యా సంస్థకు 410వ స్థానం
- ఐఐఎస్‌సీకి 501వ ర్యాంకు, ఐఐటీ-ముంబైకు 568వ ర్యాంకు
- హార్వర్డ్ వర్సిటీకి ప్రపంచంలోనే అగ్రస్థానం
- ఆ తర్వాత మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, స్టాన్‌ఫోర్డ్, కేంబ్రిడ్జి, ఆక్స్‌ఫర్డ్
- వరల్డ్ టాప్-10 వర్సిటీలు అన్నీ అమెరికాకు చెందినవే
- ప్రపంచ ర్యాంకింగ్స్‌లో భారత్‌కు చెందిన 65 విద్యా సంస్థలకు చోటు

సాక్షి, అమరావతి: ప్రపంచ వ్యాప్తంగా భారతీయ విశ్వవిద్యాలయాలు అత్యుత్తమ పనితీరును కనబరుస్తున్నాయి. సెంటర్ ఫర్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్ (సీడబ్ల్యూయూఆర్)లో 65 భారతీయ వర్సిటీలు, ఐఐటీ, ఐఐఎంలు చోటు దక్కించుకున్నాయి. ప్రపంచంలో మొత్తం రెండువేల విశ్వవిద్యాలయాలకు సీడబ్ల్యూయూఆర్-2024 ఎడిషన్‌లో ర్యాంకులు ప్రకటించింది. గతేడాదితో పోలిస్తే భారత్‌కు చెందిన 32 ఉన్నత విద్యా సంస్థల ర్యాంకులు మెరుగవ్వగా.. మరో 33 సంస్థల ర్యాంకులు స్వల్పంగా క్షీణించాయి. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్



-అహ్మదాబాద్ (ఐఐఎం-ఏ) దేశంలోనే అగ్రశేణి విద్యా సంస్థగా నిలిచింది. అంతర్జాతీయంగా గతేడాది 419వ ర్యాంకు నుంచి ప్రస్తుతం 410కి చేరుకోవడం విశేషం.

తగ్గిన ర్యాంకులు..

20,966 విద్యా సంస్థల నుంచి అత్యుత్తమ విద్యా సేవలందించే రెండు వేల వర్సిటీలను గుర్తించి సీడబ్ల్యూయూఆర్ ర్యాంకులు ప్రకటించింది. టాటా ఇన్‌స్టిట్యూట్‌తో సహా దేశంలోని టాప్-10 ఇన్‌స్టిట్యూట్లలో ఏడింటి ర్యాంకులు క్షీణించాయి. ఐఐఎం-అహ్మదాబాద్ తర్వాత ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్‌సీ) నిలిచింది. గతేడాది 494వ ర్యాంకు నుంచి 501కు, ఐఐటీ-ముంబై 554 నుంచి 568వ ర్యాంకు, ఐఐటీ-మద్రాస్ 570 నుంచి 582, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ వర్సిటీ 580 నుంచి 606కు, ఐఐటీ-ఢిల్లీ 607 నుంచి 616, ఢిల్లీ వర్సిటీ 621 నుంచి 622, పంజాబ్ వర్సిటీ 759 నుంచి 823కు క్షీణించాయి. మరోవైపు.. ఐఐటీ-ఖరగ్‌పూర్ తన స్థానాన్ని 721 నుంచి 704కు, అకాడమీ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇన్నోవేటివ్ రీసెర్చ్ 866 నుంచి 798కు మెరుగుపర్చుకుంది.

టాప్-10 వర్సిటీలు అమెరికావే..

- హార్వర్డ్ వర్సిటీ
- మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ
- స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం
- యూనివర్సిటీ ఆఫ్ కేంబ్రిడ్జి
- యూనివర్సిటీ ఆఫ్ ఆక్స్‌ఫర్డ్
- ప్రిన్స్‌టన్ వర్సిటీ
- కొలంబియా విశ్వవిద్యాలయం
- యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియా
- యేల్ వర్సిటీ
- కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ

టాప్‌లో అమెరికా వర్సిటీలు..

సెంటర్ ఫర్ వరల్డ్ వర్సిటీ ర్యాంకింగ్స్‌లో టాప్-10లో అన్నీ అమెరికా విశ్వవిద్యాలయాలే నిలిచాయి. అమెరికాకు చెందిన 90 విద్యా సంస్థలు ర్యాంకుల్లో మెరుగుదలను సాధించగా 23 స్థిరంగా, 216 వర్సిటీల ర్యాంకులు క్షీణించాయి. అలాగే, యూకేలో కేవలం 28 సంస్థలు మాత్రమే స్థానాలను మెరుగుపర్చుకోగా, 57 సంస్థల ర్యాంకులు పడిపోయాయి. జర్మనీకి చెందిన మ్యూనిచ్ విశ్వవిద్యాలయం 46వ స్థానంలో ఉన్నా జర్మనీలోని 55 వర్సిటీల ర్యాంకులు దిగజారాయి. వీటికి విరుద్ధంగా చైనాలో 95% వర్సిటీలు గతేడాది కంటే మెరుగైన ప్రదర్శన కనబర్చాయి. సింఘువా వర్సిటీ 43వ స్థానంలో నిలిచింది.

వెయ్యిలోపు భారత్‌లోని వర్సిటీల ర్యాంకులు..

పంజాబ్ వర్సిటీ (823), ఐఐటీ-కాన్పూర్ (842), ఎయిమ్స్-ఢిల్లీ (874), ఐఐటీ-రూర్కీ (880), బెనారస్ హిందూ వర్సిటీ (891), హోమీ బాబా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ (903), జవహర్‌లాల్ నెహ్రూ సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ సైంటిఫిక్ రీసెర్చ్ (927), జవహర్‌లాల్ నెహ్రూ వర్సిటీ (951), ఐఐటీ-గౌహతి (966) ర్యాంకులు సాధించాయి. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌కు 1,299, ఐఐటీ-హైదరాబాద్‌కు 1,327 ర్యాంకులు వచ్చాయి.

పాఠశాలలకు ఫ్యూచర్ స్కిల్ నిపుణులు

- 7,071 హైస్కూళ్లకు 2,379 మంది నియామకానికి చర్యలు
- జూన్ నుంచి విద్యార్థులకు సాంకేతిక అంశాలపై శిక్షణ

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ప్రవేశపెట్టిన ఐటీ స్కిల్ కోర్సులపై విద్యార్థులకు 2024-25 విద్యా సంవత్సరంలో శిక్షణ ఇచ్చేందుకు ఫ్యూచర్ స్కిల్ ఎక్స్‌పర్ట్స్ నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జూన్ నెల నుంచి మొత్తం 7,071 ఉన్నత పాఠశాలల్లో సేవలు అందించేందుకు 2,379 మందిని నియమిస్తారు. మూడు పాఠశాలలకు ఒకరు చొప్పున ఇంజినీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులను ఫ్యూచర్ స్కిల్ ఎక్స్‌పర్ట్స్‌గా నియమిస్తామని పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాల్లోని ఇంజినీరింగ్ కాలేజీల నుంచి టాప్-3 విద్యార్థులను ఎంపిక చేసి వారి వివరాలను ఈ నెల 22వ తేదీలోపు పంపించాలని డీఈవోలను ఆదేశించామని పేర్కొన్నారు. వారితో రాష్ట్ర ఎంపిక కమిటీ వర్చువల్‌గా మాట్లాడి అభ్యర్థులను ఎంపిక చేస్తుందని తెలిపారు. ఈ మేరకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఇంజినీరింగ్ కాలేజీల ప్రిన్సిపాళ్లతో సమన్వయం చేసుకోవాలని ఆయన సూచించారు. ఒక్కో ఎక్స్‌పర్ట్‌కు నెలకు రూ.12 వేల గౌరవ వేతనంతోపాటు ప్రతి కిలో మీటరు దూరం ప్రయాణానికి రూ.2 చొప్పున చెల్లిస్తామని ప్రవీణ్‌ప్రకాశ్ వెల్లడించారు.

వెబ్‌సైట్‌లో టెన్త్ సప్లిమెంటరీ హాల్‌టికెట్లు

సాక్షి, అమరావతి: పదో తరగతి ఫెయిలైన విద్యార్థులకు నిర్వహించే అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 24 నుంచి ప్రారంభమవుతాయని పరీక్షల విభాగం డైరెక్టర్ డి.దేవానందరెడ్డి తెలిపారు. హాల్‌టికెట్లను www.bse.ap.gov.inలో అందుబాటులో ఉంచామన్నారు. విద్యార్థులు సంబంధిత స్కూల్ లాగిన్ నుంచి గాని లేదా విద్యార్థి వ్యక్తిగత వివరాలతో గాని బుధవారం ఉదయం నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని చెప్పారు.

గురుకుల ప్రవేశ పరీక్ష ఫలితాలు వెల్లడి

సాక్షి, అమరావతి: ఏపీ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలోని గురుకుల పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరం ప్రవేశాల కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. మంగళవారం పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేశ్ కుమార్, గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి ఆర్.నరసింహారావు సంయుక్తంగా విజయవాడలోని పాఠశాల విద్యాశాఖ కార్యాలయంలో ఫలితాలను విడుదల చేశారు. సంస్థ పరిధిలోని 38 సాధారణ పాఠశాలల్లో 5వ తరగతి సీట్లు, 12 మైనారిటీ పాఠశాలల్లో ఎస్సీ, ఎస్టీ కేటగిరీ సీట్లు, 6 నుంచి 8 తరగతుల్లో మిగిలిన సీట్లతో పాటు, ఇంటర్, డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలకు పరీక్ష నిర్వహించారు. స్కూల్ స్థాయిలో 3,770 సీట్లకు 32,666 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 25,216 మంది పరీక్షకు హాజరయ్యారు.

- పాఠశాల స్థాయిలో ఐదో తరగతిలో ఎం.కీర్తి (విశాఖపట్నం జిల్లా), 6వ తరగతి పి.సోమేశ్వర రావు (విజయనగరం జిల్లా), 7వ తరగతి కె.ఖగేంద్ర (శ్రీకాకుళం జిల్లా), ఎనిమిదో తరగతిలో వై.మేఘ శ్యామ్ (విజయనగరం జిల్లా) రాష్ట్ర స్థాయిలో అత్యధిక మార్కులు సాధించారు.



ఫలితాలను విడుదల చేస్తున్న సురేశ్ కుమార్, నరసింహారావు తదితరులు

- రాష్ట్రంలోని ఏడు జూనియర్ కాలేజీల్లో ఉన్న 1,149 సీట్లకు 56,949 మంది దరఖాస్తు చేసుకోగా 49,308 మంది పరీక్షకు హాజరయ్యారు. ఎంపీసీ విభాగంలో జి.యశ్వంత్ సాయి, ఎంఈసీ/సీఈసీ విభాగంలో ఎల్.సత్యరామ్ మోహన్ (తూర్పు గోదావరి), బైపీసీ విభాగంలో ఎం.మహిత (కర్నూలు జిల్లా) అత్యధిక మార్కులు సాధించారు. వీరితో పాటు నాగార్జునసాగర్‌లోని డిగ్రీ కాలేజీలో 152 సీట్లకు ఎంపికైన విద్యార్థుల వివరాలను https://aprs.apcfss.in/లో అందుబాటులో ఉంచినట్లు సంస్థ కార్యదర్శి నరసింహారావు తెలిపారు.

ట్రిపుల్ ఐటీకి దరఖాస్తు చేసుకోవడం ఇలా


నూజివీడు ట్రిపుల్ ఐటీ

నూజివీడు: రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, శ్రీకాకుళం, ఒంగోలు ట్రిపుల్ ఐటీల్లో 2024-25 విద్యా సంవత్సరానికి ఆరేళ్ల బీటెక్ సమీకృత ఇంజినీరింగ్ కోర్సులో ప్రవేశాలకుగాను వర్సిటీ ఈ నెల 6న నోటిఫికేషన్ వెలువరించింది. ఒక్కో సెంటర్‌లో 1,000 సీట్లు ఉన్నాయి. ఈడబ్ల్యూఎస్ కోటాలో మరో 100 సీట్లు ఉన్నాయి. ఈ కోర్సులో చేరేందుకు దరఖాస్తులను ఈ నెల 8 నుంచి జూన్ 25 సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తారు. ప్రవేశాల్లో ఎస్సీలకు 15%, ఎస్టీలకు 6%, బీసీ-ఏకు 7 %, బీసీ-బీకి 10 %, బీసీ-సీకి 1%, బీసీ-డీకి 7%, బీసీ-ఈకి 4% చొప్పున రిజర్వేషన్ అమలు చేస్తారు. ప్రత్యేక సీట్ల కింద వికలాంగులకు 5%, సైనికోద్యోగుల పిల్లలకు 2%, ఎన్‌సీసీ విద్యార్థులకు 1%, స్పోర్ట్స్ కోటా కింద 0.5%, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కోటా కింద 0.5% సీట్లను భర్తీ చేస్తారు. ప్రతి కేటగిరీలోనూ 33.33% సీట్లను సమాంతరంగా బాలికలకు కేటాయిస్తారు.

ప్రవేశార్హతలు

అభ్యర్థులు ప్రథమ ప్రయత్నంలోనే 2024లో ఎస్ఎస్‌సీ లేదా తత్సమాన పరీక్షలో రెగ్యులర్ విద్యార్థిగా ఉత్తీర్ణులై ఉండాలి.

వయస్సు 31-12-2024 నాటికి 18 ఏళ్లు నిండకుండా ఉండాలి. ఎస్సీ, ఎస్టీ కేటగిరీ అభ్యర్థులకైతే 21 ఏళ్లు నిండకుండా ఉండాలి.

మెరిట్ ఆధారంగా అడ్మిషన్లు ఇలా..

పదో తరగతిలో వచ్చిన మార్కుల ఆధారంగా మెరిట్ పద్ధతిలో ప్రవేశాలు కల్పిస్తారు. నాన్ రెసిడెన్షియల్ ప్రభుత్వ పాఠశాలలు, జిల్లా పరిషత్ హైస్కూళ్లు, మున్సిపల్ హైస్కూళ్లలో చదివిన విద్యార్థులకు వారి మార్కులకు 4% డిప్రివేషన్ స్కోర్‌ను అదనంగా కలుపుతారు. దీనిని సాంఘికంగా, ఆర్థికంగా వెనుకబాటుకు గురైన విద్యార్థులకు ఇచ్చే వెయిటేజీగా పేర్కొన్నారు. 85% సీట్లను స్థానికం గాను, మిగిలిన 15% సీట్లను మెరిట్ కోటాలో తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు కేటాయించారు.

బీఈడీ ప్రవేశాలకు రేపు ధ్రువపత్రాల పరిశీలన

సాక్షి, అమరావతి: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం బీఈడీ ప్రవేశాలకు ఎంపికైన అభ్యర్థులు ఈనెల 16, 17 తేదీల్లో ధ్రువపత్రాల పరిశీలనకు హాజరుకావాలని వర్సిటీ అభ్యాసక సహాయ సేవా విభాగం డైరెక్టర్ ఎల్.విజయ కృష్ణారెడ్డి (ఎల్వీకే) మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వర్సిటీ వెబ్‌సైట్‌లో అభ్యర్థుల జాబితాను పొందుపరిచామని పేర్కొన్నారు. అభ్యర్థులు ఫీజు చెల్లించి, ఒరిజినల్ ధ్రువపత్రాలతో హైదరాబాద్‌లోని వర్సిటీలో హాజరుకావాలని సూచించారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

జూన్ 10 వరకు గడువు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో వచ్చే విద్యా సంవత్సరానికి ఇంజినీరింగ్, నాన్-ఇంజినీరింగ్ ట్రేడ్‌లలో ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఉపాధి, శిక్షణ సంస్థ డైరెక్టర్ బి.నవ్య మంగళవారం తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు iti.ap.gov.in పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. జూన్ 10లోగా తప్పులు లేకుండా దరఖాస్తు చేసుకోవాలన్నారు.



జ్ఞానము కలవాడు తన శత్రువులను ప్రేమించటమే కాకుండా, తన స్నేహితులను ద్వేషించనూ గలడు.

– ఫ్రెడరిక్ నీషే

సాక్షి

బుధవారం, 15 మే 2024

నేపాల్ కొత్త లడాయి


తీరి కూర్చుని సమస్యలు సృష్టించుకోవటంలో నేపాల్ ప్రధాని ప్రచండను మించినవారెవరూ ఉండరు. కనుకనే భారత్‌లోని ప్రాంతాలతో కూడిన వివాదాస్పద మ్యాప్‌తో కొత్త వంద రూపాయల నోటు విడుదల చేసి మరో గొడవకు తెరతీశారు. మన ఉత్తరాఖండ్‌లో భాగంగా... 372 చదరపు కిలో మీటర్ల మేర విస్తరించివున్న లింపియాధుర, కాలాపానీ, లిపులేఖ్ ప్రాంతాలను తనవిగా చెప్పుకుంటూ లడాయికి దిగడం నేపాల్‌కు కొత్త కాదు. నాలుగేళ్లక్రితం ఆ ప్రాంతాలతో కూడిన భౌగోళిక చిత్రపటాన్నీ, దానికి సంబంధించిన బిల్లునూ పార్లమెంటులో ప్రవేశపెట్టి ఏకగ్రీవ ఆమోదం కూడా పొందింది. నిజానికి అంతకుముందే 2014లో ప్రధాని నరేంద్ర మోదీ నేపాల్‌లో పర్యటించి సరిహద్దు వివాదాల పరిష్కారానికి ఉభయ దేశాల ప్రతినిధులతో ఒక కార్యాచరణ బృందాన్ని ఏర్పాటు చేసుకోవాలని ప్రతిపాదించారు. అందుకు నేపాల్ కూడా ఆమోదం తెలిపింది. దానికి సంబంధించి తదుపరి చర్యలు తీసుకోవటంలో ఇరు దేశాలూ చొరవ తీసుకోలేదన్నది వాస్తవం. ఆ పని తక్షణం మొదలుకావాలని భారత్‌ను డిమాండ్ చేయటంలో తప్పులేదు. అందుకు దౌత్యమార్గంలో నిరంతర చర్చలు జరపటం కూడా అవసరం. కానీ దీన్ని వదిలి 2020లో ఏకపక్షంగా మ్యాప్‌ను విడుదల చేసి సమస్యను మరింత జటిలం చేయటానికే నేపాల్ మొగ్గుచూపింది. పాలక కూటమిలో అంతర్గత విభేదాలు వచ్చిన ప్రతిసారీ ప్రజల దృష్టి మళ్లించేందుకు భారత్‌తో వున్న సరిహద్దు సమస్యను ఎజెండాలోకి తీసుకురావటం తప్ప ఆ వివాదాన్ని చిత్తశుద్ధితో పరిష్కరించుకుందామన్న ఆలోచన పాలకులకు లేదనే విమర్శలు తరచు రావటానికి ఇదే కారణం. వంద రూపాయల నోటుపై వివాదాస్పద మ్యాప్ ఉండాలనుకోవటం వెనక కూడా ఇలాంటి ఉద్దేశమే ఉందన్నది విపక్షాల విమర్శ. తన ఏలుబడిలోని కూటమిలో భాగస్వామిగా వున్న జనతా సమాజ్‌వాదీ పార్టీ–నేపాల్ (జేఎస్‌పీ–ఎన్)లో కుమ్ములాట మొదలైన మరుక్షణమే ప్రచండ వివాదాస్పద మ్యాప్‌ను బయటకు తీశారు. భారత్ మద్దతున్న మాధేసి తెగల సమూహానికి ప్రాతినిధ్యంవహించే ఆ పార్టీలో అంతర్గత తగాదాలు బయల్దేరితే నేపాల్ రాజకీయాలపై వాటి ప్రభావం ఎక్కువేవుంటుంది. 2020లో సరిహద్దు సమస్యపై నేపాల్ పార్లమెంటులో బిల్లుపెట్టి ఏకగ్రీవంగా ఆమోదించేలా చేయటంలో కీలకపాత్రపోషించిన అప్పటి ప్రధాని, సీపీఎన్ (యూఎంఎల్) నాయకుడు కేపీ శర్మ ఓలి రెండు నెలలక్రితం పాలక కూటమిలో చేరటం కూడా కొత్త కరెన్సీనోటు ముద్రణకు కారణమంటున్నారు. 'దురాక్రమణలోవున్న నేపాల్ భూభాగాలను తిరిగి తీసుకురావటమే తమ కర్తవ్యమని సీపీఎన్(యూఎంఎల్) తన మేనిఫెస్టోలో ఇప్పటికే ప్రకటించివుంది. అయితే నేపాల్ పార్లమెంటు కొత్త మ్యాప్‌ను ఆమోదించినప్పుడు ప్రజల్లో కనిపించిన ఉత్సాహం, ఉద్వేగం ఇప్పుడు లేవు సరికదా...ప్రచండపై విమర్శలే అధికంగా వినిపిస్తున్నాయి.

ఇలా అత్యుత్సాహంతో సొంత మ్యాప్‌లు రూపొందించుకోవటం ఒక్క నేపాల్‌కే కాదు...చైనా, పాకిస్తాన్‌లకు కూడా అలవాటే. మన అరుణాచల్ ప్రదేశ్‌లోని భౌగోళిక ప్రాంతాలకు తనవైన పేర్లు పెట్టుకుని, మ్యాప్‌లలో చూపుకోవటం చైనాకు అలవాటు. పాకిస్తాన్‌దీ అదే సంస్కృతి. అది జమ్మూ, కశ్మీర్‌లో కొంత ప్రాంతాన్ని ఏనాటినుంచో తన మ్యాప్‌లలో చూపుతోంది. దేశాలమధ్య సరిహద్దులకు సంబంధించి తలెత్తే వివాదాలు ప్రజలను రెచ్చగొడితే పరిష్కారం కావు. వాటిని దౌత్యస్థాయిలో అవతలి దేశంతో ఓపిగ్గా చర్చించి, చారిత్రక, సాంస్కృతిక ఆధారాల పరిశీలనకు నిపుణులతో ఉమ్మడి కమిటీలు ఏర్పాటుచేసుకోవాలి. ఆ మార్గాన్ని వదిలి ఇష్టానుసారం జనం భావోద్వేగాలను రెచ్చగొట్టాలనుకుంటే పరిష్కారానికి అందనంత జటిలంగా వివాదాలు మారతాయి. నిజానికి సరిహద్దు తగాదాలన్నీ మన దేశాన్ని పాలించిన బ్రిటిష్ వలసపాలకులు వదిలిపెట్టిపోయినవే. 1814–16 మధ్య సాగిన ఆంగ్లో–నేపాలీ యుద్ధంలో ఈస్టిండియా కంపెనీకి నేపాల్ ధారాదత్తం చేసిన ప్రాంతమే ప్రస్తుత వివాదానికి మూలం. వలసపాలకులు పోయిన ఏడున్నర దశాబ్దాల తర్వాత కూడా ఆ భూభాగంపై ఇరు దేశాల మధ్యా అవగాహన కుదరకపోవటం విచారించదగ్గదే. నిజానికి నేపాల్‌తో సరిహద్దు వివాదాలు అసలు పరిష్కారం కాలేదని చెప్పలేం. గత మూడు దశాబ్దాల్లో ఇరు దేశాలూ పరస్పరం చర్చించుకుని దాదాపు 98 శాతం సమస్యలను పరిష్కరించుకోగలిగాయి. మిగిలిన సమస్యల్ని సైతం ఈ దోవలోనే పరిష్కరించుకోవచ్చన్న ఇంగితజ్ఞానం నేపాల్ నేతలకు లేదు. దేశాధ్యక్షుడు రామచంద్ర పోద్వాల్‌కు ఆర్థిక సలహాదారుగా వున్న చిరంజీవి నేపాల్ సైతం కొత్త నోటు విడుదల తెలివితక్కువ నిర్ణయమని, రెచ్చగొట్టే చర్యని బాహాటంగా విమర్శించటం గమనించదగింది. అందువల్ల ఆయన తన పదవి పోగొట్టుకోవాల్సివచ్చినా ప్రభుత్వ నిర్ణయంపై జనంలో వున్న అసంతృప్తికి ఆ వ్యాఖ్యలు అద్దంపట్టాయి.

ఇరుగు పొరుగు దేశాలతో వున్న సరిహద్దు తగాదాలను పరిష్కరించుకోవటంలో అలసత్వం చూపితే వాటిని చైనా తనకు అనుకూలంగా మలుచుకుంటుందని గుర్తించటంలో మన పాలకులు విఫలమవుతున్నారు. ఎప్పుడో 2014లో ఉమ్మడి కార్యాచరణ బృందం ఏర్పాటుకు ఇరుదేశాల మధ్యా ఒప్పందం కుదిరినా ఇంతవరకూ సాకారం కాకపోవటంలో నేపాల్‌తోపాటు మన బాధ్యత కూడా వుంది. ఈ విషయంలో నేపాల్ పాలకులకు ఎలాంటి స్వప్రయోజనాలున్నాయన్న అంశంతో మనకు నిమిత్తం లేదు. మన వంతుగా ఏం చేస్తున్నామో గమనించుకోవాలి. అటు నేపాల్ కూడా ఏకపక్ష చర్యలతో సాధించేదేమీ ఉండదని గ్రహించాలి. వివాదాలకు భావోద్వేగాలు జోడించటం ఎప్పటికీ పరిష్కారమార్గం కాదని గుర్తించాలి.

'రక్షణ'కు ఒక దిగ్దర్శనం అవసరం!

విశ్లేషణ



మేజర్ జనరల్ అశోక్ కె. మెహతా (రిటైర్డ్)

బీజేపీ, కాంగ్రెస్ మేనిఫెస్టోలు జాతీయ భద్రతకు భిన్న మార్గాల్లో ప్రాధాన్యం ఇచ్చాయి. అయితే రెండూ కూడా అత్యాధునిక మిలటరీ ఆయుధాలను సమకూర్చుకోవటానికి ఏమంత ప్రాముఖ్యం ఇవ్వలేదు. దేశంలోని ఈ రెండు ప్రధాన జాతీయ పార్టీల మేనిఫెస్టోలు పరిశీలించిన తరువాత రక్షణ, భద్రత అంశాల విషయంలో కాంగ్రెస్ మేనిఫెస్టో కొంత మెరుగ్గా ఉన్నట్లు తోస్తోంది కానీ... త్రివిధ దళాల అధిపతులు, జాతీయ భద్రతా సలహాదారులు కలిసి ఉన్న డిఫెన్స్ ప్లానింగ్ కమిటీ... జాతీయ భద్రత వ్యూహం ఒకదాన్ని రూపొందించే విషయం రెండు మేనిఫెస్టోల్లోనూ స్పష్టంగా లేదు. అంతేకాదు, మన రక్షణ రంగానికి ఇప్పుడు దిగ్దర్శనం చేసే ఒక 'ప్రొఫెషనల్' అవసరం కూడా ఎంతైనా ఉంది.

బీజేపీ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఆత్మ నిర్భర్ భారత్'లో స్వావలంబనకు పెద్ద పీట వేశారు కానీ... అత్యాధునిక మిలిటరీ ఆయుధాలను సమకూర్చుకోవడంపై మాత్రం దృష్టి పెట్టలేదు. జాతీయ భద్రత, రక్షణ వంటి విషయాల్లో భారతీయ జనతా పార్టీ తన మేనిఫెస్టోలో చాలా అంశాలను ప్రస్తావించింది కానీ... ఏవీ అంత సమగ్రంగా ఉన్నట్టు కనిపించవు. 'మోదీకి గ్యారెంటీ ఫర్ సురక్షిత్ భారత్' పేరుతో మోదీ ప్రభుత్వం తను సాధించిన విజయాలను వెల్లడించింది, భవిష్యత్తు కోసం కొన్ని హామీలను ఇచ్చింది.

2014 తరువాత దేశంలోని ఏ నగరంలోనూ ఉగ్రదాడి ఏదీ జరగలేదని బీజేపీ చెప్పుకుంటోంది. ఇందులో కీలకం 'నగరం' అన్న పదం. 2016లో పఠాన్‌కోట వైమానిక స్థావరం, యూరీలు; 2019లో పుల్వామా ఘటనల్లో 'నగరాల'పై దాడులు జరగలేదు కాబట్టి తాము తప్పుగా ఏమీ చెప్పలేదని బీజేపీ సమర్థించుకోవచ్చు.

దీంతోపాటే ఆర్టికల్ 370 రద్దు ప్రభావం జమ్మూ కశ్మీర్‌లో ఎలా ఉందో కూడా మేనిఫెస్టోలో ప్రస్తావించారు. వామపక్ష తీవ్రవాద సంబంధిత హింస 52 శాతం వరకూ తగ్గిందనీ, ఈశాన్య భారతదేశంలో చొరబాటుదారుల సమస్య 71 శాతం నెమ్మదించిందని కూడా ఇందులో వివరించారు. ఉగ్రవాదాన్ని అస్సలు సహించేది లేదని చెబుతూ మేనిఫెస్టోలో 2016 నాటి సర్జికల్ స్ట్రైక్స్, 2019 నాటి బాలాకోట్ దాడి గురించి చెప్పారు. చైనా, పాకిస్తాన్, మయన్మార్ సరిహద్దుల్లో అత్యాధునికమైన రీతిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామనీ, కార్యక్రమాలను వేగవంతం చేస్తామనీ, సాంకేతిక పరిజ్ఞానం సాయంతో స్మార్ట్ ఫెన్సింగ్ వంటివి ఏర్పాటు చేస్తామని కూడా బీజేపీ తన మేనిఫెస్టోలో ప్రకటించింది. అయితే.. మణిపుర్ కూడా మన దేశ సరిహద్దులో ఉన్నా దాని ప్రస్తావన లేకపోవడం గమనార్హం.

'మోదీకి గ్యారెంటీ ఫర్ గ్లోబల్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ హబ్' విభాగంలో రక్షణ రంగ ఉత్పత్తులను మరింత విస్తృత స్థాయిలో తయారు చేస్తామనీ, 'మేడిన్ భారత్' ఎగుమతులకు ఊతమిస్తామని కూడా చెప్పుకున్నారు. ఈ ప్రయత్నాల వల్ల వాయు, పదాతిదళాలకు అవసరమైన ఆయుధాలు, వ్యవస్థలను దేశీయంగానే తయారు చేసేందుకు ప్రోత్సాహం లభిస్తుందని వివరించారు. గత ఏడాది అంటే బీజేపీ అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లు అయిన తరువాత 'నేషన్ ఫస్ట్: ఫారిన్ పాలసీ అండ్ నేషనల్ సెక్యూరిటీ' పేరుతో బీజేపీ ఒక బుక్‌లెట్ విడుదల చేసి. అందులో తాము సాధించిన ఘనతలను ప్రస్తావించడం ఇక్కడ చెప్పుకోవాల్సిన అంశం.

కాంగ్రెస్ మేనిఫెస్టోలో రక్షణ, అంతర్గత భద్రతను, బయటి నుంచి రాగల సవాళ్లను వేర్వేరుగా సమీక్షించారు. లద్దాఖ్ ప్రాంతంలో సుమారు రెండు వేల కిలోమీటర్ల వైశాల్యమున్న భారత భూభాగాన్ని, మొత్తం 65 పెట్రోలింగ్ పోస్టుల్లో 25 పోస్టులపై పట్టు కోల్పోయామన్న



విషయాన్ని కాంగ్రెస్ ప్రస్తావించింది. అధికారంలోకి వస్తే జాతీయ భద్రతా వ్యూహం (ఎన్ఎస్ఎస్) ఒకదాన్ని ఆవిష్కరిస్తామని ప్రకటించింది. అలాగే ఎప్పుడో 2009లో రక్షణ మంత్రి జారీ చేసిన ఆపరేషనల్ డైరెక్టివ్‌లను సమీక్షిస్తామనీ, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ నియామక ప్రక్రియను పారదర్శకంగా, వ్యవస్థీకృతంగా చేస్తామని కూడా హామీలు ఇచ్చింది. రక్షణ శాఖకు తగినన్ని నిధులు కేటాయించడమే కాకుండా ఈ రంగంలో తిరోగమిస్తున్న అంశాలను మళ్లీ పట్టాలెక్కిస్తామని తెలిపింది. 'అగ్నిపథ్' పథకం రద్దుతో పాటుగా, జాతీయ భద్రతా కౌన్సిల్, నేషనల్ సెక్యూరిటీ అడ్వయిజర్లను పార్లమెంటు పర్యవేక్షణలో పనిచేసేలా మార్పులు చేస్తామనీ, వ్యూహాత్మక అవసరాలకు అంతర్జాతీయ స్థాయి సరుకు రవాణా వ్యవస్థను అభివృద్ధి చేస్తామనీ 'వన్ ర్యాంక్– వన్ పెన్షన్' అమల్లోని లోపాలను సవరిస్తామనీ వివరించింది. వైకల్యం కారణంగా లభించే పెన్షన్‌పై పన్నులు రద్దు చేస్తామని కూడా చెప్పింది. అంతర్గత భద్రత విషయాలను ప్రస్తావిస్తూ ద్వేషపూరిత ప్రసంగాలు, హింసలకు తావు ఇవ్వమనీ, ఇతర మతాల నిరాదరణనూ సహించబోమనీ స్పష్టం చేసింది. 'నేషనల్ ఇంటెలిజెన్స్ గ్రిడ్'ను ఆచరణలోకి తేవడం, ఏడాది లోపు 'నేషనల్ కౌంటర్ టెర్రరిజం సెంటర్' ఏర్పాటు తమ లక్ష్యాలని వివరించింది.

దేశంలోని రెండు ప్రధాన జాతీయ పార్టీల మేనిఫెస్టోలు పరిశీలించిన తరువాత కాంగ్రెస్ మేనిఫెస్టో రక్షణ, భద్రత అంశాల విషయంలో కాస్త మెరుగ్గా ఉన్నట్లు తోస్తోంది. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే... మన ప్రభుత్వం రక్షణ రంగానికి జాతీయ స్థూల ఉత్పత్తి (జీడీపీ)లో రెండు శాతం కంటే తక్కువ నిధులు కేటాయిస్తూండటం! ఫలితంగా మన మిలటరీ సామర్థ్యాలను చైనాకు దీటుగా మార్చుకునే విషయంలో వెనుకబడిపోయాం. త్రివిధ దళాల ఆధునికీకరణకు మరిన్ని నిధుల కేటాయిస్తామని ప్రభుత్వం చెబుతున్నా అగ్నిపథ్ లాంటి పథకాల పుణ్యమా అని ఈ ఆధునికీకరణ మరో పదేళ్లకు కానీ పూర్తికాని పరిస్థితి ఏర్పడింది. వన్ ర్యాంక్– వన్ పెన్షన్ బకాయిలు 2002–23లో మిలటరీ ఆధునికీకరణకు కేటాయించిన నిధుల కంటే ఎక్కువ కావడం, మిలటరీ సిబ్బంది సంఖ్యను మదింపు చేయడం ద్వారా ఈ లోటును అధిగమిస్తామని బీజేపీ చెప్పడం ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన విషయాలు.

ఈ చర్యల కారణంగా మన యుద్ధ సన్నద్ధత, సామర్థ్యం తగ్గిపోయాయి. 2022లో కేవలం ఒక్క ఆర్మీలోనే 1.18 లక్షల ఖాళీలు ఉన్నాయంటే పరిస్థితి ఏమిటన్నది అర్థం చేసుకోవచ్చు.

ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఆత్మ నిర్భరత' కార్యక్రమం కూడా స్వావలంబనపై ఎక్కువ దృష్టి పెట్టింది కానీ... అత్యాధునిక ఆయుధాలనూ, వ్యవస్థలనూ ఏర్పాటు చేసుకోవడంపై కాదు. ఈ విషయాన్ని దేశ తొలి సీడీఎస్, దివంగత జనరల్ బిపిన్ రావత్ గతంలోనే కచ్చితంగా అంచనా కట్టారు. తగినన్ని, నాణ్యమైన ఆయుధ వ్యవస్థలు లేకపోయేందుకు ప్రస్తుతం అవలంబిస్తున్న 'ఎల్1' టెండర్ వ్యవస్థ కారణం. మిత్ర దేశాలకు లైన్ ఆఫ్ క్రెడిట్ ఇవ్వడంతో రక్షణ రంగ ఎగుమతులు పెరిగాయి. ఈ దేశాలన్నీ ప్రాణాంతకమైనవి కాకుండా ఇతర పరికరాలను ఎక్కువగా కొనుగోలు చేస్తున్నాయి.

త్రివిధ దళాల అధిపతులు, జాతీయ భద్రతా సలహాదారులు కలిసి ఉన్న డిఫెన్స్ ప్లానింగ్ కమిటీ జాతీయ భద్రత వ్యూహం ఒకదాన్ని ఇంకా రూపొందించాల్సి ఉంది. ముసాయిదా ఒకదాన్ని ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్ 2021లోనే భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌కు ఇచ్చిన విషయం ప్రస్తావనార్హం. అప్పటి నుంచి ఇప్పటివరకూ దాన్ని అప్‌డేట్ చేస్తూనే ఉన్నారు.

ఆర్మీ దళాలు ఎదుర్కొంటున్న అతిపెద్ద, ముఖ్యమైన సమస్య వనరుల కొరత. దీంతోపాటే కేటాయించిన నిధులను సక్రమంగా వినియోగించక పోవటం కూడా. జాతీయ భద్రత విషయంలో 1980 మధ్య కాలం మిలటరీకి స్వర్ణయుగం అని చెప్పాలి. త్రివిధ దళాలు 15 ఏళ్ల రక్షణ ప్రణాళికను 1988లో పార్లమెంటులో ప్రస్తావించడం గమనార్హం.

పదేళ్లలో బీజేపీ ఐదుగురు రక్షణ మంత్రులను నియమించింది. వీరిలో ఒకరు ఆర్థిక శాఖ మంత్రిగానూ పనిచేశారు. రెండుసార్లు రక్షణ మంత్రిత్వ శాఖను అదనపు బాధ్యతగా చేపట్టారు కూడా! మాజీ విదేశీ వ్యవహారాల కార్యదర్శి ఎస్.జయశంకర్‌ను ఆ శాఖ మంత్రిగానూ నియమించింది ఈ ప్రభుత్వం. జయశంకర్ అంతర్జాతీయ స్థాయిలో భారత్ ప్రభను వెలిగించారనడంలో సందేహం లేదు. అయితే దేశ రక్షణ రంగం కూడా ఇలాంటి ప్రొఫెషనల్ ఏర్పాటును కోరుకుంటోంది. రక్షణ మంత్రి లేదా ఆ శాఖ సహాయ మంత్రికైనా మిలటరీ విషయాలపై ఎంతో కొంత పట్టు ఉండాలి. దీనివల్ల నిర్ణయాలు తీసుకోవడం సులువు అవుతుంది. పథకాల అమలు వేగవంతమవుతుంది. ఆత్మ నిర్భరత సాధ్యమవుతుంది.

– వ్యాసకర్త మిలటరీ వ్యవహారాల వ్యాఖ్యాత

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా



నమ్మకం పోతుంది

ఎన్డీయేకి 400కి పైగా సీట్లు వస్తాయన్న నమ్మకంతో ఉన్న బీజేపీ బ్రిజ్ భూషణ్ కుమారుడిని అభ్యర్థిగా నిలబెట్టకుండా ఉండాల్సింది. ఇలా చేయటం వల్ల... సామాజిక కళంకాన్ని సైతం ఎదుర్కొంటూ బ్రిజ్ భూషణ్‌పై ఎంతో కాలంగా న్యాయ పోరాటం చేస్తూ ఉన్న మన మహిళా ఒలింపిక్ విజేతల మనోధైర్యాన్ని దెబ్బతీసినట్లయింది.

– ప్రీతిష్ నంది, మాజీ ఎంపీ, జర్నలిస్ట్

జాప్యమైతే అప్రతిష్ఠ



రేవణ్ణ విషయమై దేశ ప్రతిష్ఠ భారీ మూల్యం చెల్లించుకోనుంది. తుపాకీతో బెదిరించి అత్యాచారం చేయటం నపుంసకత్వానికి సంకేతం. సత్వర విచారణ జరిపించి, శిక్షించటంలో జాప్యం తగని కేసు ఇది. రేపిస్టు కొడుకు, కిడ్నాపర్ తండ్రి.

– శోభా డే, సామాజిక వ్యాఖ్యాత

మాయదారి ఒప్పందం



ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలన్నీ 'వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్' (హూ) ప్రతిపాదించిన 'మహమ్మారి' ఒప్పందంపై చర్చలు జరుపుతున్నాయి. ఈ ఒప్పందంపై సంతకం చేయటం అంటే మహమ్మారులు, లాక్‌డౌన్‌లు, వాక్సిన్‌ల విషయంలో ప్రభుత్వాలు ప్రపంచ ఆరోగ్య సంస్థ చెప్పినట్లు చేయటమే! అంటే తమ సార్వభౌమత్వాన్ని కోల్పోవటమే!

– ప్రశాంత్ భూషణ్, న్యాయవాది, యాక్టివిస్టు

మంచే జరిగింది



మణిపుర్‌లోని ఒక్క కామ్‌జోంగ్ జిల్లాలోనే 5,457 మంది అక్రమ వలసదారులను గుర్తించారు. వారిలో 5,173 మంది బయోమెట్రిక్ డేటాను ప్రభుత్వం సేకరించింది. ఇది సాధ్యమవటానికి కారణం... అక్రమ వలసదారులను బహిష్కరించాలనీ, రాష్ట్రంలో ఎన్.ఆర్.సి. (నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్) ని అమలు చేయాలనీ మణిపుర్ ప్రజలు డిమాండ్ చేయటమే!

– అన్షుల్ సక్సేనా, న్యూస్ ఎనలిస్ట్

ఇన్ బాక్స్

ప్రైవేటు రైలు వచ్చేస్తోంది!

పూర్తిగా ప్రభుత్వ రంగంలో నడుస్తున్న వ్యవస్థల్లో భారత రైల్వేస్ ఒకటి. కానీ ఈ జూన్‌లో దానిలోనూ ప్రైవేటు రైలు ప్రవేశిస్తోందనే సమాచారం పెద్దగా ఆశ్చర్యాన్ని కలిగించడం లేదు. ఎందుకంటే ఇప్పటికే అనేక రంగాలు ప్రైవేటైజేషన్‌కు గురవుతున్న సంగతి తెలిసిందే.

ఈ ప్రైవేట్ రైలు ప్రధాన లక్ష్యం పర్యాటకులను ఆకర్షించడమే. సౌకర్యాలు బాగుంటే దీనికి తిరుగుండదు. సాధారణంగా మన రైళ్లు కిక్కిరిసి ఉంటాయి. కాలు పెట్టడానికి సందు ఉండదు. విజ్ఞానం, వినోదం, ఆహ్లాదం కోరుకునే పర్యాటకులు ఇటువంటి రైళ్లలో ప్రయాణం చేయరు. ఎంచక్కా కూర్చోవడానికే కాక పండుకొని సౌకర్యవంతంగా ప్రయాణించడానికి వీలున్న విశాలంగా ఉన్న కంపార్ట్‌మెంట్లను పర్యాటకులు కోరుకుంటారు. ముఖ్యంగా పరి శుభ్రత ఉండాలి. నాణ్యమైన తినుబండారాలు ఉండాలి. సిబ్బంది పర్యాటకుల పట్ల మర్యాద, మన్నన చూపాలి. తాజా ప్రైవేట్ రైలును ప్రయోగాత్మకంగా కేరళ లోని తిరువనంతపురం నుంచి గోవా వరకు నడుపుతారు. ఈ మార్గంలో చక్కటి ప్రకృతి దృశ్యాలు ఎక్కువ.

త్రివేంద్రం, కొల్లాం, కొట్టాయం, ఎర్నాకుళం, కన్నూర్, కాసర్‌గోడ్ వంటివి పర్యాటకులను బాగా ఆకట్టుకుంటాయి. ఈ రైలులో దాదాపుగా 700 మంది ప్రయాణం చేయవచ్చని తెలుస్తోంది. ఇందులో ప్రయాణికులకు ఏమైనా అనారోగ్య సమస్యలు వస్తే వైద్య సిబ్బంది కూడా ఉంటారు. ప్రయాణికుల రక్షణకూ సిబ్బంది ఉంటారు. దీనిని ఎస్ఆర్ఎమ్‌పీఆర్ గ్లోబల్ రైల్వేస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ నిర్వహిస్తుందని సమాచారం. క్రమంగా ప్రైవేట్ రైళ్లు అన్ని ప్రధాన చారిత్రక, ఆధ్యాత్మిక సుందర ప్రదేశాలను చుట్టి రావడానికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. తాజ్‌మహల్ వంటి అద్భుత కట్టడాలు ఎన్నో మనదేశంలో ఉన్నాయి. విదేశీయులూ ఇటువంటి సుందర కట్టడాలను దర్శిస్తూ ఉంటారు. మంచి ప్రమాణాలతో పర్యాటక ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేస్తే దేశ, విదేశీ పర్యాటకులు అధిక సంఖ్యలో సందర్శించే అవకాశం ఉంటుంది. అలాగే ప్రసిద్ధ పుణ్య క్షేత్రాలను కలుపుతూ సీనియర్ సిటిజన్స్ కోసమే ప్రత్యేక పర్యాటక రైళ్లు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

ప్రైవేట్ రైళ్లు రావడం వలన అటు ప్రభుత్వానికి కూడా ఆదాయం ఉంటుంది. ప్రభుత్వ, ప్రైవేటు రైళ్ల మధ్య ఆరోగ్యకరమైన పోటీ ఏర్పడి అంతిమంగా ప్రయాణికులు లాభపడే అవకాశం ఉంది. కాబట్టి ప్రైవేటు రైళ్లను గుడ్డిగా వ్యతిరేకించాల్సిన అవసరం లేదు.

– కనుమ ఎల్లారెడ్డి, అమెరికా

ప్రతి ఓటూ ఎంతో విలువైనదే!

సందర్భం




జిల్లా గోవర్ధన్

ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత కీలకమైనది. అది ఎన్నికల్లో వేసే ఓటు కావచ్చు లేదా చట్టసభల్లో బలపరీక్ష జరిపేటప్పుడు ప్రజాప్రతినిధులు వేసే ఓటు కావచ్చు. ఒకటి రెండు ఓట్ల తేడాతో అభ్యర్థులు లేదా ప్రభుత్వాలు ఓటమిపాలయిన ఉదాహరణలు ఉన్నాయంటే ఆశ్చర్యపోవలసిన పనిలేదు. పన్నెండవ లోక్‌సభలో జరిగిన సంఘటన ఇందుకు ఒక ఉదాహరణ.

1998 మార్చిలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఏ రాజకీయ పార్టీ మెజారిటీ పొందలేకపోవటంతో అత్యధిక సీట్లు (182) సాధించిన భారతీయ జనతా పార్టీ, పన్నెండు ప్రాంతీయ పార్టీల (ఎన్డీఏ) సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసింది. అటల్ బిహారీ వాజ్‌పేయి 1998 మార్చి19న 10వ ప్రధాన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. కాని ఇది మూణ్ణాళ్ళ ముచ్చటే అయింది. 18 మంది లోక్‌సభ సభ్యులతో, ఆ ప్రభుత్వానికి మద్దతు ఇస్తూ వచ్చిన అన్నా డీఎమ్‌కే అధినేత్రి జయలలిత రోజుకొక గొంతెమ్మ కోరికతో ప్రధాని కంటి మీద కునుకులేకుండా చేసింది అప్పట్లో. ఓ రోజు 'అమ్మ'... నేవల్ అధికారినే మార్చి తనకు అనుకూలమైన ఆఫీసరును నియమించవలసిందిగా కోరటంతో విసిగిపోయిన ప్రధాని వాజ్‌పేయి ససేమిరా అన్నారు. అంతే, ఏప్రిల్ 14న ఆయన ప్రభుత్వానికి మద్దతు విరమించుకుంటున్నట్లు చెన్నై నుండి ఢిల్లీ కెళ్ళి రాష్ట్రపతికి వినతి పత్రం అందజేశారు జయలలిత. 543 సభ్యుల పార్లమెంటులో 'నాజూకు' బలంతో సాగుతున్న వాజ్‌పేయి ప్రభుత్వం, మైనారిటీకి చేరింది. దీంతో అవిశ్వాస తీర్మానానికి తెర లేపింది ప్రతిపక్ష కాంగ్రెస్.

ప్రధానికి 'మ్యాన్ ఫ్రైడే'గా చలామణీ అవుతున్న బీజేపీ యువనేత ప్రమోద్ మహాజన్ రంగంలోకి దిగి తనదైన శైలిలో చకచకా పావులు కదిపి, అవిశ్వాసాన్ని ఎదుర్కోవటానికి, ఎన్డీఏకి అనుకూలంగా తిరిగి సంఖ్యాబలాన్ని సమకూర్చారు. అదే రోజు రాత్రి... బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) నాయకురాలు మాయావతి ఇంటి ముందు ఒక తెల్ల అంబాసడర్ ఎర్ర బుగ్గ కారు ఆగింది. కారులోని వీఐపీని చూసిన సెక్యూరిటీ గార్డ్, సెల్యూట్ చేసి గేటు తెరిచి, మేడం మాయవతికి ఫోన్ ద్వారా ఆయన రాకను చేరవేశాడు. సుమారు అరగంట సేపు ఆమెతో సీరియస్‌గా చర్చించి వెళ్ళిపోయాడు. ఆయన మరెవరో కాదు, కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ లీడర్ శరద్ చంద్ర పవార్.

మరుసటి రోజు (17 ఏప్రిల్) ఉదయం. పార్లమెంటు సెంట్రల్ హాలులోకి ఎంపీలు రావటం మొదలెట్టారు. వారిలో ఒకరు ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి. ఆయనను చూడగానే, దగ్గరకు వస్తూ పాదాభివందనం చేసింది మాయావతి. ఎప్పటిలాగే చిరునవ్వుతో ఆమెను ఆశీర్వదిస్తూ ముందుకు నడిచారు ఆయన. ఆ తర్వాత శరద్ పవార్ ఆమె దగ్గరకు వెళ్లి చెవిలో ఏదో చెబుతున్నారు. ఈ దృశ్యం చూసిన బీజేపీ నేత ప్రమోద్ మహాజన్ మనసు ఏదో కీడును శంకించింది. సుదీర్ఘ చర్చల తర్వాత మధ్యాహ్నం అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టింది కాంగ్రెస్ పార్టీ. మాయావతి పార్టీ ఐదుగురు సభ్యులు అవిశ్వాస బిల్లుకు, ఊహించని రీతిలో ఆమోదం తెలపటంతో వాజ్‌పేయి ప్రభుత్వం ఒకే ఒక్క ఓటు తక్కువ అవ్వడంతో మెజారిటీ కోల్పోయింది. మాయావతి వైపు పవార్ విసిరిన పాచిక ప్రభావం అప్పుడు అర్థమైంది ప్రమోద్ మహాజన్‌కు. అవాక్కయి పోయారు ట్రెజరీ బెంచ్ సభ్యులు.



1999లో అవిశ్వాస తీర్మానం సందర్భంగా పార్లమెంట్‌లో వాజ్‌పేయి

ఇక 1999 ఏప్రిల్ 21 నాడు కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ రాష్ట్రపతి భవన్ చేరుకుని, ప్రభుత్వం ఏర్పాటుకు అవకాశం ఇవ్వాల్సిందిగా కోరారు. వాస్తవానికి ఈ విన్నపం, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ లీడరుగా శరద్ పవార్ చేయాల్సింది. పరిస్థితిని ఆకళింపు చేసుకున్న పవార్, వెంటనే తన 'ప్లాన్ బి' బటన్ ఆన్ చేయటంతో, ఏప్రిల్ 22 నాడు ఆయన మిత్రుడు సమాజ్‌వాది పార్టీ నేత ములాయం సింగ్ యాదవ్, 'రాబోయే కాంగ్రెస్ ప్రభుత్వానికి తన పార్టీ 19 మంది ఎంపీల మద్దతు ఉండబోదని' వెల్లడించారు. అలా మ్యాజిక్ సంఖ్య (272)ను చేరుకోలేక పోయింది కాంగ్రెస్. చివరకి 12వ లోక్‌సభ త్రిశంకు స్వర్గంలో ఉండిపోవడంతో 1999 ఏప్రిల్ 26న దాన్ని రద్దు చేశారు రాష్ట్రపతి కేఆర్ నారాయణన్.


కనివిని ఎరుగని మండుటెండలు, అటు రాజకీయ నాయకుల ఊకదంపుడు ప్రచారాలతో 18వ పార్లమెంటు ఎన్నికలు ముమ్మరంగా సాగుతున్న ప్రస్తుత దశలో విసిగి పోయిన దేశంలో పలుచోట్ల ఓటర్లు ఎందుకో ఈసారి ఓటు హక్కుపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మూడో విడత ఎన్నికలు (283 సీట్లు) ముగిసేసరికి ఓటింగ్ శాతం తగ్గిపోవటంతో స్టాక్ మార్కెట్‌లో ప్రకంపనలు మొదలయ్యాయి. ఒక వేళ 4 జూన్ నాటి ఫలితాలు 12వ లోక్‌సభ ఎన్నికల ఫలితాల మాదిరి పునరావృతమైతే, దేశ ఆర్థిక, రాజకీయ పరిస్థితి ఎలా ఉంటుందో! అదే జరిగితే, మరి బాధ్యులు ఎవరు? ఓటర్లా లేక ప్రజా విశ్వాసం చూరగొనలేని రాజకీయపక్షాలా?

(శరద్ పవార్ రాజకీయ ఆత్మకథ, మరాఠీ పుస్తకం, 'లోక్ మాఝే సాంగతి' ఆధారంగా)

– విశ్రాంత పీఎఫ్ కమిషనర్, । 9819096949

మన లోపలే ఉంది!

అదొక పెద్ద సంత. అక్కడ ఓ బిచ్చగాడు నిల్చునేవాడు. కానీ అతను ఎవరినీ నోరు తెరచి ఏమీ అడగడు. ఇస్తే తీసుకుంటాడు. రోజూ ఉదయమే వస్తాడు. ఒకే చోట నిల్చుంటాడు. కుడి చేతిని మాత్రం ముందుకు చాస్తాడు. ఏమీ మాట్లాడడు. ఆ దారిన వచ్చి పోయే వాళ్ళు అతని చేతిలో చిల్లర నాణేలు వేసి పోతుంటారు. అతను దాదాపు యాభై ఏళ్లుగా అదే చోట నిల్చుని యాచన చేస్తున్నాడు. ఉన్నట్టుండి ఒక రోజు బిచ్చమెత్తుకుంటున్న చోటే పడి చనిపోయాడు. ఊరివారంతా అయ్యో పాపం అనుకున్నారు. ఊరి ప్రజలందరూ ఏకమై ఆ బిచ్చగాడు అడుక్కునే చోట అతనికి ఓ విగ్రహం పెట్టాలనుకున్నారు. వెంటనే విరాళాలు సేకరించారు. బోలెడంత డబ్బు జమైంది. ఆ బిచ్చగాడు ఎప్పుడూ నిల్చున్న చోటే తవ్వడం మొదలుపెట్టారు. ఓ రెండు అడుగులు తవ్వారో లేదో ఓ బిందె బయటపడింది. అందులో బంగారు నాణేలు, వెండి నాణేలు ఉన్నాయి. వాటిని చూసి ఆశ్చర్యపోయారు. ఒకరన్నారు... 'చూశారా.! ఈ బిచ్చగాడు తన కాళ్ళ కింద ఇంతటి విలువైన సంపద పెట్టుకుని చిల్లర పైసల కోసం అడుక్కున్నాడు కదా' అని.



జ్యోతిర్మయం

అప్పుడు అటువైపుగా వచ్చిన ఓ సాధువు అక్కడున్న వారిని చూసి 'అవును, ప్రతి మనిషీ ఇలాగే ఉన్నాడు. తన బుర్రలో ఉన్న తెలివితేటలనూ, శక్తిసామర్థ్యాలనూ, సంతోషాన్నీ అతను గ్రహించడు. బయటెక్కడో అవన్నీ ఉన్నాయనుకుని వెతుకుతుంటాడు' అని అక్కడి నుంచి వెళ్ళిపోయారు.

సాధువు వెళ్ళాక అక్కడున్న వారందరూ ఆలోచనలో పడ్డారు. ఇదంతా ఎందుకు చెప్పడమంటే, మన దగ్గర ఏమేమి ఉన్నాయో సరిగ్గా తెలుసుకోం. కానీ అవన్నీ వెతుకుతూ ఎక్కడెక్కడికో పోతుంటాం. వీధి చివర ఉన్న కిరాణా దుకాణానికి వెళ్ళి ఓ అర కిలో సంతోషాన్ని కొనుక్కోగలమా?

పూర్వం ఓ జ్ఞాని ఉండేవారు. ఆయన వద్దకు ఓ శిష్యుడు వచ్చాడు. 'మీ వద్ద జ్ఞానమనే ముత్యాలు ఉన్నాయని అంటున్నారు. నాకందులో కొంత అమ్మగలరు'అని అడిగాడు. అప్పుడు ఆ జ్ఞాని 'నీకది అమ్మడం కుదరదు. ఎందుకంటే దాని ఖరీదు నువ్వివ్వలేవు. పోనీ ఉచితంగా ఇద్దామంటే నువ్వు దానిని నిర్లక్ష్యం చేస్తావు. కనుక నాలాగా నువ్వు కూడా జ్ఞానమనేసాగరంలో మునిగి తేలాలి. అప్పుడు నువ్వూ ఓ ముత్యాన్ని పొందవచ్చు. అంతేతప్ప బయటెక్కడో కొనే విషయం కాదు. దేనికైనా కృషి అనేది ముఖ్యం. అందులో ప్రయత్నలోపం తగదు' అన్నారు జ్ఞాని.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, తిథి: శు.సప్తమి ఉ.5.56 వరకు, తదుపరి అష్టమి, నక్షత్రం: ఆశ్లేష సా.4.58 వరకు, తదుపరి మఖ, వర్జ్యం: లేదు, దుర్ముహూర్తం: ఉ.11.31 నుండి 12.19 వరకు, అమృతఘడియలు: ప.3.12 నుండి 4.55 వరకు; రాహుకాలం: ప.12.00 నుండి 1.30 వరకు, యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు, సూర్యోదయం: 5.32, సూర్యాస్తమయం: 6.19.

క్లుప్తంగా...

శ్రీవారి సేవలో కేంద్రమంత్రి పాండే



తిరుమల: తిరుమల శ్రీవారిని కేంద్ర మంత్రి మహేందర్‌నాథ్ పాండే మంగళవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు పలుకగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

ఏపీలో ఎన్డీయే క్లీన్‌స్వీప్ చేస్తుంది

- టీడీపీ అధినేత చంద్రబాబు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమి క్లీన్ స్వీప్ చేస్తుందని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు చెప్పారు. ప్రధాని మోదీ నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వారణాసి వెళ్లిన ఆయన అక్కడ మీడియాతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా ఎన్డీయే కూటమికి 400 సీట్లు వస్తాయన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని చెప్పారు.

గవర్నర్‌కు చంద్రబాబు లేఖ

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సొంత కాంట్రాక్టర్లకు నిధులు విడుదల చేసేందుకు సిద్ధమైందని.. ఈ చెల్లింపులను అడ్డుకోవాలని కోరుతూ గవర్నర్‌కు చంద్రబాబు లేఖ రాశారు. నిబంధనలకు విరుద్ధంగా ఈ బిల్లుల విడుదల జరగబోతోందన్నారు. రాజకీయ స్వార్థంతో చేసే ఇలాంటి పనుల వల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. అలాగే టీడీపీ కార్యకర్తలపై వైఎస్సార్‌సీపీ దాడులు చేస్తోందని డీజీపీకి చంద్రబాబు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఆయన డీజీపీకి ఫోన్ చేసి మాచర్ల, చంద్రగిరి, తాడిపత్రిలో తమ వారిపై దాడులు చేస్తున్నారని.. తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా, ఫలితాలు అద్భుతంగా ఉంటాయని టీడీపీ నేత బుచ్చయ్యచౌదరి ఓ ప్రకటనలో తెలిపారు.

కూటమికే అత్యధిక స్థానాలు

జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్

సాక్షి, అమరావతి: ఎన్నికల ఫలితాలు ఎన్డీయే కూటమికే అనుకూలంగా వస్తాయని.. అత్యధిక స్థానాలు గెలుస్తామని జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ చెప్పారు. వారణాసి వెళ్లిన పవన్‌కళ్యాణ్ అక్కడ విలేకరులతో మాట్లాడారంటూ ఆ పార్టీ కార్యాలయం మంగళవారం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేసింది. 'ఆంధ్రప్రదేశ్‌లోని శాసనసభతో పాటు లోక్‌సభ నుంచి అత్యధిక స్థానాలను ఎన్డీయే కూటమి గెలవబోతుంది. 2014లో మోదీ మొదటిసారి ప్రధాని అయినప్పటి నుంచి ఆయనతో నాకు సన్నిహిత సంబంధాలున్నాయి. వ్యక్తిగతంగా మోదీ అంటే అమితమైన గౌరవం. మూడోసారి ఆయన ప్రధాని కావాలని ఆకాంక్షిస్తున్నాను. దేశం ఆయన నాయకత్వంలో మరింత ముందుకు వెళ్తుందని బలంగా నమ్ముతున్నాను. మోదీ అఖండ మెజారిటీతో వారణాసిలో గెలవబోతున్నారు. ఎన్డీయే ప్రభుత్వం అత్యధిక మెజార్టీతో కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయబోతోంది. రాష్ట్రంలోనూ ఎన్డీయే ప్రజా పాలన మొదలు కాబోతోంది' అని పవన్ అన్నారు.

బానిస బతుకుల నుంచి విముక్తి

- ఇక నుంచి మీరంతా స్వేచ్ఛాజీవులు
- స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన స్వతంత్రంగానే పోటీ
- టీడీపీనుద్దేశించి జనసేన నేత నాగబాబు సంచలన వ్యాఖ్యలు

పిఠాపురం: జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సోదరుడు, ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.నాగబాబు సంచలన వ్యాఖ్యలు చేశారు. రెండు రోజులుగా టీడీపీతో సంబంధం లేకుండా విడిగా సమావేశాలు పెడుతున్న నాగబాబు.. మంగళవారం కాకినాడ జిల్లా పిఠాపురం మండలం కుమారపురంలో పార్టీ శ్రేణులతో అంతర్గత సమీక్షలో తెలుగుదేశం పార్టీ నాయకులను ద్దేశించి పలు వ్యాఖ్యలు చేశారు. జనసేన వర్గాల కథనం ప్రకారం.. పిఠాపురం నియోజకవర్గంలో ఓ టీడీపీ నాయకుడు తమను తీవ్ర ఇబ్బందులకు, అవమానాలకు గురిచేశారని కార్యకర్తలు, నాయకులు నాగబాబుకు ఈ సమావేశంలో చెప్పారు. దీనికి ఆయన స్పందిస్తూ.. ఇప్పటివరకు మనం ఒకరి కింద పనిచేశామని, ఇకపై ఆ అవసరం లేదని, బానిస బతుకుల నుంచి విముక్తి పొందామంటూ వ్యాఖ్యానించారు. ఇకపై జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన స్వతంత్రంగా పోటీ చేస్తుందని ప్రకటించారు. ఎవరి అడుగులకు మడుగులొత్తాల్సిన అవసరం లేదని, జనసేన నాయకులమని చెప్పుకుని తిరగండని చెప్పారు. అంతా తామే చేశామని ఎవరైనా అంటే గట్టిగా తిరగబడాలని స్పష్టంగా చెప్పినట్లు తెలిసింది. మీ వెనుక అధినేత పవన్ కల్యాణ్ ఉంటారని, పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పరిస్థితులు అనుకూలించక, పది మెట్లు దిగి, మనస్సు చంపుకొని, తగ్గి ఒకరి కింద పని చేశామని వ్యాఖ్యానించారు. కానీ ప్రజలు మనల్నే కోరుకున్నారని, ఇక నుంచి మనమంతా ప్రజలతో ఉండాలని, ఎవరితోనో కలసి ఉండాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఎవ్వరికీ సమాధానం చెప్పాల్సిన పని లేదని తెలిపారు. వారు పెట్టిన బాధలు భరించినందుకు మీ అందరినీ క్షమాపణ కోరుతున్నా అని నాగబాబు అన్నారు.

తాడిపత్రిలో టీడీపీ శ్రేణుల విధ్వంసకాండ

ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఇంటిపై టీడీపీ రాళ్ల దాడి

- అనుచరులతో కలిసి జేసీ ప్రభాకర్‌రెడ్డి హింసాకాండ
- టీడీపీ రాళ్లదాడిలో సీఐ మురళీకృష్ణకు గాయాలు
- బాష్పవాయువు ప్రయోగం
- గాల్లోకి పోలీసుల కాల్పులు
- ఎస్పీ అమిత్‌బర్దర్, బీఎస్ఎఫ్ బలగాలపైనా రాళ్ల దాడి
- గాయపడిన బీఎస్ఎఫ్ జవాను
- టీడీపీ శ్రేణుల ఆగడాల అదుపులో పోలీసుల వైఫల్యం

తాడిపత్రి/తాడిపత్రి అర్బన్: అనంతపురం జిల్లా తాడిపత్రిలో టీడీపీ శ్రేణులు రెచ్చిపోయాయి. పోలింగ్ నాడు మొదలైన పచ్చ ముఠా హింసాకాండ మంగళవారమూ ఎమ్మెల్యే పెద్దారెడ్డి లక్ష్యంగా కొనసాగింది.. సోమవారం పోలింగ్ సందర్భంగా దాడులకు దిగిన టీడీపీ నేత జేసీ ప్రభాకర్‌రెడ్డి వర్గీయులు.. మంగళవారమూ తాడిపత్రిలో రెచ్చిపోయారు. వైఎస్సార్‌సీపీ వర్గీయులపై దాడులకు దిగి ఆస్తులను ధ్వంసం చేశారు. టీడీపీ దాడిలో గాయపడిన కార్యకర్తను పరామర్శించేందుకు వెళ్లిన ఎమ్మెల్యే పెద్దారెడ్డిపై రాళ్ల వర్షం కురిపించారు. అంతటితో ఆగకుండా తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి వందలాది మంది తన అనుచరులతో కలిసి ఎమ్మెల్యే ఇంటిని చుట్టుముట్టి రాళ్ల దాడి చేశారు. దీంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులూ ప్రతిఘటనకు దిగాయి. రెండు పార్టీల కార్యకర్తలూ పరస్పరం రాళ్ల దాడికి పాల్పడడంతో తాడిపత్రి రణరంగాన్ని తలపించింది. అడ్డొచ్చిన పోలీసులపైనా టీడీపీ కార్యకర్తలు రాళ్లు విసిరారు. తాడిపత్రి అర్బన్ సీఐ మురళీకృష్ణ తలకు రాయి తగలడంతో తీవ్రంగా గాయపడ్డారు. పరిస్థితులు అదుపు తప్పడంతో పోలీసులు బాష్పవాయువును ప్రయోగించారు.

బరి తెగించిన టీడీపీ కార్యకర్తలు

తాడిపత్రి పట్టణంలోని గానుగవీధికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త సంజీవ సోమవారం జరిగిన ఎన్నికల పోలింగ్ సందర్భంగా 230వ పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్యే అభ్యర్థి కేతిరెడ్డి పెద్దారెడ్డి తరఫున ఏజెంటుగా ఉన్నారు. మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో టీడీపీ నాయకుడు సూర్యముని తన వర్గీయులు భాను, కిరణ్, అశోక్, వేణు మరికొందరితో కలిసి సంజీవపై దాడి చేశారు. అతని ఇంట్లోని సామగ్రిని ధ్వంసం చేయడమే కాకుండా అతని మిక్చర్ బండినీ ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి తన అనుచరులతో కలిసి సంజీవ ఇంటికి వెళ్లి పరామర్శించారు. అక్కడి నుంచి తిరిగొస్తుండగా టీడీపీ నాయకుడు సూర్యముని ఇంటి వద్ద పెద్దఎత్తున గుమిగూడిన టీడీపీ అల్లరి మూకలు ఎమ్మెల్యే పెద్దారెడ్డి కాన్వాయ్‌పై దాడులకు పాల్పడ్డాయి. దీంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. వారిని చూసిన టీడీపీ అల్లరి మూకలు పోలీసులపైనా రాళ్లతో దాడి చేశాయి. ఈ దాడిలో తాడిపత్రి అర్బన్ సీఐ మురళీ కృష్ణ తలకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అక్కడున్న పోలీసులు ఆయన్ను హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు.



జేసీ అనుచరుల రాళ్ల దాడిలో గాయపడిన తాడిపత్రి అర్బన్ సీఐ మురళీకృష్ణ, బీఎస్ఎఫ్ జవాను



సీఐ మురళీకృష్ణపై జేసీ ప్రభాకర్‌రెడ్డి దౌర్జన్యం



బాణసంచాకు నిప్పు పెట్టి ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఇంటి వైపు విసురుతున్న జేసీ అనుచరులు

జేసీ ప్రభాకర్ గూండాగిరి

దాడి విషయం తెలుసుకున్న తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి వందలాది మంది తన అనుచరులతో టీడీపీ నాయకుడు సూర్యముని ఇంటి వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి తన అనుచరులను వెంటేసుకుని సీబీ రోడ్డులో భయానక వాతావరణం సృష్టిస్తూ వస్తుండగా..పోలీసు బలగాలు అడ్డుకున్నా, ఫలితం లేకపోవడంతో పోలీసులు వారిపై బాష్పవాయువును ప్రయోగించారు. ఆ తర్వాత ప్రభాకర్‌రెడ్డి తన అనుచరులతో పుట్లూరు రోడ్డు గుండా సంజీవనగర్ మీదుగా తన నివాసానికి చేరుకున్నారు. అప్పటికే పక్కా ప్రణాళికతో తన ఇంటి ముందున్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సిద్ధంగా ఉంచుకున్న ట్రాక్టర్లలోని రాళ్లతో టీడీపీ వర్గీయులు ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఇంటిపైకి విరుచుకుపడ్డారు. ఎమ్మెల్యే నివాసాన్ని చుట్టుముట్టి రాళ్ల వర్షం కురిపించారు. ఈ చర్యతో ఆ ప్రాంతంలోని వారందరూ ఇళ్లకు తలుపులేసుకుని బిక్కుబిక్కుమంటూ గడిపారు. విషయం తెలుసుకున్న జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ జూనియర్ కళాశాల మైదానానికి చేరుకున్నారు. అప్పటికే అక్కడ ఐదు వేల మందికి పైగా జేసీ అనుచరులు గుమిగూడి ఉండడంతో అందరూ అక్కడి నుంచి వెళ్లిపోవాలని హెచ్చరికలు జారీ చేశారు. అయినా వారు వినకుండా ఎస్పీ అమిత్ బర్దర్, డీఎస్పీ గంగయ్య, బీఎస్ఎఫ్ బలగాలపై ఊహించని రీతిలో ఒక్కసారిగా రాళ్లతో విరుచుకుపడ్డారు. రాళ్లతో దాడి చేస్తూ ముందుకు చొచ్చుకురావడంతో పోలీసులు సైతం పరుగెత్తాల్సివచ్చింది. చివరకు ఎస్పీ ఆదేశాలతో పోలీసులు బాష్పవాయువు ప్రయోగించారు. అయినా పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో గాల్లోకి ఐదు రౌండ్ల కాల్పులు జరిపారు. అప్పటికీ పరిస్థితి అదుపులోకి రాకపోగా.. జేసీ అనుచరులు ఒక్కసారిగా నాగాలాండ్ నుంచి వచ్చిన బీఎస్ఎఫ్ బలగాలపైనా రాళ్లదాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో బీఎస్ఎఫ్ జవానుల్లో ఒకరి కంటికి తీవ్ర గాయమైంది. జేసీ అనుచరులు విచక్షణ కోల్పోయి దాడులకు దిగడంతో ఎస్పీ అమిత్‌బర్దర్, డీఎస్పీ గంగయ్య, పోలీసులు సైతం ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని అక్కడి నుంచి వెళ్లిపోయారు. అంతటితో ఆగని అల్లరి మూకలు మరింత రెచ్చిపోయి బాణా సంచాకు నిప్పు పెట్టి ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఇంటి వైపు విసిరారు. పరిస్థితి చేయి దాటిపోతుందని భావించిన ఎస్పీ పెద్దఎత్తున అదనపు పోలీసు బలగాలను రప్పించారు. అనంతపురం రేంజ్ డీఐజీ షేముషితో పాటు కర్నూలు, వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల ఎస్పీలు, ట్రైనీ ఎస్పీలు తాడిపత్రికి చేరుకుని భద్రతను సమీక్షించారు. ఆయా జిల్లాల నుంచి అదనపు పోలీసు బలగాలను రప్పించారు.

పోలీసుల వైఫల్యమే కారణం

రెండు రోజులుగా తాడిపత్రిలో జరుగుతున్న దాడులకు పోలీసుల వైఫల్యమే కారణమని తెలుస్తోంది. తాడిపత్రి అసలే సమస్యాత్మక ప్రాంతం. అలాంటి ప్రాంతంలో అప్రమత్తంగా ఉండాల్సిన పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ఎన్నికల బందోబస్తు నిమిత్తం వచ్చిన బలగాలను మంగళవారం ఉదయమే పంపేశారు. దాడులు జరుగుతాయని ముందస్తుగా పసిగట్టడంలో పోలీసులు విఫలమయ్యారన్న విమర్శలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. పోలీసు బలగాలను పట్టణంలో అలాగే ఉంచి ఉంటే మంగళవారం ఘటనలు చోటు చేసుకునే అవకాశం ఉండేది కాదని పలువురు అభిప్రాయపడ్డారు. టీడీపీ వర్గీయుల పట్ల పోలీసులు అవలంబిస్తున్న మెతకవైఖరే అందుకు కారణమన్న బలమైన విమర్శలు వినిపిస్తున్నాయి. అదనపు ఎస్పీ రామకృష్ణ టీడీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నట్లు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆరోపిస్తున్నారు.

జేసీ ట్రావెల్స్ దందాపై ఈడీ కొరడా

పీఎంఎల్‌ఏ కోర్టులో ప్రాసిక్యూషన్ కంప్లైంట్ దాఖలు

సాక్షి, అమరావతి/విశాఖ లీగల్: టీడీపీ సీనియర్ నేత జేసీ ప్రభాకర్‌రెడ్డి కుటుంబం అవినీతి బాగోతాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నిర్ధారించింది. జేసీ కుటుంబానికి చెందిన ట్రావెల్స్ సంస్థలు సుప్రీంకోర్టు నిషేధించిన బీఎస్–3 వాహనాలకు అక్రమ రిజిస్ట్రేషన్లు చేయించి అవినీతికి పాల్పడ్డాయని నిగ్గు తేల్చింది. ఈ వ్యవహారంపై ఇప్పటికే కేసు నమోదు చేసి కీలక ఆధారాలు సేకరించిన ఈడీ ఈ కేసులో విశాఖపట్నం పీఎంఎల్‌ఏ న్యాయస్థానంలో ప్రాసిక్యూషన్ కంప్లైంట్ (పీసీ)ని దాఖలు చేసింది. జేసీ ప్రభాకర్ రెడ్డి, సి. గోపాల్‌రెడ్డిలతోపాటు 17మందిని నిందితులుగా పేర్కొంది. జేసీ కుటుంబం అవినీతి దందాకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.. దేశంలో కాలుష్య నియంత్రణ చర్యల్లో భాగంగా బీఎస్3 వాహనాలను సుప్రీంకోర్టు 2017, ఏప్రిల్ నుంచి నిషేధించింది. కానీ, జేసీ ప్రభాకర్‌రెడ్డి, ఆయన భాగస్వామి సి. గోపాల్‌రెడ్డి తదితరులు అశోక్ లేలాండ్ కంపెనీ నుంచి బీఎస్ 3 వాహనాల (బస్సు)లను కొనుగోలు చేశారు. వాటిని తుక్కు కింద కొనుగోలు చేసినట్లు కథ నడిపించారు. అనంతరం డాక్యుమెంట్లను ఫోర్జరీ చేసి బీఎస్4 వాహనాలుగా చూపించారు.అనంతరం ఆ వాహనాలను నాగాలాండ్, కర్ణాటకలలో అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారు. ఇలా 50 బస్సులను జఠాధర ట్రావెల్స్ పేరిట, 104 వాహనాలను మెస్సర్స్ గోపాల్‌రెడ్డి పేరిట రిజి స్ట్రేషన్లు చేసి అంతర్రాష్ట్ర బస్ సర్వీసులుగా నిర్వహించారు. ఈ వ్యవహారాన్ని రాష్ట్ర రవాణా శాఖ గుర్తించి కేసు నమోదు చేసింది. ఇతర రాష్ట్రాలతో ముడిపడిన అక్రమం కావడంతో ఈడీకి నివేదించింది. దీంతో దర్యాప్తు చేసిన ఈడీ జేసీ కుటుంబం అవినీతి వ్యవ హారాన్ని పూర్తి ఆధారాలతో నిర్ధారించింది. జేసీ ది వాకర్‌రెడ్డి, సి.గోపాల్ రెడ్డిలకు చెందిన రూ.28.62 కోట్ల విలువైన స్థిరాస్తులను జప్తుచేసింది. ప్రాసిక్యూషన్ కంప్లైంట్‌ను తాజాగా న్యాయస్థానంలో దాఖలు చేయడంతో ఈ కేసు విచారణ వేగవంతం కానుందన్నది స్పష్టమైంది.

జమ్మలమడుగులో ఎమ్మెల్యేపై దాడిచేసిన వ్యక్తి అరెస్ట్

జమ్మలమడుగు: ఎన్నికల సందర్భంగా వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగులోని వెంకటేశ్వరకాలనీలోని 116, 117 పోలింగ్ బూత్‌ల వద్ద సోమవారం రాత్రి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిపై దాడిచేసిన వ్యక్తిని మంగళవారం అరెస్టు చేసినట్లు డీఎస్పీ యశ్వంత్ చెప్పారు. జమ్మలమడుగులోని తన కార్యాలయంలో మంగళవారం రాత్రి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ మాట్లాడారు. ఈ దాడికి సంబంధించి కరుణాకర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు 447/2024 కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సీసీ కెమెరాలను, వీడియోలను పరిశీలించి నిందితుడు గొరిగేనూరు గ్రామానికి చెందిన గోనే కృష్ణారెడ్డిని గుర్తించినట్లు చెప్పారు. అతడిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. 2014 ఎన్నికల సమయంలో కూడా కృష్ణారెడ్డిపై కేసు నమోదైందని డీఎస్పీ చెప్పారు.

రెచ్చిపోయిన జనసేన, టీడీపీ



కపిలేశ్వరపురం: కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం వల్లూరులో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు టీడీపీ పచ్చమూకలు కలిసి వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు రుద్రయ్య, సతీష్‌పై మంగళవారం దాడి చేశారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తోట త్రిమూర్తులు, ఆయన కుమారుడు పృథ్వీరాజ్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణతో చర్చించిన అనంతరం తిరుగు ప్రయాణమవ్వగా పచ్చ మూకలు రాళ్లతో దాడి చేశారు. ఈ దాడిలో తోట కుమారుడు పృథ్వీరాజ్ కారు అద్దం ధ్వంసమైంది.

రాష్ట్రంలో 81.3% పోలింగ్!

▶ మొదటి పేజీ తరువాయి

మంగళవారం మధ్యాహ్నం సీఈవో ముఖేష్‌కుమార్ మీనా తెలిపారు. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో రాత్రి 2 గంటల వరకు ఓటింగ్ జరిగినందున ఎక్కడ ఎంత ఓటింగ్ జరిగిందో పూర్తి వివరాలు రావడానికి ఆలస్యమవుతోందని వివరించారు.

మంగళవారం రాత్రి అందిన సమాచారం ప్రకారం జిల్లాల వారీగా పోలింగ్ (శాతాల్లో)

డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ	: 83.19
అల్లూరి సీతారామరాజు	: 63.19
ఏలూరు	: 83.04
సత్యసాయి	: 82.77
చిత్తూరు	: 82.65
ప్రకాశం	: 82.40
బాపట్ల	: 82.33
కృష్ణా	: 82.20
అనకాపల్లి	: 81.63
పశ్చిమ గోదావరి	: 81.12
నంద్యాల	: 80.92
విజయనగరం	: 79.41
తూర్పు గోదావరి	: 79.31
అనంతపురం	: 79.25
ఎన్టీఆర్	: 78.76
కడప	: 78.72
పల్నాడు	: 78.70
నెల్లూరు	: 78.10
తిరుపతి	: 76.83
కాకినాడ	: 76.37
అన్నమయ్య	: 76.12
కర్నూలు	: 75.83
గుంటూరు	: 75.74
శ్రీకాకుళం	: 75.41
మన్యం	: 75.24
విశాఖ	: 65.50

టీడీపీ నేతలను అరెస్టు చేయండి

- హింసాకాండకు పాల్పడినవారిని కఠినంగా శిక్షించాలి
- పోలీసులు నిర్లిప్తంగా వ్యవహరిస్తున్నారు
- డీజీపీకి హోం మంత్రి తానేటి వనిత ఫోన్



సాక్షి, అమరావతి: రాష్ట్ర డీజీపీ హరీశ్ గుప్తాతో రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత మంగళవారం ఫోన్‌లో మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా పలుచోట్ల తలెత్తిన హింసాత్మక ఘటనలను ఆయన దృష్టికి తెచ్చారు. చంద్రగిరి, గురజాల, తాడిపత్రి, గోపాలపురం తదితర నియోజకవర్గాల్లో టీడీపీ నేతలు, కార్యకర్తలు చేసిన హింసాకాండపై డీజీపీతో ఆమె మాట్లాడారు. ఎమ్మెల్యేలపై దాడులు చేస్తుంటే స్థానిక పోలీసులు నిర్లిప్తంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. టీడీపీకి ఓటేయలేదనే కారణంతో మహిళలు, బీసీ, ఎస్సీ, ఎస్టీలపై ఆ పార్టీ నేతలు దాడులు చేస్తున్నారన్నారు. టీడీపీ దాడులను స్థానిక పోలీసుల దృష్టికి తెచ్చినా వారు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని వివరించారు. టీడీపీ దౌర్జన్యాలను, హింసాకాండను తక్షణమే అడ్డుకోవడంలో విఫలమైతే.. మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదుర్కోవాల్సిన పరిస్థితులు తలెత్తుతాయన్నారు. దాడులకు పాల్పడ్డ టీడీపీ నాయకులను, కార్యకర్తలను వెంటనే అరెస్టు చేయాలని ఆమె కోరారు. పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకున్నారో కచ్చితంగా తెలియజేయాలన్నారు. రాష్ట్రంలో ఎన్నికల సంఘం నియమించిన భద్రతా వ్యవహారాల పరిశీలకుడు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నట్టు సమాచారం ఉందన్నారు. టీడీపీ ఇచ్చిన ఫిర్యాదులతో బాధ్యతారహితంగా ఎక్కడికక్కడ చేసిన బదిలీల వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని వనిత డీజీపీకి తెలిపారు. పట్టపగలు నడిరోడ్డుపై టీడీపీ నాయకులు హింసకు పాల్పడుతుంటే స్థానిక పోలీసులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. నిబంధనల ప్రకారం వ్యవహరించేలా తక్షణమే ఆదేశాలు ఇవ్వాలని కోరారు. దౌర్జన్యకాండకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు.

తిరుపతి గంగమ్మ జాతర ప్రారంభం

- తొమ్మిది రోజుల పాటు ఉత్సవాల నిర్వహణ
- 22న అమ్మవారి విశ్వరూప దర్శనంతో ముగియనున్న ఉత్సవాలు



తిరుపతి కల్చరల్: భక్తుల కొంగుబంగారమై వెలుగొందుతున్న తిరుపతిలోని శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతర కైకాల కులస్తుల చాటింపుతో మంగళవారం అర్ధరాత్రి వైభవంగా ప్రారంభమైంది. సాక్షాత్తు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారికి స్వయాన చెల్లెలు, తిరుపతి గ్రామ దేవత అయిన గంగమ్మ విగ్రహాన్ని శ్రీవారి తొలి భక్తుడిగా విశేష సేవలు అందించి స్వామి వారి చేత తాతా.. అని పిలిపించుకున్న తిరుమల నంబి అనంతాళ్వార్ స్వహస్తాలతో ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి శక్తి స్వరూపిణిగా, భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లిగా గంగమ్మ పూజలందుకుంటోంది. అమ్మవారి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకుని తొమ్మిది రోజులపాటు జానపద కళా రూపాలతో అత్యంత వేడుకగా గంగమ్మ జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. గతేడాది రాష్ట్ర ప్రభుత్వం సైతం తిరుపతి గంగమ్మ జాతరను రాష్ట్ర పండుగగా ప్రకటించిన విషయం తెలిసిందే. కాగా, తొలి రోజు మంగళవారం ఉదయం ఆలయం ఆవరణలో అమ్మవారి విశ్వరూప దర్శన కొడిస్తంభానికి భక్తుల సమక్షంలో అభిషేకం జరిపారు. ఒడిబాల సమర్పణతో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. బుధవారం నుంచి భక్తులు రోజుకొక వేషధారణలో తొమ్మిది రోజుల పాటు పురవీధుల్లో సందడి చేయనున్నారు. 22న తెల్లవారు జామున అమ్మవారి విశ్వరూప దర్శనంతో ఉత్సవాలు ముగియనున్నాయి.

'ఫ్యాను'కు ఓటేసిందని తల్లిని చంపేశాడు

- సుత్తితో కొట్టి చంపిన కుమారుడు
- అనంతపురం జిల్లాలో దారుణం
- ఏలూరు జిల్లాలో కుటుంబంపై ఇనుప రాడ్డుతో దాడి



కుమారుడి చేతిలో హత్యకు గురైన సుంకమ్మ



పెంటయ్య వీపుపై ఇనుప రాడ్డుతో కొట్టిన వాతలు

కంబదూరు/పెదవేగి: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలతో అండగా నిలవడంతో అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మలు సోమవారం జరిగిన ఎన్నికల పోలింగ్‌లో స్వచ్ఛందంగా తరలివచ్చి ఓటు వేశారు. ఈ క్రమంలో తన మాట వినకుండా వైఎస్సార్‌సీపీకి ఓటు వేసిందన్న అక్కసుతో కన్నతల్లినే ఓ దుర్మార్గుడు సుత్తితో కొట్టి చంపాడు. ఈ దారుణ ఘటన అనంతపురం జిల్లా కంబదూరు మండలంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. వైసీపల్లికి చెందిన సుంకమ్మ (52) సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా వైఎస్సార్‌సీపీ వర్గీయుల ఆటోలో వెళ్లి ఓటు వేసి వచ్చింది. దీంతో 'ఫ్యాను' గుర్తుకు ఓటు వేసి ఉంటుందన్న ఉద్దేశంతో సుంకమ్మ కుమారుడు వెంకటేశులు మంగళవారం తల్లితో గొడవపడ్డాడు. తనకు తెలియకుండా వైఎస్సార్‌సీపీకి ఓటు ఎందుకు వేశావని సుత్తితో దాడి చేశాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. స్థానిక టీడీపీ నాయకుల ప్రోద్బలంతోనే అతడు ఈ దుర్మార్గానికి ఒడిగట్టినట్లు గ్రామస్తులు చెప్పారు. ఘటనపై కంబదూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ సభ్యులపై ఇనుపరాడ్డుతో దాడి

వైఎస్సార్‌సీపీకి ఓటేశారని తల్లిదండ్రులపై వారి కుమారుడే ఇనుప రాడ్డుతో దాడి చేసిన దారుణ ఘటన ఏలూరు జిల్లా పెదవేగి మండలంలోని విజయరాయిలో చోటుచేసుకుంది. బాధితుడు ముంగమూరి పెంటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. పెంటయ్య కుమారుడు వంశీ టీడీపీ కార్యకర్త. మంగళవారం రాత్రి అతడు కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో ఏ పార్టీకి ఓటు వేశారని ప్రశ్నించాడు. దీంతో వంశీ తండ్రి పెంటయ్య, మిగిలిన కుటుంబ సభ్యులు వైఎస్సార్‌సీపీకి వేశామని బదులిచ్చారు. దీంతో ఒక్కసారిగా వంశీ పిచ్చి పట్టినవాడిలా ఊగిపోతూ ఆ పార్టీకి ఓటెందుకు వేశారంటూ.. సమీపంలోని ఇనుప రాడ్డుతో తండ్రి పెంటయ్యపై విచక్షణారహితంగా దాడికి పాల్పడ్డాడు. ఈ దాడిని ఆపే ప్రయత్నం చేసిన తల్లిని, చెల్లిని కూడా చితకబాదాడు. ఈ క్రమంలో దెబ్బలకు తాళలేక వారు స్థానిక వైఎస్సార్‌సీపీ నేతల వద్దకు పరుగులు తీశారు. తాను వైఎస్సార్‌సీపీ వీరాభిమానినని, తనకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని ఉందని పెంటయ్య చెప్పాడు. అందుకే ఫ్యాన్ గుర్తుకు ఓటేశానని, అయితే తన కుమారుడు తండ్రిని అని కూడా చూడకుండా తనను చావబాదాడని కన్నీటి పర్యంతమయ్యాడు.

20 వరకు వర్షాలే

ఆ తరువాత స్వల్పంగా పెరగనున్న ఉష్ణతాపం



సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో మరికొన్ని రోజులపాటు వడగాడ్పులకు విరామం లభించనుంది. ఇప్పటికే ఐదారు రోజుల నుంచి ద్రోణి, ఆవర్తనాల ప్రభావంతో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, అక్కడక్కడా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగా నమోదవుతున్నాయి. రాష్ట్రం మొత్తమ్మీద ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు మించడం లేదు. ఫలితంగా వడగాడ్పులు వీయడం లేదు. ప్రస్తుతం ఈ నెల 20వ తేదీ వరకు ఇవే పరిస్థితులు కొనసాగే అవకాశాలు ఉన్నాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. అప్పటివరకు వడగాడ్పులకు ఆస్కారం ఉండదని పేర్కొంటున్నారు. 20వ తేదీ తరువాత వర్షాలు తగ్గుముఖం పట్టి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయంటున్నారు. మరోవైపు దక్షిణ అంతర్భాగ కర్ణాటక, దాని పరిసర ప్రాంతాలపై ఉన్న ఉపరితల ఆవర్తనం కేరళ నుంచి కర్ణాటక మీదుగా మరఠ్వాడా వరకు సముద్ర మట్టానికి 0.9 కి.మీ. ఎత్తులో ఉన్న ద్రోణితో విలీనమైంది. అదే సమయంలో రాష్ట్రంపై ఆగ్నేయ, నైరుతి దిశల నుంచి గాలులు వీస్తున్నాయి. ఫలితంగా రానున్న ఐదు రోజులు (20వ తేదీ వరకు) కోస్తాంధ్ర, రాయలసీమల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) మంగళవారం నివేదికలో తెలిపింది. వర్షాలతోపాటు ఉరుములు, మెరుపులు, పిడుగులు సంభవిస్తాయని, గంటకు 40–50 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. కాగా.. మంగళవారం ఉదయం 8.30 నుంచి రాత్రి వరకు గోగులదిన్నె (ప్రకాశం)లో 4.1, గవరవరం (ఏలూరు)లో 3.9, పైడిమెట్ల (తూర్పు గోదావరి)లో, ఫిరంగిపురం (గుంటూరు)లో 3.4 సెం.మీ. చొప్పున, జీకే వీధి (అల్లూరి సీతారామరాజు) 3, ఆత్మకూరు (నంద్యాల)లో 2.5 సెం.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది.

16 నుంచి బీసీజీ టీకా పంపిణీ

రాష్ట్ర వైద్య శాఖ వెల్లడి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 2025 నాటికి టీబీ కేసుల నిర్మూలనే లక్ష్యంగా ఈ నెల 16వ తేదీ నుంచి బాసిల్లస్ కాల్మెట్–గెర్విన్ (బీసీజీ) వ్యాక్సిన్ పంపిణీ ప్రారంభించనున్నట్టు వైద్య శాఖ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. అల్లూరి సీతారామరాజు, విశాఖ, విజయనగరం, కృష్ణా, గుంటూరు, పల్నాడు, నెల్లూరు, చిత్తూరు, నంద్యాల, వైఎస్సార్, అన్నమయ్య, సత్యసాయి జిల్లాల్లో టీకా పంపిణీ చేపట్టనున్నట్టు వెల్లడించారు. 18 ఏళ్లు పైబడిన వారిలో టీబీ రోగుల కుటుంబ సభ్యులు, మధుమేహ వ్యాధిగ్రస్తులు, ధూమపానం చేసేవారికి, 60 ఏళ్లు పైబడిన వారందరికీ టీకా వేస్తామన్నారు. మూడు నెలల వ్యవధిలో పంపిణీ పూర్తి చేస్తామని వివరించారు.

'కేదార్‌నాథ్' మ్యూజియం నిర్మాణ నిపుణుడిగా శివనాగిరెడ్డి

నియామక ఉత్తర్వులు జారీ చేసిన కేంద్ర సాంస్కృతిక శాఖ

తెనాలి: కేదార్‌నాథ్ ఆలయ సమగ్ర అభివృద్ధి పథకంలో భాగంగా ఆలయం సమీపంలో రూపుదిద్దుకోనున్న కేదార్ పరిచయ్ మ్యూజియం నిర్మాణ నిపుణుడిగా గుంటూరు జిల్లా తెనాలికి చెందిన ప్రముఖ స్థపతి, పురావస్తు పరిశోధకుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి నియమితులయ్యారు. కేంద్ర సాంస్కృతిక శాఖ ఈ మేరకు ఉత్తర్వులు జారీచేసింది. మ్యూజియంలోని వివిధ విభాగాల్లో ఏర్పాటు చేయనున్న ప్రదర్శితాలను ఎంపిక చేసేందుకు ఇటీవల ఢిల్లీలోని నేషనల్ మ్యూజియంలో నిర్వహించిన సమావేశంలో డాక్టర్ శివనాగిరెడ్డి పాల్గొని వివిధ సూచనలు చేశారు. కేదార్ పరిచయ మ్యూజియం మూడు గ్యాలరీల్లోని మొదటి గ్యాలరీలో తీర్థస్థలంగా కేదార్‌నాథ్, రెండో గ్యాలరీలో శివుని కుటుంబం, శివారాధన, మూడో గ్యాలరీలో స్థానిక సంప్రదాయాలు, సాంస్కృతిక అంశాలు ఉంటాయని డాక్టర్ శివనాగిరెడ్డి చెప్పారు. ఆలయం వెనుక ప్రాకారంలో లోపలి వైపున శివుని వెయ్యి పేర్లు, ఆయుధాలు ఉంటాయని పేర్కొన్నారు. కేదార్‌నాథ్ ఆలయం వెనుక నిర్మిస్తున్న శివ ఉద్యానవనంలో ప్రదర్శించే శివరూప శిల్పాలపై జరిగిన చర్చల్లోనూ ఆయన పాల్గొన్నారు. కమిటీ సభ్యులు హాజరైన ఆ సమావేశంలో వివిధ రాజవంశాలకు చెందిన చారిత్రక శివుని శిల్పాల ఎంపికలో స్థపతిగా అభిప్రాయాలను శివనాగిరెడ్డి తెలియజేశారు.

ప్రధాని నామినేషన్

వారణాసికి తరలివచ్చిన కేంద్ర మంత్రులు, సీఎంలు, ఎన్డీఏ పక్ష నేతలు

వారణాసి: ఉత్తరప్రదేశ్‌లోని ఆధ్యాత్మిక నగరం వారణాసి నుంచి ప్రధాని మోదీ మంగళవారం నామినేషన్ దాఖలుచేశారు. మూడోసారి వారణాసి నుంచి బరిలో దిగిన మోదీకి మద్దతుగా కేంద్ర మంత్రులు, బీజేపీపాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఎన్డీఏ కూటమి పార్టీల అగ్రనేతలు నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రధాని నామినేషన్‌ను ప్రతిపాదించిన నలుగురిలో ఒక బ్రాహ్మణుడు, ఇద్దరు ఓబీసీలు, ఇక దళితుడు ఉన్నారు. పండిట్ జ్ఞానేశ్వర్ శాస్త్రి, బైజ్‌నాథ్ పటేల్, లాల్‌చంద్ కుష్వాహా, సంజయ్ సోంకర్‌లు మోదీ నామినేషన్‌ను ప్రతిపాదించారు. అయోధ్యలో బాలరామాలయం ప్రాణ ప్రతిష్ట క్రతువుకు ముహూర్తాన్ని నిర్ణయించిన పండితుల్లో జ్ఞానేశ్వర్ శాస్త్రి కూడా ఒకరు. బైజ్‌నాథ్ పటేల్, లాల్‌చంద్ కుష్వాహా ఓబీసీలు కాగా, సోంకార్ బీజేపీ వారణాసి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉన్న దళిత నేత.

కలెక్టరేట్ నిండా ప్రముఖులే

బీజేపీ చీఫ్ నడ్డా, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్, హర్‌దీప్‌సింగ్ పురీ, అనుప్రియా పటేల్, రాందాస్ అథవాలే, మహారాష్ట్ర సీఎం ఏక్‌నాథ్ షిండే, మేఘాలయ సీఎం కాన్రాడ్ సంగ్మా, ఎన్సీపీ నేత ప్రఫుల్ పటేల్, టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్, హిందుస్తానీ అవామ్ మోర్చా(ఎస్) వ్యవస్థాపకుడు జితన్ రాం మాంఝీ, రాష్ట్రీయ లోక్‌మోర్చా చీఫ్ ఉపేంద్ర కుష్వాహా, నిషద్ పార్టీ చీఫ్ సంజయ్ నిషద్, సుహేల్‌దేవ్ భారతీయ సమాజ్‌పార్టీ చీఫ్ ఓంప్రకాశ్ రాజ్‌భర్, ఆర్ఎల్‌డీ చీఫ్ జయంత్ చౌదరి, ఎల్‌జేపీ(రాంవిలాస్) చీఫ్ చిరాగ్ పాశ్వాన్, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, అన్బుమణి రాందాస్, తమిళ మానిల కాంగ్రెస్ చీఫ్ జీకే వాసన్, బీజేపీ నేత దేవనాథన్ యాదవ్, భారతధర్మ జనసేన అధ్యక్షుడు తుషార్ వెల్లపల్లి, అసోమ్ గణపరిషత్ అధ్యక్షుడు అతుల్ బోరాలు వారణాసి కలెక్టరేట్‌లో మోదీ నామినేషన్ కార్యక్రమానికి హాజరయ్యారు. మోదీ నామినేషన్ వేయడానికి వస్తున్నారని తెలిసి స్థానికులు పెద్ద సంఖ్యలో వారణాసి కలెక్టరేట్‌కు వచ్చారు. నామినేషన్ వేశాక మోదీ 'ఎక్స్'లో ఒక పోస్ట్‌చేశారు. '' ఎన్డీఏ నేతలు మద్దతుగా ఇక్కడకు రావడం నాకు గర్వకారణం. దేశ ప్రగతికి, అన్ని ప్రాంతాల ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు ఎన్డీఏ కూటమి కంకణబద్ధమైంది. భవిష్యత్తు లోనూ ఇలాగే దేశ ప్రగతికి పాటుపడతాం' అని మోదీ అన్నారు.

దశశ్వమేధ్ ఘాట్‌లో పూజలు

నామినేషన్ వేయడానికి ముందు మోదీ మంగళవారం ఉదయం కాశీలో గంగా తీరాన దశశ్వమేధ్ ఘాట్‌లో పూజలు చేశారు. ఘాట్ వద్ద వేదమంత్రాల మధ్య గంగా హారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. తర్వాత పడవలో నమో ఘాట్‌కు వెళ్లారు. అక్కడి కాలభైరవ ఆలయంలో పూజలు చేశారు. ఆ తర్వాత నేరుగా కలెక్టరేట్‌కు వెళ్లారు.

బూత్‌కు '370' ఓట్లు ఎక్కువ పడాలి

నామినేషన్ తర్వాత కాశీలోని రుద్రాక్ష కన్వెన్షన్ సెంటర్‌లో కాశీ నియోజకవర్గ బీజేపీ నేతలు, కార్యకర్తలతో మోదీ సమావేశమయ్యారు. ''జమ్మూకశ్మీర్‌లో రద్దయిన ఆర్టికల్ 370కి గుర్తుగా కాశీలోని ప్రతి బూత్‌లో గతంతో పోలిస్తే నాకు 370 ఎక్కువ ఓట్లు పడేలా చేసే బాధ్యత మీదే' అని మోదీ అన్నారు. కేంద్ర, యూపీ రాష్ట్ర ప్రభుత్వ పథకాల గురించి మరింతగా ప్రజలకు వివరించాలని సూచించారు. బీజేపీ కార్యకర్తలకు మోదీ విజయమంత్రాలను ఉపదేశించారని బీజేపీ ఒక ప్రకటనలో పేర్కొంది. కాంగ్రెస్ యూపీ చీఫ్ అజయ్ రాయ్, బీఎస్పీ నేత అథ్‌హర్ జమాల్ లారీ మోదీకి పోటీగా బరిలో నిలబడ్డారు.



మంగళవారం వారణాసిలో అధికారికి నామినేషన్ పత్రాలను అందజేస్తున్న ప్రధాని మోదీ

సొంత ఇల్లు, కారు లేదు
మోదీ అఫిడవిట్

మోదీ తన స్థిరచరాస్తుల వివరాలను అఫిడవిట్‌లో పొందుపరిచారు. అఫిడవిట్ ప్రకారం.. మోదీకి సొంత భూమి, ఇల్లు, కారు లేవు. చేతిలో రూ.52,920 నగదు ఉంది. రూ.3.02 కోట్ల చరాస్తులు ఉన్నాయి. 2018–19లో రూ.11,14,230గా ఉన్న ఆదాయం 2022–23 వచ్చేసరికి రూ.23,56,080కు పెరిగింది. గాంధీనగర్ ఎస్‌బీఐ బ్రాంచీలో రూ.73,304, వారణాసి ఎస్‌బీఐ బ్రాంచీలో రూ. 7,000 నగదు ఉంది. ఎస్‌బీఐలో రూ.2.85 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఉన్నాయి. రూ.2.67 లక్షల విలువైన, 45 గ్రాముల బరువైన నాలుగు బంగారు ఉంగరాలు ఉన్నాయి. 9.12 లక్షల విలువైన నేషనల్ సేవింగ్ సర్టిఫికెట్లు ఉన్నాయి. నామినేషన్ పత్రాల్లో భార్య పేరును జశోదాబెన్‌గా పేర్కొన్న మోదీ ఆమె ఆస్తుల వివరాలు తనకు తెలియదని పేర్కొన్నారు. ఆయనపై ఎలాంటి క్రిమినల్ కేసులు లేవు. ఆయనకు అప్పులు కూడా లేవు. 1967లో ఎస్ఎస్‌సీ, 1978లో ఢిల్లీ యూనివర్సిటీలో బీఏ డిగ్రీ, 1983లో గుజరాత్ యూనివర్సిటీలో ఎంఏ పూర్తిచేశారు. 2019 ఎన్నికల అఫిడవిట్‌లో గుజరాత్‌లోని గాంధీనగర్‌లో ఒక ప్లాట్ ఉందని పేర్కొన్న మోదీ ఈసారి దానిని ప్రస్తావించలేదు.

నిందితుల జాబితాలో ఆప్

ఢిల్లీ హైకోర్టుకు తెలిపిన ఈడీ

న్యూఢిల్లీ: ఢిల్లీ ఎక్సయిజ్ పాలసీ స్కామ్ సంబంధ మనీ లాండరింగ్ కేసులో తదుపరి చార్జ్‌షీటులో ఆమ్ ఆద్మీ పార్టీని నిందితుల జాబితాలో చేర్చుతామని మంగళవారం ఢిల్లీ హైకోర్టుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తెలిపింది. ఈ కేసులో అరెస్టయిన ఆప్ నేత, ఢిల్లీ మాజీ మంత్రి మనీశ్ సిసోడియా బెయిల్‌కు సంబంధించిన పిటిషన్ విచారణ సందర్భంగా ఈడీ ఈ విషయం తెలిపింది. సిసోడియాకు బెయిల్ ఇవ్వొద్దని జస్టిస్ స్వర్ణకాంత శర్మను ఈడీ తరఫు న్యాయవాది కోరారు. ' సిసోడియా ఎక్కువ పిటిషన్లు వేశారని చెబుతున్నారు. కానీ పిటిషన్ల వల్ల విచారణ ఎందుకు ఆలస్యమవుతోందో ఈడీ చెప్పట్లేదు'' అని సిసోడియా తరఫు న్యాయవాది మోహిత్ మాథుర్ వాదించారు. ''పిటిషన్ల మీద పిటిషన్లు వేస్తూ కేసులో చార్జ్‌షీటు ప్రక్రియ ముందుకు సాగకుండా నిందితులు అవరోధాలు సృష్టిస్తున్నారు. ఈ కేసులో ఇప్పటిదాకా 17 మందినే అరెస్ట్ చేస్తే నిందితులు ట్రయల్ కోర్టులో ఏకంగా 250 పిటిషన్లు వేశారు. పిటిషన్ల విచారణ నేపథ్యంలో దర్యాప్తు అధికారి దర్యాప్తును వదిలేసి ప్రతిరోజూ కోర్టుకు హాజరుకావాల్సి వస్తోంది' అని ఈడీ లాయర్ వాదించారు. చార్జ్‌షీటు ఆలస్యానికి నిందితులే కారణమని సీబీఐ సైతం వాదించింది. ఎప్పటికప్పుడు కొత్త వ్యక్తులను అరెస్ట్‌చేస్తూ ఈ కేసు విచారణ త్వరగా ముగిసిపోకుండా ఈడీ, సీబీఐ ప్రయత్నిస్తున్నాయని సిసోడియా తరఫు న్యాయవాది వాదించారు. వాదోపవాదనలు విన్నాక జడ్జి తన తీర్పును రిజర్వ్ చేశారు.

ఉండమ్మా.. బొట్టు పెడతా !



ఎన్నికల విచిత్రం

జార్ఖండ్‌లోని గిరిదిహ్ జిల్లాలో మంగళవారం జేఎంఎం లోక్‌సభ ఎన్నికల ప్రచార ర్యాలీ చేపట్టింది. ఈ సందర్భంగా మాజీ సీఎం హేమంత్ సోరెన్ భార్య, జేఎంఎం నేత కల్పనా సోరెన్‌కు బొట్టు పెడుతున్న ఓ అభిమాని.

రఫాలో ఇజ్రాయెల్ సైన్యం దాడి..
భారత మాజీ సైనికాధికారి మృతి

పూర్తిస్థాయి దర్యాప్తు జరిపించాలని ఐరాస సెక్రెటరీ జనరల్ డిమాండ్



ఐక్యరాజ్యసమితి: ఇజ్రాయెల్, హమాస్ యుద్ధంలో భారతీయ మాజీ సైనికాధికారి కల్నల్ వైభవ్ అనిల్ కాలే(46) బలయ్యారు. గాజాలోని రఫా నగరంలో ఇజ్రాయెల్ సైన్యం దాడిలో అతడు ప్రయాణిస్తున్నవాహనం ధ్వంసమైంది. తీవ్రంగా గాయపడిన అనిల్ కాలే ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై ఇజ్రాయెల్ విచారం వ్యక్తం చేసింది. తమ సైన్యం చేసిన దాడిపై ప్రత్యేక దర్యాప్తు జరిపిస్తామని ప్రకటించింది. అనిల్ కాలే ఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో బి.ఎ. చదివాడు. 'బిహేవియరల్ సైన్స్', 'ఇంటర్నేషనల్ హ్యూమానిటేరియల్ లా'లో డిగ్రీలు సాధించారు. ఐఐఎం-లక్నో, ఐఐఎం-ఇండోర్‌లో ఉన్నత విద్య అభ్యసించారు. 2004 ఏప్రిల్‌లో భారత సైన్యంలో చేరారు. 2009, 2010లోఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో కంటింజెంట్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా సేవలందించారు. సైనికుడిగా జమ్మూకశ్మీర్‌లో పని చేశారు. 2022లో భారత సైన్యం నుంచి పదవీ విరమణ చేశారు. రెండు నెలల క్రితమే ఐక్యరాజ్యసమితి డిపార్టుమెంట్ ఆఫ్ సేఫ్టీ, సెక్యూరిటీ(డీఎస్ఎస్)లో సెక్యూరిటీ కో-ఆర్డినేషన్ ఆఫీసరుగా చేరారు. అనిల్ కాలే సోమవారం ఉదయం ఐక్యరాజ్యసమితి వాహనంలో మరో డీఎస్ఎస్ అధికారితో కలిసి రఫాలోని యూరోపియన్ హాస్పిటల్‌కు బయలుదేరగా ఇజ్రాయెల్ సైన్యం హఠాత్తుగా దాడి చేసింది. ఈ దాడిలో అనిల్ కాలే మృతిచెందగా, మరో అధికారి తీవ్రంగా గాయపడ్డారు. అతడు ఎవరన్నది ఇంకా గుర్తించలేదు.

ఐరాస సెక్రెటరీ జనరల్ గుటేరస్ దిగ్భ్రాంతి

కల్నల్ అనిల్ కాలే మరణం పట్ల ఐక్యరాజ్య సమితి సెక్రెటరీ జనరల్ ఆంటోనియో గుటేరస్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన మరణం తనను తీవ్ర విషాదానికి గురిచేసిందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అనిల్ కాలే మృతిపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టాలని ఇజ్రాయెల్‌ను డిమాండ్ చేశారు. అనిల్ కాలే కుటుంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. గాజాలో విధి నిర్వహణలో ఉన్న ఐక్యరాజ్యసమితి సిబ్బందిపై ఇజ్రాయెల్ సైన్యం దాడులను గుటేరస్ ఖండించారు. గాజాలో వెంటనే కాల్పుల విరమణ పాటించాలని సూచించారు. బందీలను విడుదల చేయాలని హమాస్ మిలిటెంట్లకు హితవు పలికారు. కల్నల్ వైభవ్ అనిల్ కాలే మరణం పట్ల ఐక్యరాజ్యసమితిలోని భారత ప్రతినిధి బృందం దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. మంగళవారం సంతాపం ప్రకటించింది. గత ఏడాది అక్టోబర్ 7న ఇజ్రాయెల్, హమాస్ మధ్య పోరాటం మొదలైన తర్వాత గాజాలో ఇప్పటివరకు 190 మందికిపైగా ఐక్యరాజ్య సమితి సిబ్బంది మరణించారు. గాజాలో ఐక్యరాజ్యసమితి తరఫున పనిచేస్తూ విధి నిర్వహణలో మరణించిన తొలి విదేశీయుడు అనిల్ కాలే కావడం గమనార్హం. మహారాష్ట్రలోని నాగపూర్‌కు చెందిన అనిల్ కాలే కుటుంబం పుణేలో స్థిరపడింది. మృతదేహాన్ని ఇండియాకు రప్పించేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఆయన కుటుంబ సభ్యుడు రిటైర్డ్ వింగ్ కమాండర్ ప్రశాంత్ కర్డే చెప్పారు. పుణేలో అంత్యక్రియలు నిర్వహిస్తామన్నారు. అనిల్ కాలేకు భార్య అమృత, కుమారుడు వేదాంత్, కుమార్తె రాధిక ఉన్నారు. ఆయన సోదరుడు విశాల్ కాలే ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో గ్రూప్ కెప్టెన్‌గా పనిచేస్తున్నారు. సోదరుడి వరుసయ్యే కల్నల్ అమేయ్ కాలే భారత సైన్యంలో పనిచేస్తున్నారు.

గౌతమ్ నవ్‌లఖాకు సుప్రీం బెయిల్



న్యూఢిల్లీ: హక్కుల కార్యకర్త గౌతమ్ నవ్‌లఖాకు ఎల్గర్ పరిషద్- మావోయిస్టులతో సంబంధాల కేసులో సుప్రీంకోర్టు మంగళవారం బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో కోర్టు విచారణ పూర్తయ్యేసరికి ఎంత సమయం పడుతుందో చెప్పలేమంటూ జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్, జస్టిస్ ఎస్.వి.ఎన్. భాటిలతో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. గౌతమ్ నవ్‌లఖాకు కిందకోర్టు మంజూరు చేసిన బెయిల్‌పై బాంబే హైకోర్టు విధించిన స్టేను పొడిగించేందుకు నిరాకరించింది. గృహ నిర్బంధంలో ఉన్న సమయానికి గాను పోలీసు భద్రత నిమిత్తం రూ. 20 లక్షలు చెల్లించాలని నవ్‌లఖాకు సూచించింది. 'హైకోర్టు స్టేను పొడిగించడానికి మాకు కారణాలేమీ కనబడటం లేదు. నవ్‌లఖా నాలుగేళ్లకు పైగా నిర్బంధంలో ఉన్నారు. ఇంకా అభియోగాలే నమోదు చేయలేదు. కోర్టు విచారణ పూర్తయ్యేసరికి ఏళ్లకు ఏళ్లు పడుతుంది. అందుకే బెయిల్ మంజూరు చేస్తున్నాం' అని ధర్మాసనం పేర్కొంది.

న్యాయవాద వృత్తి విశిష్టమైనది

వినియోగదారుల పరిరక్షణ చట్టం పరిధిలోకి రాదు ● సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక తీర్పు



న్యూఢిల్లీ: న్యాయవాద వృత్తి చాలా విశిష్టమైందని, ఇది ఇతర సంప్రదాయ వృత్తుల్లాంటిది కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. న్యాయవాద వృత్తి సేవాభావంతో కూడకున్నదని, పవిత్రమైందని, ఇందులో వ్యాపార, వాణిజ్యానికి తావులేదని వెల్లడించింది. న్యాయవాదుల పనివిధానం ప్రత్యేకంగా ఉంటుందని పేర్కొంది. వినియోగదారుల పరిరక్షణ చట్టం పరిధిలోకి న్యాయవాదులను చేర్చలేమంటూ కీలక తీర్పు వెలువరించింది. సేవాలోపం కింద వినియోగదారుల కోర్టుల్లో వారిపై దావా వేయడం సాధ్యం కాదని తేల్చిచెప్పింది. లాయర్లు అందించే సేవలు వ్యక్తిగత సేవల కిందికి వస్తాయని పేర్కొంది. లాయర్ల సేవలు పొందడం ఒక కాంట్రాక్టు లాంటిదేనని ఉద్ఘాటించింది. 'సర్వీసు' నిర్వచనం నుంచి న్యాయవాదులకు మినహాయింపు ఉందని స్పష్టం చేసింది. వినియోగదారుల పరిరక్షణ చట్టం -1986 పరిధిలోకి లాయర్లు, వారు అందించే సేవలు వస్తాయని స్పష్టం చేస్తూ 2007లో జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్(ఎన్‌సీడీఆర్‌సీ) ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ న్యాయవాదుల సంఘాలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. పిటిషన్ దాఖలు చేశాయి. ఈ పిటిషన్‌పై జస్టిస్ బేలా ఎం.త్రివేది, జస్టిస్ పంకజ్ మిట్టల్‌తో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం మంగళవారం తీర్పు వెలువరించింది. 1986 నాటి చట్టం స్థానంలో తీసుకొచ్చిన వినియోగదారుల పరిరక్షణ చట్టం-2019 పరిధిలో న్యాయవాదులను చేర్చలేదని వెల్లడించింది. పిటిషన్‌ను కొట్టివేసింది. న్యాయ వ్యవస్థ పట్ల ప్రజలకు ఎంతో విశ్వాసం ఉందని తెలిపింది. న్యాయవాదులు కూడా న్యాయ వ్యవస్థలో భాగమేనని వివరించింది. న్యాయ వ్యవస్థను స్వతంత్రను కాపాడడంలో న్యాయవాదులు కూడా కీలక పాత్ర పోషిస్తున్నారని ధర్మాసనం స్పష్టంచేసింది.

వైద్యులపై తీర్పును పునఃసమీక్షించాలి

వైద్య వృత్తిని వినియోగదారుల పరిరక్షణ చట్టం పరిధిలో చేరుస్తూ 1995లో ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు ధర్మాసనం అభిప్రాయపడింది. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వర్సెస్ వి.పి.శాంత కేసులో సుప్రీంకోర్టు 1995లో తీర్పు ఇచ్చింది. వినియోగదారుల పరిరక్షణ చట్టం–1986లోని సెక్షన్ 2(1)(ఓ) కింద నిర్వచించిన సేవలు అనే విభాగంలో వైద్య వృత్తిని కూడా చేర్చాలని ఆదేశించింది. దీనిని సవాలు చేస్తూ కోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. తాజాగా దీనిపై ధర్మాసనం స్పందించింది. 1995 నాటి తీర్పును పునఃసమీక్షించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి నివేదించింది.

థాయ్ హక్కుల కార్యకర్త జైలులోనే మృతి



బ్యాంకాక్: క్రూరమైన రాచరిక చట్టాలు సహా దేశ న్యాయ వ్యవస్థలో సంస్కరణల కోసం పోరాటం సాగిస్తున్న థాయ్‌లాండ్ హక్కుల యువ ఉద్యమకారిణి నెటిపార్న్ సనేశంగ్‌ఖోమ్(28) మంగళవారం జైలులోనే కన్నుమూశారు. రాచరికాన్ని తూలనాడటం వంటి వేర్వేరు ఆరు ఆరోపణలను ఆమె ఎదుర్కొంటున్నారు. కోర్టు ధిక్కారం కింద ఈ ఏడాది జనవరిలో నెటిపార్న్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆ మరునాటి నుంచే జైలులో ఆమె నిరాహార దీక్ష మొదలుపెట్టారు. ఫిబ్రవరి నుంచి నీళ్లు మాత్రమే తాగుతున్నారు. ఏప్రిల్ నుంచి ఆహారం తీసుకుంటున్నారు. అయితే, దీక్ష కారణంగా నెటిపార్న్ పూర్తిగా బలహీనంగా మారారని, అనీమియాతో ఇబ్బంది పడుతున్న ఆమె విటమిన్లు, ఎలక్ట్రోలైట్‌లను కూడా తిరస్కరిస్తున్నారని జైలు అధికారులు చెబుతున్నారు. మంగళవారం వేకువజామున ఆమె గుండె కొట్టుకోవడం ఆగిపోయిందని, ఆస్పత్రికి తరలించినా ఫలితం దక్కలేదని అంటున్నారు.

ఇతను విమానం దొంగ

● 110 రోజుల్లో 200 ప్రయాణాలు
● లక్షల విలువైన నగల చోరీ

న్యూఢిల్లీ: రాజేశ్ కపూర్.. వయసు 40 ఏళ్లు. ఉండేది ఢిల్లీలో. ఇతడొక వింత దొంగ. విమానాల్లో ప్రయాణిస్తూ బంగారు నగలు చోరీ చేయడం ఇతడికి ఇష్టం. బంగారం అమ్మేయగా వచ్చిన డబ్బులను ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ బెట్టింగ్‌ల్లో పెట్టడం మరో హాబీ. తప్పుడు ధ్రువపత్రాలతో విమానం టికెట్లు కొంటాడు. ఆ టైమ్‌లో మనసుకు తోచిన ఫోన్ నెంబర్ ఇచ్చేస్తాడు. ఇదంతా ఆధారాలు దొరక్కుండా చేయడానికే అన్నమాట! విమానం ఎక్కాక వృద్ధులు, మహిళలనే తన టార్గెట్‌గా ఎంచుకుంటాడు. ఎయిర్ హోస్టెస్‌లను రిక్వెస్ట్ చేసి, తన టార్గెట్ పక్క సీట్లో కూర్చుంటాడు. అదును చూసి వారి బ్యాగులు, పర్సుల్లోని నగలు కాజేస్తాడు. ఏమీ తెలినట్టుగా ఎయిర్‌పోర్టులో దిగిపోతాడు. 110 రోజుల్లో ఏకంగా 200 విమాన ప్రయాణాలు చేశాడు. రూ.లక్షల విలువైన బంగారం మూటగట్టుకున్నాడు. చివరకు పాపం పండింది. పోలీసులకు దొరికిపోయాడు. అమృత్‌సర్ నుంచి ఢిల్లీకి విమానంలో ప్రయాణిస్తుండగా రూ.20 లక్షల విలువైన బంగారం పోయిందని ఈ ఏడాది ఫిబ్రవరి 2న అమెరికా పౌరుడొకరు ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అలాగే హైదరాబాద్ నుంచి ఢిల్లీకి విమానంలో వెళ్తుండగా రూ.7 లక్షల విలువైన నగలు చోరీకి గురయ్యాయని ఓ మహిళ ఏప్రిల్ 11న ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు చోరుడి కోసం వేట మొదలుపెట్టారు. రాజేశ్ కపూర్ ఇచ్చిన ఆధారాలు నకిలీవి కావడంతో అతడిని పట్టుకోవడం తొలుత కష్టంగా మారింది. 100 సీసీ కెమెరాల దృశ్యాలను జల్లెడట్టి రాజేశ్‌ను అరెసట్‌చేశారు. రాజేశ్‌కు ఢిల్లీలో సొంత గెస్ట్‌హౌజ్ ఉంది. మొబైల్ రిపేర్ షాపు ఉంది. గతంలో రైళ్లలో దొంగతనాలు చేసేవాడు. ఒకసారి దొరికిపోయి కొన్నాళ్లు నిశ్శబ్దంగా ఉన్నాడు. తర్వాత విమానాల్లో చోరీకి శ్రీకారం చుట్టాడు.

ముంబైలో హోర్డింగ్ కూలిన ఘటనలో
14కు పెరిగిన మృతులు

ముంబై: ముంబైలో సోమవారం సాయంత్రం అకాల వర్షాలు, భారీ ఈదురుగాలుల కారణంగా భారీ హోర్డింగ్ కూలిన ఘటనలో సహాయ చర్యలు కొనసాగుతున్నాయి. ఈ విషాద ఘటనలో మృతుల సంఖ్య 14కు చేరుకుంది. క్షతగాత్రుల్లో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. 21 గంటల తర్వాత కూడా సహాయ చర్యలు కొలిక్కి రాలేదు. ఘట్కోపర్ ప్రాంతంలోని ఓ పెట్రోల్ బంక్ వద్ద ఏర్పాటు చేసిన 120 చదరపు అడుగుల భారీ హోర్డింగ్ కుప్పకూలడం తెలిసిందే. ఈ ఘటనలో మంగళవారం సాయంత్రం వరకు హోర్డింగ్ కింద చిక్కుకున్న 89 మంది క్షతగాత్రులను బయటకు తీయగలిగారు. ముంబై, థానెల్లోని వేర్వేరు ఆస్పత్రుల్లో వీరిని చేర్పించారు. చికిత్స అనంతరం 32 మంది డిశ్చార్జి అయ్యారు. ఘటనాస్థలిలో సోమవారం సాయంత్రం నుంచి 100 మందితో కూడిన రెండు ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలతోపాటు మరో 125 మంది బీఎంసీ సిబ్బంది అవిశ్రాంతంగా పనిచేస్తున్నారు. రెండు 500 టన్నుల సామర్థ్యమున్న క్రేన్లు, రెండు హైడ్రా క్రేన్లు, రెండు ప్రొక్లెయినర్లతో భారీ హోర్డింగ్ గర్డర్లను పక్కకు తొలగించి, కింద చిక్కుకున్న వారిని కాపాడేందుకు ప్రయత్నాలు ప్రయత్నాలు సాగుతున్నాయి. ఇప్పటి వరకు మూడు గర్డర్లను తీయగలిగామని ఎన్‌డీఆర్‌ఎఫ్ అసిస్టెంట్ కమాండర్ నిఖిల్ ముధోల్కర్ చెప్పారు. , మరో రెండు గర్డర్లను కూడా తీయగలిగితే అడుగున ఎందరు చిక్కుకున్నదీ తెలుస్తుందని చెప్పారు. అయితే, పెట్రోల్ పంప్ ప్రాంతం కావడంతో మండే స్వభావం ఉన్న గ్యాసోలిన్, ఆక్సీ ఫ్యూయల్ కట్టర్‌లను వాడలేక పోతున్నామన్నారు.

భోజనానికి గంట ముందు, తర్వాత
టీ, కాఫీలు వద్దు: ఐసీఎంఆర్

న్యూఢిల్లీ: భోజనానికి గంట ముందు, తర్వాత టీ, కాఫీలు తాగొద్దని ప్రజలను భారత వైద్య పరిశోధనా మండలి(ఐసీఎంఆర్) హెచ్చరించింది. టీ, కాఫీల్లో ఉండే ట్యానిన్లు ఆహారంలోని ఇనుమును శరీరం సంగ్రహించకుండా అడ్డుపడతాయని తెలిపింది. ఆరోగ్యవంతమైన జీవనం కోసం భారతీయులు పాటించాల్సిన ఆహార నియమాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు అంటూ 17 రకాల సలహాలు,సూచనలను ఇటీవలే ఐసీఎంఆర్ విడుదలచేసింది. ఐసీఎంఆర్‌లోని పరిశోధనా విభాగమైన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్(ఎన్ఐఎన్) ఈ నియమావళి రూపకల్పనలో పాలుపంచుకుంది. ''భోజనం చేయగానే అందులోని ఐరన్ ధాతువును శరీరం శోషించుకునే పని మొదలెడుతుంది. ఇనుమును సంగ్రహించి రక్తంలో కలిపేస్తుంది. మనం పీల్చిన గాలిలోని ఆక్సీజన్‌ను రక్తం శరీరమంతటికీ సరఫరా చేయాలంటే ఇనుము అవసరం. ఇనుము సమపాళ్లలో లేకపోతే ఆక్సీజన్ సరిగా అందక శరీర కణాల సామర్థ్యం తగ్గిపోతుంది. ఇదంతా సక్రమంగా జరగాలంటే ఇనుము శోషణ సాఫీగా జరగాలి. కానీ కాఫీ, టీలు తాగితే వాటిలోని ట్యానిన్ అనే రసాయనం ఈ శోషణ ప్రక్రియకు పెద్ద అవరోధంగా తయారవుతుంది. ట్యానిన్ ఇనుముకు అతుక్కుపోయి రక్తంలో ఇనుము సులభంగా కలిసిపోనివ్వదు. దాంతో రక్తంలో ఐరన్ లోపిస్తుంది. ఐరన్‌లోపం చివరకు రక్తహీనతకు దారితీస్తుందని ఐసీఎంఆర్ వివరించింది.

ఎలక్షన్ బీట్

కాంగ్రెస్ వస్తే రామ్‌లల్లా మళ్లీ టెంట్‌లోకే..

జార్ఖండ్ ఎన్నికల ప్రచారంలో ప్రధాని మోదీ

రాంచీ: విపక్ష కాంగ్రెస్ సిగ్గుమాలిన రాజకీయాలు చేస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మండిపడ్డారు. కేంద్రంలో అధికారంలో వస్తే అయోధ్య రామ్ లల్లాను మళ్లీ టెంట్‌లోకి పంపించేందుకు కుట్రలు చేస్తోందని ఆరోపించారు. మంగళవారం జార్ఖండ్‌లోని గిరిదీలో ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. జార్ఖండ్‌లో జేఎంఎం-కాంగ్రెస్ కూటమి ప్రభుత్వం అవినీతికి మారుపేరుగా మారిపోయిందన్నారు. బుజ్జగింపు, వారసత్వ రాజకీయాలే ఆ పార్టీల విధానమని ధ్వజమెత్తారు. అవినీతి, బుజ్జగింపు, వారసత్వ రాజకీయాల నుంచి దేశానికి విముక్తి కల్పించేందుకు తాము కట్టుబడి ఉన్నామని స్పష్టంచేశారు. అయోధ్యలో రామమందిరం విషయంలో సుప్రీంకోర్టు తీర్పును కాంగ్రెస్ నాయకులు తప్పుపడుతున్నారని, అధికారంలోకి వస్తే ఆలయ ప్రాంగణానికి తాళం వేసేందుకు కుతంత్రాలు సాగిస్తున్నారని దుయ్యబట్టారు. గతంలో దేశాన్ని ఏలిన కాంగ్రెస్ ప్రభుత్వాలు నక్సలిజాన్ని ప్రజలపై రుద్దాయని విమర్శించారు. నక్సలిజాన్ని కట్టడి చేయడానికి తాము కృషి చేస్తున్నామని తెలిపారు.

మోదీ జ్యోతిష్యుడా?: ప్రియాంక

న్యూఢిల్లీ/అమేథీ: ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా రాదన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యలను కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ తిప్పికొట్టారు. మోదీ ఏమైనా జ్యోతిష్యుడా అని ప్రశ్నించారు. 'నేనైతే జ్యోతిష్యురాలిని కాదు. ఒకవేళ ప్రధాని జ్యోతిష్యుడైతే చెప్పండి' అని మోదీ వ్యాఖ్యలపై స్పందిస్తూ వ్యాఖ్యానించారు. పార్టీల పనితీరును బేరీజు వేసుకొని ఓటు వేయాలని ప్రజలను కోరారు. రాయ్‌బరేలీ, అమేథీలతో తమ బంధం రాజకీయాలకు అతీతమైనదని పేర్కొన్నారు. సమాజ్‌వాదీ పార్టీతో పొత్తు పెట్టుకొని కాంగ్రెస్ యూపీలో 17 స్థానాల్లో పోటీచేస్తున్న విషయం తెలిసిందే. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఏం జరుగుతోందో చూడాలని, కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఏం చేస్తున్నామో చూడాలని, దీన్ని దృష్టిలో పెట్టుకొని విచక్షణతో ఓటేయాలని పిలుపిచ్చారు. రాజ్యాంగాన్ని మారుస్తామంటున్న వాళ్ల నుంచి ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని ప్రియాంక అన్నారు. రాయ్‌బరేలీ, అమేథీలలో కాంగ్రెస్‌దే విజయమని ధీమా వ్యక్తం చేశారు. రాయ్‌బరేలీ నుంచి రాహుల్‌గాంధీ పోటీస్తుండగా, అమేథీలో గాంధీ కుటుంబం తమ నమ్మినబంటు కిశోరీలాల్ శర్మను బరిలోకి దింపింది. ఈ రెండు నియోజకవర్గాల ఎన్నికల బాధ్యతలను ప్రియాంక భుజానికెత్తుకున్నారు. విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

మండీలో కంగనా రనౌత్ నామినేషన్

షిమ్లా: కేంద్రంలో బీజేపీ మరోసారి అధికారంలోకి వస్తే హిమాచల్ ప్రదేశ్‌లోని మండీ లోక్‌సభ నియోజకవర్గాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతానని, ఇక్కడి ప్రాజెక్టులను పూర్తి చేయిస్తానని, రైల్వే లైన్ తీసుకొస్తానని ప్రముఖ బాలీవుడ్ నటి కంగనా రనౌత్ హామీ ఇచ్చారు. మండీ నుంచి బీజేపీ అభ్యర్థిగా ఆమె మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం ఎన్నికల ప్రచార ర్యాలీలో ప్రసంగించారు. భవిష్యత్తులో కూడా మండీ నుంచి నామినేషన్ దాఖలు చేసే అవకాశం తనకు లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

మోదీపై పిటిషన్‌కు సుప్రీం 'నో'

న్యూఢిల్లీ: ఈ సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోదీ పోటీ చేయకుండా నిషేధం విధించాలని విజ్ఞప్తి చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టులో తోసిపుచ్చింది. ఎన్నికల ప్రచారంలో ప్రధానమంత్రి విద్వేషపూరిత ప్రసంగాలు చేశారని, ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారని ఫాతిమా అనే వ్యక్తి ఆరోపించారు. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం ఎన్నికల్లో ఆరేళ్లపాటు మోదీ పోటీ చేయకుండా అనర్హత వేటు వేయాలని, ఈ మేరకు ఎన్నికల సంఘానికి ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ఎస్.సి.శర్మతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం మంగళవారం స్పందించింది. తొలుత సంబంధిత అధికారులను ఆశ్రయించాలని, వారికి ఫిర్యాదు చేయాలని పిటిషనర్‌కు సూచించింది. పిటిషన్‌ను తిరస్కరిస్తున్నట్లు వెల్లడించింది. దీంతో ఫాతిమా తన పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు.

బీజేపీ 230 దాటదు: కేజ్రీవాల్

చండీగఢ్: దేశవ్యాప్తంగా బీజేపీ ప్రాబల్యం కోల్పోతోందని, ఆ పార్టీకి 230 స్థానాలకు మించి రావని ఢిల్లీ సీఎం, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. కురుక్షేత్రలో ఆప్ అభ్యర్థి సుశీల్ గుప్తాకు మద్దతుగా పెహోవాలో మంగళవారం కేజ్రీవాల్ రోడ్‌షో నిర్వహించారు. 'మార్చి 16న ఎన్నికల షెడ్యూల్ వెలువడింది. మార్చి 21న నన్ను జైలుకు పంపారు. అంటే కేజ్రీవాల్ ప్రచారం చేయకూడదనేది వారి ఉద్దేశం. కేజ్రీవాల్ అంటే వారికి భయం' అని బీజేపీని ఉద్దేశించి అన్నారు. దేశవ్యాప్తంగా బీజేపీకి ప్రతికూల పరిస్థితులు ఉన్నాయి. దారుణంగా ఓడిపోనుంది. హర్యానా, రాజస్తాన్, మహారాష్ట్ర, కర్నాటక, జార్ఖండ్, బిహార్, ఉత్తరప్రదేశ్, బెంగాల్, ఢిల్లీ, పంజాబ్‌లలో బీజేపీ సీట్లు తగ్గిపోనున్నాయి. పెరిగే ప్రసక్తే లేదు. 400 సీట్లలో విజయం సాధిస్తామని బీజేపీ చెబుతోంది. 230 కంటే ఎక్కువ నెగ్గదని నేను రాసిస్తాను అని ఢిల్లీ సీఎం అన్నారు.

100 స్మార్ట్ సిటీలు ఎక్కడ?

ఉమ్మడి ప్రచార ర్యాలీలో మోదీపై రాహుల్, అఖిలేశ్ నిప్పులు

ఝాన్సీ(యూపీ): ఉత్తరప్రదేశ్‌లో విపక్షాల కూటమి పార్టీల అగ్రనేతలు రాహుల్ గాంధీ, అఖిలేశ్ యాదవ్‌లు ఉమ్మడిగా ప్రధాని మోదీపై విమర్శనాస్త్రాలు ఎక్కుపెట్టారు. మంగళవారం ఝాన్సీ పట్టణంలో రాణి ఝాన్సీ కోట సమీపంలో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో నేతలిద్దరూ మాట్లాడారు. '' దేశంలో 100 స్మార్ట్ సిటీలను సృష్టిస్తానని మోదీ వాగ్దానం చేశారు. కానీ ఆ దిశగా ఒక్క అడుగు కూడా వేయలేదు. రైతులు, యువతను విస్మరించారు. మేం అధికారంలోకి వస్తే రైతులు, యువతపై దృష్టిపెడతాం'' అని రాహుల్ అన్నారు. తర్వాత ఎస్పీ చీఫ్ అఖిలేశ్ మాట్లాడారు. '' లోక్‌సభ ఎన్నికల్లో ఇప్పటికే ముగిసిన నాలుగు దశల పోలింగ్ సరళి గమనిస్తే బీజేపీ గ్రాఫ్ పడిపోతోందని స్పష్టంగా తెలుస్తోంది. కమలం కమిలిపోవడం ఖాయం. యూపీలో యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని రాష్ట్ర బీజేపీ సర్కార్ హయాంలో తరచూ ప్రశ్నపత్రాల లీకేజీ ఉదంతాలు జరుగుతున్నాయి. దీంతో యువత భవిష్యత్తు అగమ్యగోచరమైంది'' అని అఖిలేశ్ ఆగ్రహం వ్యక్తంచేశారు.

• జీరో వేస్ట్ డిజైన్



చెన్నైలోని టాట్ స్కూల్ ఆఫ్ డిజైన్ కళాశాలకు చెందిన ఓ విద్యార్థి కట్టింగ్ చేసే సమయంలో వృథాగా పడేసే వస్త్రాల పీస్‌లను ఉపయోగించి జీరో వేస్ట్ డిజైన్ క్లాతింగ్ అనే కొత్త తరహా దుస్తులను రూపొందించి అందరి దృష్టిని ఆకర్షించారు. వీటిని చెన్నైలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో మోడల్స్ ప్రదర్శించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. - సాక్షి, చెన్నై

న్యూస్‌రీల్

నటుడు గౌండ్రమణికి సుప్రీం కోర్టులో ఊరట



నటుడు గౌండ్రమణి

తమిళసినిమా: సీనియర్ హాస్య నటుడు గౌండ్రమణి స్థానికి కోడంబాక్కం, ఆర్కాడు రోడ్డులో 1996లో ఐదు గ్రౌండుల స్థలాన్ని కొనుగోలు చేశారు. కాగా అందులో 22,700 చదరపు అడుగుల స్థలంలో వాణిజ్య భవనాన్ని నిర్మించడానికి శ్రీ అభిరామి పౌండేషన్ అనే సంస్థతో గౌండ్రమణి ఒప్పందం కుదుర్చుకున్నారు. అందు కోసం రూ. కోటి వరకు ఖర్చు చేశారు. అయితే ఆ భవన నిర్మాణ సంస్థ 2003 వరకూ నిర్మాణ పనులను ప్రారంభించలేదు. దీంతో నటుడు గౌండ్రమణి తన స్థలాన్ని తిరిగి అప్పగించాల్సిందిగా శ్రీ అభిరామి పౌండేషన్ సంస్థపై చెన్నై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసు నటుడు గౌండ్రమణికి అనుకూలంగా తీర్పు వచ్చింది. ఈ స్థలాన్ని ఆయనకు అప్పగించాలనీ, అప్పటి వరకూ నెలకు రూ.లక్ష చొప్పున నష్ట పరిహారం చెల్లించాలని న్యాయస్థానం తీర్పునిచ్చింది. దీంతో శ్రీ అభిరామి పౌండేషన్ నిర్వాహకులు హైకోర్టు తీర్పుపై సుప్రీం కోర్టులో అప్పీల్ చేసింది. ఈ కేసు తుది విచారణ మంగళవారం జరిగింది. వాదనల అనంతరం సుప్రీంకోర్టు శ్రీ అభిరామీ పౌండేషన్ పిటిషన్‌ను కొట్టి వేసింది.

ధోని అభిమాని పట్టు

- చేపాక్కం స్టేడియం పరిసరాల్లో టెంట్ వేసుకుని హంగామా
- తన అభిమాన క్రికెటర్‌ను కలిసిన తర్వాతే ఇంటికి వెళ్తానంటున్న ఢిల్లీ వాసి



అన్నానగర్: ఐపీఎల్ పోటీల్లో భాగంగా చెన్నై సూపర్ కింగ్స్‌- రాజస్థాన్ రాయల్స్ జట్ల మధ్య ఆదివారం చేపాక్కం స్టేడియంలో మ్యాచ్ నిర్వహించారు. ఈ పోటీని చూడడానికి ఢిల్లీ నుండి చెన్నైకి వచ్చిన యువకుడు గౌరవ్ (19) చెన్నై టీమ్ ప్లేయర్ ధోనీని వ్యక్తిగతంగా చూసిన తరువాతనే ఢిల్లీకి వెళ్తానంటూ చేపాక్కంలో ఉంటున్నాడు. .ధోనీకి వీరాభిమాని అయిన ఇతను ధోనీని కలిసేందుకు సైకిల్ పై (23 రోజుల పాటు) ఢిల్లీ నుంచి చెన్నైకి వచ్చాడు. స్నేహితులు ఇచ్చిన టికెట్‌తో అతను రాజస్థాన్ రాయల్స్, చెన్నై మధ్య మ్యాచ్‌ను చూశాడు. ఈ క్రమంలో ధోనిని వ్యక్తిగతంగా కలిసిన తర్వాత ఢిల్లీకి తిరిగి వెళతానంటూ చేపాక్కం మైదానం 9వ గేట్ ప్రవేశ ప్రాంతంలో గుడారం వేసుకున్నాడు. ఈ విషయం స్థానికంగా కలకలం రేపింది.

ఎగ్మూర్ కోర్టుకు పళణి

- ప్రత్యేక కోర్టుకు మారన్ పిటిషన్ బదిలీ



కోర్టుకు హాజరైన పళణి స్వామి

సాక్షి, చెన్నై : అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి పళణి స్వామిపై సెంట్రల్ చెన్నై డీఎంకే అభ్యర్థి, సిట్టింగ్ ఎంపీ దయానిధి మారన్ దాఖలు పరువునష్టం దావా పిటిషన్ మంగళవారం విచారణకు వచ్చింది. దీంతో ఈ విచారణ నిమిత్తం పళణి స్వామి స్వయంగా కోర్టుకు హాజరయ్యారు. ఈ పిటిషన్‌ను ప్రత్యేక కోర్టుకు బదిలీ చేశారు. వివరాలు.. ఎన్నికల ప్రచారంలో భాగంగా గత నెల పురసైవాక్కంలో జరిగిన సభలో మారన్‌ను టార్గెట్ చేసి పళణి స్వామి తీవ్రంగా విరుచుకుపడ్డారు. 75 శాతం నియోజకవర్గ నిధులను ఆయన ఖర్చే పెట్టలేదని, నిధులు దుర్వినియోగమైనట్టుగా ఆరోపణలు చేశారు. ఇది తన పరువుకు భంగం కల్గించే విధంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ మారన్ నోటీసులు జారీ చేశారు. క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అయితే పళణి స్పందించలేదు. దీంతో తన పరువుకు భంగం కల్గించే విధంగా వ్యవహరించిన పళణిస్వామిపై ఎగ్మూర్ కోర్టులో మారన్ పరువునష్టం దావా దాఖలు చేశారు. ఈ పిటిషన్ ఎగ్మూర్ 13వ మేజిస్టేట్ కోర్టు న్యాయమూర్తి ధర్మ ప్రభు ముందు మంగళవారం విచారణకు వచ్చింది. ఈ పిటిషన్ విచారణ నిమిత్తం పళని స్వామి స్వయంగా కోర్టుకు హాజరయ్యారు. ఆయన తరపున న్యావాదులు అయ్యప్ప రాజ్, రియాజ్ అహ్మద్ వాదనలు వినిపించారు. వాదనల అనంతరం ఈ పిటిషన్‌ను ఎంపీ, ఎమ్మెల్యేల కేసులను విచారించే ప్రత్యేక కోర్టు బదిలీ చేస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి విచారణను జూలై 27వ తేదీకి వాయిదా వేశారు.

మల్టీ మోడల్ సేవ!

చెన్నై మహానగరంలోని మెట్రో, ఎలక్ట్రిక్, ఎంటీసీ బస్సుల సేవలన్నీ ఒకే గూటి కిందికి తీసుకొచ్చే ప్రక్రియ పూర్తయ్యింది. కంబైన్డ్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ పర్యవేక్షణలో ప్రత్యేక యాప్, స్మార్ట్ కార్డుల ద్వారా అన్ని రవాణా సేవలకు ఒకే టికెట్ లక్ష్యంగా మల్టీ మోడల్ సేవకు రూపకల్పన చేశారు. ఇది జూన్ రెండో వారంలో అమల్లోకి రానుంది.

- అన్ని రవాణా సేవలకు ఒకే టికెట్
- కసరత్తు పూర్తి చేసిన అధికారులు
- ప్రత్యేక యాప్ సిద్ధం
- జూన్ రెండవ వారం నుంచి అమలులోకి..



మెట్రో రైలు



ఎలక్ట్రిక్ రైలు



ఎంటీసీ బస్సు

సాక్షి, చెన్నై: రాజధాని నగరం చెన్నై విస్తీర్ణం 2026లో మరింతగా పెరగనున్న విషయం తెలిసిందే. ఇది వరకు నగరం, సబర్బన్ ప్రాంతాలుగా 1,189 చ.కీమీ విస్తీర్ణంతో ఉన్న ఈ చెన్నై మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ ఇకపై 5,904 చదరపు కి.మీ విస్తీర్ణంతో మహా మహానగరంగా ఆవిర్భవించనుంది. చెన్నై, కాంచీపురం, చెంగల్పట్టు, తిరువళ్లూరు, రాణిపేట జిల్లా అరక్కోణం ఈ మహా మహానగరం పరిధిలోకి రానున్నాయి. అదే సమయంలో చెన్నై నగరం చుట్టూ మెట్రో సేవల కార్యాచరణ వేగవంతం చేసి పనులపై అధికారులు దృష్టి పెట్టారు. అలాగే, ఎంటీసీ బస్సుల సేవలను, ఎలక్ట్రిక్ రైళ్ల సేవలను వీటికి అనుసంధానించే విధంగా ఒకే టికెట్‌తో మల్టీ మోడల్ సేవలకు కార్యాచరణ సిద్ధం చేశారు

నివేదిక రెడీ

రాజధాని నగరం చెన్నైలో ప్రధాన రవాణా వ్యవస్థలుగా చెంగల్పట్టు నుంచి బీచ్ వరకు, సెంట్రల్ నుంచి అర్కోణం, గుమ్మిడి పూండి వైపుగా ఎలక్ట్రిక్ రైళ్ల సేవలు, బీచ్ నుంచి వేళచ్చేరి వరకు ఎంఆర్‌టీఎస్ రైలు సేవలు చెన్నైలో ఇప్పటికే ఉంది. ఇటీవల విమానాశ్రయం నుంచి కోయంబేడు - సెంట్రల్ మీదుగా విమ్కో నగర్‌కు ఓ మార్గం, సెయింట్ థామస్ మౌంట్ నుంచి ఆలందూరు మీదుగా అన్నాసాలై వైపుగా సెంట్రల్‌కు మారో మార్గంలో మెట్రో రైలు సేవలు అందుబాటులోకి వచ్చాయి. అదే సమయంలో ఎంఆర్‌టీఎస్ సేవలు మరికొన్ని నెలల్లో వేళచ్చేరి నుంచి సెయింట్ థామస్ మౌంట్ వరకు విస్తరించనున్నాయి. ఇక, మెట్రో సేవలు చెన్నై నగర శివారులోని నలు దిశలను చుట్టే విధంగా కీలాంబాక్కం, సిరుచ్చేరి, మాధవరం, పూందమల్లి - ఆవడి - పరందూరు వరకు విస్తరించనుంది. కొన్ని మార్గాలలో పనులు శరవేగంగా, మరికొన్ని మార్గాల్లో టెండర్లు, ఇతర అనుమతుల ప్రక్రియలు సాగుతున్నాయి. నగరానికి నలు దిశలా మెట్రో ప్రయాణమే కాదు, ఇతర రకాల రవాణా వ్యవస్థలను సులభతరం చేయడమే లక్ష్యంగా చెన్నై మెట్రో డెవలప్ మెంట్ అథారిటీ పర్యవేక్షణలో (సీఎండీఏ) కంబైన్డ్ ట్రాన్స్ పోర్టు అథారిటీ రంగంలోకి దిగింది. మల్టీ మోడల్ ట్రాన్స్‌పోర్ట్‌లను ఏకీకృతం చేస్తూ, అన్ని సేవలకు ఒకే టికెట్ అన్న నినాదంతో ముందుకెళ్లనుంది.

జూన్ రెండవ వారంలో..

ఒకే గూటిలోకి అన్ని రవాణా సేవలను తీసుకొచ్చేందుకు కసరత్తును కంబైన్డ్ ట్రాన్స్‌పోర్టు అథారిటీ ప్రస్తుతం పూర్తి చేసింది. ఒకే టికెట్‌తో అన్ని రకాల రవాణా సేవలను ప్రజలు పొందేందుకు కార్యాచరణ సిద్ధం చేసింది. ఆయా మార్గాలను ఏకం చేయడం, రైల్వేతో అనుసంధానించడం, ప్రయాణికులకు రవాణా మార్గాలను సులభతరం చేయడం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని రూట్ మ్యాప్ రెడీ చేశారు. ఇందుకోసం ప్రత్యేక మొబైల్ యాప్‌ను సిద్ధం చేశారు. తద్వారా ప్రయాణ టికెట్ పొందేందుకు వీలుగా రూట్ మ్యాప్‌తో పాటు అన్ని రకాల రవాణా సమాచారం , సమయం తదితర వివరాలను ప్రత్యేకంగా ప్రయాణికులకు తెలియజేసేందుకు సిద్ధమవుతున్నారు. చెన్నై నగరంలో అన్ని రకాల రవాణాలకు సంబంధించిన స్టేషన్ల, స్టాపింగ్‌లు తదితర సమాచారం ఈ యాప్‌లో పొందుపరుస్తున్నారు. ఈ మేరకు ఒకే టికెట్ ఆధారంగా మూడు రవాణా సేవలను పొందేందుకు వీలు కల్పించనున్నారు. మెట్రో అందజేస్తున్న స్మార్ట్ కార్డు ఆధారంగా లేదా, మొబైల్ యాప్‌లోని క్యూఆర్ కోడ్ ఉపయోగించి టికెట్లను పొందే అవకాశం ఇస్తారు. మెట్రో స్టేషన్లలో స్కానింగ్ సదుపాయం ద్వారా టికెట్ పొందేందుకు, ఎంటీసీ బస్సులలో పొందుపరచనున్న క్యూఆర్ కోడ్ స్టిక్కర్ల ద్వారా అప్పటికప్పుడే టికెట్లు పొందేందుకు సైతం వెసులుబాటు కల్పించే విధంగా సమగ్ర వివరాలను ఈ యాప్‌లో పొందుపరిచినట్లు సంకేతాలు వెలువడ్డాయి. ఎలక్ట్రిక్ రైళ్లలో ప్రయాణించే వారు టీటీఆర్‌లు తనిఖీలకు వచ్చిన సమయంలో స్మార్ట్ కార్డును స్కాన్ చేసి చెక్ చేసుకునే విధంగా ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నారు. ఒకే టికెట్‌తో కూడిన స్మార్ట్ కార్డును రీచార్జ్ చేసుకునే విధంగా అవకాశం కల్పించనున్నారు. అంతేకాకుండా కొన్ని మార్గాలలో బస్సులో ఆటోమెటిక్ టికెట్ సౌకర్యం కల్పించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ ఒకే టికెట్ సేవకు సంబంధించిన సమగ్ర నివేదికను అధికారులు సిద్ధం చేశారు. జూన్ మొదటి వారంలో సీఎం స్టాలిన్‌కు సమర్పించినానంతరం రెండోవారం నుంచి ప్రయోగాత్మకంగా కొన్ని మార్గలలో ఒకే టికెట్టు సేవకు శ్రీకారం చుట్టే విధంగా ముందుకెళ్తున్నారు. త్వరలో 1,500 ఎలక్ట్రిక్ బస్సులు చెన్నైలో సేవలు అందించబోతుండడంతో 2025 జనవరి నాటికి పూర్తిస్థాయిలో ఒకే టికెట్ సేవను ప్రయాణికుల ముంగిట తెచ్చే విధంగా కార్యాచరణ సిద్ధం చేశారు. ఆ తదుపరి రాష్ట్రంలోని అన్ని నగరాలకు సేవలను విస్తరించే విధంగా చర్యలు చేపట్టనున్నారు.

ఎంపీ సెల్వరాసు అంత్యక్రియలు పూర్తి



సెల్వరాసు భౌతిక కాయానికి నివాళులు అర్పిస్తున్న పోలీసులు

సాక్షి, చెన్నై : నాగపట్నం సీపీఐ ఎంపీ సెల్వరాసు (67) భౌతిక కాయానికి మంగళవారం స్వగ్రామంలో అధికార లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయి. కుటుంబ సంప్రదాయల మేరకు ఆయన భౌతిక కాయాన్ని ఖననం చేశారు. వివరాలు.. నాగపట్నం లోక్‌సభ ఎంపీ సెల్వరాసు అనారోగ్యంతో సోమవారం మరణించిన విషయం తెలిసిందే. ఆయన భౌతిక కాయాన్ని చెన్నై నుంచి తిరువారూర్ జిల్లా మన్నార్‌కుడి సమీపంలోని కోవిల్‌చిత్త మల్లి గ్రామానికి తీసుకెళ్లారు. అప్పులు, పార్టీ వర్గాల సందర్శనార్థం రాత్రంతా స్వగృహంలో భౌతికకాయాన్ని ఉంచారు. ఉదయాన్నే ఊరేగింపుగా స్థానికంగా ఉన్న ఎంపీకి చెందిన స్థలంలో అంత్యక్రియలకు తీసుకెళ్లారు. ఇక్కడ అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. పార్టీ వర్గాలు, స్థానిక ప్రజలు తరలి వచ్చి కన్నీటి నివాళులర్పించారు. కుటుంబ సంప్రదాయం మేరకు ఆయన పార్థీవ దేహాన్ని ఖననం చేశారు.

పశ్చిమ కనుమల్లో ముసురు వర్షం

- అనేక చోట్ల వరుణ తాండవం
- నైరుతికి ఆహ్వానమా?





సాక్షి, చెన్నై : పశ్చిమ కనుమల్లో ముసురు వర్షం కురుస్తోంది. మంగళవారం అనేక చోట్ల అకాల వర్షం ఈదురు గాలులతో వరుణుడు తాండవం చేశాడు. దీంతో పశ్చిమ కనుమల వెంబడి ఉన్న జిల్లాలకు వాతావరణ శాఖ ఆరంజ్ అలర్ట్ ప్రకటించింది. వివరాలు.. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలలో భానుడి విశ్వరూపం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. మే నెలలో మరింతగా భానుడు ఉగ్రతాండవం చేస్తున్నా, అకాల వర్షం కారణంగా కొన్ని జిల్లాల్లో ప్రజలకు ఉపశమనం కలుగుతోంది. ఈ పరిస్థితులలో వారం రోజులలో నైరుతి రుతు పవనాలు దక్షిణ అండమాన్ సముద్రంలోకి ప్రవేశించనున్నట్లు వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఈ నెలాఖరుకల్లా ఈ పవనాలు కేరళ తీరాన్ని తాకే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని భావిస్తున్నారు. ఈ పవనాలకు ఆహ్వానం పలికే విధంగా పశ్చిమ కనుమల వెంబడి కేరళ సరిహద్దులలోని తమిళ జిల్లాలు కన్యాకుమారి, తిరునల్వేలి, తూత్తుకుడి, తెన్‌కాశి, తేని, నీలగిరి, దిండుగల్, కోయంబత్తూరులో వర్షాలు మొదలయ్యాయి. తెరిపించి తెరిపించి అక్కడక్కడా సోమవారం రాత్రి నుంచి వర్షాలు పడుతున్నాయి. బుధ, గురువారాల్లో ఈ జిల్లాతో పాటు మరికొన్ని పొరుగు జిల్లాలకు ఆరంజ్ అలర్ట్‌ను ప్రకటించారు. తూత్తుకుడి, కోయంబత్తూరులో అనేక చోట్ల సోమవారం రాత్రి, మంగళవారం ఉదయం భారీ వర్షం పడడంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. నీలగిరి జిల్లా ఊటీలో మంచుదుప్పటి కప్పేసినట్టుగా చిరు జల్లులతో వాతావరణం ఆహ్లాదకరంగా మారింది. మేట్టుపాళయంలో ఈదురు గాలుల వర్షానికి చెట్లు నేలకొరిగాయి. తేని జిల్లా పెరియకులంలో 200 సంవత్సరాల వృక్షం నేలకొరగడంతో పక్కనే ఉన్న ఐదు ఇల్లు దెబ్బతిన్నాయి. ఇందులో ఉన్న వారికి స్వల్పగాయాలయ్యాయి. నైరుతిని ఆహ్వానించే విధంగా ఏటా ముందుగా పశ్చిమ కనుమలలో వర్షాలు పడుతుండడంతో ఇది ఏరువాకకు శుభ సూచకమని రైతులు చెబుతున్నారు.

ఎల్లో ఫీవర్ టీకా తప్పనిసరి

- ఆఫ్రికా, దక్షిణ అమెరికా వెళ్లే ప్రయాణికులకు ప్రజారోగ్య శాఖ సూచన

కొరుక్కుపేట: ఆఫ్రికా, దక్షిణ అమెరికా దేశాల్లో ఎల్లో ఫీవర్ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ఆయా దేశాలకు వెళ్లే వారు తప్పనిసరిగా టీకాలు వేయించుకోవాలని ప్రజారోగ్య శాఖ సూచించింది. ఈ మేరకు పబ్లిక్ హెల్త్ అండ్ డిసీజ్ ప్రివెన్షన్ విభాగం మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. వివరాలు.. ఎల్లో ఫీవర్ ఆఫ్రికా, దక్షిణ అమెరికాలో విజృంభిస్తోంది. ఈ కారణంగా భారత్ నుంచి ఇతర దేశాలకు వెళ్లే వారు, ఆయా దేశాల నుంచి భారత్ కు వచ్చేవారు ఎల్లో ఫీవర్ టీకాలు తప్పక వేయించుకోవాలని ఆరోగ్య మంత్రిత్వ శాఖ సూచించింది. టీకా వేసిన పది రోజుల తర్వాత వారు పైన ఆయా దేశాలకు వెళ్లడానికి, ఆయా దేశాల నుంచి భారత్‌కు రావడానికి కూడా అనుమతి ఉంటుదన్నారు. ఈ విషయాన్ని విమానాశ్రయాలు, ఓడరేవుల వద్ద నిర్ధారిస్తున్నట్లు పేర్కొన్నారు. చెన్నై గిండిలోని అంతర్జాతీయ టీకా కేంద్రం, కింగ్ డిసీజ్ రీసెర్చ్ సెంటర్‌లో ప్రతి మంగళ, శుక్రవారాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు టీకాలు వేస్తామన్నారు. చెన్నైలోని రాజాజీ రోడ్డులోని హార్బర్ హెల్త్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రతి సోమ, బుధవారాల్లో టీకాలు అందుబాటులో ఉంటాయన్నారు. తూత్తుకుడి న్యూపోర్ట్‌లో ప్రతి మంగళవారం టీకాలు వేస్తారన్నారు. ఈ మూడు చోట్ల మాత్రమే టీకాలు అందుబాటులో ఉంటాయని, మిగిలిన చోట్ల ఎక్కడా ఉండవని స్పష్టం చేశారు.

రాష్ట్రంలో 41 మంది న్యాయమూర్తుల బదిలీ

కొరుక్కుపేట: చెన్నై సీబీఐ కోర్టు అదనపు జిల్లా సెషన్ కోర్టు రికార్డులతో సహా 41 మంది న్యాయమూర్తులను బదిలీ చేస్తూ చెన్నై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎం. జ్యోతిరామన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో చెన్నై కుటుంబ సంక్షేమ న్యాయస్థానంలో మొదటి అదనపు ప్రధాన న్యాయమూర్తిగా విధులు నిర్వహిస్తున్న సుమతిని పుదుచ్చేరి పోక్సో కోర్టు న్యాయమూర్తిగానూ, చెన్నై రాష్ట్ర రవాణా సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న మరియాను చెన్నై ఇండస్ట్రియల్ ట్రిబ్యునల్ హెడ్‌గా బదిలీ చేశారు. ఇదే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 41 మంది జిల్లా మేజిస్ట్రేట్లనూ ట్రాన్స్‌ఫర్ చేశారు.

తమిళనాడులో వైఎస్సార్ సేవాదళ్ సేవలు



టెండర్ కేర్‌లో సహాయకాల పంపిణీ

సాక్షి, చెన్నై: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ సీపీ అధ్యక్షులు వైఎస్. జగన్ మోహన్ రెడ్డి సోదరుడు వైఎస్ అనిల్‌రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకుని మంగళవారం చెన్నైలో వైఎస్సార్ సేవాదళ్ తమిళనాడు విభాగం నేతృత్వంలో పలు సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. బుధవారం వైఎస్ అనిల్‌రెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించనున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని రెండు రోజుల పాటు సేవా కార్యక్రమాలకు ఏర్పాట్లు చేశారు. సేవా దళ్ తమిళనాడు అధ్యక్షుడు జహీర్ హుస్సేన్, వైఎస్సార్ సీపీ నేత శరవణన్ ఆధ్వర్యంలో తొలిరోజు ఉదయం నుంచి పలుచోట్ల సేవా కార్యక్రమాలను నిర్వహించారు. తొలుత అన్నాసాలైలోని జెమిని వంతెన వద్ద ఉన్న లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో సేవా కార్యక్రమాలు జరిగాయి. ఇక్కడి 250 మందికి పైగా ఉన్న అంధ విద్యార్థులకు యూనిఫాంను అందజేశారు. అలాగే అక్కడి పిల్లల కోసం ఆర్థిక సాయంగా చెక్‌ను అందజేశారు. అనంతరం అంబత్తూరులోని టెండర్ కేర్ హోంలో సేవా కార్యక్రమాలు జరిగాయి. వైఎస్ అనిల్‌రెడ్డి ఆరోగ్య క్షేమాన్ని కాంక్షిస్తూ ప్రార్థనలు చేశారు. వృద్ధులకు అవసరమైన అన్ని రకాల వస్తువులు, బియ్యం బస్తాలు, ఇతర నిత్యావసర వస్తువులు, బ్రెడ్లు, స్వీట్లు, వస్త్రాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. అలాగే, మరికొన్ని చోట్ల సేవలతో ముందుకెళ్లారు. బుధవారం కూడా పలు సేవా కార్యక్రమాలతో పాటు రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలకు ఏర్పాట్లు చేశారు. సేవా దళ్ అధికార ప్రతినిధి కృతిక, నాయకులు ప్రకాష్, ఆనంద్, బాలాజీ పాల్గొన్నారు.



లిటిల్ ఫ్లవర్ స్కూల్‌లో అంధుల కోసం చెక్కు అందజేస్తున్న జహీర్‌హుస్సేన్ తదితరులు

తగ్గేదేలే!

- ప్లస్-1 ఫలితాల్లోనూ బాలికల హవా
- మొత్తం 91.17 శాతం ఉత్తీర్ణత
- బాలికలు 94.69, బాలురు 87.26 శాతం పాస్



సెల్‌ఫోన్‌లలో ప్లస్-1 ఫలితాలను చూపిస్తున్న విద్యార్థినులు



ఫలితాలను విడుదల చేస్తున్న పరీక్షల విభాగం డైరెక్టర్ సేతు రామవర్మ

సాక్షి, చెన్నై: పది, ప్లస్-2 తరహాలోనే ప్లస్-1లోనూ బాలికల హవా కొనసాగింది. ప్లస్-1 పరీక్ష ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఇందులో 91.17 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. వీరిలో బాలికలు 94.69 శాతం మంది ఉన్నారు. పలు సబ్జెక్టులలో విద్యార్థులకు వందకు వంద మార్కులను సాధించారు. వివరాలు.. ఈనెల 6వ తేదీన ప్లస్-2, 10వ తేదీన పదో తరగతి ఫలితాలు విడుదలైన విషయం తెలిసిందే. ప్లస్ -1 విద్యార్థులకు మార్చిలో పరీక్షలు జరిగాయి. ఈ పరీక్ష ఫలితాలను మంగళవారం డీపీఐ ఆవరణలో పరీక్షల విభాగం డైరెక్టర్ సేతు రామవర్మ విడుదల చేశారు. 7,534 పాఠశాలలకు చెందిన 8,11,172 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఇదులో బాలికలు 4,26,821, బాలురు 3,84,351 మంది ఉన్నారు. వీరిలో 91.17 శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. గత విద్యా సంవత్సరం 90.93 శాతం మంది పాస్ అయ్యారు. కాగా, ఈసారి పాసైన వారి శాతం కాస్త పెరిగింది. ఉత్తీర్ణులైన వారిలో 94.69 శాతం (4,04,143 బాలికలు), 87.26 శాతంతో(3,35,396 మంది బాలురు) ఉన్నారు. బాలురు కంటే బాలిక ఉత్తీర్ణత 7.43 శాతం అధికంగా ఉండడం గమనార్హం.

వందకు వంద మార్కులు..

ప్లస్-1లోనూ వందకు వంద మార్కులను అనేక సబ్జెక్టుల్లో పెద్దసంఖ్యలో విద్యార్థులు సాధించారు. తమిళం -8, ఆంగ్లం -13, ఫిజిక్స్ -696, కెమిస్ట్రీ -493, బయాలజీ -171, గణితం -779, బోటని-2, జువాలజీ -29, కంప్యూటర్ సైన్స్ -3432, కామర్స్ -620, అకౌంటెన్సీ -415, ఎకనామిక్స -741, కంప్యూటర్ అప్లికేషన్స్ -288, బిజినెస్ మాథ్యమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ -293 మంది విద్యార్థులకు వందకు వంద మార్కులు సాధించారు. కోయంబత్తూరు జిల్లా 96.02 శాతంతో రాష్ట్రంలో తొలి స్థానాన్ని, ఈరోడ్ 95.56 శాతంతో రెండవ స్థానాన్ని, తిరుప్పూర్ 95.23 శాతంతో మూడవ స్థానాన్ని దక్కించుకున్నాయి. ఈ మూడు జిల్లాలు పక్క పక్కనే ఉండడం విశేషం. చివరి స్థానంలో 81.40 శాతంతో వేలూరు నిలిచింది. ఇక పది ఫలితాలలోనూ వేలూరు చివరి స్థానంలో నిలవడం గమనార్హం. ఫలితాలతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల ఆనందానికి అవధులు లేవు. దీంతో విద్యార్థులు తమ పాఠశాలలకు చేరుకుని పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. విద్యార్థులు రిజిస్టర్డ్ మొబైల్ నెంబర్లకు ఎస్ఎంఎస్ ద్వారా ఉత్తీర్ణత, మార్కుల వివరాలను తెలియజేశారు. అలాగే పలు వెబ్ సైట్ల ద్వారా కూడా సమాచారం అందించారు. ఇదిలా ఉండగా, ప్లస్‌టూ, పదిలో తప్పిన విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షకు సిద్ధమైన విషయం తెలిసిందే. ఈ విద్యార్థులకు మంగళవారం నుంచి ప్రత్యేక శిక్షణ తరగతులు వారు చదువుకున్న పాఠశాల్లో ప్రారంభమయ్యాయి.

క్లుప్తంగా

వీఐటీ చాన్స్‌లర్‌కు న్యూయార్క్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న వీఐటీ చాన్స్‌లర్ విశ్వనాథన్

వేలూరు: వీఐటీ చాన్స్‌లర్ విశ్వనాథన్‌కు న్యూయార్క్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. వేలూరు వీఐటీ యూనివర్సిటీ చాన్స్‌లర్ కె. విశ్వనాథన్ పార్లమెంట్ సభ్యుడిగానూ, మంత్రిగానూ పలు పదవులు నిర్వహించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం వీఐటీ యూనివర్సిటీని ప్రారంభించి దేశంలోనే ఉన్నత విద్యా సంస్థగా తీర్చిదిద్దారు. దీంతో పాటు వివిధ సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. అలాగే అంతర్జాతీయ స్థాయిలో ఉన్నత విద్యాభివృద్ధికి కృషి చేశారు. ఈ కారణంగా యునైటెడ్ స్టేట్స్‌లో స్టేట్ యూనివర్సిటీ ఆఫ్ న్యూయార్క్ విశ్వనాథన్‌కు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈనెల 10వ తేదీన న్యూయార్క్‌లోని బింగ్‌హమ్‌టన్ యూనివర్సిటీలో జరిగిన వేడుకల్లో ఆ యూనివర్సిటీ చాన్స్‌లర్ హార్వే స్టింగర్ నుంచి విశ్వనాథన్ గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. ఈమేరకు ఓ ప్రకటన విడుదల చేశారు.

రైలు ఢీకొని యువకుడి దుర్మరణం

అన్నానగర్: రైలు ఢీకొని యువకుడు దుర్మరణం చెందాడు. నాగై జిల్లా మనక్కాడులో ఆకాశ మారియమ్మన్ ఆలయం ఉంది. ఈ ఆలయ వేడుక సోమవారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ ఉత్సవాలకు వేదారణ్యం రామకృష్ణాపురానికి చెందిన కాళిదాసు కుమారుడు కుమార సారథి(19), అతని స్నేహితులు తులసియా పట్నానికి చెందిన ప్రభాకరన్(18), వేదారణ్యానికి చెందిన నారాయణన్(18) వెళ్లారు. ఆలయ ఉత్సవాలు ముగిశాక బాగా పొద్దుపోవడంతో వారు ఇళ్లకు వెళ్లకుండా మనక్కా అడవిలో రైలు పట్టాలపై పడుకుని నిద్రించారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం తిరుతురైపూండి నుంచి అగస్తియన్‌పల్లి వెళుతున్న రైలు ట్రాక్‌పై నిద్రిస్తున్న వారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కుమార సారథి తల తెగిపడి దుర్మరణం చెందాడు. ప్రభాకరన్, నారాయణన్ తీవ్రంగా గాయపడ్డారు. ఇది గమనించిన స్థానికులు వారిని తిరువారూరు ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కోలాహలంగా గుడియాత్తం జాతర

- అమ్మన్ శిరస్సును దర్శించుకున్న ఐదు లక్షల మంది భక్తులు
- పటిష్ట పోలీస్ బందోబస్తు



అమ్మన్ శిరస్సు ఊరేగింపులో పాల్గొన్న భక్తజనం

వేలూరు: జిల్లాలోని గుడియాత్తం గంగయమ్మన్ ఆలయంలో జాతరను పురస్కరించుకుని శిరస్సు ఊరేగింపు మంగళవారం ఉదయం వైభవంగా నిర్వహించారు. జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన గుడియాత్తం గంగయమ్మన్ జాతర ఏటా అతి వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా మంగళవారం ఉదయం ముత్తాలమ్మన్ ఆలయంలోని అమ్మన్ శిరస్సుకు ప్రత్యేక పూజలు చేసి భక్తిశ్రద్ధలతో భక్తుల కోలాహలం నడుమ శిరస్సును ఊరేగింపుగా తీసుకొచ్చి పాలారు నది ఒడ్డున ఉన్న ఆలయంలోని విగ్రహానికి అమర్చారు. ఈ ఊరేగింపులో ఓం శక్తి భక్తులతో పాటు, స్థానికులు వివిధ వేషధారణలతో పులి వేషం, స్వామి వేషాలు ధరించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే భక్తులు కొబ్బరి కాయలను కొట్టి మొక్కు లు తీర్చుకున్నారు. ఈ జాతరకు వేలూరు, తిరువణ్ణామలై, తిరుపత్తూరు, వాణియంబాడి, ఆంబూ రు, పరదరామి, చిత్తూరు నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. ఇదిలా ఉండగా విపరీతమైన ఎండ తీవ్రతతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. జాతరకు వచ్చే భక్తుల దాహార్తిని తీర్చేందుకు అక్కడక్కడే నీరు, మజ్జిగ, అంబలితో పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ జాతరలో దేవదాయ శాఖ ఆలయ అధికారి లక్ష్మణన్, ఆలయ ఈఓ తిరునావుక్కరసు, అసిస్టెంట్ కమిషనర్ నిత్య, ఆలయ ధర్మకర్త ఆర్‌జే సంపత్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్పీ రాజేష్ కన్నన్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. జాతర ముగింపులో రాత్రి బాన వేడుకలను ఏర్పాటు చేశారు.

స్నూకర్ విజేతలకు ట్రోఫీలు ప్రదానం



విజేతలతో నిర్వాహకులు

కొరుక్కుపేట: చెన్నై జార్జి టౌన్‌లోని మద్రాసు యునైటెడ్ క్లబ్ (ఎంయూసీ) ఆధ్వర్యంలో దేశంలోనే తొలిసారిఎంయూసీ 6 రెడ్స్ అండ్ 10 రెడ్స్ నాన్ మెడలిస్ట్ స్నూకర్ చాంపియన్ షిప్–2024 పోటీలు నిర్వహించారు. రసవత్తరంగా సాగిన పోటీల్లో 6 రెడ్స్ స్నూకర్ ఫైనల్స్ విజేతగా టీఆర్ రామ్‌నారాయణన్ (ఎంయూసీ) నిలిచారు. అలాగే 10 రెడ్స్ కేటగిరిలో ఫైనల్స్ విజేతగా ఆశీష్ చాంపియన్‌గా నిలిచారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులు, ఎంయూసీ ఆఫీస్ బేరర్స్, ట్రోర్నమెంట్ కమిటీకి చెందిన నటరాజ్, మురళి, సంతోష్, రఫాత్ హబీబ్, లక్ష్మీకాంత్, శ్యామ్ సుందర్ గుప్త, రాజేష్, మహ్మద్ అనీఫ్, షైల్ విజయ్ కుమార్, అరవింద్, గణేష్, రామ్ నారాయణన్, అబ్దుల్ ఖాదర్ పాల్గొని, విజేతలకు ట్రోఫీలు అందజేశారు.

ఉరివేసుకుని యువకుడి ఆత్మహత్య

అన్నానగర్: ఉరివేసుకుని యువకుడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన తిరువళ్లువర్‌నగర్‌లో కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. చెన్నై తిరువాన్మియూర్ తిరువళ్లువర్ నగర్ 53వ క్రాస్ స్ట్రీట్‌కు చెందిన దినేష్ (26) రోడ్డు ప్రమాదంలో ఎడమకాలు కోల్పోయాడు. దీంతో అతడు చికిత్స పొందుతున్నాడు. అయినా కాలు నొప్పి మాత్రం తగ్గలేదు. దీంతో బాధను భరించలేక తీవ్రంగా ఇబ్బంది పడేవాడు. ఈ క్రమంలో మంగళవారం ఇంట్లో దినేష్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న తిరువాన్మియూర్ పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగం తీసిస్తామని రూ. 16.5 లక్షలు మోసం

తిరువొత్తియూరు: చెన్నై కార్పొరేషన్‌లో ఉద్యోగం తీసి ఇస్తామని చెప్పి రూ.16.5 లక్షల మోసం చేసినట్టు వచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. వివరాలు.. సేలం ఏర్కాడు ప్రాంతానికి చెందిన అస్పరత్ అజయ్ ప్రైవేటు యూనివర్సిటీలో మెరైన్ కోర్సు నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. ఇతని స్నేహితుడు కరికాలన్ ద్వారా పరిచయమైన వ్యక్తి దినేష్. ఇతను చెన్నై కార్పొరేషన్‌లో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. దినేష్ తనకు ఉన్నత ఉద్యోగులు తెలుసునని వారి ద్వారా కార్పొరేషన్‌లో ఉద్యోగం తీసిస్తానని అస్పరత్ అజయ్‌ని నమ్మించాడు. అంతేకాకుండా అతని నుంచి ఉద్యోగం కోసం రూ. 16.5 దినేష్ పొందాడు. అయితే రెండేళ్లయినప్పటికీ అతనికి దినేష్ ఉద్యోగం తీసివ్వలేదు. దీంతో మోసపోయిన అస్పరత్ అజయ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మత్తు మాత్రలు విక్రయం

– యువకుడి అరెస్టు

తిరువొత్తియూరు: కోయంబేడు ప్రాంతంలో మంగళవారం పోలీసులు గస్తీ కాస్తున్న సమయంలో ఆ ప్రాంతంలో మత్తుమాత్రలు విక్రయిస్తున్న యువకుడిని పోలీసులు పట్టుకొని విచారణ చేశారు. నిందితుడు విల్లుపురం జిల్లాకు చెందిన దయాలన్ (26) అని తెలిసింది. ఇతను కోయంబేడు ప్రాంతంలో ఉంటూ మత్తు మాత్రలు విక్రయిస్తున్నట్లు తేలింది. ఇతని వద్ద నుంచి 400 మత్తు మాత్రలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతన్ని ఎగ్మోర్ కోర్టులో హాజరుపరిచి పుళల్ జైలుకు తరలించారు.

పెట్ లైసెన్స్ కోసం 6,713 దరఖాస్తులు

కొరుక్కుపేట: పెట్ లైసెన్స్ కోసం ఒక వారం రోజుల వ్యవధిలోనే 6713 మంది దరఖాస్తు చేసుకున్నారు. పెంపుడు కుక్కలు ప్రజలపై దాడి చేస్తున్న ఘటనలు రోజురోజుకు పెరిగిపోవడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా చెన్నైలో ఓ బాలికను పెంపుడు కుక్కలు కరిచిన ఘటనతో కుక్కల భయం పెరిగిపోయిందనే చెప్పాలి. వీధి కుక్కలంటే భయపడే జనం ఇప్పుడు పెంపుడు కుక్కలంటే కూడా భయపడుతున్నారు. దీనిపై చెన్నై మున్సిపల్ కార్పొరేషన్ చర్యలు చేపట్టింది. పెట్ లైసెన్స్ తప్పనిసరి చేయడంతో ఒక్క వారంలోనే పెట్ లైసెన్స్ కోసం ఏకంగా 6,713 మంది దరఖాస్తు చేసుకున్నారు. వచ్చే నెలలోగా 20 వేల మందికి కొత్త లైసెన్సులు మంజూరు చేయాలని కార్పొరేషన్ లక్ష్యంగా పెట్టుకున్నట్టు అధికారులు వెల్లడించారు. పెంపుడు కుక్కలను సరైన పద్ధతిలో పెంచకపోతే, చెన్నైలో ఇలాంటి ఘటనలు కొనసాగుతున్నాయని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. గత 10 నెలల్లో 272 మంది మాత్రమే లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. కానీ లైసెన్సు తప్పనిసరి అయిన తర్వాత చాలా మంది లైసెన్సుల కోసం దరఖాస్తులు చేసుకుంటున్నారు. ఈ నెలాఖరు నాటికి 10 వేల మంది వరకు కొత్త లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. వచ్చే నెలలోగా 20 వేల కొత్త లైసెన్సులు జారీ చేయాలని లక్ష్యంగా పెట్టుకుందన్నారు. అలాగే లైసెన్స్ లేని వారికి రూ. వెయ్యి జరిమానా విధించడమే కాకుండా తగిన చర్యలు తీసుకుంటామని ప్రకటించింది. లైసెన్స్ లేని యజమానులు, పెంపుడు జంతువులపై చర్యలు తీసుకుంటామని చెన్నై కార్పొరేషన్ ప్రకటించిన నేపథ్యంలో సంతానోత్పత్తికి లైసెన్స్ లేని చాలా మంది ఆన్‌లైన్‌లో లైసెన్స్ పొందడానికి ఆసక్తి చూపుతున్నారు. అలాగే చెన్నైలో గత వారం రోజుల్లో 6,713 మంది పెట్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకున్నట్టు అధికారులు వెల్లడించారు.



కాంచీపురం లోక్‌సభ పరిధిలో నమోదైన ఓట్లుకు సంబంధించి ఈవీఎంలతో పాటు వీవీ ప్యాట్లు కాంచీపురంలోని పొన్నురిక్కరై అన్నా ఇంజనీరింగ్ కళాశాలలో ఉంచారు. దీంతో అక్కడ భద్రతను జిల్లా కలెక్టర్ కలైసెల్వి మంగళవారం పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. – కాంచీపురం (పళ్లిపట్టు)

ప్రైవేటు బ్యాంక్ మేనేజర్ ఆత్మహత్య

- ప్రేమలో వైఫల్యమే కారణం

అన్నానగర్: ప్రేమ విఫలం కాడంతో ఓ ప్రైవేటు బ్యాంక్ మేనేజర్ ఆత్మహత్య చేసుకున్నాడు. తిరుచ్చిలోని భీమానగర్ పుదుతేరు ప్రాంతానికి చెందిన బాలకరాయ్ కుమారుడు అబ్రహం (24). ఇతడు గ్రాడ్యుయేట్. అతను చెన్నై ఎన్నూర్ లోని ప్రముఖ ప్రైవేట్ బ్యాంక్‌లో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో పూణేలో బ్యాచిలర్ డిగ్రీని అభ్యసిస్తున్నప్పుడు, నాగర్‌కోయిల్‌కు చెందిన తోటి విద్యార్థితో ప్రేమలో పడ్డాడు. ఈ వ్యవహారం బాలిక తల్లిదండ్రులకు తెలిసింది. దీంతో ఆమెను తల్లిదండ్రులు మందలించారు. దీంతో యువతి అబ్రహంతో మాట్లాడడం మానేసింది. కొన్ని నెలలుగా ప్రియురాలు మాట్లాడకపోవడంతో కలత చెంది, బ్లేడుతో చేతులు కోసుకున్నాడు. కుటుంబ సభ్యులు చికిత్స అందించి అతడిని రక్షించారు. ఈ స్థితిలో అబ్రహం తన తల్లి ద్వారా అమ్మాయితో మాట్లాడాడు. ఆ అమ్మాయి తన తల్లిదండ్రుల మాట వింటానని చెప్పి ఫోన్ కట్ చేసింది. దీంతో అబ్రాహాం తీవ్ర ఆవేదనకు గురై మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

తండ్రిగా కాకుండా దర్శకుడిగా చెబుతున్నా..



హిట్‌లిస్ట్ చిత్రం ఆడియోను ఆవిష్కరించిన మిష్కిన్, పీ.వాసులతో చిత్ర యూనిట్

తమిళసినిమా: సినీ రంగంలో వారసులు పరిచయం కావడం సులభమే. అయితే ఆ తరువాత వారేమిటో నిరూపించుకోవడం అన్నది వారి ప్రతిభ. అదృష్టం పైనే ఆధారపడి ఉంటుంది. అలా కథానాయకుడిగా పరిచయం అయిన వారసుడు విజయ్ కనిష్క. ఈయన ప్రముఖ దర్శకుడు విక్రమన్ కొడుకు. హిట్‌లిస్ట్ చిత్రం ద్వారా హీరోగా రంగప్రవేశం చేశారు. ఆర్‌కే.సెల్యులాయిడ్ పతాకంపై దర్శకుడు కేఎస్ రవికుమార్ నిర్మించిన ఈ చిత్రానికి ఆయన శిష్యులు సూర్య కదీర్, కార్తికేయన్‌ల ద్వయం దర్శకత్వం వహించారు. నటుడు శరత్‌కుమార్ ప్రధాన పాత్రను పోషించిన ఇందులో దర్శకుడు గౌతమ్ మీనన్, సముద్రఖని తదితరులు ముఖ్య పాత్రల్లో నటించారు. సీ.సత్య సంగీతం అందించిన ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమాలను పూర్తి చేసుకుని త్వరలో తెరపైకి రావడానికి సిద్ధం అవుతోంది. ఈ సందర్భంగా సోమవారం చిత్ర ఆడియో ఆవిష్కరణ కార్యక్రమాన్ని స్థానిక వడపళనిలోని కమలా థియేటర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్శక, నటుడు కే.భాగ్యరాజ్, ఆర్‌వీ. ఉదయకుమార్, మిష్కిన్, పీ.వాసు, నటుడు జీవా, జయంరవి, నిర్మాత కలైపులి ఎస్.థాను, టి.శివ, సురేశ్ కామాక్షి, ధనుంజయన్ తదితరులు పాల్గొన్నారు. ఈ వేదికపై దర్శక నటుడు కే.భాగ్యరాజ్ నటుడు విజయ్ కనిష్కను పరిచయం చేశారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత కేఎస్.రవికుమార్ మాట్లాడుతూ ఈ చిత్ర నిర్మాణానికి కారణం అయిన రమేశ్ గ్రాండ్ క్రియేషన్స్ కార్తీక్, కమలకన్నన్, శ్రీనివాసన్, విజయకుమార్‌కు ధన్యవాదాలు అన్నారు. అలాగే తనపైనా, దర్శకుడు విక్రమన్‌పై అభిమానంతో ఇందులో నటించడానికి అంగీకరించిన నటుడు శరత్‌కుమార్‌కు కృతజ్ఞతలు అన్నారు. అలాగే దర్శకుడు గౌతమ్‌మీనన్, సముద్రఖని ఇద్దరూ అడగ్గానే ఈ చిత్రంలో నటించారని చెప్పారు. ఈ చిత్ర దర్శకులు తన శిష్యులైనా హిట్‌లిస్ట్ చిత్ర కథనాన్ని చాలా చక్కగా రూపొందించారని, వారు ఎలా పని చేస్తున్నారన్నది నటుడు శరత్‌కుమార్, దర్శకుడు గౌతమ్ మీనన్‌లను అడిగి తెలుచుకునేవాడినని, ఇక్కడికి వచ్చి ఆశీస్సులందించిన అందరికీ కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని తెలిపారు. చివరిగా దర్శకుడు విక్రమన్ మాట్లాడుతూ తాను చెప్పాల్సిందంతా కేఎస్.రవికుమార్ మాట్లాడారని, ఈ చిత్రాన్ని నిర్మించినందుకు ఆయనకు ధన్యవాదాలని పేర్కొన్నారు. ఒక తండ్రిగా కాకుండా దర్శకుడిగా చెబుతున్నానని విజయ్ కనిష్క చాలా బాగా నటించారని ప్రశంసించారు. ఈ చిత్రం కచ్చితంగా విజయం సాధిస్తుందనే నమ్మకాన్ని వ్యక్తం చేశారు. తను నటుడిగా ఉన్నత స్థాయికి ఎదుగుతారనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

కోలీవుడ్ టాక్స్

అవును.. మేము విడిపోతున్నాం!



జీవీ.ప్రకాశ్‌కుమార్, సైంధవి

తమిళసినిమా: కోలీవుడ్‌లో మరో ప్రేమ జంట వివాహ రద్దుకు సిద్ధం అయ్యింది. ఈ మధ్య నటుడు ధనుష్, ఐశ్వర్య రజనీకాంత్ తమ 18 ఏళ్ల వైవాహిక జీవితానికి స్వస్తి చెబుతూ అభిప్రాయ భేదాలతో విడిపోయిన విషయం తెలిసిందే. వీరికి ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. వీరు విడాకుల కోసం న్యాయస్థానాన్ని ఆశ్రయించడం సినీ ప్రముఖులను దిగ్భ్రాంతికి గురి చేసింది. కాగా తాజాగా వీరి బాటలోనే మరో సినీ సెలబ్రిటీ జంట విడిపోతున్నట్లు అధికారికంగా ప్రకటించి షాక్ ఇచ్చింది. ఈ జంటనే సంగీత దర్శకుడు జీవీ.ప్రకాశ్‌కుమార్, గాయని సైంధవి. అతి పిన్న వయసులోనే సంగీత దర్శకుడిగా పరిచయం అయ్యి ఉన్నత స్థాయికి చేరుకున్న జీవీ.ప్రకాశ్‌కుమార్, కథానాయకుడిగానూ రాణిస్తున్నారు. అలాగే సినీ గాయనిగా మంచి స్థాయిలో రాణిస్తున్న సైంధవి గురించి పరిచయం చేయాల్సిన అవసరం లేదు. విశేషం ఏమిటంటే జీవీ.ప్రకాశ్‌కుమార్, సైంధవిలు పాఠశాల దశలోనే ప్రేమలో పడ్డారు. అది కళాశాల విద్య వరకూ పెరిగి ఇద్దరూ పెళ్లి చేసుకున్నారు. దాంపత్య జీవితానికి చిహ్నంగా అన్వి అనే కూతురు ఉంది. కాగా చిరకాల ప్రేమకు పెళ్లి రూపం ఇచ్చిన జీవీ.ప్రకాశ్‌కుమార్, గాయని సైంధవి దంపతులు తమ 11 ఏళ్ల వివాహ బంధాన్ని తెంచుకోవడానికి సిద్ధం అయ్యారు. దీని గురించి జీవీ.ప్రకాశ్ కుమార్ మంగళవారం మీడియాకు విడుదల చేసిన ప్రకటన ద్వారా అధికారికంగా వెల్లడించారు. అందులో తాను సైంధవి పరస్పర అవగాహనతో విడిపోతున్నట్లు పేర్కొన్నారు. వ్యక్తిగత కారణాలతో ఈ నిర్ణయం తీసుకున్నామని, తమ ఈ నిర్ణయాన్ని అందరూ అర్థం చేసుకుంటారని భావిస్తున్నామన్నారు. గాయని సైంధవి కూడా తన ఇన్‌స్టాగామ్‌లో పేర్కొంటూ తమ ప్రశాంతత కోసం ఉన్నతి కోసం విడిపోవాలనే నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కాగా ఈ జంట నిర్ణయం సినీ వర్గాలను ఆశ్చర్యానికి గురి చేసింది. కాగా జీవీ.ప్రకాశ్‌కుమార్, సైంధవిలు విడిపోతున్నట్లు గత రెండు మూడు రోజుల నుంచి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. అయితే అది వదంతి అయితే బాగుటుందని చాలా మంది కోరుకున్నారు. అయితే చివరికి అదే నిజం అయ్యింది.

రేడియో రూం పేరుతో స్టోరీ టెల్లింగ్ యాప్



రేడియో రూమ్ యాప్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సినీ ప్రముఖులు

తమిళసినిమా: సినిమా ఇప్పుడు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కొత్త పుంతలు తొక్కుతున్న విషయం తెలిసిందే. దానికి మరింత సహకరించేలా తాజాగా రెడియో రూమ్ పేరుతో స్టోరీ టెల్లింగ్ యాప్‌ను ప్రారంభించారు. పలు మీడియా సంస్థల్లో పని చేసి అనుభవం గడించిన దర్శకుడు, నిర్మాత వెంకీ అనే వెంకటాచలం ఈ రేడియో రూమ్‌పేరుతో స్టోరీ టెల్లింగ్ యాప్‌ను చెన్నైలో ఆవిష్కరించారు. త్వరలో ఆడియో ఓటీటీను కూడా ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. దీని ప్రారంభోత్సవంలో దర్శకుడు సురేశ్‌కృష్ణ, శశి, స్టాన్లీ, గౌతమ్‌మీనన్, రచయిత రాజేశ్‌కుమార్, నటుడు జాన్ విజయ్ తదితర సినీ ప్రముఖులు పాల్గొన్నారు. కాగా ఈ రేడియో రూంలో ఆడియో బుక్ స్టోరీస్, నవలలు, ఆడియో డ్రామాలతో వాయిస్ వీడియోలు, వీటి కోసమే రూపొందించిన సంగీతం, శబ్దాలు ఏర్పాటు చేసినట్లు వెంకీ చెప్పారు. అందే విధంగా తమిళ కథలతో పాటు, శ్రీలంక తమిళ కథలు, తెలుగు, మలయాళం, కన్నడం భాషా కథలు పొందుపరిచినట్లు చెప్పారు. కాగా త్వరలోనే బెంగాలీ, మరాఠీ భాషా నవలను, ఇతర ఇతర దేశాలకు చెందిన పోర్చుగీస్, స్పానిష్, జర్మన్ కథలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఇందులో ప్రేమ, సెంటిమెంట్, థ్రిల్లర్, ఇన్వెస్టిగేషన్ కు సంబంధించిన కథలు ఉంటాయన్నారు.

ప్రొడక్షన్ మేనేజర్‌లా పని చేశారు!



తలమై సెయలగం వెబ్ సిరీస్ యూనిట్

తమిళసినిమా: తన భర్త, నటుడు శరత్‌కుమార్ తలమై సెయలగం వెబ్ సిరీస్ నిర్మాణం కోసం ప్రొడక్షన్ మేనేజర్‌గా పని చేశారని నటి, రాడాన్ మీడియా వర్క్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అధినేత రాధిక శరత్‌కుమార్ పేర్కొన్నారు. నటిగా, నిర్మాతగా రాణిస్తున్న రాధికా శరత్‌కుమార్ తాజాగా వెబ్ ప్రపంచంలోకి ప్రవేశించారు. జీ 5 సంస్థతో కలిసి ఈమె నిర్మించిన వెబ్ సిరీస్ తలమై సెయలగం. దర్శకుడు వసంతబాలన్ దర్శకత్వం వహించిన తొలి వెబ్ సిరీస్ కూడా ఇదేనన్నది గమనార్హం. కాగా నటుడు కిశోర్, నటి శ్రేయారెడ్డి, భరత్, రమ్యానంభీశన్, ఆదిత్యమీనన్, కని కుస్రుతి, దర్శగుప్త తదితరులు ప్రధాన పాత్రలు పోషించిన ఈ వెబ్ సిరీస్ 8 ఎపిసోడ్స్‌తో నిర్మాణ కార్యక్రమాలను పూర్తి చేసుకుని ఈ నెల 17వ తేదీ నుంచి జీ5 ఓటీటీలో స్ట్రీమింగ్‌కు సిద్ధం అవుతోంది. ఇది సమకాలీన రాజకీయాలను ఆవిష్కరించే కథాంశంతో రూపొందిన వెబ్ సిరీస్ అని దర్శకుడు వసంతబాలన్ పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం చెన్నైలోని ప్రసాద్‌ల్యాబ్‌లో జరిగిన మీడియా సమావేశంలో నటి, నిర్మాత రాధిక శరత్‌కుమార్ మాట్లాడుతూ ఒక కథను దర్శకుడు వసంతబాలన్‌కు ఇచ్చి వెబ్ సిరీస్‌గా రూపొందించాలని చెప్పానన్నారు. అయితే ఆ స్క్రిప్ట్ చదివిన ఆయన దీన్ని వెబ్ సిరీస్‌గా చేస్తే తాను ఊరు వదిలి వెళ్లిపోవాల్సి వస్తుందనే భయాన్ని వ్యక్తం చేశారన్నారు. దీంతో మీ స్టైల్‌లో కథను రెడీ చేయమని చెప్పడంతో ఆయన తన వెర్షన్‌ను అద్భుతంగా రాశారన్నారు. అయితే సినిమా దర్శకుడు కావడంతో వెబ్ సిరీస్‌ను తెరకెక్కించడానికి ముందు కాస్త తడబడ్డారని, ఆ తరువాత గాడిలో పడ్డారని చెప్పారు. వసంతబాలన్ ఈ వెబ్ సిరీస్‌ను చాలా బాగా రూపొందించారని చెప్పారు. జీ 5 సంస్థతో కలిసి దీన్ని నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. కాగా ఈ వెబ్ సిరీస్ నిర్మాణం కోసం తన భర్త, నటుడు శరత్‌కుమార్ ఒక ప్రొడక్షన్ మేనేజర్‌లా పని చేశారని, ఆయన లేకుంటే ఇది సాధ్యం అయ్యేది కాదని అన్నారు. అర్ధరాత్రి 2 గంటల వరకూ దీనికి సంబంధించిన చర్చలు జరిగేవన్నారు. అలాంటి సమయంలో తనను విశ్రాంతి తీసుకోమని, ఆయన 4 గంటల వరకూ పని చేసి, మళ్లీ ఉదయం 7 గంటలకే రెడీ అయ్యేవారని చెప్పారు. నటుడు శరత్‌కుమార్ తాను ఈ వెబ్ సిరీస్‌కు ప్రొడక్షన్ మేనేజర్‌గా పని చేయడం గురించి రాధిక చెప్పారని, తొలి రోజుల్లో తాను సైకిల్‌పై పేపర్లు వేశానని, సైకిల్‌ను పార్టులుగా విడదీసి రిపేర్లు చేశానని చెప్పారు. ఆ తరువాత పాత్రికేయుడిగానూ పని చేసినట్లు చెప్పారు.

విడాముయర్చి చిత్రానికి త్రిష షాక్



తమిళసినిమా: నటి త్రిష ఇంతకు ముందెప్పుడూ లేనంత బిజీగా ఉన్నారు. అంతే కాదు ఇప్పుడీ చెన్నై 40 ఏళ్ల పరువాల భామ నటిస్తున్న చిత్రాలన్ని సూపర్‌స్టార్స్‌తోనే కావడం విశేషం. అంతేకాదు అన్ని భాషల్లోనూ ఏక కాలంలో నటించేస్తున్నారు. ప్రస్తుతం అజిత్ సరసన విడాముయర్చి, కమలహాసన్‌కు జంటగా థగ్ లైఫ్, తెలుగులో చిరంజీవికి జంటగా విశ్వంభర, మలయాళంలో మోహన్‌లాల్‌తో రామ్, టోవినో థామస్ సరసన ఐడెంటిటీ మొదలగు చిత్రాల్లో నటిస్తున్నారు. కాగా వీటిలో ఐడెంటిటీ చిత్ర షూటింగ్‌ను త్రిష పూర్తి చేశారు. ఈ చిత్రాన్ని ఈ ఏడాది చివరిలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు నిర్మాతల వర్గం పేర్కొంది. కాగా దీనికి సంబంధించిన ఫొటోలిప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. కాగా అజిత్ సరసన నటిస్తున్న విడాముయర్చి చిత్ర షూటింగ్ జాప్యం కావడంతో ఆ చిత్రానికి కేటాయించిన కాల్‌షీట్స్‌ను నటి త్రిష కమలహాసన్‌కు జంటగా నటిస్తున్న థగ్‌లైఫ్ చిత్రానికి, చిరంజీవితో నటిస్తున్న విశ్వంభర చిత్రానికి కేటాయించినట్లు టాక్ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఇది విడాముయర్చి చిత్ర యూనిట్‌కు పెద్ద షాక్కే అవుతుంది. అంతా మణిరత్నం చేసిన పని. ఆయన దర్శకత్వం వహించిన పొన్నియిన్ సెల్వన్ చిత్రంలో నటి త్రిషకు అవకాశం ఇవ్వడం, ఆ చిత్రం విజయం సాధించడం, ముఖ్యంగా అందులో కుందవై పాత్రలో త్రిష రాజసం ఒలికించే నటనకు ప్రశంసలు లభించడం కారణంగానే ఇప్పుడామె క్షణం తీరిక లేని నటిగా మారారు. టైమ్ అంటే ఇదే మరి.

క్లుప్తంగా

రూ.కోటి నగదు స్వాధీనం

తిరువొత్తియూరు: అక్రమంగా తరలిస్తున్న రూ.కోటి నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. షావుకార్‌పేట ప్రాంతంలో సోమవారం రాత్రి కొత్వాల్ చావడి పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో ఓ బైకుపై వచ్చిన ఇద్దరు యువకులను ఆపి తనిఖీ చేశారు. వారి బైక్‌లో నోట్ల కట్టలు ఉన్నట్లు గుర్తించారు. ఈ మొత్తం రూ. కోటిగా తేల్చారు. విచారణలో వారు చెన్నై అన్నానగర్ ప్రాంతానికి చెందిన అబ్దుల్ ఆజా, మేడవాక్కం కుట్టిఅప్పన్న వీధికి చెందిన ధనశేఖర్ అని తెలిసింది. అబ్దుల్ ఆజా మన్నడిలో ఉన్న ప్రైవేటు నగదు మార్పిడి చేసే సంస్థలోనూ, ధనశేఖర్ మరో నగదు మార్పిడి సంస్థలోనూ పనిచేస్తున్నట్లు తెలిసింది. కానీ నగదుకు తగిన ఆధారాలు వారి చూపలేదు. దీంతో రూ.కోటి నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తర్వాత దానిని నుంగంబాక్కంలో ఉన్న ఇన్‌కంటాక్స్ అధికారులకు అప్పగించారు. పట్టుబడిన నగదు హవాలా నగదా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. అబ్దుల్‌ఆజా, ధనశేఖర్‌ను ప్రశ్నిస్తున్నారు.

గూండా చట్టం కింద 42 మంది అరెస్టు

అన్నానగర్: వారం రోజుల్లో గూండా చట్టం కింద 42 మందిని పోలీసులు అరెస్టు చేశారు. చెన్నైలో ప్రజాశాంతికి విఘాతం కలిగించడం, హత్య, హత్యాయత్నం, దొంగతనం, డ్రగ్స్ అమ్మడం వంటి నేరాలకు పాల్పడే వ్యక్తులను గూండా యాక్ట్ కింద అరెస్టు చేస్తున్నారు. ఈ క్రమంలో వారం రోజుల్లో 42 మందిని అదుపులోకి తీసుకున్నట్లు చెన్నై పోలీస్ కమిషనర్ సందీప్ రాయ్ రాథోడ్ వెల్లడించారు. దీంతో ఈ ఏడాది ఈ చట్టం కింద అరెస్టు చేసిన వారి సంఖ్య 496కి చేరింది.

లారీ, బైకు ఢీ .. చిన్నారి మృతి

అన్నానగర్ : ఎరుకంజేరి రోడ్డు పక్కన ఆగి ఉన్న ట్రక్కును బైక్ ఢీకొనడంతో చిన్నారి మృతి చెందింది. వివరాల్లోకి వెళితే.. చెన్నైలోని వ్యాసర్‌పాడి సి.కళ్యాణపురం ప్రాంతానికి చెందిన శంకర్ (26) ఫుడ్ డెలివరీ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య నందిని (21), ఏడాదిన్నర కుమారుడు నితిక్, 3 నెలల పాప కృతిక్ ఉన్నారు. ఈ స్థితిలో వారంతా సోమవారం అంబత్తూరులోని బంధువుల ఇంటికి వెళ్లారు. తర్వాత అర్ధరాత్రి తిరిగి ఇంటికి బయలుదేరారు. మూలకడై మీదుగా ఎరుకంజేరి హైవేపై వ్యాసర్‌పాడి వైపు వస్తుండగా రోడ్డుకు ఎడమ వైపు ఆగి ఉన్న లారీని శంకర్ బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో నితిక్ సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. శంకర్, భార్య, మరో బిడ్డ చికిత్స పొందుతున్నారు. ప్రమాదంపై కీల్పాక్కం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సెల్వరాజ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ, బస్సు ఢీ

- లారీ డ్రైవర్ మృతి

తిరువొత్తియూరు: మేల్ మలయనూరు సమీపంలో మంగళవారం తెల్లవారుజామున ప్రైవేటు బస్సు, మినీ లారీ ఎదురుగా ఢీ కొన్నాయి. ఈ ఘటనలో లారీ డ్రైవర్ మృతి చెందగా 10 మంది ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. తేనే జిల్లా ఉత్తమపాలయం తాలూకాకు చెందిన లారీడ్రైవర్ నాగరాజన్ (50) తేని జిల్లా నుంచి ద్రాక్ష పండ్లను విల్లుపురం, తిరుచ్చి, సెంజీ తదితర ప్రాంతాల్లో ఉన్న పండ్ల మార్కెట్‌కు సరఫరా చేస్తుంటాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి పండ్లను దుకాణాలకు సరఫరా చేయడానికి బయలుదేరాడు. మంగళవారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో విల్లుపురం జిల్లా సెంజీ నుంచి సేందపట్టుకు వెళుతుండగా అన్నామంగళం వద్ద ఎదురుగా వస్తున్న ప్రైవేట్ బస్సు మినీ లారీని ఎదురుగా వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో మినీ లారీ డ్రైవర్ నాగరాజన్ అదే చోట మృతి చెందాడు. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న 10 మందికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు స్పందించి క్షతగాత్రులను అంబులెన్స్‌లో సెంజీ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అగ్నిమాపకశాఖ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని లారీ డ్రైవర్ నాగరాజన్ మృతదేహాన్ని, లారీలో నుంచి బయటకు తీసి శవ పరీక్ష కోసం సెంజీ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కల దాడిలో కృష్ణజింకకు తీవ్రగాయాలు



తిరుత్తణి: కుక్కల దాడిలో కృష్ణజింకకు తీవ్ర గాయాలయ్యాయి. తిరువలంగాడు యూనియన్ తొయిదావూరు సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి కృష్ణజింక మంగళవారం ఉదయం నీటికోసం గ్రామం వైపు రాగా, వీధి కుక్కలు జింకపై దాడి చేశాయి. దీంతో జింక కాలు విరిగింది. వెంటనే అక్కడున్న స్థానికులు జింకను కుక్కల నుంచి కాపాడారు. విరిగిన జింక కాలుకు కట్టు కట్టి అటవీ శాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అయితే వారు సంఘటన ప్రాంతం చేరుకోవడానికి మూడు గంటల సమయం పట్టడంతో గ్రామీణులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వన్య ప్రాణులను కాపాడాల్సిన అటవీ శాఖ అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నట్లు, వేసవిలో వన్యప్రాణులను కాపాడేందుకు అటవీ ప్రాంతాల్లో నీటి ట్యాంకులు ఏర్పాటు చేయాల్సిన అటవీశాఖ సిబ్బంది పట్టించుకోక పోవడంతోనే వన్య ప్రాణులు నీటి కోసం జనారణ్యంలోకి వచ్చి ప్రాణాలు కోల్పోవడంతోపాటు గాయాలపాలవుతున్నట్లు ఆరోపించారు.

విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ పళని ఇంట్లో
ఏసీబీ దాడులు

- రూ.కోట్ల విలువైన ఆస్తి పత్రాల స్వాధీనం
- విచారణ చేపట్టిన అవినీతి నిరోధక శాఖ అధికారులు

కొరుక్కుపేట: ఆదాయానికి మించి 61.38 శాతం ఆస్తులు సంపాదించిన ఆరోగ్య సేవల విభాగం రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ పళని ఇంటిపై అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అధికారులు దాడులు నిర్వహిస్తున్నారు. ఈ దాడుల్లో కోట్లాది రూపాయల విలువైన ఆస్తుల పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. వివరాల్లోకి వెళితే.. చెన్నై నొలంబూర్ గురుసామి వీధికి చెందిన పళని(59) 1995లో వైద్యాధికారిగా సర్వీసులో చేరి, సీనియారిటీ ఆధారంగా కాంచీపురం జిల్లా ఆరోగ్య సేవల శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఎగ్మూర్‌లోని కుటుంబ సంక్షేమ శిక్షణ సంస్థ ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్నారు. 2021 అక్టోబర్ 18వ తేదీన అతని కార్యాలయంలో లెక్కలో చూపని రూ. 2,02,300 స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు అవినీతి నిరోధక శాఖ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ దాడి తరువాత అతని లాకర్ నుంచి రూ. 3,22,900 జప్తు చేశారు. అనంతరం జరిపిన విచారణలో పళని తన భార్య పేరు మీద లెక్కలో చూపని రూ.29,80,500 పొందాడు. అలాగే అన్న, కుటుంబ సభ్యుల పేరిట ఆస్తులు కూడబెట్టినట్లు గుర్తించారు. తిరువళ్లూరు జిల్లా అంబత్తూరులో 1,889 చదరపు అడుగుల భూమిని పళని కొనుగోలు చేసినట్లు తేలింది. కాంచీపురం ఆరోగ్య శాఖ మాజీ జాయింట్ డైరెక్టర్ పళనిపై అవినీతి నిరోధక శాఖ పోలీసులు కేసు నమోదు చేసి, చెన్నైలోని ఆయన ఇంటిపై దాడులు చేశారు. ఆయన భార్య ప్రమీల పేరిట కూడా ఆస్తులు కొనుగోలు చేసినట్లు గుర్తించారు. అధికారుల విచారణలో పళని ఆదాయానికి మించి రూ.2,93,14,373 ఆస్తులు సంపాదించగా, ఆయన భార్య పేరున రూ.2.34 కోట్ల ఆస్తులు ఉన్నట్లు గుర్తించారు. తన కెరీర్‌లో రూ.1.79 కోట్లకు పైగా ఆదాయాన్ని సేకరించిన పళని ఆదాయం కన్నా 61.38 శాతం ఆస్తులు అదనంగా కూడబెట్టినట్లు గుర్తించారు. అనంతరం మొగప్పేర్ ప్రాంతంలోని కాంచీపురం జిల్లా వైద్యారోగ్య శాఖ డైరెక్టర్ పళని ఇంట్లో ఏసీబీ ఇన్‌స్పెక్టర్ అన్నాదురై నేతృత్వంలో పోలీసులు మంగళవారం దాడులు చేశారు. ఈ దాడిలో పళని ఆస్తి సెక్యూరిటీలు, బ్యాంకు ఖాతా పుస్తకాలు, ఆయన పదవీ కాలంలో ఆయన భార్య, కుటుంబ సభ్యుల పేరిట సంపాదించిన నగదు, బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. దీనిపై అవినీతి నిరోధక శాఖ అధికారులు పళనిని విచారిస్తున్నారు.



పళని ఇల్లు

ఆలయసందర్శనలో నయనతార, విఘ్నేశ్‌శివన్

తమిళసినిమా: అగ్రనటి నయనతార వివాహానికి ముందు భక్తి మార్గం పట్టారు. ఆ తరువాతే దర్శకుడు విఘ్నేశ్‌శివన్‌ను 2022లో పెళ్లి చేసుకున్నారు. ఆ తరువాత నయనతార తరచూ వివిధ ప్రదేశాల్లోని ఆలయాలను దర్శించుకుని, విశేష పూజలు నిర్వహిస్తున్నారు. కాగా తాజాగా నయనతార, విఘ్నేశ్‌శివన్ దంపతులు సోమవారం కన్యాకుమారిలోని పలు ఆలయాలను సందర్శించి, విశేష పూజలు నిర్వహించారు. కన్యాకుమారిలోని సుశీంద్రం దనుమాలయ స్వామి ఆలయానికి వెళ్లి స్వామి దర్శనం చేసుకున్నారు. ఆలయ ధర్మకర్త ప్రియా రామకృష్ణన్ వీరిని సాదరంగా ఆహ్వానించారు. ఆలయంలోని ఆంజనేయస్వామికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం నాగర్‌కోవిల్‌లోని నాగరాజ ఆలయానికి వెళ్లి స్వామి దర్శనం చేసుకున్నారు. స్వామి తోపు అయ్యా వైకుంఠస్వామిని దర్శించుకున్నారు. అక్కడ ముఖానికి తిరునామం పెట్టుకుని అయ్యా వైకుంఠస్వామికి పూజలు నిర్వహించారు. కాగా నయనతార, విఘ్నేశ్‌శివన్ దంపతులను చూసిన ఆ ప్రాంత ప్రజలు, భక్తులు వారితో ఫొటోలు దిగడానికి ఆసక్తి చూపారు. వారితో ఫొటోలు దిగిన నయనతార, విఘ్నేశ్ శివన్‌లు అందరికీ అభివాదం చేసి వారిలో ఉత్సాహాన్ని నింపారు.



అర్చకునికి పూజా సామగ్రి అందజేస్తున్న విఘ్నేశ్‌శివన్, నయనతార

తిరునాళ్లు నిర్వహణపై విభేదాలు

- పీస్ కమిటీ సమావేశంతో కుదిరిన సమోధ్య

పళ్లిపట్టు: తిరునాళ్ల నిర్వహణకు సంబంధించి రెండు గ్రామస్తులు మధ్య విభేదాలు చోటు చేసుకున్నాయి. దీంతో ఆర్డీఓ ఆధ్వర్యంలో మంగళవారం పీస్ కమిటీ నిర్వహించి, సమోధ్య కుదిర్చారు. ఆర్కేపేట యూనియన్ అమ్మయార్‌కుప్పంలో ద్రౌపదీదేవి ఆలయంలో 50 ఏళ్లుగా ద్రౌపదీదేవి అగ్నిగుండ వేడుకలు నిర్వహించడం పరిపాటి. అయితే ఈ ఏడాది వేడుకలు ఏ గ్రామానికి చెందిన ప్రజలు జరపాలన్న విషయమై అమ్మయార్‌కుప్పం, శివలింగపురం గ్రామస్తులు మధ్య విభేదాలు తలెత్తాయి. సమస్య పరిష్కారం కోసం తిరుత్తణి ఆర్డీఓ దీప అధ్యక్షతన ఆర్కేపేట తహసీల్దార్ కార్యాలయంలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఇందులో రెండు గ్రామాలకు చెందిన కమిటీ సభ్యులు పాల్గొన్నారు. చివరగా రెండు గ్రామాలకు చెందిన వారిని వేడుకల కమిటీలో సభ్యులుగా నియమించి, వేడుకలు జరుపుకోవాలని తీర్మానించి, ఒడంబడికలో తీర్మానం చేశారు. తహసీల్దార్ విజయకుమార్, సీఐ మలర్, ఎస్‌ఐ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీఓ దీప ఆధ్వర్యంలో పీస్ కమిటీ సమావేశం

ఏటీఎంలో రూ.37 లక్షల నగదు చోరీ

- సెక్యూరిటీ గార్డు అరెస్టు

తిరువొత్తియూరు: చెన్నై ఊరపాక్కంలోని ఒక ఏటీఎం కేంద్రంలో నగదు నింపడానికి వచ్చిన సమయంలో రూ. 37 లక్షల నగదును తీసుకుని పారిపోయిన సెక్యూరిటీ గార్డును పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. వేలచేరిలో ఉన్న ప్రైవేటు సంస్థ చెంగల్పట్టు జిల్లాలో ఉన్న పలు ఏటీఎం యంత్రాల్లో నగదు నింపుతోంది. ఈ క్రమంలో ఆ సంస్థ ఉద్యోగులు ఊరపాక్కంలో ఉన్న ప్రైవేటు బ్యాంకు ఏటీఎం కేంద్రంలో నగదును నింపడానికి వెళ్లారు. ఆ సమయంలో అక్కడ సెక్యూరిటీ గార్డుగా ఉన్న కొట్టివాక్కం ప్రాంతానికి చెందిన గుణశేఖరన్ (45) ఏటీఎంలో నింపడానికి తీసుకు వచ్చిన రూ. 37 లక్షలను చోరీ చేసి అక్కడి నుంచి పారిపోయాడు. దీంతో నగదు నింపడానికి వచ్చిన ఉద్యోగులు దిగ్భ్రాంతి చెంది గూడువాంజేరీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ మురుగేషన్ నేతృత్వంలో ప్రత్యేక బృందం పోలీసులు రూ. 37 లక్షలతో పారిపోయిన సెక్యూరిటీ గుణశేఖరన్ కోసం తీవ్రంగా విచారణ జరిపారు. ఆ సమయంలో అతను తిరువాన్మియూర్ ప్రాంతంలో దాగి ఉన్నట్లు తెలిసింది. మంగళవారం ఉదయం ప్రత్యేక బృందం పోలీసులు గుణశేఖర్‌ను అరెస్టు చేశారు. అతడిని పోలీసులు విచారణ జరుపుతున్నారు.

• క్యాన్సర్ రోగుల సహాయార్థం..



నిరుపేద క్యాన్సర్ రోగులను ఆదుకునేందుకు తేన్‌మొళి మెమోరియల్ ట్రస్ట్ నేతృత్వంలో మంగళవారం చెన్నైలో సాంస్కృతిక వేడుక నిర్వహించారు. సినీ నటీ నటులు సంతోష్ ప్రతాప్, సునీతా గొగోయ్, స్టాండ్ అప్ కామెడియన్ జగన్ కృష్ణన్, ఇతర మిమిక్రీ కళాకారులు, నృత్యకారులు తమ ప్రదర్శనలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా క్యాన్సర్ రోగులకు అండగా తామున్నామని చాటేలా నిర్వాహకులు, నటీ నటులు ఒకే వేదిక నుంచి భరోసాను ఇచ్చారు. - సాక్షి, చెన్నై

పూనిమాంగాడు పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత



పాఠశాల స్థాయిలో తొలి మూడు స్థానాలు సాధించిన విద్యార్థినులను సత్కరిస్తున్న హెచ్ ఎం మురుగన్

తిరుత్తణి: ప్లస్ 1 పబ్లిక్ పరీక్ష ఫలితాల్లో పూనిమాంగాడు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మార్చి నెలలో నిర్వహించిన ప్లస్1 పబ్లిక్ పరీక్షల ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. తిరుత్తణి సబ్ డివిజన్‌లోని పూనిమాంగాడు ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. గ్రామీణ ప్రాంతంలోని పాఠశాలలో విద్యార్థుల వంద శాతం ఉత్తీర్ణతకు కృషి చేసిన పాఠశాల హెచ్‌ఎం మురుగన్‌తోపాటు ఉపాధ్యాయులను గ్రామీణులు కొనియాడారు. కాగా తిరుత్తణి సబ్ డివిజన్‌లోని 20 ప్రభుత్వ మహోన్నత పాఠశాలల్లో గతంతో పోల్చితే ఈ ఏడాది ఫలితాలు నిరాశ మిగిల్చాయి. విద్యార్థుల ఉత్తీర్ణత శాతం తగ్గడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. తిరుత్తణి ప్రభుత్వ బాలికల మహోన్నత పాఠశాలలో 72 శాతం ఉత్తీర్ణత సాధించగా, డాక్టర్ రాధాకృష్ణన్ బాలుర మహోన్నత పాఠశాలలో 42 శాతం ఉత్తీర్ణత మాత్రమే నమోదైంది.

సాయుధ దళ మహిళా పోలీసు మృతి

తిరువొత్తియూరు: సాయుధ దళంలో పనిచేస్తున్న ఓ మహిళా పోలీసు కానిస్టేబుల్ అనారోగ్యంతో మృతి చెందారు. వివరాల్లోకి వెళితే.. తిరువారూరు జిల్లా మావూరు పిన్నవాసల్ ప్రాంతానికి చెందిన కమలి (23) ఆవడిలోని సాయుధ దళంలో పని చేస్తూ అక్కడే ఉన్న పోలీసు క్వార్టర్స్‌లో ఉంటున్నారు. కమలి ఇటీవల ఆరోగ్యం పాలయ్యారు. దీంతో కీల్పాక్కం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ వచ్చారు. ఈమెకు కిడ్నీ ఇన్‌ఫెక్షన్ రక్తంలో కలిసినట్టు, తద్వారా ఇతర అవయవాలు పాడైనట్టు వైద్యులు వెల్లడించారు. దీంతో కమలి చెన్నైలోని ఆళ్వార్‌పేటలోని కావేరీ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వచ్చారు. చికిత్స ఫలించక కమలి సోమవారం మృతి చెందారు.

కొడుకును హ్యతమార్చిన తండ్రి

- తండ్రి సహా ముగ్గురి అరెస్టు
- హోసూరులో ఉత్కంఠ

కొరుక్కుపేట: కేబుల్ వైర్‌తో కుమారుడి మెడ బిగించి, హత్య చేసి.. ఆత్మహత్యగా చిత్రీకరించిన తండ్రిసహా ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. హోసూరు తాలూకా కృష్ణగిరి జిల్లాకు చెందిన ప్రేమ్‌నాథ్‌రెడ్డి (58) మావిటీ. అతడి కుమారుడు జైదీప్ (24)కు మద్యపానం అలవాటు ఉండేది. రెండ్రోజుల క్రితం జయదీప్ మధ్యాహ్నం ఇంట్లో శవమై కనిపించాడు. ఆత్మహత్య చేసుకున్నాడని అతని తండ్రి ప్రేమనాథ్ రెడ్డి ఇరుగుపొరుగు వారికి సమాచారం అందించాడు. గ్రామ పరిపాలన అధికారి విజయకుమార్ మద్దిగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు జయదీప్ మృతదేహాన్ని కృష్ణగిరి ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రికి తరలించారు. యువకుడి ఆత్మహత్యగా పోలీసులు ప్రాథమికంగా కేసు నమోదు చేశారు. ఈ కేసులో జయదీప్ ఆత్మహత్య చేసుకోలేదని, కేబుల్ వైర్‌ను మెడకు బిగించి హత్య చేసినట్లు పోస్టుమార్టంలో తేలింది. దీంతో పోలీసులు ప్రేమ్‌నాథరెడ్డిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. తన కుమారుడు జయదీప్‌ను చిన్న కుమారుడు యస్వంత్, బంధువు మంజునాథ్‌తో కలసి హత్య చేసినట్లు ప్రేమ్‌నాథ్‌రెడ్డి అంగీకరించాడు. దీంతో వారిని పోలీసులు అరెస్టు చేసి ధర్మపురి జైలుకు తరలించారు.

మసాజ్ సెంటర్‌లో వ్యభిచారం

- నిర్వాహకుడి అరెస్టు

తిరువొత్తియూరు: చెన్నై పోరూరు సమీపంలో వ్యభిచారం నిర్వహిస్తున్న మసాజ్ సెంటర్ నిర్వాహకులను పోలీసులు అరెస్టు చేశారు. అక్కడ ఉన్న ముగ్గురు యువతులను పోలీసులు రక్షించారు. వివరాలు.. పోరూరు సమీపంలోని కారాపాక్కం ఆర్కాడు రోడ్డులో ఉన్న మసాజ్ సెంటర్లో వ్యభిచారం జరుగుతున్నట్లు వలసరవాక్కం పోలీసులకు సమాచారం అందింది. దీంతో సబ్ ఇన్‌స్పెక్టర్ భాస్కరన్ నేతృత్వంలో అక్కడికి వెళ్లి తనిఖీ చేయగా అక్కడ యువతులతో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు తెలుస్తుంది. దీంతో మసాజ్ సెంటర్ మేనేజర్ అయిన పోరూరు ప్రాంతానికి చెందిన అరసును పోలీసులు అరెస్టు చేశారు. అలాగే ముగ్గురు యువతులను విడిపించి వారిని మైలాపూర్‌లో ఉన్న ప్రభుత్వ శరణాలయానికి తరలించారు.

21 నుంచి కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు

నారాయణవనం: నారాయణవనంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 21 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలిరోజు 21న ధ్వజారోహణం, పెద్దశేష వాహనం, 22 చిన్నశేష, హంస వాహన సేవలు, 23న సింహ, ముత్యపు పందిరి వాహన సేవలు, 24న కల్పవృక్ష, సర్వభూపాల వాహన సేవలు, 25న పల్లకీ సేవ, గరుడ వాహనసేవ, 26న హను మంత వాహనం, వసంతోత్సవం, గజ వాహన సేవ జరుగుతుంది. 27న సూర్య, చంద్రప్రభ వాహన సేవలు, 28న ఉదయం రథోత్సవం, సాయంత్రం ఆర్జిత కల్యాణోత్సవం, రాత్రి అశ్వ వాహన సేవ, 29న ఉదయం పద్మ సరస్సులో చక్రస్నానం, రాత్రి చేపట్టే ధ్వజావరోహణంతో స్వామివారి బ్రహ్మోత్సవాలు ముగియనున్నాయి.

విద్యార్థులను జాగ్రత్తగా తీసుకెళ్లాలి



పాఠశాల బస్సులను తనిఖీ చేస్తున్న కలెక్టర్ వలర్‌మది

వేలూరు: పాఠశాల బస్సుల్లో విద్యార్థులను అతి జాగ్రత్తగా తీసుకెళ్లాలని కలెక్టర్ వలర్‌మది ప్రైవేటు పాఠశాల యాజమాన్యాలను ఆదేశించారు. రాణిపేటలోని ప్రభుత్వ పాఠశాల మైదానంలో రాణిపేట జిల్లాలోని ప్రైవేటు పాఠశాల బస్సుల కండిషన్‌ను మంగళవారం ఉదయం కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బస్సుల్లో విద్యార్థులను తరలించే సమయంలో అతి జాగ్రత్తగా తీసుకెళ్లాలని, అందుకు బస్సులను కండిషన్‌గా ఉంచుకోవాలన్నారు. అలాగే పాఠశాల బస్సులను నడిపేందుకు సీనియర్ డ్రైవర్లను నియమించుకుని, ప్రతి బస్సుకు క్లీనర్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మద్యం సేవించి బస్సులను నడిపే డ్రైవర్ల లైసెన్స్‌లను రద్దు చేసేందుకు సిఫారసు చేస్తామని హెచ్చరించారు. అనంతరం పాఠశాల బస్సుల కండిషన్, బస్సుల టైర్లు, అద్దాలు, తలుపులు, సీట్లు, డ్రైవర్ లైసెన్స్, బస్సులో ప్రథమ చికిత్స బాక్సు, స్పీడు కండిషన్ తదితర అంశాలను పరిశీలించారు. ప్రతి బస్సుకు అత్యవసర దారిని ఏర్పాటు చేయాలన్నారు. అలాగే మంటలను అదుపు చేసే సామగ్రిని బస్సులో తప్పక ఉంచాలన్నారు. విద్యార్థులను తీసుకెళ్లే సమయంలో బస్సులను అతి వేగంగా నడపకూడదని డ్రైవర్లకు తెలిపారు. రాణిపేట డివిజన్ పరిధిలో ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలకు చెందిన 495 బస్సులను తనిఖీ చేశారు. ఇదే తరహాలో అరక్కోణం తదితర ప్రాంతాల్లో ఆయా డివిజన్ పరిధిలోని పాఠశాల బస్సులను తనిఖీ చేసి సర్టిఫికెట్ ఉంటేనే బస్సులను నడపాలన్నారు. ఆమెతో పాటు డీఆర్వో మనోరమణి, ఆర్డీఓ రామలింగం పాల్గొన్నారు.

బావిలో మునిగి ముగ్గురు విద్యార్థుల మృతి



విద్యార్థులు(ఫైల్)

అన్నానగర్: కరూర్ సమీపంలో మంగళవారం బావిలో మునిగి ముగ్గురు చిన్నారులు మృతి చెందడం విషాదాన్ని నింపింది. వివరాల్లోకి వెళితే.. కరూర్ అండాంకోవిల్ పుదూరు ప్రాంతానికి చెందిన రమేష్ కుమారుడు అశ్విన్ (12), ఇళంగో కుమారుడు మారి ముత్తు (13) ఇద్దరూ అదే ప్రాంతంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నారు. అదే ప్రాంతానికి చెందిన శ్రీధర్ కుమారుడు శ్రీవిష్ణు(14) ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. వీరు ముగ్గురూ స్నేహితులు. ప్రస్తుతం పాఠశాలకు సెలవులు కావడంతో ముగ్గురు కలిసి ఆడుకుంటున్నారు. ఈ స్థితిలో ఎండ ఎక్కువగా ఉండడంతో మంగళవారం కరూర్–కోయంబత్తూరు రోడ్డులోని అండాంకోవిల్ సమీపంలోని వ్యవసాయ బావి వద్ద స్నానానికి వెళ్లారు. ఈ క్రమంలో ముగ్గురు విద్యార్థులు ఎంతసేపటికీ ఇంటికి రాలేదు. భయాందోళనకు గురైన వారి తల్లిదండ్రులు బంధువులు, స్నేహితుల ఇళ్లతోపాటు పలు ప్రాంతాల్లో వెతికారు. ఎక్కడా కనిపించక పోవడంతో కరూర్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ముగ్గురు విద్యార్థులు స్నానానికి వెళ్లారని తేలడంతో ఆ ప్రాంతంలోని వ్యవసాయ బావుల్లో వెతికారు. అక్కడ ఓ బావి దగ్గర విద్యార్థుల చెప్పులు, దుస్తులు పడి ఉన్నట్టు గుర్తించారు. అనంతరం కరూర్ అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి బావిలో దిగి వెతికారు. అనంతరం ఆ బావి నుంచి 3 మృతదేహాలను వెలికి తీశారు. ఇది చూసి తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ ఘటన కరూర్ ప్రాంతంలో తీవ్ర విషాదాన్ని నింపింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ యజమానిపై దాడి

- ఇద్దరు రౌడీల అరెస్టు

తిరువొత్తియూరు: ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో జరిగిన గొడవలో ఆ హోటల్ యజమానిపై కత్తితో దాడి చేశారు. ఈ ఘటనకు సంబంధించి ఇద్దరు రౌడీలను పోలీసులు అరెస్టు చేశారు. మరో నలుగురి కోసం పోలీసులు గాలిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. పాత చాకలిపేట రామానుజన్ వీధిలో బషీర్ అహమ్మద్ (42) అనే వ్యక్తి ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ నడుపుతున్నాడు. ఈ హోటల్ వద్దకు వచ్చిన ఆరుగురు ముఠా ఉచితంగా చికెన్ బిర్యానీ పెట్టమని అడిగారు. అందుకు హోటల్ యజమాని బషీర్ అహమ్మద్ తిరస్కరించారు. దీంతో ఆ ముఠా బషీర్ అహమ్మద్‌పై కత్తితో దాడి చేసి పారిపోయారు. ఈ విషయమై ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు చాకలిపేట పోలీసులు కేసు నమోదు చేసి, అక్కడున్న సీసీ కెమెరా పుటేజీల ఆధారంగా నిందితుల కోసం గాలించారు. ఈ క్రమంలో మంగళవారం రాయపురం గ్రేస్ గార్డెన్ ప్రాంతానికి చెందిన ఆనంద్ అలియాస్ కుళ్ల ఆనంద్ (19), అదే ప్రాంతాన్ని చెందిన తారణి (21)ని పోలీసులు అరెస్టు చేశారు. విచారణలో కుళ్ల ఆనంద్, రౌడీలు అని తెలియ వచ్చింది. దీంతో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. మరో నలుగురి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

గుట్కా తరలింపు కేసులో వ్యక్తి అరెస్టు

తిరుత్తణి: పట్టణంలో నిషేధిత గుట్కా, పొగాకు ఉత్పత్తులు తరలిస్తున్న వ్యక్తిని మంగళవారం పోలీసులు అరెస్టు చేసి, 22 కిలోల నిషేధిత గుట్కా, పొగాకు ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. తిరుత్తణి సమీపంలోని పొన్పాడి చెక్‌పోస్టు వద్ద తిరుత్తణి పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ నుంచి తిరుత్తణి వైపు గోనె సంచె తలపై ఉంచుకుని వెళుతున్న వ్యక్తి పోలీసులు చూసి అక్కడ నుంచి పరారు కావడాన్ని గుర్తించిన పోలీసులు ఆ వ్యక్తిని అదుపులో తీసుకుని గోనె సంచి తెరిచి చూడగా అందులో నిషేధిత గుట్కా, పొగాకు ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించి, వాటిని స్వాధీనం చేసుకుని, ఆ వ్యక్తిని తిరుత్తణి పోలీసులకు అప్పగించారు. ఎస్‌ఐ రాఖీకుమారి కేసు నమోదు చేసి, విచారణ చేపట్టారు. నిందితుడు కాంచీపురం కొళపాక్కం ప్రాంతానికి చెందిన అజ్మల్‌ఖాన్(42) అని గుర్తించారు. అతడు కాంచీపురంలో దుకాణాల్లో విక్రయించేందుకు నిషేధిత గుట్కా, పొగాకు ఉత్పత్తులు తరలిస్తున్నట్లు తెలిసింది. దీంతో అతడిని అరెస్టు చేసి, రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచి సబ్ జైలుకు తరలించారు.



పోలీసుల అదుపులో అజ్మల్‌ఖాన్

పోలీసులను కించ పరిచిన కేసు విచారణ ముమ్మరం

- యూట్యూబర్ ఫెలిక్స్ ఇల్లు, ఆఫీసులో తిరుచ్చి పోలీసుల సోదాలు
- కీలక పత్రాలు స్వాధీనం

కొరుక్కుపేట: మహిళా పోలీసులను దూషించిన కేసులో అరెస్టయిన యూట్యూబర్ ఫెలిక్స్ ఇల్లు, కార్యాలయాల్లో మంగళవారం ఉదయం నుంచి తిరుచ్చి పోలీసులు సోదాలు చేస్తున్నారు. ఈ సోదాల్లో కేసుకు సంబంధించిన పలు కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. చెన్నైలోని నుంగంబాక్కం, కమ్దార్ నగర్ 2వ వీధికి చెందిన ఫెలిక్స్ గెరాల్డ్ స్థానిక నుంగంబాక్కంలోని పార్సన్ కాంప్లెక్స్‌లోని 6వ అంతస్తులో 'రెడ్ పిక్స్' పేరుతో సొంతంగా యూట్యూబ్ ఛానెల్ నడుపుతున్నాడు. అతను తన యూట్యూబ్ ఛానెల్‌లో కొన్ని రోజుల క్రితం యూట్యూబర్ శంకర్ ఇంటర్వ్యూలు చేశాడు. ఆ సమయంలో రాష్ట్రంలోని పోలీసులు మహిళా పోలీసుల గురించి చాలా జుగుప్సాకరంగా మాట్లాడాడు. దానిని ప్రోత్సహించడానికి ఫెలిక్స్ గెరాల్డ్ మరింతగా మాట్లాడారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ వీడియో తమిళనాడు పోలీసు శాఖలో పని చేస్తున్న మహిళా పోలీసు అధికారులను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. దీనిపై తిరుచ్చి పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ప్రకారం, రెడ్ పిక్స్ యూట్యూబ్ ఛానెల్ వ్యవస్థాపకుడు ఫెలిక్స్ గెరాల్డ్, యూట్యూబర్ శంకర్‌పై కేసు నమోదు చేశారు. ఆ తర్వాత యూట్యూబర్ శంకర్‌ను అరెస్టు చేసి తిరుచ్చి పోలీసులు 8వ తేదీన కోయంబత్తూరు సెంట్రల్ జైలులో పెట్టారు. ఈ కేసులో పరారీలో ఉన్న రెడ్ పిక్స్ ఛానల్ వ్యవస్థాపకుడు ఫెలిక్స్ గెరాల్డ్‌ను ఈనెల 11న ఢిల్లీలో అరెస్ట్ చేసిన పోలీసులు రైలులో చెన్నైకి తీసుకొచ్చి రోడ్డు మార్గంలో సోమవారం తిరుచ్చి కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసులో భాగంగా తిరుచ్చి పోలీసులు చెన్నైలోని నుంగంబాక్కంలోని యూట్యూబ్ ఛానల్ వ్యవస్థాపకుడు ఫెలిక్స్ జెరాల్డ్ ఇల్లు కార్యాలయంలో మంగళవారం ఉదయం నుంచి దాడులు నిర్వహిస్తున్నారు. ఈ సోదాల్లో పెన్ డ్రైవ్‌తో పాటు పలు ముఖ్యమైన డాక్యుమెంట్లు, డిజిటల్ డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. విచారణ కొనసాగుతున్నందున పత్రాల వివరాలను వెల్లడించడానికి పోలీసులు నిరాకరించారు.



ఫెలిక్స్‌ను ప్రశ్నిస్తున్న పోలీసులు

దాడులు.. లూటీలు.. విధ్వంసం

టీడీపీ నేతల మూక దాడులతో అట్టుడికిన పల్నాడు జిల్లా

సాక్షి, నరసరావుపేట/వినుకొండ(నూజెండ్ల)/కారెంపూడి/పెదకూరపాడు/మాచవరం : పల్నాడులో తెలుగుదేశం పార్టీ ఓటమి భయంతో చేస్తున్న అరాచకపర్వం రెండో రోజూ కొనసాగింది. సోమవారం పోలింగ్ రోజు వైఎస్సార్‌సీపీకి ప్రజలు భారీ స్థాయిలో ఓటు వేస్తున్నారని తెలుసుకొని మధ్యాహ్నం నుంచే దాడులు ప్రారంభించారు. మంగళవారం కూడా జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఈ దాడులు కొనసాగాయి. ఓవైపు వైఎస్సార్‌సీపీ నేతలపై విచక్షణారహితంగా దాడులు జరుగుతున్నా పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదు. తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా జిల్లా ఎస్పీ వ్యవహరిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు వాపోతున్నారు. ఇన్ని దాడులు జరుగుతున్నా కేంద్ర బలగాలు ఏవని ప్రశ్నిస్తున్నారు. మాచర్ల నియోజకవర్గం కారంపూడి మండలంలోని పేటసన్నెగండ్ల గ్రామ శివారు బాలచంద్రనగర్ (పోతురాజుగుట్ట)లో నివాసం ఉంటున్న బేడ బుడగ జంగాలు తమకు ఓటు వేయలేదని ఆగ్రహించిన టీడీపీ గూండాలు సుమారు 70 మంది సోమవారం రాత్రి వారి ఇళ్లపై కర్రలు, రాళ్లతో దాడి చేసి విచక్షణా రహితంగా కొట్టారు. మహిళలు, పిల్లలని కూడా చూడకుండా చావ బాదారు. ఇళ్లలోని సామాన్లు, ఫ్యాన్లు, బల్బులను పగులగొట్టారు. చిల్లర కొట్టునూ లూటీ చేశారు. సామాన్లు, నగదును దోచుకెళ్లారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు పెల్లూరి కోటయ్యకు చెందిన స్కార్పియో వాహనాన్ని ధ్వంసం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు పెల్లూరి బిక్షంకు చెందిన బైక్‌ను, మక్కెన శేషుకు చెందిన బైక్‌ను మరో ఇద్దరి ద్విచక్ర వాహనాలను ధ్వంసం చేశారు. గొర్ల సైదులు చేయి, కాలిపై కర్రలతో బాదారు. కత్తెర లక్ష్మి చేయి విరగ్గొట్టారు. రాళ్ల దాడితో అందరూ ప్రాణభయంతో ఇంటి నుంచి పారిపోయి వేరే చోట తల దాచుకున్నారు. ఏరా.. టీడీపీకి ఓటు వేయమంటే వేయకుండా వైఎస్సార్‌సీపీకి ఓటు వేస్తారా.. నా కొడకల్లారా.. అంటూ తీవ్రంగా దూషిస్తూ అరాచకపర్వాన్ని కొనసాగించారని బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. జూన్ 4 తర్వాత తాము అధికారంలోకి వస్తామని, అప్పుడు అంతు చూస్తామని బెదిరించారన్నారు. 'ఇళ్ల మీద పడి కనపడిన వారిని కనపడినట్లు కర్రలతో కొట్టారు. ఇళ్లలోకి జొరబడి సామాన్లన్నీ చిందవందర చేశారు. నా చేయి, కాలుపై కర్రలతో కొట్టారు. ముసలోళ్లమని కూడా చూడలేదు. భయమేసింది. పిల్లలు పరారయ్యారు. ఎటూ పోలేని మమ్మల్ని చితకబాదారు. బూతులు తిట్టారు' అంటూ గొర్ల సైదులు కన్నీటి పర్యంతమయ్యారు. 'నా చేయి విరగ్గొట్టారు. నేను పని చేస్తేనే పిల్లలను పోషించుకునేది. ఇప్పుడు ఎలా పని చేయాలి? ఇన్నాళ్లూ మా బాగోగులు పట్టించుకున్నారా.. కష్టాల్లో ఉంటే ఆదుకున్నారా.. అలాంటి వారు మాపై దౌర్జన్యం ఏమిటి? మా లాంటి బీదోళ్లపై పడి కొట్టడం ఏమిటి? ఓటు వేయలేదని కొడతారా?' అంటూ కత్తెర లక్ష్మి వాపోయింది.

ముప్పాళ్లలో మైనార్టీలపై దాడులు

▲ సత్తెనపల్లి నియోజకవర్గం ముప్పాళ్ల మండలం మాదల గ్రామంలో సోమవారం సాయంత్రం పోలింగ్ ముగిసినప్పటి నుంచి తెల్లవారుజాము 3 గంటల వరకు వైఎస్సార్‌సీపీ నేతలపై టీడీపీ కార్యకర్తల రాళ్ల దాడి కొనసాగింది. తిరిగి మంగళవారం ఉదయం తొండపి గ్రామంలోని వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులైన ముస్లింల ఇళ్లలోకి టీడీపీ సానుభూతి పరులు ఆడ, మగ బేధం లేకుండా మూకుమ్మడిగా చొరబడ్డారు.

▲ మహిళలను, చిన్నారులను భయభ్రాంతులకు గురిచేస్తూ విలువైన సామగ్రిని ధ్వంసం చేశారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ఇంట్లోని సామగ్రి పగలకొట్టారు. రెండు ద్విచక్ర వాహనాలకు నిప్పు పెట్టారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన మహిళలను భయభ్రాంతులకు గురి చేశారు. దాడికి పాల్పడుతున్న తరుణంలో ముస్లిం కుటుంబాల్లోని మగ వారంతా ప్రాణాలు కాపాడుకునేందుకు పొలాల్లోకి పరుగులు తీశారు. మహిళలు, చిన్నారులు తలుపులు వేసుకొని ప్రాణాలు అరిచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ ఇళ్లలోనే ఉండిపోయారు.

▲ ఎన్నికల ప్రక్రియ పూర్తయినప్పటి నుంచి మండలంలోని తొండపి, మాదల గ్రామాలు భయం గుప్పిట్లోనే ఉన్నాయి. రెండు గ్రామాల్లోనూ ముస్లిం వర్గీయులే వైఎస్సార్‌సీపీ మద్దతు దారులుగా ఉండగా, టీడీపీకి మాత్రం బలమైన సామాజిక వర్గానికి చెందిన వారు. ముస్లిం వర్గీయులంతా గత ఎన్నికల్లో, ఈ ఎన్నికల్లోను వైఎస్సార్‌సీపీ కి అండగా ఉంటున్నారు. దీంతో ఆయా గ్రామాల్లో వైఎస్సార్‌సీపీకి మెజార్టీ లభిస్తుండటాన్ని జీర్ణించుకోలేక భౌతిక దాడులకు దిగుతున్నారు.

కేసానుపల్లిలో వైఎస్సార్‌సీపీ నేతల ఇళ్లపై దాడి

▲ గురజాల నియోజకవర్గం దాచేపల్లి మండలంలోని కేసానుపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకులు బొల్లా శ్రీనివాసరావు, చుండు రామారావు ఇళ్లపై సోమవారం రాత్రి 11 గంటల సమయంలో టీడీపీ నాయకులు రాళ్లు విసిరారు. దీంతో కిటికీల అద్దాలు పగిలిపోయాయి. ఇళ్లలోని ఫర్నిచర్ ధ్వంసం చేశారు.


సత్తెనపల్లి నియోజకవర్గం ముప్పాళ్ల మండలం మాదలలో టీడీపీ మూకలు విసిరిన రాళ్లు

▲ వైఎస్సార్‌సీపీ నేత చుండు రామారావు తండ్రి వెంకటేశ్వర్లు, తల్లి లచ్చమ్మతో పాటు మరో ఇద్దరిపై టీడీపీ నేతలు దాడి చేసి గాయపరిచారు. చుట్టుపక్కల జనం భయంతో పరుగులు తీశారు. టీడీపీ నేతల దాడిపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని తంగెడ, ఇరికేపల్లి, దాచేపల్లి గ్రామాల్లో టీడీపీ, జనసేన నాయకులు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారు.

ఎస్సీలపై దాష్టీకం

▲ చిలకలూరిపేట మండలం కావూరు ఎస్సీ కాలనీలో పోలింగ్ సందర్భంగా సోమవారం రాత్రి వైఎస్సార్‌సీపీ వర్గీయులపై టీడీపీ నాయకులు దౌర్జన్యానికి దిగారు. పోలింగ్ బూత్ 211లో ఉదయం 7.30 గంటలకు ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో సాయంత్రం పోలింగ్ ముగిసే సమయానికి ఓట్లు కొన్ని పోల్ కావాల్సినవి మిగిలి ఉన్నాయి. దీనికోసం సమయం పెంచాల్సిందిగా వైఎస్సార్‌సీపీ తరఫున బూత్ ఏజెంటుగా ఉన్న నలమాల కాంతయ్య అధికారులకు విజ్ఞప్తి చేశాడు. ఇది నచ్చని టీడీపీలో ఆధిపత్య సామాజిక వర్గానికి చెందిన కొందరు ఘర్షణకు దిగారు. కులం పేరుతో దూషిస్తూ కాంతయ్యపై దాడి చేశారు. దీంతో ఇతను తల పగిలి పడిపోయాడు.

▲ దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన కట్టిం ఆనందరావు, మరి కొందరికి కూడా గాయాలయ్యాయి. కాంతయ్య, ఆనందరావులను చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రి నుంచి మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ఈ ఘర్షణ నేపథ్యంలో కావూరులోని మంచినీటి ప్లాంట్ నుంచి ఎస్సీ వర్గీయులు మంగళవారం మంచి నీరు తీసుకువెళ్లకుండా కట్టడి చేసి వారి దాష్టీకాన్ని చాటుకున్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు గ్రామానికి వెళ్లి బాధితులకు అండగా నిలిచారు.


టీడీపీ కార్యకర్తల దాడిలో తీవ్రంగా గాయపడిన కృష్ణవేణి

కంభంపాడులో పచ్చ మూకల విధ్వంస కాండ

▲ పెదకూరపాడు నియోజకవర్గంలోని కంభంపాడులో వైఎస్సార్‌సీపీకి పట్టున్న ఎస్సీ, బీసీ కాలనీలపై కత్తులు, కర్రలతో టీడీపీ కార్యకర్తలు దాడులకు పాల్పడ్డారు. సోమవారం పోలింగ్ కేంద్రాల వద్ద వీరంగం వేశారు. మహిళలు అని కూడా చూడకుండా దాడులకు పాల్పడ్డారు. వైఎస్సార్‌సీపీ సర్పంచ్ ఆర్తిమళ్ల నాగేశ్వరరావు (నాగయ్య) సతీమణి, వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ ఆర్తిమళ్ల ఆంజమ్మ లక్ష్యంగా సోమవారం అర్ధరాత్రి టీడీపీ నేతలు, కార్యకర్తలు ఒక్కసారిగా దాడులకు పాల్పడ్డారు.

▲ పోలింగ్ ముగిసిన తర్వాత ఒక్కసారిగా పదుల సంఖ్యలో వచ్చిన పచ్చమూకలు.. నాగేశ్వరరావు, అతని కుమారులు రాజశేఖర్, ప్రవీణ్, ఆర్తిమళ్ల తిరుపతిరావు, ఎస్సీ కాలనీకి చెందిన సురేష్, బీసీ కాలనీకి చెందిన బ్రహ్మం, పల్లపాటి కృష్ణవేణిలపై దాడులకు పాల్పడ్డారు. పలువురి తల, కాళ్లు, చేతులు, ఛాతీపై రక్త గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని స్థానికులు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. టీడీపీ గూండాలు పలు మార్లు ఎస్సీ, బీసీ కాలనీల్లో తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు.


టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన ప్రవీణ్, తిరుపతిరావు


గాయపడిన వారిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

కారెంపూడిలో వైఎస్సార్‌సీపీ కార్యాలయంపై దాడి

▲ కారెంపూడిలో టీడీపీ గూండాలు మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు బీభత్సం సృష్టించారు. సుమారు 500 మంది రౌడీలు స్థానిక టీడీపీ నేతల నాయకత్వంలో బస్టాండ్ సెంటర్‌కు చేరుకుని వైఎస్సార్‌సీపీ నాయకుడు షేక్ కరీంకు చెందిన వాచ్ షాపును ధ్వంసం చేశారు. కర్రలు, రాడ్‌లతో భయానక వాతావరణం సృష్టిస్తూ గ్రామం మొత్తాన్ని భయాందోళనలకు గురి చేశారు.

▲ కారెంపూడి ఎంపీపీ బొమ్మిన సావిత్రికి చెందిన పాల కేంద్రాన్ని ధ్వంసం చేసి తగల బెట్టారు. తర్వాత మాచర్ల రోడ్డులో ఉన్న పోలిరెడ్డికి చెందిన టీస్టాల్‌పై దాడి చేసి ధ్వంసం చేశారు. అరుపులు, కేకలతో లూథరన్ చర్చి వద్ద ఎస్సీ కాలనీలో బీభత్సం సష్టించారు. తర్వాత వైఎస్సార్‌సీపీ కార్యాలయంలోని ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అక్బర్ నివాసంపై దాడి చేశారు.

▲ స్టేట్ బ్యాంక్ సెంటర్‌లో ఉన్న ఎంపీటీసీ సభ్యురాలు వేముల పద్మావతి భర్త నిర్వహిస్తున్న ఆటో కన్సల్టెన్సీపై దాడి చేశారు. అక్కడ ఉన్న 40 బైక్‌లకు నిప్పు పెట్టారు. బైక్‌లకు ఉన్న బ్యాటరీలు పేలడంతో దానికి ఆనుకుని ఉన్న నివాస ప్రాంత ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఇందిరా గాంధీ బొమ్మ సెంటర్‌లో ఉన్న అపార్ట్‌మెంట్‌లో నిలిపి ఉంచిన వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల అధ్యక్షుడు చిలుకూరి చంద్రశేఖరరెడ్డి కారును ధ్వంసం చేశారు.

▲ టీడీపీ రౌడీ గ్యాంగ్ మరొకటి.. ఆర్య వైశ్య వీధి ముస్లిం ఏరియాలో ప్రజలను భయాందోళనకు గురి చేసింది. తర్వాత గ్రామ శివారులో ఉన్న ఆదినారాయణ కాలనీలో వైఎస్సార్‌సీపీ జిల్లా పార్టీ కార్యదర్శి కొమ్ము చంద్రశేఖర్ నివాసానికి నిప్పు పెట్టారు. ఇదిలా ఉండగా, మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తుల రాళ్ల దాడిలో కారెంపూడి సీఐ నారాయణస్వామి తలకు బలమైన గాయం అయింది. జెడ్పీ హైస్కూల్ వద్ద పార్క్ చేసి ఉన్న టీడీపీ నాయకుని స్కార్పియోను దుండగులు ధ్వంసం చేశారు.


టీడీపీ దాడిలో ధ్వంసమైన కారు, గాయపడిన కె.లక్ష్మి

▲ మాచర్ల నియోజకవర్గం రెంటచింతల మండల పరిధిలోని గోలి గ్రామంలో సోమవారం రాత్రి టీడీపీ వర్గీయులు దాడి చేయగా, వైఎస్సార్‌సీపీ వర్గీయులు ప్రతిఘటించారు. ఓ దశలో ఇరువర్గాలు రాళ్లు విసురుకోవడంతో పలువురికి గాయాలయ్యాయి. ఈ దాడులలో వైఎస్సార్‌సీపీకి చెందిన మూఢావత్ మల్లయ్యనాయక్, మూఢావత్ కొండానాయక్, ఆర్.నాగేశ్వరరావునాయక్ , మూఢావత్ నాగేశ్వరరావు నాయక్ గాయపడ్డారు. క్షతగాత్రులు గురజాల, పిడుగురాళ్ల ఆస్పత్రులలో చికిత్స పొందుతున్నారు.


టీడీపీ మూకల దాడిలో గాయపడిన అమ్మిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కాజా ఆదిశేషమ్మ


మల్లంపాటి చెంచిరెడ్డి

నూజెండ్లలో టీడీపీ మూకల దాడులు


అమ్మిరెడ్డి సంజీవరెడ్డి, జక్కిరెడ్డి గోవిందరెడ్డి

▲ వినుకొండ నియోజకవర్గం నూజెండ్లలో టీడీపీ నాయకులు రెచ్చిపోయారు. మంగళవారం పక్కా ప్రణాళిక ప్రకారం ప్రధాన సెంటరులోకి వస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులపై రాళ్లు, కర్రలతో విచక్షణా రహితంగా దాడులకు తెగబడ్డారు. ఈ దాడిలో 15 మందికి పైగా తీవ్ర గాయాలపాలయ్యారు. మహిళలను వెంటాడి దాడి చేశారు. గ్రామంలో అందరూ కలసి కట్టుగా ఎన్నికల్లో పాల్గొన్నారనే అక్కసుతో టీడీపీ నాయకులు దాడులు చేశారు. ఈ దాడుల్లో కాజా ఆదిశేషమ్మ, అమ్మిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జక్కిరెడ్డి గోవిందరెడ్డి, అమ్మిరెడ్డి సంజీవరెడ్డి, భవనం సంజీవరెడ్డి, మల్లంపాటి చెంచిరెడ్డి, నక్కా ఆదిలక్ష్మి, కాజా జయమ్మ, వంగూరి ప్రసాద్ సహా 15 మందికి పైగా గాయపడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నప్పటికీ, గొడవను అదుపు చేయలేక పోవటం పలు విమర్శలకు తావిచ్చింది. క్షతగాత్రులను వినుకొండ ఆస్పత్రిలో స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పరామర్శించారు.

▲ బొల్లాపల్లి మండలం పేరూరుపాడులో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల ఇళ్లపై టీడీపీ మూక దాడులకు పాల్పడింది. ఈ దాడిలో నలుగురు తీవ్రంగా గాయపడగా, మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వీరిని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పరామర్శించారు. పోలింగ్ జరుగుతున్న సమయంలో ఏర్పడిన స్వల్ప వివాదంతో కావాలనే టీడీపీ నాయకులు రాళ్లు, కర్రలతో దాడులకు దిగారు.

కొత్త గణేశునిపాడులో బీభత్సకాండ

వైఎస్సార్‌సీపీకి ఓటేశారన్న కారణంతో అమాయకులపై దాడులు

- యరపతినేని రౌడీమూకల దాడులతో ఇళ్లు వదిలి వెళ్లిపోయిన బీసీలు
- భయంతో దేవాలయాల్లో తలదాచుకున్న మహిళలు
- బాధితులను పరామర్శించిన వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్, ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి
- వారిపైనా దాడికి పాల్పడిన 'పచ్చ' సైకోలు
- అదుపు చేయలేక గాలిలోకి కాల్పులు జరిపిన పోలీసులు

సాక్షి, నరసరావుపేట: పోలింగ్ ముగిసినా పల్నాడులో టీడీపీ దౌర్జన్యకాండ కొనసాగుతూనే ఉంది. వైఎస్సార్‌సీపీకి ఓటేశారన్న అక్కసుతో జిల్లాలోని పలు గ్రామాల్లో సోమవారం సాయంత్రం నుంచి అమాయకులపై టీడీపీ రౌడీ మూకలు యథేచ్ఛగా దౌర్జన్యాలకు పాల్పడుతున్నాయి. ఇళ్లపై విచక్షణారహితంగా దాడులు చేస్తుండటంతో పురుషులు గ్రామాలు వదిలి ప్రాణాలు దక్కించుకోగా, మహిళలు, పిల్లలు దేవాలయంలో తలదాచుకుంటున్నారు. బాధితులను పరామర్శించడానికి వెళ్లిన ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులపైనా దాడులకు తెగబడుతున్నారు. చివరకు పోలీసులు గాలిలోకి కాల్పులు జరిపి నాయకులను గ్రామాలు దాటించాల్సి వచ్చింది. ఇంత జరుగుతున్నా జిల్లా ఎస్పీ బాధితులను రక్షించే చర్యలు తీసుకోకపోవడంపై ఆందోళన వ్యక్తమవుతోంది.

కొత్త గణేశునిపాలెంలో యథేచ్ఛగా దాడులు

మాచవరం మండలం కొత్త గణేషునిపాడు గ్రామంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన కుటుంబాలు వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఓట్లు వేశారన్న అక్కసుతో యరపతినేని శ్రీనివాస్ వర్గీయులు పెద్ద ఎత్తున టీడీపీ రౌడీలను, గూండాలను తీసుకువచ్చి దాడులకు దిగారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులను టార్గెట్ చేస్తూ వారి ఇళ్లపై దాడులు చేశారు. మోటారు బైకులు, జేసీబీలు, ఆటోలను, ఇళ్లలోని సామాన్లు, టీవీలు, ఇతర వస్తువులను ధ్వంసం చేశారు. ఆడవాళ్లు, పిల్లలు అనే కనికరం లేకుండా బూతులు తిడుతూ, భౌతికదాడులకు పాల్పడ్డారు. భయానక పరిస్థితుల్లో పురుషులంతా పొలాల్లోకి పరుగులు పెట్టి, అర్ధరాత్రి వరకూ బిక్కుబిక్కుమంటూ గడిపారు. మహిళలు, చిన్న పిల్లలు గంగమ్మగుడిలో తలదాచుకున్నారని తెలిసి, దేవాలయంపైకి రాళ్లు విసురుతూ భయకంపితుల్ని చేశారు.

చేతులెత్తేసిన పోలీసులు...

గ్రామంలో టీడీపీ చేస్తున్న దాడులపై పోలీసులకు ఫోన్‌ద్వారా, వీడియో సందేశాల ద్వారా బాధిత మహిళలు సమాచారం అందించినా పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయలేదు. ఫోర్సు తక్కువగా ఉందన్న నెపంతో తప్పించుకున్నారని మంగళవారం ఆ గ్రామానికి వెళ్లిన మీడియాకు వారు తెలిపారు. బాధితులను పరామర్శించేందుకు వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి మంగళవారం మధ్యాహ్నం గ్రామానికి చేరుకున్నారు. అక్కడ పరిస్థితులు చూసి వారు చలించిపోయారు. వారికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వచ్చిన విషయం తెలుసుకున్న వందలాది మంది టీడీపీ మూకలు వారిని చుట్టిముట్టి, వాహనాలపై రాళ్లు రువ్వారు. గ్రామం నుంచి బయటకు వెళ్లనీయకుండా రహదారిని దిగ్బంధించారు. ఇంత జరుగుతున్నా పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారు. మరింత రెచ్చిపోయిన టీడీపీ మూక దాడులను అడ్డుకునేందుకు చివరి ప్రయత్నంగా పోలీసులు గాలిలోకి కాల్పులు జరపాల్సి వచ్చింది.

ఇంట్లో సామాన్లు ధ్వంసం చేశారు



ఓట్లు వేసి ఇంటికి వచ్చాం. అంతా బాగుంది అనుకున్నాం. ఒక్కసారిగా టీడీపీ వాళ్లు గుంపులు, గుంపులుగా వచ్చి మా ఇళ్లపై దాడులు చేసి, ఇంటిపైనున్న రేకులు పగులగట్టారు. ఇంట్లోని టీవీ, ఫ్రిడ్జ్ కూలర్, ఫ్యాన్లు ధ్వంసం చేశారు. బూతులు తిడుతూ మగవాళ్లను బతకనీయమంటూ బెదిరించారు. మేము బెదిరిపోయి గంగమ్మ గుడిలో తలదాచుకున్నాం.

– అంబటి శ్రీలక్ష్మి, బాధిత మహిళ

వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నామనే...



గ్రామంలో టీడీపీ బలంగా ఉండేది. 2019 ఎన్నికల నుంచి జగనన్నపై నమ్మకంతో మేము వైఎస్సార్‌సీపీలో యాక్టివ్‌గా ఉంటున్నాం. ఎలాగైనా ఈ ఎన్నికల్లో జగనన్నను గెలిపించాలని బాగా పని చేశాం. దానిని తట్టుకోలేక మా ఇంటిపై దాడి చేశారు. అద్దాలు పగులగొట్టారు. ఇంటిపై రాళ్లు వేశారు. బూతులు తిట్టారు. భయంతో మా వాళ్లు రాత్రంతా పొలాల్లో తలదాచుకున్నారు. చాలా భయమేస్తోంది.

– చల్లగుండ్ల కోటేశ్వరమ్మ బాధిత మహిళ


కొత్త గణేశునిపాడులోని ఆలయం వద్ద మాట్లాడుతున్న బాధిత మహిళలు

కనీసం స్పందించని ఎస్పీ

గ్రామంలో ఇంత అరాచకం జరుగుతుంటే జిల్లా ఎస్పీ బింధుమాదవ్ మాత్రం ఎటువంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు వాపోతున్నారు. ఆయన గ్రామాన్ని సందర్శించలేదు. అవసరమైన బలగాలను పంపలేదు. వారి వైఖరి ఇప్పుడు అనుమానాలకు తావిస్తోంది. కారంపూడిలోని టీడీపీ కార్యాలయంలో ఫర్నిచర్ ధ్వంసమైందని తెలియగానే వెళ్లిన ఎస్పీ కొత్త గణేషునిపాడుకు ఎందుకు వెళ్లలేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

పల్నాడు టీడీపీ నేతలతో పోలీసుల కుమ్మక్కు

చంద్రబాబు చెప్పినట్టే నడుచుకుంటున్న ఎన్నికల కమిషన్

- సస్పెండైన పోలీసు అధికారులను చివరి నిమిషంలో నియమించారు
- వైఎస్సార్‌సీపీ అనుకూల గ్రామాలు రెండింటికి ఒక డీఎస్పీ పర్యవేక్షణ ఏమిటీ
- ఫోన్ చేస్తే కనీసం స్పందించని ఎస్పీ, డీఎస్పీలు
- ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు అనిల్, గోపిరెడ్డి


విలేకర్లతో మాట్లాడుతున్న డాక్టర్ అనిల్, డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: పల్నాడు టీడీపీ నాయకులతో పోలీసులు కుమ్మక్కయ్యారని దీనివల్లే హింస, అరాచకం, విధ్వంసం చోటుచేసుకున్నాయని వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్, నరసరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. పల్నాడు రోడ్డులోని పార్టీ పార్లమెంటు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో డాక్టర్ అనిల్ మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే వారి పాలన ఎలా ఉండబోతుందో తెలియడానికి ఈ సంఘటనలే ఉదాహరణ అని వ్యాఖ్యానించారు. ఇటువంటి దారుణాలు చేయటానికే చంద్రబాబు నాయుడు బీజేపీని కలుపుకున్నారనీ, నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన ఎన్నికల కమిషన్ వారు చెప్పినట్లే నడుచుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. మాచర్ల నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు అధికంగా ఉన్న రెండు గ్రామాలకు ఒక డీఎస్పీని బందోబస్తుకి ఉపయోగించారనీ, అసలు ఆ గ్రామాల్లో గొడవలే లేవని తెలిపారు. అదే టీడీపీ వర్గీయులు అధికంగా ఉన్న ఒక మండలానికి ఎస్ఐ స్థాయి వ్యక్తినైనా బందోబస్తుకు పంపలేదన్నారు. ఎమ్మెల్యేకు, అతని కుమారుడికి గాయాలయ్యాయని పోలీసులకు ఫోన్ చేస్తే స్పందించకపోవడం దారుణమన్నారు. తమను హౌస్ అరెస్టు చేసి టీడీపీ అభ్యర్థులు మాత్రం స్వేచ్ఛగా తిరిగేందుకు అవకాశం కల్పించడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. సస్పెండైన సీఐ, ఎస్ఐలను ఎన్నికలకు ముందురోజు నియమించుకొని అరాచకం చేశారన్నారు. ఎమ్మెల్యే ఓటు వేసేందుకు కూడా బతిమిలాడుకోవాల్సి వచ్చిందన్నారు. ఎస్పీ జిల్లా మొత్తం వదిలేసి ఒక్క మాచర్లకే పరిమితమయ్యారని చెప్పారు. ఈవీఎంలు ధ్వంసమైనా పోలింగ్ ఆపకుండా మరో ఈవీఎం పెట్టి తమ ఏజెంట్లు లేకుండానే టీడీపీ వర్గీయులు రిగ్గింగ్ చేసేందుకు పోలీసులు సహకరించారన్నారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో పోలింగ్ జరుగుతున్నప్పుడే 25మందికి పైగా తమ కార్యకర్తల తలలు పగిలాయన్నారు. గుండ్లపల్లిలో టీడీపీ అభ్యర్థి వచ్చి వెళ్లాక మహిళా ఏజెంటు జాకెట్, చీర చించి బయటకు పంపించారన్నారు. మరో ఏజెంటు తల పగులగొట్టారన్నారు.

ఎమ్మెల్యే గృహంపైనా దాడి

నరసరావుపేటలో ఏకంగా ఎమ్మెల్యే గృహంపైనే దాడిచేశారన్నారు. చిలకలూరిపేట, పెదకూరపాడుల్లో జరిగిన దాడులపై పోలీసులకు ఫోన్ చేసినా ఎత్తలేదన్నారు. బీసీలు, ఎస్సీలు ఏజెంట్లుగా కూర్చుంటారా అంటూ గురజాల నియోజకవర్గంలోని కొత్త గణేశునిపాడు, కేసానుపల్లిలో మహిళలని చూడకుండా కొట్టారని ఆందోళన వ్యక్తం చేశారు. సత్తెనపల్లి నియోజకవర్గం మాదలలో మంగళవారం దాడిచేసి ఇళ్లు, వాహనాలను ధ్వంసం చేశారన్నారు. పాకాలపాడులో ఒకరి కాలు విరగ్గొట్టారన్నారు. అధిష్టానం నుంచి వచ్చిన ఆదేశాల మేరకే టీడీపీ గూండాలు ఈ అరాచకాలకు పాల్పడుతున్నారని చెప్పారు. ఐజీలు, ఎస్పీలు తాము ఫోన్ చేస్తేనే ఎత్తలేదని, సామాన్యులు ఫోన్ చేస్తే ఎక్కడ ఎత్తుతారని ప్రశ్నించారు. కలెక్టర్ ఫోన్ ఎత్తినా స్పందించేలోపే ప్రత్యర్థులు పని ముగించారని తెలిపారు. టీడీపీ నాయకులు ఎన్ని అరాచకాలకు పాల్పడినా ఎన్నికల్లో అత్యంత భారీ మెజార్టీతో తాను, ఏడుగురు ఎమ్మెల్యేలు గెలవబోతున్నామని, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ప్రమాణస్వీకారం చేస్తారనీ స్పష్టం చేశారు. పల్నాడు ప్రజలు విజ్ఞతతో వ్యవహరించి ఓటు వేశారని వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యకర్తలకు అండగా ఉంటామని చెప్పారు.

చంద్రబాబు సూచనలతోనే కార్యకర్తల దాడులు

డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో చంద్రబాబు ఏమి చెబితే అదే జరిగిందనీ, ఉద్దేశపూర్వకంగా మధ్యాహ్నం నుంచి టీడీపీ వర్గీయులు గొడవలకు దిగారనీ తెలిపారు. తమ ఏజెంట్లు బూత్‌ల నుంచి బయటకు వస్తే వారు రిగ్గింగ్ చేసుకోవాలని భావించారనీ, అందుకే తాము సాయంత్రం ఏడుగంటల వరకు బూత్‌ల నుంచి బయటకు రావొద్దని ముందుగానే సూచించామన్నారు. హింసాత్మక సంఘటనలు జరగకూడదనే తాము సంయమనం పాటించామన్నారు. అరవిందబాబు హాస్పిటల్ వద్దకు పమిడిపాడు నుంచి 500మంది 30 ట్రాక్టర్లతో వచ్చి నవయుగ బార్ అండ్ రెస్టారెంట్ నుంచి రెండు ఆటోల్లో ఖాళీ బీర్ బాటిళ్లు, మద్యం తీసుకొచ్చి దాడిచేసేందుకు మంగళవారం రాత్రి సిద్ధమయ్యారనీ, దీనిపై ఎస్పీ, డీఎస్పీలకు ఫోన్‌చేసినా వారు స్పందించలేదని వాపోయారు. మా కుటుంబ రక్షణ కోసం పలు గ్రామాల నుంచి కొందరిని పిలిపించుకుని హాస్పిటల్‌ను కాపాడుకున్నామని చెప్పారు. తమకు సహకరించిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. సీనియర్ నాయకులు డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు పిల్లి ఓబులురెడ్డి, డాక్టర్ సుధీర్‌భార్గవరెడ్డి పాల్గొన్నారు.

విభిన్నం

ప్రాణమున్న గోడలు







బయటి గోడలు
ఎలా ఉంటే ఏంటి అనుకుంటారు
చాలామంది.
అరె.. ఇలా ఉంటే ఎంత బాగుంటుంది
అనేలా చేస్తుంది స్నేహ చక్రవర్తి.

ఎత్తుగా ఉండే గోడలపై
భారీ మ్యూరల్స్ గీయడం సవాలు.
మహిళా ఆర్టిస్ట్‌గా ఆ సవాలును ఎదుర్కొంది స్నేహ.
దేశంలో గొప్ప కుడ్య చిత్రకారిణిగా ఉన్న
ఆమె జీవన విశేషాలు.

స్నేహ చక్రవర్తి

కూర్గ్ కాఫీ తోటల్లో పనిచేసే కార్మికులు, కొచ్చిలో చేపలు పట్టే బెస్తవారు, బెంగళూరులో ఇడ్లీ హోటల్ నడిపే ముసలామె, తమిళనాడులో తిరిగే జడలు గట్టిన సాధువులు, కష్టజీవులు, శ్రామిక మహిళలు... వీరిని భారీ బొమ్మలుగా ఎప్పుడైనా గోడల మీద చూశామా? స్నేహ చక్రవర్తి 'మ్యూరల్స్' (కుడ్య చిత్రాలు– గోడ బొమ్మలు) చూస్తే వీరే కనపడతారు. 'దేశంలో ఎవరూ గమనించని జీవన పోరాట యోధులు వీరంతా. వీళ్లను బొమ్మల్లో చూపడమే నా లక్ష్యం' అంటుంది స్నేహ చక్రవర్తి. గత సంవత్సరం ఆమె 'ట్రావెల్ అండ్ పెయింట్ ఇండియా' పేరుతో భారత దేశ యాత్ర చేసింది. కూర్గ్‌తో మొదలెట్టి హిమాచల్ ప్రదేశ్ వరకూ అనేక రాష్ట్రాల్లో తిరుగుతూ గోడల మీద భారీ చిత్రాలు గీసింది. వాటిలో ప్రధాన అంశం సామాన్యులు, సామాన్య జీవనం... దానిలోని సౌందర్యం. 'దేశమంటే వీళ్లే' అంటుంది స్నేహ.

సొంత ఊరు ఢిల్లీ

ఢిల్లీలో పుట్టి పెరిగిన స్నేహ అక్కడ చదువు పూర్తి చేసింది. ఆమె తండ్రి ఇంజినీర్, తల్లి గృహిణి. 'నాకు ఏడేళ్ల వయసున్నప్పుడు చేతుల మీద మెహందీ వేసే ఒక మహిళ వచ్చింది. ఆమె వేసిన డిజైన్లు నన్ను ఆకర్షించాయి. ఆమె మా పక్కింటికి వెళితే అక్కడకు కూడా వెళ్లి ఆమె మెహందీ వేయడం చూశాను. మరుసటి రోజే అమ్మను అడిగి మెహందీ తెచ్చి ట్రై చేశాను. నాకు మెహందీ వేయడం వచ్చేసింది. ఎనిమిదేళ్లకు మా ఏరియాలో గిరాకీ ఉన్న మెహందీ ఆర్టిస్ట్‌ను అయ్యాను. అయితే కళ అన్నం పెట్టదు అనే భావనతో ఏదైనా పని చేయమని నన్ను మా తల్లిదండ్రులు కోరారు. వారి కోసమని ఒక ఎయిర్‌లైన్స్ సంస్థలో ఇంటీరియర్ డిజైనర్‌గా చేశారు. కాని ఇలా ఒకరి కింద పని చేయడం నాకు నచ్చలేదు. నా మనసు అక్కడ లేదు. నేను రంగుల కోసం పుట్టాను. రంగుల్లో మునుగుతాను. నా బొమ్మలు అందరూ చూడాలి. అంటే నేను మ్యూరలిస్ట్‌గా, స్ట్రీట్ ఆర్టిస్ట్‌గా పేరు గడించాలి. ఆ విషయం ఇంట్లో చెప్పి 2018 నుంచి మ్యూరలిస్ట్‌గా మారాను' అని తెలిపింది స్నేహ చక్రవర్తి.


జటిలమైన చిత్రకళ

కాన్వాస్ మీద బొమ్మ గీయడం వేరు... ఒక పెద్ద గోడను కాన్వాస్‌గా చేసుకోవడం వేరు. కాగితం మీద వేసుకున్న బొమ్మను పదింతలు ఇరవై యింతలు పెంచి గోడ మీద గీస్తారు. దొంతీలు కట్టుకుని గోడ మీద బొమ్మ వేస్తే మళ్లీ కిందకు దిగి దూరం నుంచి చూసుకుంటూ బొమ్మను అంచనా కడుతూ గీయాలి. సాధారణంగా మగవారు ఈ ఆర్ట్‌లో ప్రావీణ్యం సంపాదిస్తారు. మ్యూరలిస్ట్‌లుగా ఉన్న మహిళలు తక్కువ. వారిలో స్నేహ చక్రవర్తి పేరు పొందింది. పూణె, ముంబై స్లమ్స్‌లో ఆమె గీసిన బొమ్మలు ఆ మురికివాడలకు జీవం, ప్రాణం పోశాయి. 'అందమైన బొమ్మ ఉన్న గోడ దగ్గర ఎవరూ చెత్త వేయడానికి ఇష్టపడరు. ఉమ్మివేయరు' అని చెప్పింది స్నేహ.

స్త్రీలు- సందేశాలు

'నా మ్యూరల్స్‌తో స్త్రీల సాధికారతను చూపిస్తుంటాను. స్వేచ్ఛాభావనను చూపుతుంటాను. సరైన సందేశాలు కూడా ఇస్తుంటాను. ఒకసారి ఒక పెద్ద స్త్రీ బొమ్మ గీచి ఫర్ సేల్ ఫర్ సేల్ అని చాలాసార్లు ఆ స్త్రీ బొమ్మ చుట్టూ రాశాను. పోర్నోగ్రఫీ వల్ల స్త్రీ దేహం అమ్మకానికి సులువుగా దొరుకుతుందన్న భావన పురుషులలో ఉంటుంది. అలాంటి భావజాలం ఎంత దుర్మార్గమైనదో తెలిసొచ్చేలా ఆ బొమ్మ గీశాను. దానికి మంచి స్పందన వచ్చింది. గోడలు లేని ప్రపంచం లేదు. అందుకే నేను ప్రపంచమంతా తిరిగి బొమ్మలు వేస్తాను. నా బొమ్మ ప్రతి దేశం గోడ మీద మన ప్రజలను, సంస్కృతిని చూపాలన్నదే నా కోరిక' అని తెలిపింది స్నేహ.

నాసాలో మన అక్షత!



అక్షత కృష్ణమూర్తి

అమెరికాలోని నాసా (నేషనల్ ఏరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్)లో ఉద్యోగం... ఈ కల చాలా మందికే ఉండి ఉంటుంది. ఈ కలను సాకారం చేసుకున్న తొలి భారతీయ యువతి అక్షత కృష్ణమూర్తి. నాసా అనగానే మనకు అంతరిక్షంలోకి వెళ్లి గ్రహాలను అధ్యయనం చేసిన రాకేశ్ శర్మ గుర్తు వస్తారు. అలాగే కల్పనా చావ్లా, సునీత విలియమ్స్ కూడా గుర్తుకు వస్తారు. కల్పనా చావ్లా, సునీత విలియమ్స్ ఇద్దరూ భారతీయ సంతతికి చెందిన వారే కానీ భారత పౌరసత్వం ఉన్న వాళ్లు కాదు. అమెరికా పౌరసత్వమే వారి అంతరిక్ష పథాన్ని సుగమం చేసింది. ఇక అక్షత విషయానికి వస్తే...

■ ఆకాశానికి ఆవల

బెంగళూరుకు చెందిన అక్షతా కృష్ణమూర్తికి చిన్నప్పటి నుంచి ఆకాశానికి ఆవల ఏముంటుంది అనే ఆలోచనే. ఆమె బాల్యం ఆకాశంలో నక్షత్రాలను చూడడంతో, చుక్కల్లో చందమామ వెలుగుతో సంతృప్తి చెందలేదు. అంతరిక్షం అంటే మనకు కనిపించేది మాత్రమే కాదు, ఇంకా ఏదో ఉంది, అదేంటో తెలుసుకోవాలనే ఆసక్తి ఉండేది. బాల్యంలో మొదలైన ఆసక్తిని పెద్దయ్యేవరకు కొనసాగించింది. తన పయనాన్ని అంతరిక్షం వైపుగా సాగాలని కోరుకుంది. అందుకోసం తీవ్రంగా శ్రమించింది, నేడు నాసా లో ఏరో స్పేస్ ఇంజనీర్‌గా ఉద్యోగం సంపాదించింది. ఆ వివరాలను తెలియచేస్తూ ''ఇది కేవలం అదృష్టం అని కానీ, కాకతాళీయంగా జరిగిపోయిందని చెప్పను. పూర్తిగా పదిహేనేళ్ల కఠోర శ్రమతోనే, అంతకు మించిన ఓర్పుతోనే సాధ్యమైంది'' అంటుంది అక్షత. అలాగే అంతరిక్షంలో కెరీర్‌ని వెతుక్కోవాలంటే పాటించాల్సిన కొన్ని సూత్రాలను కూడా పంచుకుంది.

■ నక్షత్రశాల నుంచి అంతరిక్షం వరకు...

''నాసాలోని జెట్ ప్రొపల్షన్ లాబొరేటరీలో స్పేస్ మిషన్‌లకు 'ప్రిన్సిపల్ నావిగేటర్ అండ్ స్పేస్ సిస్టమ్స్ ఇంజనీర్'గా విధులు నిర్వర్తిస్తున్నాను. నాసా– ఇస్రో సంయుక్తంగా నిర్వహించిన సింథటిక్ ఆపెర్చర్ రాడార్ మిషన్‌లో ఫేజ్ లీడ్‌గానూ, మార్స్ 2020 మిషన్‌లో రోబోటిక్స్ సిస్టమ్స్ ఇంజనీర్‌గానూ బాధ్యతలు నిర్వర్తించాను. నేను చదివింది స్టేట్ బోర్డ్ సిలబస్‌లోనే. మాది సంపన్న కుటుంబం కూడా కాదు. అయితే చిన్నప్పుడు నా వీకెండ్ ఎంజాయ్‌మెంట్‌లో ప్లానిటేరియం విజిట్స్, బెంగుళూరులో ఎయిర్‌షోస్ ఎక్కువగా ఉండేవి. నా ఆసక్తిని గమనించిన మా అమ్మానాన్న నేనడిగిన ప్రతిసారీ తీసుకెళ్లేవారు. హబుల్ టెలిస్కోప్ గురించి తెలుసుకోవడం నా జీవితంలో గొప్ప మలుపు. బహుశా 2000 సంవత్సరంలో అనుకుంటాను. నాకప్పుడు పదేళ్లు. వ్యోమగాములు అంతరిక్షంలో నడవడం గురించి తెలిసి చాలా ఆనందం కలిగింది. అంతరిక్షం నుంచి భూమిని చూడాలనే కోరిక కూడా. కెరీర్ గురించిన ఆలోచనలకు స్పష్టమైన రూపం వచ్చింది కూడా అప్పుడే. అంతరిక్షంలోకి వెళ్లే మార్గాల గురించి అధ్యయనం చేయగా చేయగా వ్యోమగాముల్లో ఎక్కువమంది ఎమ్ఐటీలోనే చదివారని తెలిసింది. నేను అదే సంస్థలో చదవాలని నిర్ణయించుకున్నాను. దాంతో బీటెక్ మెకానికల్ ఇంజనీరింగ్‌లో చేరాను. బెంగళూరులోని ఆర్ కాలేజ్‌లో మెకానికల్ ఇంజనీరింగ్ 2010 బ్యాచ్‌లో నేను మాత్రమే అమ్మాయిని. యూనివర్సిటీ ఆఫ్ ఇల్లినాయిస్‌లో ఏరోస్పేస్‌లో మాస్టర్స్ చేశాను. పీహెచ్‌డీకి ఎమ్ఐటీ (మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) నుంచి స్కాలర్‌షిప్‌తో సీటు వచ్చింది. అయితే యూఎస్‌లో అంతరిక్షంలో ఉద్యోగం రావాలంటే ఆ దేశ పౌరసత్వం ఉండాలి కనీసం గ్రీన్‌కార్డ్ అయినా ఉండాలి. సెమినార్‌లలో నేను సమర్పించిన పేపర్‌లకు ప్రశంసలు వచ్చినప్పటికీ ఉద్యోగం వచ్చేది కాదు. అయినా నా పరిశోధనలను మాత్రం ఆపలేదు. ప్రొఫెసర్‌లకు వారితో కలిసి పని చేసే అవకాశం ఇవ్వమని వినతులు పోస్ట్ చేయడం కూడా ఆపలేదు. నా అప్లికేషన్ ఎప్పుడూ వెయిట్ లిస్టులోనే ఉండేది. వీసా సమయం పూర్తి కావస్తున్న సమయంలో ఒక పేపర్ ప్రెజెంటేషన్ సారా సీగర్ అనే ఆస్ట్రో ఫిజిసిస్ట్ దృష్టిని ఆకర్షించింది. అలా ఒక ఏడాదికి ఇంటర్న్‌షిప్‌కి అవకాశం వచ్చింది. ఆ ఏడాది పూర్తవుతున్న సమయంలో మరో పీహెచ్‌డీకి అప్లయ్ చేశాను. నాసా – ఇస్రో సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమాల్లో కూడా పని చేశాను. మొత్తం మీద మూడవ ప్రయత్నంలో నాసాలో ఫుల్‌టైమ్ ఉద్యోగినయ్యాను.

■ మేధ ఉంది- పాదు లేదు

మనదేశంలో అంతరిక్షంలో పరిశోధన చేయగలిగిన మేధ ఉంది. మొక్క ఎదగాలంటే అందుకు అనువైన పాదు ఉండాలి. అలాంటి పాదును తల్లిదండ్రులు బాల్యంలోనే వేయాలి. అలాంటి ప్రోత్సాహం మన దగ్గర ఉండాల్సినంతగా లేదనే చెప్పాలి. అందుకే లక్ష్యాన్ని సాధించడంలో నాకు ఎదురైన సవాళ్లతోపాటు అవకాశాలను వివరిస్తూ సోషల్ మీడియాలో పోస్ట్‌లు పెడుతున్నాను. నేను సూచించేదేమిటంటే... స్కూల్‌లో సైన్స్ ప్రాజెక్టుల్లో పాల్గొనాలి. అంతరిక్షంలో కూడా ఆస్ట్రో ఫిజిక్స్, ఆస్ట్రానమీ, టెక్నాలజీ, ఇంజనీరింగ్ వంటి చాలా విభాగాలుంటాయి. మన ఆసక్తి ఎందులో అనేది తెలుసుకోవాలి. అంతరిక్షరంగంలో స్థిరపడాలంటే బాచిలర్స్ సరిపోదు. బాచిలర్స్‌లో సైన్స్, ఇంజనీరింగ్‌తో పాటు పీహెచ్‌డీ తప్పనిసరి. అలాగే ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్, మెషీన్ లెర్నింగ్, కోడింగ్ వంటి నైపుణ్యాలను కూడా మెరుగుపరుచుకోవాలి. అంతరిక్షానికి సంబంధించి వీలైనంత ఎక్కువ సదస్సులు, సమావేశాల్లో పాల్గొనాలి. నిపుణులను సంప్రదిస్తూ మన సందేహాలను నివృత్తి చేసుకుంటూ జ్ఞానాన్ని పెంచుకోవాలి. ఇవన్నీ అంతరిక్షయానాన్ని సుగమం చేసే మార్గాలు'' అంటోంది అక్షత.

సూపర్ మామ్స్!

తల్లిగా మారిన ప్రతి స్త్రీ పిల్లల పనిని ఇష్టంగానూ
అదే సమయంలో కష్టంగానూ భావిస్తుంటుంది.
తన బాగు గురించి తాను చూసుకోవడం మరచిపోతుంటుంది.
తల్లిగా మారిన తర్వాత కూడా తమ జీవితాన్ని అర్థవంతంగా
ఎలా మార్చుకోవాలో క్రీడాస్ఫూర్తితో నిరూపిస్తున్నారు కొందరు తల్లులు.
ఇటీవల అమెరికా వాసి కైట్లిన్ డోనర్ స్ట్రోలర్‌తో రన్నర్ మామ్ రికార్డ్‌ను బద్దలు కొట్టింది.
ముంబై వాసి అయిన వినీత్ సింగ్ గర్భవతిగా ఉన్నప్పటి నుంచే రన్నింగ్‌తో
తన ప్రపంచాన్ని ఎంత ఆరోగ్యంగా మార్చుకుందో రుజువు చేస్తోంది.

అమెరికాలోని ఫ్లోరిడాలో ఉంటున్న ఇద్దరు పిల్లల తల్లి అయిన 34 ఏళ్ల కైట్లిన్ డోనర్ ఇటీవల చేసిన ప్రయత్నం అందరినీ ఆకర్షించింది. తన 20 నెలల కొడుకును స్ట్రోలర్ (లాగుడు బండి)లో కూర్చోబెట్టుకొని, ఆ స్ట్రోలర్‌ను నెడుతూ మైలు దూరాన్ని కేవలం ఐదు నిమిషాల 11 సెకన్లలో పూర్తి చేసి, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ నుండి అధికారిక గుర్తింపు పొందింది. తల్లుల్లో ఉన్న శక్తిని ఎలా పెంచుకోవచ్చో తన సాధన ద్వారా నిరూపిస్తోంది.

సాధనమున సమకూరు..

రెండవ గర్భధారణ సమయంలో ప్రసవానంతరం తన లక్ష్యాన్ని ప్రపంచానికి చాటాలనుకుంది. రన్నింగ్ గోల్‌ని ఏర్పరుచుకునే క్రమంలో ఆమెకు రన్నర్ స్నేహితులు ఉత్సాహం కలిగించారు. ఇది ఆమెను మరింత ముందుకు వెళ్లేలా చేసింది. గిన్నిస్ వరల్డ్ రికార్డ్ ప్రాసెస్‌లో భాగంగా సెప్టెంబర్ 2022లో తన బిడ్డకు కేవలం నెల వయసు ఉన్నప్పుడే కైటిన్ దరఖాస్తు చేసింది. కానీ, అది తిరస్కరణకు గురైంది. కిందటేడాది మళ్లీ దరఖాస్తు చేసింది.

ఒలింపిక్ మారథాన్ ట్రయల్స్‌లోనూ వెనకబాటుకు లోనైంది. అయినా నిరుత్సాహపడకుండా మరింతగా కఠినమైన శిక్షణా విధానాన్ని పాటించింది. లెగ్ టర్నోవర్‌ని పెంచడానికి కొన్ని స్పీడ్ వర్కవుట్‌లను నిర్వహించింది. సాధనలో 1600 మీటర్ల వర్కౌట్‌ను స్ట్రోలర్‌తో సాధన చేసింది. ఈ ఎక్స్‌పీరియెన్స్ ఆమెలో మరింత ఉత్సాహాన్ని నింపింది. కిందటి నెలలో బాబ్ గేర్ రివల్యూషన్ 3.0 స్ట్రోలర్‌తో ట్రాక్‌లోకి ప్రవేశించింది. దీనికి ఆమె కుటుంబం, సన్నిహితులు అందించిన మద్దతు తనకీ విజయం సాధించడానికి తోడ్పడింది అని తెలియజేస్తుంది.


కైట్లిన్ డోనర్

కఠినమైన లక్ష్యాలనే ఎంచుకోవాలి..

ట్రాక్‌పై పరిగెత్తుతున్నప్పుడు ప్రతి అడుగుతోనూ ఆమె ఈ లక్ష్యాన్ని అధిగమించడంతో చుట్టూ ఉన్న వారి చప్పట్ల హోరు కన్నా తన లక్ష్యానికి ఆమె ఇచ్చిన ప్రాముఖ్యానికి అందరూ కొనియాడారు. మైలు దూరాన్ని 5 నిమిషాల 11.13 సెకన్ల సమయంలో ముగించి, మునుపటి 5 నిమిషాల 13 సెకన్ల ప్రపంచ రికార్డును బద్దలు కొట్టి విజేతగా నిలిచింది. ఆమె ట్రాక్‌పై పరిగెత్తుతున్నప్పుడు అందరి దృష్టి ఆమెపై అలాగే బాబ్ గేర్ రివల్యూషన్ 3.0 స్ట్రోలర్‌లోని బిడ్డపై కూడా ఉంది. 'సులువైన వాటిని కాదు భయానకమైన లక్ష్యాలనే ఎంచుకోండి. ఎందుకు సాధించలేం? అనే ప్రశ్న ఎవరికి వారు వేసుకోండి. ఆశించిన ఫలితం వస్తుందో రాదో చెప్పలేం. కానీ, ప్రయత్నించినందుకు ఏ మాత్రం చింతించరు' అని బోసినవ్వుల కొడుకును ఎత్తుకుంటూ చెబుతుంది డోనర్.

మన వినీత్ సింగ్

ముంబై వాసి వినీత్ సింగ్‌కి తల్లిగానే కాదు విజయవంతమైన ఎంట్రప్రెన్యూర్‌గా... ఫిట్‌నెస్ ఔత్సాహికురాలుగా కూడా ఎంతో పేరుంది. ఆరు నెలల గర్భవతిగా ఉండీ వైద్యుల అనుమతితో ఈ ఏడాది జనవరిలో జరిగిన 30 కిలోమీటర్ల మారథాన్‌లో పాల్గొంది. 'నా ప్రపంచం ఎంత ఆరోగ్యంగా ఉందో ఈ మారథాన్ నాకు పరిచయం చేసింది' అని ఈ సందర్భంగా తెలియజేసింది. వినీత్ సింగ్ కుటుంబం క్రీడలు, ఫిట్ నెస్ అంటే చాలా ఇష్టపడుతుంది. అప్పటికే వినీత్‌కి అల్ట్రా మారథాన్, హాఫ్ మారథాన్ వంటి వాటిల్లో పాల్గొన్న అనుభవం ఉంది. 3.8 కిలోమీటర్ల ఈత, 180 కిలోమీటర్ల సైకిల్ రైడ్, 42 కిలోమీటర్ల మారథాన్‌లలోనూ పాల్గొంది. మోస్ట్ పవర్‌ఫుల్ ఉమన్‌గా అవార్డులూ గెలుచుకుంది. గర్భవతులుగా ఉన్నప్పుడు, ప్రసవానంతరమూ తల్లులు తమ ఆరోగ్యం పట్ల ఎంత శ్రద్ధ చూపాలో, తమ ప్రపంచాన్ని ఎంత ఉత్సాహకరంగా మార్చుకోవాలో ఈ తల్లులు తమ జీవనశైలితో నిరూపిస్తున్నారు.


వినీత్ సింగ్


వినీత్ సింగ్

యూత్ పల్స్

ఫైర్

ఫ్యాషన్ కాదు పాషన్



యూత్ అంటేనే ఫైర్. ఇప్పుడు ఆ ఫైర్ 'ఫైర్' ట్రెండ్‌ను ఇష్టపడుతోంది.
'ఫైర్'ట్రెండ్ అనేది ఫ్యాషన్ ట్రెండ్ కాదు.... F.I.R.E అంటే ఫైనాన్షియల్ ఇండిపెండెన్స్, రిటైర్ ఎర్లీ. జెన్ జెడ్‌లో 48 శాతం 'ఫైర్' ప్లాన్‌కు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఎర్లీ రిటైర్‌మెంట్ తరువాత తమకు ఇష్టమైన పనుల జాబితాను సిద్ధం చేసుకుంటున్నారు.

ఒక సర్వే ప్రకారం 2024లో జెన్ జెడ్‌లో 47 శాతం మంది ముందస్తు పదవీ విరమణకు ప్రాధాన్యత ఇస్తున్నారు.

'ఎందుకు ఇలా? అనే ప్రశ్నకు ఏకైక సమాధానం వినిపించకపోవచ్చు. అయితే అన్ని కారణాల సారం ఒక్కటే...'నాకు ఇష్టమైన పని చేయాలి'

ముంబైకి చెందిన తేజస్వి, పెయింటింగ్‌పై తనకు ఉన్న పాషన్‌నే కెరీర్‌గా చేసుకోవాలనుకుంది. అయితే కుటుంబ ఆర్థికపరిస్థితుల వల్ల ఉద్యోగం చేయడం అనివార్యం అయింది. F.I.R.E (ఫైనాన్షియల్ ఇండిపెండెన్స్, రిటైర్ ఎర్లీ)ని దృష్టిలో పెట్టుకొని ఆమె దుబారా ఖర్చులు తగ్గించుకొని పొదుపునకు ప్రాధాన్యత ఇస్తోంది.

'ఉద్యోగం మీద ఆధారపడకుండా, ఆర్థిక ఇబ్బందులు లేకుండా సాఫీగా జీవితం గడపడానికి అవసరమైన పొదుపు, పెట్టుబడి వ్యూహాలు ఫైర్‌లో ఉన్నాయి' అంటారు నిపుణులు.

'ఫైర్' మూమెంట్‌పై ఆసక్తి ఉన్నట్లే అపోహలు ఉన్నాయి.

'ఫైర్‌పై ఎన్నో అపోహలు ఉన్నాయి. ఫైర్‌కు ప్రాధాన్యత ఇవ్వడం అంటే ఎక్స్‌ట్రీమ్ సేవింగ్స్ కోసం అసాధారణ జీవితాన్ని గడపడం. ప్రాపంచిక సుఖాలను త్యాగం చేయడం అనేది అందులో ఒకటి. కాని ఇది నిజం కాదు. నా దృష్టిలో ఫైర్ స్ట్రాటజీ అంటే ఇంటెలిజెంట్ ఇన్వెస్ట్‌మెంట్' అంటుంది బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న నవ్య.

'ఫైర్ స్ట్రాటజీ అంటే పనికి పూర్తిగా దూరం కావడం కాదు. ఇష్టమైన పనికి దగ్గర కావడం' అంటుంది దిల్లీలో ఒక ఫిన్‌టెక్ కంపెనీలో పని చేస్తున్న అనిక.

డబ్బు బాగా ఖర్చు చేసే అనిక 'ఫైర్ స్ట్రాటజీ'ని దృష్టిలో పెట్టుకొని పొదుపు దారి పట్టింది. 'పీనాసిగా మారిపోయావేంటీ'లాంటి స్నేహితుల వెక్కిరింపులను ఆమె పట్టించుకోవడం లేదు.

పుస్తకాలు రాయడం నుంచి స్వచ్ఛందసేవా కార్యక్రమాల్లో పాల్గొనడం వరకు అనిక ఎర్లీ రిటైర్‌మెంట్ తరువాత జీవితంలో ఎన్నో ఉన్నాయి.

విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం అందరికీ ఒకే రకంగా సరిపోయే యూనివర్శల్ 'ఫైర్' ఫార్ములా లేదు. వ్యక్తిగత ఆసక్తులు, ఆర్థిక లక్ష్యాలు, జీవిత పరిస్థితుల దృష్ట్యా ఒకరితో పోల్చితే మరొకరికి భిన్నమైన ఫార్ములా ఉండవచ్చు.


అందుకే 'ఫైర్'ను కస్టమైజబుల్ బ్లూ ప్రింట్ అంటారు.

యువ ఉద్యోగులలో కొద్దిమంది 'ఫైర్'లో భాగంగా తమ ఆదాయంలో 40 శాతం లేదా అంతకంటే ఎక్కువ ఆదా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇది ఆశ్చర్యకరంగా అనిపించవచ్చు. అయితే జీవనశైలిలో కొద్దిపాటి మార్పులు, సరైన బడ్జెట్ సర్దుబాట్లతో ఇదేమీ అసాధ్యం కాదని నిపుణులు అంటున్నారు.

యువతను ఉద్దేశించి ఏదో ఒక సందర్భంలో పెద్దల నోటి నుంచి వినిపించే మాట... మీకు డబ్బు విలువ తెలియదు. అయితే గత జనరేషతో పోల్చితే జెన్ జెడ్ యువతరం డబ్బును నీళ్లలా ఖర్చు చేయడం కంటే నిర్మాణాత్మకమైన పొదుపునకు ప్రాధాన్యత ఇస్తోంది. స్టాక్స్ అండ్ మ్యూచువల్ ఫండ్స్‌పై దృష్టి సారిస్తోంది. ఫైనాన్షియల్ టెక్నాలజీ కంపెనీ 'కామ్స్' రిపోర్ట్ ప్రకారం జెన్–జెడ్‌లో 54 శాతం మంది ఫస్ట్–టైమ్ మ్యూచువల్ ఫండ్ ఇన్వెస్టర్‌లు.

'రిస్క్–అవేర్‌నెస్, ఆర్థిక క్రమశిక్షణతో స్మార్ట్ ఇన్వెస్టింగ్ రూల్స్‌ను జెన్ జెడ్ తిరగ రాస్తుంది. స్టాక్‌గ్రోలో వందలాది మంది యంగ్ ఇన్వెస్టర్‌లు ఇన్వెస్టింగ్, ట్రేడింగ్ స్కిల్స్‌ను మెరుగుపరుచుకుంటున్నారు. సరియైన పద్ధతిలో ఎలా పెట్టుబడి పెట్టాలనే విషయంలో వారికి మంచి అవగాహన ఉంది' అంటున్నాడు స్టాక్‌మార్కెట్, ఇన్వెస్ట్‌మెంట్‌కు సంబంధించి ఫిన్‌టెక్ కంపెనీ 'స్టాక్‌గ్రో' కో–ఫౌండర్ అజయ్ లఖోటియ.

ఎప్పుడు, ఎలా, ఎందుకు



'ఫైర్' మూమెంట్ పాపులర్ కావడం వెనుక విక్కీ రాబిన్, జో డొమింగెజ్ రాసిన 'యువర్ మనీ ఆర్ యువర్ లైఫ్' లాంటి పుస్తకాలు ఉన్నాయి. 'డబ్బు భౌతికమైన సాధనమే కాదు. ఆధ్యాత్మికమైనది కూడా' అంటుంది ఈ పుస్తకం. మనకు అవసరమైన దాన్ని పొందానికి మాత్రమే కాదు బాధ్యతాయుతంగా జీవించడానికి, సేవాపథంలో అడుగులు వేయడానికి కూడా డబ్బు ఉపయోగపడుతుంది. మీ డబ్బు ఎక్కడి నుంచి వచ్చింది. ఎక్కడికి వెళుతుంది (ఫైనాన్షియల్ ఇంటిగ్రిటీ). మీరు మీ డబ్బును ఎక్కడ, ఎప్పుడు ఖర్చు చేస్తున్నారు. ఎక్కడ, ఎప్పుడు డబ్బు సంపాదిస్తారు (ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్). ఫైనాన్షియల్ ఇండిపెండెన్స్‌కు సంబంధించిన విషయాలపై ఈ పుస్తకం అవగాహన కలిగిస్తుంది.



'టాప్స్'లో అనాహత్, అభయ్ సింగ్‌లకు చోటు

భారత స్క్వాష్ యువ క్రీడాకారులు అనాహత్ సింగ్, అభయ్ సింగ్, వెలవన్ సెంథిల్ కుమార్‌లకు కేంద్ర క్రీడా శాఖ చేయూత ఇవ్వనుంది. ఈ ముగ్గురికి టార్గెట్ ఒలింపిక్ పోడియం స్కీమ్ (టాప్స్) డెవలప్‌మెంట్ గ్రూప్‌లో చోటు కల్పించింది. లాస్ ఏంజెలిస్ 2028 ఒలింపిక్స్‌లో స్క్వాష్‌ను తొలి సారి మెడల్ ఈవెంట్‌గా ప్రవేశ పెట్టనున్నారు. అనాహత్, అభయ్ గత ఆసియా క్రీడల్లో రెండు కాంస్యాలు, ఒక స్వర్ణం నెగ్గారు.



ప్రిక్వార్టర్ ఫైనల్లో బోపన్న-ఎబ్డెన్ జోడీ పరాజయం

ఇటాలియన్ ఓపెన్ మాస్టర్స్ సిరీస్-1000 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్‌లో రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ పోరాటం ముగిసింది. మంగళవారం రోమ్‌లో జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో రెండో సీడ్ బోపన్న-ఎబ్డెన్ ద్వయం 2-6, 4-6తో సిమోన్ బొలెలీ-వావాసోరి (ఇటలీ) జంట చేతిలో ఓడిపోయింది. 73 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో బోపన్న-ఎబ్డెన్‌లు ఐదు ఏస్‌లు సంధించి, మూడు డబుల్ ఫాల్ట్‌లు చేశారు. తమ సర్వీస్‌ను ఐదుసార్లు కోల్పోయారు. బోపన్న-ఎబ్డెన్‌లకు 29,860 యూరోల (రూ. 26 లక్షల 90 వేలు) ప్రైజ్‌మనీ, 90 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.

మనిక ర్యాంక్ 24

ప్రపంచ టీటీ ర్యాంకింగ్స్‌లో టాప్-25లో నిలిచిన భారతీయ క్రీడాకారిణిగా ఘనత



న్యూఢిల్లీ: భారత టేబుల్ టెన్నిస్ (టీటీ) మహిళా స్టార్ క్రీడాకారిణి మనిక బత్రా కెరీర్ బెస్ట్ ర్యాంక్‌ను అందుకుంది. మంగళవారం విడుదల చేసిన ప్రపంచ టీటీ ర్యాంకింగ్స్ మహిళల సింగిల్స్ విభాగంలో మనిక 24వ ర్యాంక్‌లో నిలిచింది. గతవారం సౌదీ స్మాష్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్ చేరిన మనిక ఏకంగా 14 స్థానాలు ఎగబాకి 39వ ర్యాంక్ నుంచి 24వ ర్యాంక్‌కు చేరుకుంది. తద్వారా ప్రపంచ ర్యాంకింగ్స్‌లో టాప్-25లో నిలిచిన తొలి భారతీయ టీటీ క్రీడాకారిణిగా మనిక గుర్తింపు పొందింది. గతవారం 38వ ర్యాంక్‌లో నిలిచి భారత నంబర్‌వన్‌గా ఉన్న తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ మూడు స్థానాలు పడిపోయి 41వ ర్యాంక్‌కు చేరుకోగా... యశస్విని రెండు స్థానాలు పడిపోయి 99వ ర్యాంక్‌లో నిలిచింది. పురుషుల సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో భారత ప్లేయర్లు ఆచంట శరత్ కమల్ 40వ ర్యాంక్‌లో, మానవ్ ఠక్కర్ 62వ ర్యాంక్‌లో, హర్మీత్ దేశాయ్ 63వ ర్యాంక్‌లో, సత్యన్ 68వ ర్యాంక్‌లో ఉన్నారు.

తొమ్మిదోసారి టి20 ప్రపంచకప్ బరిలో షకీబ్



ఢాకా: బంగ్లాదేశ్ జట్టు స్టార్ ఆల్‌రౌండర్, మాజీ కెప్టెన్ షకీబ్ అల్ హసన్ వరుసగా తొమ్మిదోసారి టి20 ప్రపంచకప్ క్రికెట్ టోర్నీలో ఆడనున్నాడు. ఈ మెగా ఈవెంట్‌లో పాల్గొనే బంగ్లాదేశ్ జట్టును మంగళవారం ప్రకటించారు. 15 మంది సభ్యులతో కూడిన బంగ్లాదేశ్ జట్టుకు నజ్ముల్ హొస్సేన్ షాంతోను కెప్టెన్‌గా నియమించారు. భారత కెప్టెన్ రోహిత్ శర్మ, షకీబ్ మాత్రమే 2007 నుంచి 2022 వరకు జరిగిన ఎనిమిది టి20 ప్రపంచకప్ టోర్నీల్లో ఆడారు. ఇప్పటి వరకు ప్రపంచకప్‌లలో 36 మ్యాచ్‌లు ఆడిన షకీబ్ 742 పరుగులు చేయడంతోపాటు 47 వికెట్లు పడగొట్టాడు.

బంగ్లాదేశ్ జట్టు: నజ్ముల్ హొస్సేన్ (కెప్టెన్), తస్కిన్ అహ్మద్ (వైస్ కెప్టెన్), లిటన్ దాస్, సౌమ్య సర్కార్, తన్‌జిద్ హసన్, షకీబ్, తౌహిద్, మహ్మదుల్లా, జాకీర్ అలీ, తన్వీర్ ఇస్లామ్, మెహదీ హసన్, రిషాద్, ముస్తఫిజుర్, షోరిఫుల్, తన్‌జీమ్ హసన్.

ఢిల్లీ ఆశలు పదిలం!



స్టబ్స్

చివరి లీగ్ మ్యాచ్‌లో విజయం
- 19 పరుగులతో ఓడిన లక్నో
- రాణించిన స్టబ్స్, పొరెల్, ఇషాంత్
- 'ప్లే ఆఫ్స్'కు రాజస్తాన్ రాయల్స్

న్యూఢిల్లీ: సొంతగడ్డపై సత్తా చాటిన ఢిల్లీ క్యాపిటల్స్ ఐపీఎల్ లీగ్ దశను విజయంతో ముగించింది. ఈ గెలుపుతో సాంకేతికంగా 'ప్లే ఆఫ్స్' అవకాశాలు ఇంకా మిగిలే ఉన్నా... ఆ జట్టు ముందంజ వేయడం చాలా రకమైన ఇతర సమీకరణాలపై ఆధారపడి ఉంది. మరోవైపు గెలిస్తే ప్లే ఆఫ్స్ రేసులో మెరుగైన స్థితికి చేరే అవకాశం ఉన్నా కూడా లక్నో సూపర్ జెయింట్స్ దానిని చేజార్చుకుంది. మంగళవారం జరిగిన పోరులో ఢిల్లీ 19 పరుగుల తేడాతో లక్నోపై విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 208 పరుగులు చేసింది. అభిషేక్ పొరెల్ (33 బంతుల్లో 58; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు), ట్రిస్టన్ స్టబ్స్ (25 బంతుల్లో 57 నాటౌట్; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు చేయగా... షై హోప్ (27 బంతుల్లో 38; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), రిషభ్ పంత్ (23 బంతుల్లో 33; 5 ఫోర్లు) రాణించారు. అనంతరం లక్నో 20 ఓవర్లలో 9 వికెట్లకు 189 పరుగులు చేసి ఓడిపోయింది. నికోలస్ పూరన్ (27 బంతుల్లో 61; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు), అర్షద్ ఖాన్ (33 బంతుల్లో 58 నాటౌట్; 3 ఫోర్లు, 5 సిక్స్‌లు) దూకుడుగా ఆడగా మిగతా వారంతా పూర్తిగా విఫలమయ్యారు. ఢిల్లీ-లక్నో మ్యాచ్ ఫలితంతో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే రాజస్తాన్ రాయల్స్ 16 పాయింట్లతో 'ప్లే ఆఫ్స్'కు బెర్త్‌ను ఖరారు చేసుకున్న రెండో జట్టుగా నిలిచింది.

కీలక భాగస్వామ్యం...

తొలి ఓవర్లోనే జేక్ ఫ్రేజర్ (0)ను అవుట్ చేసిన లక్నో ఆనందం ఎక్కువ సేపు నిలవలేదు. పొరెల్, హోప్ కలిసి దూకుడుగా ఆడారు. అర్షద్ ఓవర్లో పొరెల్ 3 ఫోర్లు, సిక్స్ కొట్టగా, యుధ్‌వీర్ ఓవర్లో హోప్ 2 ఫోర్లు, సిక్స్ బాదాడు. పవర్‌ప్లేలో ఢిల్లీ 73 పరుగులు చేసింది. 21 బంతుల్లోనే పొరెల్ అర్ధసెంచరీ పూర్తి కాగా, ఈ జోడీ రెండో వికెట్‌కు 92 పరుగులు (49 బంతుల్లో) జోడించింది. వీరిద్దరు తక్కువ వ్యవధిలో వెనుదిరగ్గా, పంత్ కొన్ని కీలక పరుగులు సాధించాడు. అయితే స్టబ్స్ ధాటైన బ్యాటింగ్ ఢిల్లీ స్కోరును 200 దాటించింది. అర్షద్ ఓవర్లో 2 ఫోర్లు, సిక్స్ కొట్టిన అతను, నవీన్ ఓవర్లో 2 సిక్స్‌లు, ఫోర్ బాది 22 బంతుల్లోనే హాఫ్ సెంచరీని అందుకున్నాడు.

పూరన్ మినహా...

భారీ ఛేదనలో లక్నో పూర్తిగా తడబడింది. పూరన్ మెరుపు బ్యాటింగ్ తప్ప ఇన్నింగ్స్‌లో ప్రధాన బ్యాటర్ ఒక్కరు కూడా కనీస ప్రదర్శన ఇవ్వలేకపోయారు. పవర్‌ప్లే ముగిసేలోపే కేఎల్ రాహుల్ (5), డికాక్ (12), స్టొయినిస్ (5), హుడా (0) వెనుదిరగడం జట్టును బాగా దెబ్బ తీసింది. మరోవైపు అక్షర్ ఓవర్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు కొట్టిన పూరన్... ఇతర బౌలర్లపై కూడా చెలరేగి 20 బంతుల్లోనే హాఫ్ సెంచరీ సాధించాడు. అయితే లక్నోను విజయం దిశగా తీసుకెళ్లేందుకు ఇది సరిపోలేదు. విజయానికి 9 ఓవర్లలో 108 పరుగులు చేయాల్సిన స్థితిలో పూరన్ అవుట్ కావడంతో జట్టు ఆశలు కోల్పోయింది. చివర్లో అర్షద్ పోరాడినా అప్పటికే ఆలస్యమైపోయింది.

స్కోరు వివరాలు

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: జేక్ ఫ్రేజర్ (సి) నవీన్ (బి) అర్షద్ 0; పొరెల్ (సి) పూరన్ (బి) నవీన్ 58; హోప్ (సి) రాహుల్ (బి) బిష్ణోయ్ 38; పంత్ (సి) హుడా (బి) నవీన్ 33; స్టబ్స్ (నాటౌట్) 57; అక్షర్ (నాటౌట్) 14; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు)** 208. **వికెట్ల పతనం:** 1-2, 2-94, 3-111, 4-158. **బౌలింగ్:** అర్షద్ 3-0-45-1, మొహసిన్ 4-0-29-0, యుధ్‌వీర్ 2-0-28-0, నవీన్ 4-0-51-2, బిష్ణోయ్ 4-0-26-1, కృనాల్ 2-0-20-0, హుడా 1-0-9-0.

లక్నో సూపర్ జెయింట్స్ ఇన్నింగ్స్: డికాక్ (సి) ముకేశ్ (బి) ఇషాంత్ 12; రాహుల్ (సి) ముకేశ్ (బి) ఇషాంత్ 5; స్టొయినిస్ (స్టంప్డ్) పంత్ (బి) అక్షర్ 5; హుడా (ఎల్బీ) (బి) ఇషాంత్ 0; పూరన్ (సి) అక్షర్ (బి) ముకేశ్ 61; బదోని (సి) గుల్బదిన్ (బి) స్టబ్స్ 6; కృనాల్ (స్టంప్డ్) పంత్ (బి) కుల్దీప్ 18; అర్షద్ (నాటౌట్) 58; యుధ్‌వీర్ (సి) హోప్ (బి) ఖలీల్ 14; బిష్ణోయ్ (రనౌట్) 2; నవీన్ (నాటౌట్) 2; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు)** 189. **వికెట్ల పతనం:** 1-7, 2-24, 3-24, 4-44, 5-71, 6-101, 7-134, 8-167, 9-183. **బౌలింగ్:** ఇషాంత్ 4-0-34-3, ఖలీల్ 2-0-22-1, అక్షర్ 1-0-20-1, ముకేశ్ 4-0-33-1, కుల్దీప్ 4-0-33-1, స్టబ్స్ 1-0-4-1, గుల్బదిన్ 1-0-12-0, సలామ్ 3-0-30-0.



'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఇషాంత్

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ర	పా	నె.ర.రే
కోల్‌కతా	13	9	3	1	19	1.428
రాజస్తాన్	12	8	4	0	16	0.349
చెన్నై	13	7	6	0	14	0.528
హైదరాబాద్	12	7	5	0	14	0.406
ఢిల్లీ	14	7	7	0	14	-0.377
బెంగళూరు	13	6	7	0	12	0.387
లక్నో	13	6	7	0	12	-0.787
గుజరాత్	13	5	7	1	11	-1.063
ముంబై	13	4	9	0	8	-0.271
పంజాబ్	12	4	8	0	8	-0.423

నోట్: అ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

రాజస్తాన్ X పంజాబ్
వేదిక: గువాహటి
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

రెండో సెమీస్‌కు రిజర్వ్ డే లేదు!

దుబాయ్: టి20 ప్రపంచకప్‌లో ఒకవేళ భారత జట్టు సెమీఫైనల్ చేరితే ఆ మ్యాచ్ 'రిజర్వ్ డే' లేకుండానే జరగనుంది. తొలి సెమీఫైనల్, ఫైనల్‌కు మాత్రమే 'రిజర్వ్ డే' ఉంచుతున్నట్లు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) ప్రకటించింది. తొలి సెమీఫైనల్ తరూబా (ట్రినిడాడ్)లో జూన్ 26న స్థానిక కాలమానం ప్రకారం రాత్రి గం. 8:30కు ప్రారంభమవుతుంది. ఈ మ్యాచ్‌కు అంతరాయం కలిగితే తర్వాతి రోజు రిజర్వ్ డే మ్యాచ్ కొనసాగుతుంది. కానీ రెండో సెమీఫైనల్ పరిస్థితి అలా లేదు. భారత్ సెమీస్ చేరవచ్చని భావిస్తున్న రెండో సెమీస్ ప్రావిడెన్స్ (గయానా)లో జరుగుతుంది. ఇది జూన్ 27న స్థానిక కాలమానం ఉదయం గం.10:30కి (భారత కాలమానం ప్రకారం రాత్రి 8 గంటలకు) ప్రారంభమవుతుంది. భారత్‌లోని టీవీ ప్రేక్షకులను దృష్టిలో ఉంచుకునే ఈ సమయాన్ని ఖరారు చేశారు. డే మ్యాచ్ కాబట్టి ఆ రోజంతా చాలినంత సమయం ఉంటుంది. దానిని మరుసటి రోజుకు కొనసాగించడంలో అర్థం లేదని ఐసీసీ భావించింది. పైగా జూన్ 29న ఫైనల్ కాబట్టి రెండో సెమీస్‌లో గెలిచిన జట్టు వరుసగా మూడో రోజులు ఆడాల్సిన స్థితి వస్తుంది. ఇది సరైంది కాదని, ఫైనల్‌కు ముందు ఒక రోజు ప్రయాణం ప్లస్ విరామం ఉండాలి కాబట్టి అదే రోజు ఫలితాన్ని తేల్చాలని నిర్ణయించింది. అయితే 'రిజర్వ్'కు బదులుగా రెండో సెమీస్‌కు 250 నిమిషాల అదనపు సమయాన్ని ఇస్తారు. వర్షం లేదా ఇతర వాతావరణ పరిస్థితుల కారణంగా ఆట పూర్తిగా జరగకపోతే మరో నాలుగు గంటల పాటు వేచి చూస్తారు. అయితే ఆట జరగకపోతే నిబంధనల ప్రకారం 'సూపర్ ఎయిట్'లో ఎక్కువ పాయింట్లు సాధించిన టీమ్ ఫైనల్ చేరుతుంది.



టి20 ప్రపంచకప్‌లో టీమిండియా ఆటగాళ్లు ధరించే జెర్సీతో కెప్టెన్ రోహిత్, బీసీసీఐ కార్యదర్శి జై షా

కొత్త హెడ్ కోచ్ కావాలి

దరఖాస్తులు కోరిన బీసీసీఐ

న్యూఢిల్లీ: భారత పురుషుల సీనియర్ క్రికెట్ జట్టుకు కొత్త హెడ్ కోచ్‌ను ఎంపిక చేసేందుకు బీసీసీఐ ప్రక్రియ మొదలు పెట్టింది. ఈ అత్యున్నత పదవి కోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తులు కోరుతూ బీసీసీఐ ఒక ప్రకటన విడుదల చేసింది. ఆసక్తిగలవారు ఈనెల 27వ తేదీలోపు తమ దరఖాస్తులు పంపించాలి. ఎంపికైన కొత్త హెడ్ కోచ్ పదవీకాలం మూడేన్నరేళ్లపాటు (1 జూలై 2024 నుంచి 31 డిసెంబర్ 2027 వరకు) ఉంటుంది. ప్రస్తుత హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ పదవీకాలం గత ఏడాది నవంబర్‌లో వన్డే వరల్డ్‌కప్ అనంతరం ముగిసింది. అయితే టి20 ప్రపంచకప్ నేపథ్యంలో ఈ మెగా ఈవెంట్ ముగిసేవరకు టీమిండియాకు తాత్కాలిక కోచ్‌గా కొనసాగాలని బీసీసీఐ కోరడంతో ద్రవిడ్ అంగీకరించాడు. కొత్త హెడ్ కోచ్ పదవి కోసం ద్రవిడ్ కూడా మళ్లీ దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని బీసీసీఐ కార్యదర్శి జై షా తెలిపారు.

సుమీత్-సిక్కి జోడీకి నిరాశ



బ్యాంకాక్: థాయ్‌లాండ్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీ మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో సుమీత్ రెడ్డి-సిక్కి రెడ్డి (భారత్) జోడీ తొలి రౌండ్‌లోనే ఓడిపోయింది. సుమీత్-సిక్కి ద్వయం 12-21, 16-21 తో రినోవ్ రివాల్డీ-పితా మెంతారి (ఇండోనేసియా) జోడీ చేతిలో ఓటమి చవిచూసింది. పురుషుల సింగిల్స్ విభాగంలో భారత ప్లేయర్ మైస్నం మెరాబా మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించాడు.

తొలి రౌండ్‌లోనే శివ ఓటమి

అస్తానా: ఎలోర్డా కప్ అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నీలో బాక్సర్లు శివ థాపా (63.5 కేజీలు), సంజయ్ (80 కేజీలు)లకు నిరాశ ఎదురైంది. అస్తానాలో జరుగుతున్న ఈ టోర్నీ తొలి రౌండ్‌లో ఆరుసార్లు ఆసియా చాంపియన్‌షిప్ పతక విజేత శివ థాపా 1-4తో అబ్దుఅలీ అల్మాత్ (కజకిస్తాన్) చేతిలో... సంజయ్ 0-5తో తంగ్లాతిహాన్ (చైనా) చేతిలో ఓడిపోయారు. ప్లస్ 92 కేజీల విభాగంలో గౌరవ్ చౌహాన్ సెమీఫైనల్ చేరి కనీసం కాంస్యం ఖాయం చేసుకున్నాడు. క్వార్టర్ ఫైనల్లో గౌరవ్ 3-2తో డేనియల్ సపర్బయ్ (కజకిస్తాన్)పై గెలిచాడు.

సినిమా


మూడు వారాల తర్వాత కూలీగా...



రజనీకాంత్

జస్ట్ చిన్న బ్రేక్... ఆ తర్వాత కూలీగా కూల్‌గా సెట్‌లోకి అడుగుపెట్టడానికి రజనీకాంత్ ప్లాన్ చేసుకున్నారట. 'వేట్టయాన్' సినిమాలో తన పాత్రకు సంబంధించిన షూట్‌ని పూర్తి చేసిన రజనీకాంత్ ఓ మూడు వారాలు విరామం తీసుకుంటారని సమాచారం. ఆ తర్వాత జూన్ 6 నుంచి తన మరో చిత్రం 'కూలీ' షూటింగ్‌లో పాల్గొంటారట. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందనున్న ఈ చిత్రం కోసం చెన్నైలో భారీ సెట్ రూపొందించారట. ఆ సెట్‌లోనే కొత్త షెడ్యూల్ ఆరంభించనున్నారని కోలీవుడ్ టాక్. కాగా ఈ చిత్రంలో శ్రుతీహాసన్ నటించనున్నారు. రజనీ కుమార్తె పాత్రలో ఆమె కనిపిస్తారట. ఈ పాత్ర కథకి కీలకంగా ఉంటుందని తెలిసింది. సన్ పిక్చర్స్ నిర్మించనున్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ స్వరకర్త.

తెరపైకి సాహస యాత్ర



ఎవరెస్ట్‌ని అధిరోహించిన ఎడ్మండ్, టెన్జింగ్ (ఫైల్ ఫోటో)



టామ్ హిడిల్‌స్టన్

ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన ఎవరెస్ట్‌ని అధిరోహించడం చాలా కష్టం అనే అభిప్రాయాన్ని అబద్ధం చేశారు ఎడ్మండ్ హిల్లరీ, టెన్జింగ్ నార్గే. న్యూజిల్యాండ్‌కి చెందిన ఎడ్మండ్, నేపాల్‌కి చెందిన టెన్జింగ్ 1953లో ఎవరెస్ట్ చేరుకుని, అత్యంత ఎత్తయిన పర్వతాన్ని అధిరోహించిన మొదటి వ్యక్తులుగా చరిత్రలో నిలిచిపోయారు. ఈ ఇద్దరూ సాధించిన చరిత్ర నేపథ్యంలో హాలీవుడ్‌లో 'టెన్జింగ్' టైటిల్‌తో బయోపిక్ రూపొందనుంది. ఈ చిత్రంలో ఎడ్మండ్ హిల్లరీ పాత్రకు టామ్ హిడిల్‌స్టన్‌ని ఎంపిక చేశారు. యాత్ర నాయకుడు కల్నల్ జాన్ హంట్ పాత్రను విల్లెం డాఫో పోషించనున్నారు. టెన్జింగ్ నార్గే పాత్రకు సంబంధించిన ఎంపిక జరుగుతోంది. షెర్పా (పర్వతారోహకులు) కమ్యూనిటీతో సన్నిహిత సంబంధాలు ఉన్న జెన్నిఫర్ పీడోమ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. 2015లో 'షెర్పా' పేరిట జెన్నిఫర్ పీడోమ్ ఓ డాక్యుమెంటరీ తెరకెక్కించారు కూడా. అప్పుడు కొందరు పర్వతారోహకుల అనుభవాలను సేకరించి, 'షెర్పా'ని చిత్రీకరించారు. తాజాగా జెన్నిఫర్ తెరకెక్కించనున్న 'టెన్జింగ్'కి ల్యూక్ డేవిస్ స్క్రిప్ట్ సిద్ధం చేశారు. లిజ్ వాట్స్, ఎమిలీ షెర్మాన్, ఇయాన్ కానింగ్ తదితరులు నిర్మించనున్నారు. ''ఒక సాహస యాత్రను తెరపై ఆవిష్కరించడానికి ఆసక్తిగా ఉన్నాం'' అని మేకర్స్ పేర్కొన్నారు. ఈ చిత్రం షూటింగ్‌ని వచ్చే ఏడాది ఆరంభించాలనుకుంటున్నారు.



కియారా అద్వానీ

కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో కియారా

ప్రతిష్ఠాత్మక 77వ కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో హీరోయిన్ కియారా అద్వానీ తొలిసారి సందడి చేయనున్నారు. ఈ చిత్రోత్సవాల్లో భాగంగా రెడ్ సీ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ప్యానెల్‌లో కియరా ఇండియాకి ప్రాతినిధ్యం వహిస్తారట. మంగళవారం (మే 14) ప్రారంభమైన ఈ ఉత్సవాలు ఈ నెల 25 వరకూ జరగనున్నాయి. ఇప్పటివరకు దేశం తరఫున పలుమార్లు ప్రాతినిధ్యం వహించి, మెప్పించారు ఐశ్వర్యా రాయ్. ఆ తర్వాత సోనమ్ కపూర్ కూడా ఇండియా ప్రతినిధిగా మెప్పించారు. ఈ ఏడాది ఇండియాకి ప్రాతినిధ్యం వహించే అవకాశం కియరా అద్వానీని వరించింది. కాన్స్‌లో వేనిటీ ఫెయిర్ హోస్ట్ చేస్తున్న 'రెడ్ సీ ఫిల్మ్ ఫౌండేషన్ ఉమెన్ ఇన్ సినిమా' కార్యక్రమంలోనూ కియరా పాల్గొంటారు. ప్రపంచ సినిమాకు ప్రోత్సాహకాలు, చిత్రీకరణ, సినిమా నిర్మాణంలో వస్తున్న సాంకేతిక అంశాలు.. వంటి వాటి గురించి నాలుగు ప్యానెల్స్ చర్చలు జరపనున్నాయి. మే 18న లా ప్లేజ్ డెస్ పామ్స్‌లో ఈ చర్చలు జరుగుతాయి. ఆ చర్చల్లోనూ కియారా పాల్గొంటారు. కాగా ఈ ఏడాది చిత్రోత్సవాల్లో ఐశ్వర్యా రాయ్, అదితీ రావ్ హైదరి, శోభితా ధూళిపాళ వంటి తారలు దేశం నుంచి హాజరు కానున్నారు. ఇప్పుడు కియారా అద్వానీ పేరు ఈ జాబితాలో చేరింది. ఈ చిత్రోత్సవాల్లో స్టయిలిష్‌గా కనిపించడానికి, చర్చల్లో తన అభిప్రాయాలను స్పష్టంగా వ్యక్తపరచడానికి కియారా చాలా ప్రిపేర్ అయ్యారని సమాచారం.

క్లైమాక్స్‌లో సరిపోదా



నాని

నాని హీరోగా నటిస్తున్న తాజా పాన్ ఇండియా ఫిల్మ్ 'సరిపోదా శనివారం'. వివేక్ ఆత్రేయ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో ప్రియాంకా అరుల్ మోహన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ సందర్భంగా దర్శక–నిర్మాతలు మాట్లాడుతూ– ''సరిపోదా శనివారం'లో సూర్య పాత్రలో మునుపెన్నడూ కనిపించని ఇంటెన్స్ పవర్-ప్యాక్డ్ క్యారెక్టర్‌లో నాని కనిపించనున్నారు. హై బడ్జెట్‌తో యూనిక్ అడ్వంచర్‌గా రూపొందుతున్న ఈ సినిమా క్లైమాక్స్ షూటింగ్‌ను ప్రారంభించాం. ఈ యాక్షన్ ఎపిసోడ్ కోసం హైదరాబాద్‌లోని అల్యూమినియం ఫ్యాక్టరీలో అద్భుతమైన సెట్‌ను నిర్మించాం. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఆగస్టు 29న ఈ సినిమా విడుదల కానుంది'' అన్నారు. సాయికుమార్, ఎస్‌జే సూర్య కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జేక్స్ బిజోయ్, కెమెరా: మురళి జి.

హాలీవుడ్ హిట్ సిరీస్‌లో...



టబు

సీనియర్ నటి టబు సెకండ్ ఇన్నింగ్స్‌లో వరుస బాలీవుడ్ చిత్రాలతో దూసుకెళుతున్నారు. ఇటీవల విడుదలైన 'క్రూ' సినిమాతో మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్న టబు ప్రస్తుతం హిందీలో మరికొన్ని ప్రాజెక్ట్‌లు కమిట్ అయ్యారు. అలాగే హాలీవుడ్ సూపర్ హిట్ టెలివిజన్ సిరీస్ 'డ్యూన్: ప్రొఫెసి'లో నటించే లక్కీ చాన్స్ అందుకున్నారు. 'డ్యూన్' సిరీస్‌కి ప్రపంచవ్యాప్తంగా అద్భుతమైన ఫాలోయింగ్ ఉంది. తొలి భాగానికి మంచి స్పందన రావడంతో రెండో భాగం 'డ్యూన్: ప్రొఫెసి'ని ప్లాన్ చేశారు మేకర్స్. ఇందులో సిస్టర్ ఫ్రాన్సెస్ అనే ఎంతో ప్రాధాన్యమైన పాత్రలో టబు నటించనున్నారు. డయాన్ అడెము-జాన్ క్రియేషన్స్‌లో ఈ సిరీస్ రూపొందనుంది. పది వేల సంవత్సరాల క్రితం ఏం జరిగింది? అనే పాయింట్‌తో 'డ్యూన్' తొలి భాగం రూపొందింది. 'డ్యూన్: ప్రొఫెసి'ని సైన్స్ ఫిక్షన్ జానర్‌లో తెరకెక్కించనున్నారట. తొలి భాగం కంటే ఐదు రెట్ల బడ్జెట్ కేటాయించారని టాక్.

సంగీత్ ప్రారంభం



తేజు అశ్విని, నిఖిల్

నిఖిల్ విజయేంద్ర సింహా, తేజు అశ్విని జంటగా విక్రమ్ శివ, సూర్య గణపతి, హర్ష చెముడు కీలక పాత్రల్లో 'సంగీత్' సినిమా ప్రారంభమైంది. కన్నడ హిట్ మూవీ 'హంబుల్ పొలిటీషియన్ నోగ్‌రాజ్' ఫేమ్ సాద్ ఖాన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. జి. మనోహరం, ఎల్. బాలకృష్ణ సమర్పణలో నవీన్ మనోహరన్, చంద్రు మనోహరన్, స్రవంతి నవీన్ నిర్మిస్తున్న ఈ మూవీ మంగళవారం ప్రారంభమైంది. శౌర్య కెమెరా స్విచ్చాన్ చేయగా, ఎస్ఎస్ కార్తికేయ క్లాప్ కొట్టారు. నిహారిక కొణిదెల యూనిట్‌కి స్క్రిప్ట్ అందించారు. ''పెళ్లి టైమ్‌లో ఓ కుటుంబంలో జరిగే ఘటనలను వినోదభరితంగా చూపిస్తున్నాం'' అన్నారు సాద్ ఖాన్. ''ఇది నా మనసుకి దగ్గరైన కథ'' అన్నారు నిఖిల్ విజయేంద్ర సింహా. ఈ చిత్రానికి సంగీతం: కల్యాణ్ నాయక్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: మాజ్ ఖాన్.

సస్పెన్స్... థ్రిల్



'మిరల్' పోస్టర్

'ప్రేమిస్తే' మూవీ ఫేమ్ భరత్ హీరోగా నటించిన తాజా చిత్రం 'మిరల్'. ఎం. శక్తివేల్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో వాణీ భోజన్ హీరోయిన్. జగన్మోహిని, జి. ఢిల్లీ బాబు సమర్పణలో సీహెచ్ సతీష్ కుమార్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 17న రిలీజ్ కానుంది. ''హారర్, సస్పెన్స్ సీట్ ఎడ్జ్ థ్రిల్లర్‌గా రాబోతోన్న చిత్రం 'మిరల్'. ఇటీవల విడుదల చేసిన ట్రైలర్‌తో మా సినిమా మీద అంచనాలు పెరిగాయి. పోస్టర్, ట్రైలర్‌లో చూపించినట్టు ఆ మాస్క్ కథ ఏంటి? అనే ఆసక్తి అందరిలోనూ నెలకొంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

ఆ స్ఫూర్తితో కథ రాశా – కృష్ణమాచారి



''భాగ్యలక్ష్మి బంపర్ డ్రా'లో అలీగారికి కోటి రూపాయిల లాటరీ తగులుతుంది. ఆ ఆనందంలో ఆయన నవ్వుతూనే చనిపోతారు. సినిమా అంతా నవ్వు ముఖంతోనే ఉంటారు. అలాగే క్రికెటర్ లక్ష్మీపతి బాలాజీకి జరిగిన సర్జరీ వల్ల ఆయన ముఖం ఎప్పుడూ నవ్వుతున్నట్లే కనిపిస్తుంది. ఇలాంటి లోపంతో కథ రాస్తే బావుంటుందనిపించి 'రాజు యాదవ్' స్క్రిప్ట్ రాశాను'' అని డైరెక్టర్ కృష్ణమాచారి అన్నారు. గెటప్ శ్రీను హీరోగా కె. ప్రశాంత్ రెడ్డి, రాజేశ్ కల్లెపల్లి నిర్మించిన చిత్రం 'రాజు యాదవ్'. ఈ నెల 17న ఈ సినిమా రిలీజవుతున్న సందర్భంగా కృష్ణమాచారి మాట్లాడుతూ– ''15 ఏళ్ల క్రితం ఇండస్ట్రీకి వచ్చాను. 'నీదీ నాదీ ఒకే కథ, విరాటపర్వం' చిత్రాలకు దర్శకుడు వేణు ఊడుగులగారి వద్ద అసోసియేట్ డైరెక్టర్‌గా చేశాను. దర్శకుడిగా 'రాజు యాదవ్' నా తొలి చిత్రం. నాకు సహజత్వంతో కూడకున్న సినిమాలంటే ఇష్టం. 'రాజు యాదవ్' రియలిస్టిక్‌గా ఉంటుంది. గెటప్ శ్రీను కెరీర్‌లో ఇది గుర్తుండిపోయే సినిమా అవుతుంది. హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం, సురేష్ బొబ్బిలి నేపథ్య సంగీతం సినిమాని మరో స్థాయికి తీసుకెళ్లాయి. చంద్రబోస్‌గారు మా సినిమా కోసం ఓ పాట రాసి, పాడటం సంతోషంగా ఉంది. సినిమా అద్భుతంగా వచ్చింది'' అన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	328	73,105
నిఫ్టీ ▲	114	22,218

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	16,413	▲ 25
డోజోన్స్	39,330	▽ 102
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,428	▲ 13
డాక్స్	18,716	▽ 26
షాంఘై	3,146	▽ 2
నికాయ్	38,356	▲ 177

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (24 క్యారట్)	72,820
బంగారం (22 క్యారట్)	66,750
వెండి (కిలో)	87,200

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎంతం	83.11	84.13
£	బ్రిటన్ పౌండ్	ఎంతం	103.74	106.28
€	యూరో	ఎంతం	89.02	91.40
¥	జపాన్ ఎన్ (100)	ఎంతం	52.88	54.05
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎంతం	54.25	56.22
S$	సింగపూర్ డాలర్	భాపుసుబిక	59.40	64.10
SAR	సౌదీ రియాల్	భాపుసుబిక	21.37	22.93
UAE D	యూఏఈ దిర్హామ్	భాపుసుబిక	21.85	23.63
¥	చైనా యువాన్	భాపుసుబిక	10.42	12.50

ఎఫ్అండ్‌వోతో జర జాగ్రత్త

రిటైల్ ఇన్వెస్టర్లకు ఆర్థిక మంత్రి హెచ్చరిక



బీఎస్ఈలో జరిగిన వికసిత్ భారత్ 2047 కార్యక్రమంలో నిర్మలా సీతారామన్, ఎక్స్ఛేంజీ ఎండీ, సీఈవో సుందరరామన్ రామమూర్తి తదితరులు

ముంబై: రిస్కులతో కూడుకున్న ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్అండ్‌వో) ట్రేడింగ్‌లో రిటైల్ ఇన్వెస్టర్లు కూడా పెద్ద ఎత్తున పాల్గొంటున్న నేపథ్యంలో దీనిపై తగిన విధంగా పర్యవేక్షణ ఉండాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అభిప్రాయపడ్డారు. లేని పక్షంలో భవిష్యత్తులో మార్కెట్లతో పాటు ఇన్వెస్టర్ల సెంటిమెంటు, కుటుంబాల పొదుపునకు సవాళ్లు తలెత్తగలవని ఆమె హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఆ నిధులకు రక్షణ కల్పించడం తమ లక్ష్యమని బీఎస్ఈ నిర్వహించిన వికసిత్ భారత్ 2047 కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా మంత్రి చెప్పారు. ఎఫ్అండ్‌వోలో ట్రేడింగ్ కారణంగా ప్రతి పది మంది రిటైల్ ఇన్వెస్టర్లలో తొమ్మిది మంది రిటైల్ ఇన్వెస్టర్లు నష్టపోతున్నారన్న సెబీ అధ్యయనం నేపథ్యంలో మంత్రి వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

మార్కెట్లకు బ్లూచిప్స్ దన్ను

మూడో రోజూ ముందుకే



ముంబై: వరుసగా మూడో రోజు దేశీ స్టాక్ మార్కెట్లు బలపడ్డాయి. ప్రధానంగా బ్లూచిప్స్‌లో కొనుగోళ్లు ఇందుకు సహకరించాయి. సెన్సెక్స్ 328 పాయింట్లు లాభపడి 73,105కు చేరగా.. నిఫ్టీ 114 పాయింట్లు పుంజుకుంది. 22,218 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 510 పాయింట్లు జంప్‌చేసి 73,286ను అధిగమించింది. నిఫ్టీ సైతం గరిష్టంగా 22,270ను తాకింది.

మెటల్ మెరుపులు

ఎన్ఎస్ఈలో మెటల్, ఆటో, ఆయిల్ రంగాలు 3–1.5 శాతం మధ్య ఎగశాయి. ఇతర ఇండెక్సులలో పీఎస్‌యూ బ్యాంక్స్, కన్జూమర్ డ్యూరబుల్స్, రియల్టీ, మీడియా 1 శాతం స్థాయిలో బలపడగా.. ఎఫ్ఎంసీజీ, ఫార్మా 0.5 శాతం నీరసించాయి. నిఫ్టీ దిగ్గజాలలోఅదానీ ఎంటర్, ఎంఅండ్ఎం, హీరోమోటో, ఓఎన్‌జీసీ, ఎల్అండ్‌టీ, జేఎస్‌డబ్ల్యూ, హిందాల్కో, అదానీ పోర్ట్స్, ఐషర్, సన్ ఫార్మా, ఎన్‌టీపీసీ, ఆర్ఐఎల్, ఇండస్ఇండ్, అల్ట్రాటెక్, ఎస్‌బీఐ, టైటన్, విప్రో 5.4–1 శాతం మధ్య లాభపడ్డాయి.

అదానీ షేర్ల హవా

మంగళవారం ట్రేడింగ్‌లో అదానీ గ్రూప్ కౌంటర్లకు భారీ డిమాండ్ నెలకొంది. దీంతో 10 లిస్టెడ్ కంపెనీలు 5.5–2 శాతం మధ్య ఎగశాయి. వెరసి వీటి మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ (విలువ) దాదాపు రూ. 15,86,019 కోట్లకు చేరింది. ఈ ఏడాది(2024–25) వివిధ బిజినెస్‌లపై రూ. 80,000 కోట్లు ఇన్వెస్ట్ చేసే ప్రణాళికలున్నట్లు కంపెనీ ఇటీవల వెల్లడించిన సంగతి తెలిసిందే.

పసిడి గనుల రేసులో హిందుస్తాన్ జింక్, జేకే సిమెంట్

రాజస్తాన్‌లోని మైన్స్‌కు సాంకేతిక అర్హత



న్యూఢిల్లీ: రాజస్తాన్‌లో వేలం వేస్తున్న రెండు పసిడి గనులను దక్కించుకునేందుకు పోటీపడుతున్న సంస్థల్లో వేదాంత గ్రూప్ కంపెనీ హిందుస్తాన్ జింక్, జిందాల్ పవర్, జేకే సిమెంట్ తదితర సంస్థలు సాంకేతిక అర్హత పొందాయి. భూక్యా–జగ్‌పురా గోల్డ్ బ్లాక్ కోసం జిందాల్ పవర్, హిందుస్తాన్ జింక్, రామ్‌గఢ్ మినరల్స్ అండ్ మైనింగ్, సయ్యద్ ఒవైస్ అలీ, హిరాకుండ్ నేచురల్ రిసోర్సెస్ సంస్థలు సాంకేతికంగా అర్హత కలిగిన బిడ్డర్లుగా నిల్చాయి. అటు కాంక్రియా గెరా పసిడి గనికి హిందుస్తాన్ జింక్, జేకే సిమెంట్ తదితర సంస్థలు టెక్నికల్ అర్హత సాధించాయి. 2024 మార్చిలో పసిడి గనుల వేలం ప్రక్రియ ప్రారంభమైంది.

మొజాంబిక్ లిథియం బ్లాకుల్లో దెక్కన్ గోల్డ్ మైన్స్‌కు వాటాలు: ఆఫ్రికా దేశం మొజాంబిక్‌లో అయిదు లిథియం బ్లాకుల్లో మెజారిటీ వాటాలు కొనుగోలు చేసినట్లు దెక్కన్ గోల్డ్ మైన్స్ (డీజీఎంఎల్) వెల్లడించింది. ఇందుకోసం మొజాంబిక్‌కు చెందిన మాగ్నిఫికా గ్రూప్‌తో కలిసి దెక్కన్ గోల్డ్ మొజాంబిక్ ఎల్‌డీఏ (డీజీఎంవోజెడ్) పేరిట జాయింట్ వెంచర్ ఏర్పాటు చేసినట్లు వివరించింది.

ఆహార ధరల తీవ్రత

- టోకు ద్రవ్యోల్బణం ఏప్రిల్‌లో 1.26%
- 13 నెలల గరిష్టం

న్యూఢిల్లీ: టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత రిటైల్ ద్రవ్యోల్బణం ఏప్రిల్‌లో 1.26 శాతంగా నమోదైంది. గడచిన 13 నెలల్లో ఈ స్థాయి టోకు ద్రవ్యోల్బణం ఇదే తొలిసారి. ఆహార ఉత్పత్తుల ధరలు పెరగడం దీనికి ప్రధాన కారణం. ఫుడ్ ఆర్టికల్స్‌లో పాటు, విద్యుత్, క్రూడ్ పెట్రోలియం, సహజ వాయువు, కొన్ని తయారీ ఉత్పత్తుల ధరలూ పెరిగినట్లు వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ సూచీ వరుసగా రెండు నెలల నుంచి పెరుగుతూ వస్తోంది. ఫిబ్రవరిలో 0.20% ఉన్న డబ్ల్యూపీఐ, మార్చిలో 0.53 శాతానికి ఎగసింది. గత 2023 ఏప్రిల్‌లో సూచీ 0.79 శాతం పెరిగింది.



అధికారిక గణాంకాల్లో కొన్ని ముఖ్యాంశాలు చూస్తే..

- ఫుడ్ ఆర్టికల్స్ ధరలు మార్చిలో 6.88 శాతం పెరిగితే, ఏప్రిల్‌లో 7.74 శాతం ఎగశాయి. ఇదే కాలంలో కూరగాయల ధరలు 19.52 శాతం నుంచి 23.60 శాతానికి ఎగశాయి. ఆలూ ధరలు 52.96 శాతం నుంచి 71.97 శాతానికి పెరిగాయి. ఇక ఉల్లి ధరలు మార్చిలో 56.99% పెరిగితే, ఏప్రిల్‌లో 59.75 % ఎగశాయి.
- ఫ్యూయల్ అండ్ పవర్ బాస్కెట్ విభాగంలో ద్రవ్యోల్బణం ఏప్రిల్‌లో 1.38 శాతంగా ఉంది. మార్చిలో ఈ విభాగంలో అసలు పెరుగుదల లేకపోగా మైనస్ 0.77 శాతంగా (క్షీణత) నమోదైంది.
- సూచీలో మెజారిటీ వాటా కలిగిన తయారీ ఉత్పత్తుల ద్రవ్యోల్బణం మాత్రం ఏప్రిల్‌లో పెరక్కపోగా, 0.42 శాతం క్షీణించింది. అయితే మార్చిలో ఈ క్షీణ రేటు 0.85 శాతం ఉండడం గమనార్హం.

ఎయిర్‌టెల్ వీక్ సిగ్నల్స్

క్యూ4లో రూ. 2,072 కోట్లు • షేరుకి రూ. 8 డివిడెండ్



న్యూఢిల్లీ: భారతీ ఎయిర్‌టెల్ గత ఆర్థిక సంవత్సరం(2023–24) చివరి త్రైమాసికంలో నిరుత్సాహకర ఫలితాలు ప్రకటించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 31 శాతం క్షీణించి రూ. 2,072 కోట్లకు పరిమితమైంది. వాటాదారులకు షేరుకి రూ. 8 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. మొత్తం ఆదాయం మాత్రం 4 శాతం పైగా పుంజుకుని రూ. 37,599 కోట్లను అధిగమించింది. నైజీరియన్ కరెన్సీ నైరా విలువ తగ్గింపు పనితీరుపై ప్రభావం చూపినట్లు కంపెనీ ఎండీ గోపాల్ విఠల్ పేర్కొన్నారు. దీంతో రూ. 2,544 కోట్లకు పైగా ఫారెక్స్ నష్టం వాటిల్లినట్లు వెల్లడించారు. ఒక్కో వినియోగదారునిపై సగటు ఆదాయం(ఏఆర్‌పీయూ) 8% మెరుగై రూ. 209కు చేరింది.

దేశీయంగా గుడ్: దేశీయంగా క్యూ4లో ఎయిర్‌టెల్ ఆదాయం 13 శాతం ఎగసి రూ. 28,513 కోట్లను తాకింది. 4జీ, 5జీ కస్టమర్ల సంఖ్య 13 శాతం ఎగసి 25.27 కోట్లను తాకింది. మొత్తం కస్టమర్ల సంఖ్య 5 శాతం బలపడి 35.22 కోట్లకు చేరింది. పూర్తి ఏడాదికి ఎయిర్‌టెల్ నికర లాభం 10 శాతంపైగా నీరసించి రూ. 7,467 కోట్లకు పరిమితమైంది. 2022–23లో రూ. 8,346 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం 8% బలపడి రూ. 1,49,982 కోట్లను అధిగమించింది.

షేరు బీఎస్ఈలో స్వల్ప నష్టంతో రూ. 1,285 వద్ద ముగిసింది.

పీవీఆర్ ఐనాక్స్ నష్టాలు తగ్గాయ్

న్యూఢిల్లీ: పీవీఆర్ ఐనాక్స్ మార్చి త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన నష్టాలను భారీగా తగ్గించుకుని రూ. 130 కోట్లకు పరిమితం చేసుకుంది. 2022–23 క్యూ4లో రూ. 334 కోట్ల నికర నష్టం నమోదైంది. మొత్తం ఆదాయం సైతం రూ. 1,143 కోట్ల నుంచి రూ. 1,256 కోట్లకు పుంజుకుంది. మొత్తం వ్యయాలు రూ. 1,364 కోట్ల నుంచి రూ. 1,481 కోట్లకు పెరిగాయి. ఇక పూర్తి ఏడాదికి పీవీఆర్ ఐనాక్స్ నికర నష్టం కేవలం రూ. 33 కోట్లకు పరిమితమైంది. 2022–23లో రూ. 336 కోట్ల నష్టం నమోదైంది. ఆదాయం రూ. 3,751 కోట్ల నుంచి రూ. 6,107 కోట్లకు ఎగసింది.

ఫలితాల నేపథ్యంలో పీవీఆర్ ఐనాక్స్ షేరు బీఎస్ఈలో 1.5 శాతం నష్టంతో రూ. 1,298 వద్ద ముగిసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

15-5-2024 ఫామ్ ధర...

విశాఖ	550-00
చిత్తూరు	618-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	540-00
విజయవాడ	540-00
హైదరాబాద్	545-00
వరంగల్	547-00


సాగర్ సిమెంట్స్ డివిడెండ్ 70 పైసలు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సాగర్ సిమెంట్స్ బోర్డు 2023–24 ఆర్థిక సంవత్సరానికి రూ.2 ముఖ విలువ కలిగిన ఒక్కో షేరుపై 70 పైసల డివిడెండ్ చెల్లించాలని ప్రతిపాదించింది. మార్చి త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే రూ.88 కోట్ల నుంచి రూ.11 కోట్లకు పడిపోయింది. టర్నోవర్ రూ.802 కోట్ల నుంచి రూ.752 కోట్లకు వచ్చి చేరింది. 2023–24లో రూ.2,559 కోట్ల టర్నోవర్‌పై రూ.53 కోట్ల నికరనష్టం వాటిల్లింది. దాచేపల్లి ప్లాంటు క్లింకర్, సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యం పెంపునకు కంపెనీ 2024–25లో రూ.255 కోట్లు, 2025–26లో రూ.215 కోట్ల పెట్టుబడి చేయనుంది. ఎండీగా ఎస్.ఆనంద్ రెడ్డి, జేఎండీగా ఎస్.శ్రీకాంత్ రెడ్డిని తిరిగి నియమిస్తూ కంపెనీ నిర్ణయం తీసుకుంది. 2024 అక్టోబర్ 31 నుంచి మూడేళ్లు ఈ పదవిలో ఉంటారు. బీఎస్ఈలో మంగళవారం షేరు ధర 0.02% పెరిగి రూ. 214.25 వద్ద స్థిరపడింది.

వాహన విక్రయాల్లో ఏప్రిల్ శుభారంభం

- గతేడాదితో పోలిస్తే 25% జంప్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశవ్యాప్తంగా హోల్‌సేల్ వాహన విక్రయాల్లో ఏప్రిల్ శుభారంభం చేసింది. అన్ని విభాగాల్లో కలిపి గత నెలలో 21,36,157 యూనిట్లు తయారీ కంపెనీల నుంచి డీలర్లకు చేరాయి. 2023 ఏప్రిల్‌తో పోలిస్తే ఇది ఏకంగా 25 శాతం అధికం కావడం విశేషం. సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫాక్చరర్స్ (సియామ్) ప్రకారం.. ఏప్రిల్‌లో అన్ని వాహన విభాగాలు మెరుగైన హోల్‌సేల్ విక్రయాలను నమోదు చేయడం గమనార్హం. ప్యాసింజర్ వెహికిల్స్ 1.3 శాతం వృద్ధితో 3,31,278 యూనిట్లు అమ్ముడయ్యాయి. ప్యాసింజర్ కార్స్ 23.4 శాతం క్షీణించి 96,357 యూనిట్లు, యుటిలిటీ వెహికల్స్ 21 శాతం దూసుకెళ్లి 1,79,329 యూనిట్లను తాకాయి. వ్యాన్స్ అమ్మకాలు 15 శాతం పెరిగి 12,060 యూనిట్లుగా ఉన్నాయి. ద్విచక్ర వాహనాలు ఏకంగా 31 శాతం ఎగసి 17,51,393 యూనిట్లకు చేరుకున్నాయి. మోటార్‌సైకిల్స్ 34.4 శాతం దూసుకెళ్లి 11,28,192 యూనిట్లు, స్కూటర్స్ 25.2 శాతం అధికమై 5,81,277 యూనిట్లను తాకాయి. త్రిచక్ర వాహనాలు 14.5 శాతం ఎగసి 49,116 యూనిట్లు నమోదు చేశాయి.

భవిత

ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ — ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

ఇండియన్ నేవీలో అగ్నివీర్(ఎంఆర్) పోస్టులు

భారత నౌకాదళంలో అగ్నిపథ్ స్కీమ్‌లో భాగంగా.. అగ్నివీర్(ఎంఆర్) ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. అవివాహిత పురుష, మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అగ్నివీరులుగా ఎంపికైన వారికి ఐఎన్ఎస్ చిల్కాలో శిక్షణ ఉంటుంది.

- **అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో పదో తరగతి లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.
- **వయసు:** అభ్యర్థి 01.11.2003 నుంచి 30.04.2007 మధ్యలో జన్మించి ఉండాలి.
- **వేతనం:** ఎంపికైన అభ్యర్థులకు మొదటి ఏడాది రూ.30,000, రెండో ఏడాది రూ.33,000, మూడో ఏడాది రూ.36,500, నాలుగో ఏడాది రూ.40,000.
- **ఎంపిక విధానం:** అప్లికేషన్ షార్ట్‌లిస్టింగ్, స్టేజ్–1(ఇండియన్ నేవీ ఎంట్రన్స్ టెస్ట్), స్టేజ్–2(రాతపరీక్ష, శారీరక దారుఢ్య పరీక్ష–పీఎఫ్‌టీ), వైద్య పరీక్షల ఆధారంగా ఎంపికచేస్తారు.
- **పరీక్ష విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష నిర్వహిస్తారు. ప్రశ్నపత్రం హిందీ /ఇంగ్లిష్ భాషల్లో మొత్తం 50 బహుళైచ్ఛిక ప్రశ్నలతో ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు చొప్పున 50 మార్కులు ఉంటాయి. సైన్స్, మ్యాథమేటిక్స్, జనరల్ అవేర్‌నెస్ సబ్జెక్టుల నుంచి పదో తరగతి స్థాయిలో ప్రశ్నలుంటాయి. పరీక్ష వ్యవధి 30 నిమిషాలు. నెగిటివ్ మార్కింగ్ ఉంటుంది.
- **శిక్షణ:** అగ్నివీర్‌లుగా ఎంపికైన అభ్యర్థులకు ఒడిశా రాష్ట్రంలోని ఐఎన్ఎస్ చిల్కాలో వచ్చే ఏడాది నవంబర్ నెలలో శిక్షణ ప్రారంభమవుతుంది.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 13.05.2024.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరితేది:** 27.05.2024.
- **శిక్షణ ప్రారంభం:** 2024 నవంబర్ నెలలో
- **వెబ్‌సైట్:** www.joinindiannavy.gov.in

డీఆర్‌డీవో–చెస్, హైదరాబాద్‌లో 25 అప్రెంటిస్‌లు

హైదరాబాద్‌లోని డీఆర్‌డీవోకి చెందిన సెంటర్ ఫర్ హైఎనర్జీ సిస్టమ్ అండ్ సైన్సెస్(సీహెచ్ఈఎస్ఎస్).. గ్రాడ్యుయేట్ అప్రెంటిస్(ఇంజినీర్స్) ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **మొత్తం ఖాళీల సంఖ్య:** 25.
- **శిక్షణ వ్యవధి:** 12 నెలలు.
- **విభాగాలు:** గ్రాడ్యుయేట్(డిగ్రీ), టెక్నీషియన్(డిప్లొమా) అప్రెంటిస్.
- **అర్హత:** సంబంధిత విభాగాన్ని అనుసరించి బీఈ/బీటెక్, డిప్లొమా కోర్సులు ఉత్తీర్ణులై ఉండాలి.
- **స్టైపెండ్:** నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్ పోస్టులకు రూ.9000, టెక్నీషియన్ అప్రెంటిస్ పోస్టులకు రూ.8000.
- **ఎంపిక విధానం:** దరఖాస్తుల షార్ట్‌లిస్టింగ్, విద్యార్హత మార్కుల శాతం, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** ఎంప్లాయ్‌మెంట్ న్యూస్‌లో ప్రకటన వెలువడిన 21 రోజుల్లోపు దరఖాస్తు చేసుకోవాలి.
- **ప్రకటన వెలువడిన తేదీ:** 11.05.2024.
- **వెబ్‌సైట్:** https://drdo.gov.in/drdo

భారత వాయుసేనలో అగ్నివీర్ వాయు(మ్యూజీషియన్) పోస్టులు

భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన భారత వాయుసేన అగ్నిపథ్ స్కీమ్‌లో భాగంగా.. అగ్నివీర్ వాయు నియామకాలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసింది. అగ్నివీర్ వాయు (మ్యూజీషియన్) (01/2025) ఖాళీల భర్తీకి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతోంది. అర్హులైన అవివాహిత పురుష, మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **అర్హత:** గుర్తింపు పొందిన పాఠశాల/బోర్డు నుంచి మెట్రిక్యులేషన్/పదో తరగతి లేదా తత్సమాన ఉత్తీర్ణులవ్వాలి. అభ్యర్థులు సంగీతంతోపాటు సంబంధిత వాయిద్య పరికరం వాయించడంతో ప్రావీణ్యం కలిగి ఉండాలి. సంగీతానుభవ ధ్రువపత్రం తప్పనిసరిగా ఉండాలి. నిర్దిష్ట శారీరక దారుఢ్య/వైద్య ప్రమాణాలు కలిగి ఉండాలి.
- **వయసు:** 02.01.2004 నుంచి 02.07.2007 మధ్య జన్మించి ఉండాలి.
- **ఎంపిక విధానం:** మ్యూజికల్ ఇన్‌స్ట్రుమెంట్స్ ప్రొఫీషియన్సీ టెస్ట్, ఇంగ్లిష్ రాతపరీక్ష, ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, అడాప్టబిలిటీ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభతేది:** 22.05.2024.
- **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చివరితేది:** 05.06.2024.
- **రిక్రూట్‌మెంట్ ర్యాలీ తేదీలు:** 03.07.2024 నుంచి 12.07.2024 వరకు
- **వెబ్‌సైట్:** https://agnipathvayu.cdac.in

» నైపర్‌లో ఎంఫార్మసీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు
» నైపర్–జేఈఈ ర్యాంకు ఆధారంగా ప్రవేశం
» పీజీ, పీహెచ్‌డీల్లో చేరిన విద్యార్థులకు స్కాలర్‌షిప్స్
» ఫార్మా రంగంలో కెరీర్ అవకాశాలు

నైపర్‌లో.. పీజీ, పీహెచ్‌డీ

ఫార్మసీలో ఉన్నత విద్యకు ఉత్తమ వేదికలు.. నైపర్ క్యాంపస్‌లు! ఫార్మా కోర్సులను అందించడంలో అంతర్జాతీయ గుర్తింపు పొందిన ఈ ఇన్‌స్టిట్యూట్స్‌లో పీజీ, పీహెచ్‌డీ పూర్తి చేస్తే..ఉజ్వల కెరీర్ అవకాశాలు సొంతం చేసుకోవచ్చు! నైపర్‌లో ప్రవేశం పొందాలంటే.. నైపర్–జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్‌లో స్కోర్ సాధించాల్సి ఉంటుంది!! తాజాగా 2024 విద్యా సంవత్సరానికి సంబంధించి నైపర్–జేఈఈ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో.. నైపర్ జేఈఈకి అర్హతలు, పరీక్ష విధానం, బెస్ట్ స్కోర్‌కు మార్గాలు, పీజీ స్పెషలైజేషన్స్, భవిష్యత్తు అవకాశాలపై ప్రత్యేక కథనం..


నైపర్ జేఈఈ 2024

ఫార్మా రంగంలో నాణ్యమైన ఉన్నత విద్యను అందించాలనే లక్ష్యంతో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యుటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(నైపర్) క్యాంపస్‌లను ఏర్పాటు చేశారు. ఈ విద్యాసంస్థలు ఇండస్ట్రీ, రీసెర్చ్ ల్యాబ్స్‌తో ఒప్పందాల ద్వారా ప్రాక్టికాలిటీకి ప్రాధాన్యమిస్తూ .. ఎంఫార్మసీ, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు అందిస్తున్నాయి. ఆయా కోర్సుల్లో ప్రవేశాల కోసం ప్రతి ఏటా నైపర్–జేఈఈ నిర్వహిస్తున్నారు.

ఏడు క్యాంపస్‌లు.. 990 సీట్లు

దేశ వ్యాప్తంగా ప్రస్తుతం ఏడు నైపర్ క్యాంపస్‌లు ఉన్నాయి. వాటిలో ఎంఫార్మసీ, ఎంటెక్, ఎంబీఏ స్థాయిల్లో మొత్తం 990 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

కోర్సులు–స్పెషలైజేషన్లు

- మాస్టర్ ఆఫ్ సైన్స్ (ఫార్మసీ)–మెడిసినల్ కెమిస్ట్రీ, నేచురల్ ప్రొడక్ట్స్, ట్రెడిషనల్ మెడిసిన్, ఫార్మాస్యూటికల్ అనాలసిస్, ఫార్మకాలజీ అండ్ టాక్సికాలజీ, రెగ్యులేటరీ టాక్సికాలజీ, ఫార్మస్యూటిక్స్, ఫార్మకోఇన్ఫర్మాటిక్స్, రెగ్యులేటరీ అఫైర్స్.
- మాస్టర్ ఆఫ్ ఫార్మసీ (ఎంఫార్మ్)–ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ(ఫార్ములేషన్స్), ఫార్మసీ ప్రాక్టీస్, క్లినికల్ రీసెర్చ్.
- మాస్టర్ ఆఫ్ టెక్నాలజీ(ఫార్మసీ)–బయోటెక్నాలజీ/ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ (బయోటెక్నాలజీ), ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ(ప్రాసెస్ కెమిస్ట్రీ/మెడిసినల్ కెమిస్ట్రీ), మెడికల్ డివైసెస్.
- మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(ఫార్మసీ)–ఫార్మాస్యూటికల్ మేనేజ్‌మెంట్.

అర్హతలు

- **నైపర్–జేఈఈ (పీజీ):** సదరు పీజీ ప్రోగ్రామ్‌ను అనుసరించి బీఫార్మసీ/బీవీఎస్సీ /ఎంబీబీఎస్ /బీడీఎస్/బీటెక్ (బయో టెక్నాలజీ)/ఎమ్మెస్సీ తత్సమాన కోర్సుల్లో 6.75 సీజీపీఏ లేదా అంతకు సమానమైన పర్సంటేజీతో ఉత్తీర్ణత సాధించాలి. దీంతోపాటు జీప్యాట్/గేట్/నెట్‌లో అర్హత సాధించాలి. అర్హత కోర్సు చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **నైపర్–జేఈఈ(పీహెచ్‌డీ):** ఆయా విభాగాలను అనుసరించి ఎంఎస్,ఎంఫార్మసీ, ఎంటెక్ కోర్సులను సదరు స్పెషలైజేషన్లతో 6.75 సీజీపీఏతో ఉత్తీర్ణత సాధించాలి. ఎస్సీ, ఎస్టీ కేటగిరీ అభ్యర్థులు 6.25 సీజీపీఏ లేదా 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తే సరిపోతుంది. దీంతోపాటు జీప్యాట్/గేట్/సీఎస్ఐఆర్–యూజీసీ నెట్‌లో అర్హత సాధించాలి. ఎండీ, ఎంవీఎస్సీ, ఎండీఎస్, ఫార్మ్–డి ఉత్తీర్ణులకు జీప్యాట్/నెట్/గేట్ నిబంధన నుంచి మినహాయింపు లభిస్తుంది.

200 మార్కులకు పరీక్ష

ఆన్‌లైన్ విధానంలో నిర్వహించే నైపర్ జేఈఈ పరీక్ష 200 మార్కులకు ఉంటుంది. ఇందులో మొత్తం ప్రశ్నలు 200 ఉంటాయి. పరీక్షను రెండు సెక్షన్లుగా నిర్వహిస్తారు. సెక్షన్–ఎలో 50 ప్రశ్నలు జీకే, జనరల్ ఇంగ్లిష్, ఆప్టిట్యూడ్, రీజనింగ్ అంశాల నుంచి అడుగుతారు. సెక్షన్–బిలో 150 ప్రశ్నలు బీఫార్మసీ లేదా ఎంఫార్మసీకి సంబంధించి ఉంటాయి. పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహించే ఈ పరీక్షలో మెరుగైన ర్యాంకు పొందాలంటే.. అభ్యర్థులు బీఫార్మసీ స్థాయిలోని అకడమిక్స్‌పై పూర్తి స్థాయి పట్టు సాధించాలి. కెమిస్ట్రీ, ఫార్మకాలజీ, బయో టెక్నాలజీ, ఫార్మాస్యుటికల్ అనాలిసిస్ విభాగాలపై ఎక్కువ దృష్టి పెట్టాలి. మొత్తం 200 ప్రశ్నల్లో 70 శాతం మేర ప్రశ్నలు ఈ విభాగాల నుంచే అడుగుతున్నారు. కొన్ని ప్రశ్నలు జనరల్ ఆప్టిట్యూడ్‌కు సంబంధించినవి ఉంటున్నాయి.

ఎంబీఏకు జీడీ/పీఐ

నైపర్ క్యాంపస్‌లలో ఎంబీఏ ఫార్మా మేనేజ్‌మెంట్ కోర్సులో ప్రవేశానికి నైపర్ –జేఈఈలో ఉత్తీర్ణతతోపాటు గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలోనూ రాణించాల్సి ఉంటుంది. నైపర్–జేఈఈకి 85 శాతం వెయిటేజీ; గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ రెండింటికీ కలిపి 15 శాతం వెయిటేజీ ఇస్తారు.

ఉమ్మడి కౌన్సెలింగ్

నైపర్–జేఈఈలో నిర్దేశిత కటాఫ్ మార్కులు పొందిన అభ్యర్థులకు ఉమ్మడి కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ప్రతి ఏటా ఒక క్యాంపస్ నైపర్–జేఈఈని నిర్వహిస్తుంది. ఆ క్యాంపస్ ఆధ్వర్యంలోనే ఉమ్మడి కౌన్సెలింగ్ జరుగుతుంది. అందుబాటులో ఉన్న సీట్లు, కటాఫ్ మార్కులు తదితరాల ఆధారంగా ప్రవేశ జాబితా రూపొందిస్తారు. ఎంపికైన అభ్యర్థులు నిర్దేశిత గడువులోపు తమకు సీటు లభించిన క్యాంపస్‌లో జాయినింగ్ రిపోర్ట్ ఇవ్వాల్సి ఉంటుంది.

స్టయిఫండ్

నైపర్–జేఈఈ స్కోర్ ఆధారంగా ప్రవేశం ఖరారు చేసుకున్న అభ్యర్థులకు నైపర్ క్యాంపస్‌లు ఆర్థిక ప్రోత్సాహకాలను అందిస్తున్నాయి. పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందిన వారికి నెలకు రూ.12,400 స్టయిఫండ్ లభిస్తుంది. ఈ స్టయిఫండ్ కొనసాగాలంటే.. ప్రతి సెమిస్టర్‌లోనూ తప్పనిసరిగా జీపీఏ ఆరు పాయింట్లు ట్రాక్ రికార్డ్‌ను కొనసాగించాలి.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, మే 24
- **హాల్ టికెట్ డౌన్‌లోడ్, పరీక్ష తేదీ:** ఇంకా వెల్లడించలేదు
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://niperguwahati.ac.in/niperjee

నైపర్ జేఈఈ- పీహెచ్‌డీ

నైపర్ క్యాంపస్‌లలో పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు కూడా అందుబాటులో ఉన్నాయి. వీటిలో ప్రవేశానికి ప్రత్యేకంగా ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహిస్తారు. అభ్యర్థులు నైపర్ –జేఈఈ ఆన్‌లైన్ దరఖాస్తును పూర్తి చేసేటప్పుడే పీహెచ్‌డీ ప్రోగ్రామ్ ఆప్షన్‌ను ఎంచుకోవాలి.

పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష

పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నిర్వహించే నైపర్–జేఈఈ పరీక్ష ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో 170 ప్రశ్నలు–85 మార్కులు ఉంటాయి. కెమికల్ సైన్సెస్, బయలాజికల్ సైన్సెస్, ఫార్మాస్యుటికల్ సైన్సెస్ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష వ్యవధి రెండు గంటలు.

మలిదశలో ఇంటర్వ్యూ

ఎంట్రెన్స్‌లో పొందిన స్కోర్ ఆధారంగా మెరిట్ జాబితా రూపొందిస్తారు. ఈ జాబితాలో నిలిచిన వారికి ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఇంటర్వ్యూకు కేటాయించిన మార్కులు 15. ఇందులో అభ్యర్థులకు సదరు స్పెషలైజేషన్‌లో పరిశోధనల పట్ల ఉన్న ఆసక్తి, భవిష్యత్తు లక్ష్యాలు తదితరాలను పరిశీలిస్తారు. ఇందులోనూ విజయం సాధిస్తే పీహెచ్‌డీలో ప్రవేశం లభిస్తుంది.

సీటు పొందితే.. స్టయిఫండ్

పీహెచ్‌డీలో ప్రవేశాలకు ఎంపికైన అభ్యర్థులకు మొదటి రెండేళ్లు నెలకు రూ.31 వేలు చొప్పున; మూడు, నాలుగేళ్లు నెలకు రూ.35 వేలు చొప్పున ఆర్థిక ప్రోత్సాహకం లభిస్తుంది. దీంతోపాటు హెచ్ఆర్ఏ కూడా అందుతుంది.

బెస్ట్ స్కోర్ సాధించాలంటే

కోర్ సబ్జెక్ట్‌లకు సంబంధించి బీఫార్మసీలో పొందిన నైపుణ్యం పరీక్షలో బెస్ట్ స్కోర్‌కు దోహదపడుతుంది. అదేవిధంగా జీప్యాట్ కోసం కొనసాగించిన సన్నద్ధత సైతం పరీక్షలో రాణించేందుకు ఉపయోగపడుతుంది. ఫార్మకాలజీలో రిసెప్టర్స్,వాటి రకాలు, మెకానిజమ్ ఆఫ్ యాక్షన్, ఔషధాల వర్గీకరణ, క్లినికల్ ట్రయల్స్‌పై అవగాహన, ప్రీ–క్లినికల్ ట్రయల్స్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలి. డ్రగ్ డిస్కవరీకి సంబంధించి ముఖ్యంగా వాటి ప్రాముఖ్యతలు, రియాక్షన్స్‌పై అవగాహన ఏర్పరచుకోవాలి.

బరిలో హేమాహేమీలు

యూపీలో ఐదో విడతలో హోరాహోరీ

- రాయ్‌బరేలీలో రాహుల్, అమేథీలో స్మృతి
- 14 లోక్‌సభ స్థానాలకు 20న పోలింగ్

హస్తినకు గేట్‌వే లాంటి ఉత్తరప్రదేశ్‌లో నాలుగు విడతల్లో సగం లోక్‌సభ స్థానాల్లో పోలింగ్ పూర్తయింది. ఐదో విడతలో 14 నియోజకవర్గాల్లో ఈ నెల 20న పోలింగ్‌కు సర్వం సిద్ధమవుతోంది. అక్కడ పార్టీలన్నీ నువ్వా నేనా అనేలా తలపడుతున్నాయి. అభ్యర్థుల ప్రచారం ఫుల్ స్వింగ్‌లో సాగుతోంది. రాహుల్ గాంధీ, రాజ్‌నాథ్ సింగ్, స్మృతి ఇరానీ వంటి హేమాహేమీలు బరిలో ఉన్నారు. ఈ విడతలో కీలక నియోజకవర్గాలు, అభ్యర్థుల బలాబలాలేంటో చూద్దాం... - సాక్షి, నేషనల్ డెస్క్

పాడెపై వెళ్లి నామినేషన్!

గోరఖ్‌పూర్‌లో విచిత్రం

ఎన్నికల వేళ నామినేషన్ దాఖలు సందర్భంగా అభ్యర్థులు చిత్ర విచిత్ర విన్యాసాలతో అందరి దృష్టినీ ఆకర్షించడం పరిపాటే. ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ లోక్‌సభ స్థానం నుంచి పోటీలో ఉన్న స్వతంత్ర అభ్యర్థి మంగళవారం ఏకంగా పాడె మీద ఊరేగుతూ వచ్చి నామినేషన్ వేశారు! ఆయన పేరు రాజన్ యాదవ్. ఎంబీఏ పట్టభద్రుడైన ఆయన బౌద్ధ సన్యాసిగా మారారు. భిక్షపైనే జీవిక గడుపుకుంటారు. దేశంలో ప్రజాస్వామ్య మనుగడ ప్రమాదంలో పడిందని చెప్పేందుకే తానిలా పాడెపై వచ్చానని చెప్పారాయన. 'పాడె బాబా'గా ఆయన స్థానికంగా బాగా ప్రసిద్ధుడు. ఈసారి తన ఎన్నికల కార్యాలయాన్ని కూడా ఏకంగా శ్మశానవాటికలోనే తెరిచారు!



స్థానిక రాప్తీ నది ఒడ్డున ఉన్న ఆ శ్మశానవాటిక నుంచే ఎన్నికల సంబంధిత కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఎన్నికల ఖర్చు నిమిత్తం తనను చూసేందుకు వచ్చిన ఒక్కొక్కరి నుంచి రూపాయి చొప్పున వసూలు చేస్తున్నారు.

గమ్మత్తైన హామీలు

రాజన్ యాదవ్ ఎన్నికల హామీలు కూడా చాలా ఆసక్తికరంగా ఉన్నాయి. తనను గెలిపిస్తే ఎలాగైనా లైఫ్‌టైం ఉచిత ఇన్‌కమింగ్ కాల్స్ సౌకర్యాన్ని తిరిగి తీసుకొస్తానంటున్నారాయన. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినందుకు ద్విచక్ర వాహనాలకు వేస్తున్న జరిమానాలు కూడా మరీ ఎక్కువగా ఉన్నాయని, వాటిని తగ్గించేందుకు ప్రయత్నిస్తానని హామీ ఇస్తున్నారు. గతంలోనూ ఎన్నికల్లో పోటీ చేసిన చరిత్ర ఈ 'పాడె బాబా'ది. ఆయన తర్వాతి లక్ష్యం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలట! ఆ ఎన్నికల్లో మొత్తం 70 స్థానాలకూ పోటీ చేసి ఆప్ చీఫ్, ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను గద్దె దింపడమే తన లక్ష్యమని చెబుతున్నారు!

- గోరఖ్‌పూర్

రాయ్‌బరేలీ... రాహుల్‌కు అచ్చొచ్చేనా?



• రాహుల్ గాంధీ

ఈ స్థానం కాంగ్రెస్ దుర్గం. ఫిరోజ్ గాంధీ మొదలుకుని ఆయన భార్య ఇందిర, కోడలు సోనియా దాకా హస్తం జెండానే ఎగురుతోంది. మధ్యలో 1996, 1998ల్లో మాత్రం బీజేపీ విజయం సాధించింది. భర్త రాజీవ్ నియోజకవర్గమైన అమేథీ నుంచి ప్రత్యక్ష రాజకీయాల్లోకి ప్రవేశించిన సోనియా తర్వాత ఆ సీటును కుమారుడు రాహుల్‌కు అప్పగించి 2004లో అత్తగారి కంచుకోటలో పాగా వేశారు. అప్పటి నుంచీ వరుసగా విజయం సాధిస్తున్నారు. ఈసారి సోనియా ప్రత్యక్ష ఎన్నికల బరి నుంచి తప్పుకొని రాజ్యసభకు వెళ్లడంతో కాంగ్రెస్ నుంచి ఎవరు నిలబడతారనే సస్పెన్స్ కొనసాగింది. రాయ్‌బరేలీ నుంచి ప్రియాంకా గాంధీ ఎంట్రీ ఇస్తారంటూ ఊహాగానాలు చక్కర్లు కొట్టినా చివరకు రాహులే బరిలో దిగారు. ఆయనపై దినేశ్ ప్రతాప్ సింగ్‌ను బీజేపీ బరిలోకి దించింది. గత ఎన్నికల్లో కూడా దినేశ్ సోనియాపై పోటీ చేసి ఓడారు. ఆయన 2018లో కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పి కమలం గూటికి చేరారు. గత ఎన్నికల్లో అమేథీలో స్మృతి ఇరానీ చేతిలో రాహుల్ ఓటమి చవిచూడటం తెలిసిందే. అదే ఊపులో ఈసారి రాయ్‌బరేలీని కూడా చేజిక్కించుకోవాలని బీజేపీ భావిస్తోంది. కానీ ఇక్కడ ఇండియా కూటమి బలంగా ఉంది. ఈ లోక్‌సభ స్థానం పరిధిలోని ఐదు అసెంబ్లీ సెగ్మెంట్లలో నాలుగు ఎస్పీ గుప్పిట్లోనే ఉన్నాయి. ఒక్కచోట మాత్రమే బీజేపీ నెగ్గింది.



• దినేశ్ ప్రతాప్ సింగ్

ఝాన్సీ.. హోరాహోరీ




• ప్రదీప్ జైన్ ఆదిత్య

ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామానికి పుట్టిల్లయిన ఝాన్సీ పేరు చెప్పగానే రాణీ లక్ష్మీబాయి వీరోచిత పోరు కళ్లముందు కదలాడుతుంది. 1989 నుంచి బీజేపీకి గట్టి పట్టున్న ఈ నియోజకవర్గాన్ని మధ్యలో కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు దక్కించుకున్నప్పటికీ... తిరిగి కమలం విరబూసింది. గత రెండు ఎన్నికల్లోనూ బీజేపీయే ఇక్కడ విజయ ఢంకా మోగించింది. 2014లో కాషాయ ఫైర్‌బ్రాండ్ ఉమా భారతి 1.9 లక్షల ఓట్ల తేడాతో గెలుపొందారు. 2019లో బీజేపీ తరఫున టికెట్ దక్కించుకున్న అనురాగ్ శర్మ రెట్టింపు స్థాయిలో 3.7 లక్షల మెజారిటీతో ఎస్పీ అభ్యర్థి శ్యామ్ సుందర్ సింగ్ యాదవ్‌పై బంపర్ విక్టరీ కొట్టారు. ఈసారి కూడా సిట్టింగ్ ఎంపీ అనురాగ్ శర్మకే బీజేపీ చాన్సిచ్చింది. ఇండియా కూటమి నుంచి కాంగ్రెస్ తరఫున ప్రదీప్ జైన్ ఆదిత్య బరిలో ఉన్నారు. 2009లో ఆయన ఇక్కడ ఘన విజయం సాధించడం విశేషం. బీఎస్పీ రాకేశ్ కుశ్వాహను పోటీకి దించింది. ఈ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ఐదు అసెంబ్లీ సెగ్మెంట్లలో నాలుగు కమలం, ఒకటి ఎన్డీఏ భాగస్వామి అప్నాదళ్ చేతిలో ఉన్నాయి. ఇక్కడ పోటీ ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ మధ్యే నెలకొంది. గతంలో బీఎస్పీకి కూడా గణనీయంగా ఓట్లు పడటంతో పోటీ ఉత్కంఠ రేపుతోంది.



• అనురాగ్ శర్మ

లఖ్‌నవూ... రాజ్‌నాథ్ హ్యాట్రిక్ గురి



• రాజ్‌నాథ్ సింగ్

ఒకప్పుడు కాంగ్రెస్ ఓ వెలుగు వెలిగిన ఈ నియోజకవర్గంలో 1991 నుంచీ కాషాయ జెండానే రెపరెపలాడుతోంది. బీజేపీ దిగ్గజం అటల్ బిహారీ వాజ్‌పేయి 1991 నుంచి 2004 వరకు వరుసగా ఐదు సార్లు ఘన విజయం సాధించిన సీటిది. 2009లో లాల్జీ టాండన్ గెలుపొందగా... ఆ తర్వాత పార్టీలో కీలక నేత రాజ్‌నాథ్ సింగ్ ఇక్కడ పాగా వేశారు. గత రెండు ఎన్నికల్లో ఆయనదే పూర్తి హవా. 2014లో రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు రీటా బహుగుణ జోషిపై 2.7 లక్షల ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. యూపీ మాజీ ముఖ్యమంత్రి హేమవతీ నందన్ బహుగుణ కుమార్తె ఆమె. నందన్ బహుగుణ కూడా ఇక్కడ జనతా పార్టీ తరఫున 1977లో గెలుపొందడటం విశేషం. ఇక 2019లో ఎస్పీ తరఫున పోటీ చేసిన ప్రముఖ నటి, బాలీవుడ్ నటుడు శత్రుఘ్న సిన్హా భార్య పూనమ్ సిన్హాను రాజ్‌నాథ్ 3.5 లక్షల ఓట్ల భారీ తేడాతో ఓడించారు. ఈ ఎన్నికల్లో హ్యాట్రిక్ విక్టరీపై కన్నేశారు. ఎస్పీ తరఫున రవిదాస్ మెహ్రోత్రా బరిలో ఉన్నారు. అఖిలేశ్ ప్రభుత్వంలో కీలక మంత్రిగా పనిచేసిన రవిదాస్‌కు రాష్ట్ర రాజకీయాల్లో మంచి పట్టుంది. బీఎస్పీ నుంచి సర్వర్ మాలిక్ పోటీ చేస్తున్నారు. లక్నో పరిధిలోని 5 అసెంబ్లీ సెగ్మెంట్లలో మూడు బీజేపీ, రెండు ఎస్పీ ఖాతాలో ఉన్నాయి.



• రవిదాస్ మెహ్రోత్రా

ఫైజాబాద్... అయోధ్య కలిసొచ్చేనా!?



• లల్లూ సింగ్

హిందువుల కల నెరవేరిన అయోధ్య రామ మందిరం కొలువుదీరిన లోక్‌సభ నియోజకవర్గమిది. గతంలో ఇది అయోధ్య లోక్‌సభ నియోజకవర్గంగానే ఉండేది. పునర్విభజన తర్వాత ఫైజాబాద్‌గా పేరు మారింది. గత రెండు ఎన్నికల్లోనూ బీజేపీ తరఫున విక్టరీ కొట్టిన లల్లూ సింగ్ ఈసారి హ్యాట్రిక్ కోసం తహతహలాడుతున్నారు. 2014లో గెలవడానికి ముందు ఆయన అయోధ్య అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి ఐదుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించడం విశేషం. సమాజ్‌వాదీ తరఫున పార్టీ వ్యవస్థాపక సభ్యుడు, తొమ్మిదిసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన అవధేశ్ ప్రసాద్ బరిలోకి దిగారు. ప్రస్తుతం ఆయన ఇక్కడి అసెంబ్లీ స్థానం మిల్కిపూర్ సిట్టింగ్ ఎమ్మెల్యే కూడా. ఒంటరి పోరాటం చేస్తున్న బీఎస్పీ సచ్చిదానంద్ పాండేకు టికెటిచ్చింది. ఈ ఎంపీ సీట్లో 76 శాతం హిందువులు, 22 శాతం ముస్లిం జనాభా ఉంటారు. రామజన్మభూమి వివాదానికి తెర దించి రామ మందిరాన్ని సాకారం చేసిన బీజేపీ ఫుల్ జోష్‌లో ఉంది. మోదీ–యోగి ఫ్యాక్టర్‌తో ఈసారి కూడా కచ్చితంగా గెలుపు తమదేనని ధీమాగా ఉంది. ముస్లిం ఓటు బ్యాంకు దన్నుతో ఇండియా కూటమి కూడా గట్టి పోటీనే ఇస్తోంది. ఈ సీట్లో మొత్తం 5 అసెంబ్లీ సెగ్మెంట్లు ఉండగా, నాలుగు బీజేపీ, ఒకటి ఎస్పీ గెల్చుకున్నాయి.



• అవధేశ్ ప్రసాద్

కైసర్‌గంజ్... బీజేపీకి ఎదురుగాలి!



• కరణ్ భూషణ్ సింగ్

వివాదాస్పద బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్ సింగ్ ప్రాతినిధ్యం వహిస్తున్న సీటిది. రెజ్లింగ్ ఫెడరేషన్ ప్రెసిడెంట్‌గా చక్రం తిప్పిన బ్రిజ్‌భూషణ్ లైంగిక ఆరోపణల కేసులో చిక్కుకోవడంతో కాషాయ పార్టీ ఈసారి ఆయనకు సీటిచ్చేందుకు చివరివరకు తటపటాయించింది. కానీ తన కుమారుడు కరణ్ భూషణ్‌కు టికెట్ దక్కించుకోవడంలో బ్రిజ్ భూషణ్ విజయం సాధించారు. సమాజ్‌వాదీ పార్టీకి కంచుకోట అయిన ఈ సీటును కాషాయ గూటికి తెచ్చిన ఘనత ఆయనదే. సమాజ్‌వాదీ దిగ్గజ నేత బేణీప్రసాద్ వర్మ ఇక్కడ వరుసగా ఐదుసార్లు గెలిచారు. 2014, 2019ల్లో బ్రిజ్ భూషణ్ వరుస విజయాలతో ఎస్పీ హవాకు గండిపడింది. ఎస్పీ నుంచి ఈసారి రామ్ భగత్ మిశ్రా పోటీ చేస్తున్నారు. బీఎస్పీ నరేంద్ర పాండేను రంగంలోకి దించింది. దేశవ్యాప్తంగా బీజేపీపై తీవ్ర వ్యతిరేకతకు కారణమైన బ్రిజ్ భూషణ్ కుమారుడికే మళ్లీ టికెటివ్వడాన్ని ఇండియా కూటమి ప్రచారాస్త్రంగా మలచుకుంటోంది. కుమారుడిని గెలిపించుకోవడానికి బ్రిజ్ భూషణ్ తీవ్రంగానే కష్టపడుతున్నా బీజేపీకి ఎదురుగాలి తప్పదంటున్నారు విశ్లేషకులు. ఈ నియోజకవర్గంలో ఐదు అసెంబ్లీ సెగ్మెంట్లకు గాను నాలుగు చోట్ల కాషాయ జెండా ఎగురుతోంది. ఒక చోట ఎస్పీ గెలిచింది.



• నరేంద్ర పాండే

స్మృతి వర్సెస్ కిశోరీ

అమేథీలో మారిన ఎన్నికల చిత్రం

- గెలుపుపై ధీమాతో సిట్టింగ్ ఎంపీ
- స్మృతి తనకు పోటీయే కాదంటున్న శర్మ



అమేథీ. ఉత్తరప్రదేశ్‌లోని ఈ లోక్‌సభ స్థానం గాంధీ కుటుంబానికి పెట్టని కోట.. కాంగ్రెస్‌కు కంచుకోట. అలాంటి దీర్ఘకాల రాజకీయ వారసత్వానికి 2019లో బీజేపీ గట్టి షాకే ఇచ్చింది. ఏకంగా గాంధీ కుటుంబ వారసుడు రాహుల్‌గాంధీనే ఓడించి కాంగ్రెస్ కుంభస్థలం మీద కొట్టింది. పార్టీ తరఫున నెగ్గి జెయింట్ కిల్లర్‌గా అవతరించిన కేంద్ర మంత్రి స్మృతి ఇరానీ ఈసారి కూడా బరిలో ఉన్నారు. కాంగ్రెస్ నుంచి రాహుల్‌కు బదులు గాంధీ కుటుంబ విధేయుడు కిశోరీలాల్ శర్మ బరిలోకి దిగారు. ఓటమి భయంతోనే అమేథీని వదిలి రాయ్‌బరేలీకి మారారంటూ సోషల్ మీడియాలో రాహుల్ ఒక రేంజ్‌లో ట్రోలింగ్‌కు గురయ్యారు. ఈ నెల 20న ఐదో విడతలో పోలింగ్ జరగనున్న అమేథీపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది... - సాక్షి, నేషనల్ డెస్క్



కీలకం

గాంధీల అనుబంధం

అమేథీ లోక్‌సభ నియోజకవర్గం 1967లో ఏర్పడింది. నాటినుంచీ కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉంది. 1977 ఎన్నికల్లో మాత్రం ఎమర్జెన్సీ ప్రభావంతో జనతా పార్టీకి చెందిన రవీంద్ర ప్రతాప్ సింగ్ గెలుపొందారు. ఇందిరాగాంధీ రెండో కుమారుడు సంజయ్ గాంధీని 75,000కు పైగా ఓట్లతో ఓడించారు. 1980 ఎన్నికల్లో సంజయ్ పుంజుకుని రవీంద్ర ప్రతాప్ సింగ్‌ను 1,28,545 తేడాతో ఓడించారు. అదే ఏడాది జూన్‌లో సంజయ్ విమాన ప్రమాదంలో మరణించడంతో జరిగిన ఉప ఎన్నికలో రాజీవ్ గాంధీ 2,37,696 ఓట్ల భారీ ఆధిక్యంతో విజయం సాధించారు. 1984 లోక్‌సభ ఎన్నికల్లో రాజీవ్‌పై సంజయ్ భార్య మేనకా గాంధీ స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగారు. రాజీవ్ దేశవ్యాప్త ప్రచారంలో బిజీగా ఉండటంతో ఆయన తరఫున భార్య సోనియాగాంధీ తొలిసారి ఎన్నికల ప్రచార బరిలో దిగారు. తలపై చీరకొంగు, నుదుటన బొట్టు, చేతికి ఎర్రటి గాజులు, స్వచ్ఛమైన హిందీతో సామాన్యులను బాగానే ఆకట్టుకున్నారు. పెద్ద పెద్ద ప్రసంగాలు చేయకున్నా ఇటు పార్టీ నాయకులకు, అటు ప్రజలకు చేరువయ్యారు. ప్రధానిగా రాజీవ్ అసలు నియోజకవర్గాన్ని పట్టించుకోరన్న ప్రచారం జరిగినా అమేథీ ప్రజలు ఆయనవైపే నిలిచారు. మేనకపై ఏకంగా 3.14 లక్షల మెజారిటీతో రాజీవ్ ఘనవిజయం సాధించారు. అమేథీలో నేటికీ అదే రికార్డు మెజారిటీ. రాజీవ్ మరణించే దాకా అమేథీ నుంచే ప్రాతినిధ్యం వహించారు. తరవాత ఆయన స్థానంలో గాంధీ కుటుంబ సన్నిహితుడు సతీశ్ శర్మ విజయం సాధించి పీవీ కేబినెట్‌లో పెట్రోలియం మంత్రిగా కూడా చేశారు.

బీజేపీ ఎంట్రీ...

1998లోనే బీజేపీ అమేథీలో పాగా వేసింది. సతీశ్ శర్మ రెండుసార్లు గెలిచిన తర్వాత 1998లో బీజేపీ అభ్యర్థి సంజయ్ సింగ్ చేతిలో ఓటమి చవిచూశారు. 1999లో సోనియా అమేథీ నుంచే గెలిచి ఎన్నికల అరంగేట్రం చేశారు. తర్వాత 2004 సార్వత్రిక ఎన్నికల్లో ఇక్కడ రాహుల్ గెలిచారు. 2019 దాకా దశాబ్దన్నర పాటు ఆయన హవాయే సాగింది. 2014 ఎన్నికల్లో రాహుల్ చేతిలో ఓడిన స్మృతి వ్యూహాత్మకంగా నియోజకవర్గంపై బాగా దృష్టి పెట్టారు. దీనికి మోదీ మేనియా తోడై 2019లో రాహుల్‌ను స్మృతీ ఓడించగలిగారు.

ఎస్పీ పూర్తి మద్దతు

అమేథీలో కాంగ్రెస్ నుంచి రాహుల్ బరిలో దిగుతారా, లేదా అన్నదానిపై చిట్టచివరి నిమిషం దాకా ఉత్కంఠే కొనసాగింది. ఒకానొక దశలో అమేథీ నుంచి రాహుల్, రాయ్‌బరేలీ నుంచి ప్రియాంక బరిలోకి దిగుతారన్న ప్రచారమూ జరిగింది. ఎట్టకేలకు నామినేషన్ల దాఖలుకు చివరి రోజున రాహుల్ రాయ్‌బరేలీ నుంచి బరిలో దిగడం ఖాయమైంది. అ మేథీ నుంచి పార్టీ సీనియర్ నేత, గాంధీ కుటుంబానికి అత్యంత సన్నిహితుడు కిశోరీ లాల్ శర్మను కాంగ్రెస్ పోటీకి దింపింది. 40 ఏళ్లుగా నియోజకవర్గంలో క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న శర్మ అందరికీ సుపరిచితుడు. దీనికి తోడు ఇండియా కూటమి భాగస్వామి సమాజ్‌వాదీ ఈసారి కాంగ్రెస్‌కు అన్నివిధాలా దన్నుగా నిలుస్తోంది. అమేథీ, రాయ్‌బరేలీల్లో కాంగ్రెస్ విజయం కోసం రెండు పార్టీల కార్యకర్తలు కలసికట్టుగా పని చేస్తున్నారు. కుల సమీకరణాలు కూడా పని చేస్తున్నాయి. ఈ సారి యాదవులంతా ఒక్కతా టీపైకి వచ్చారు. అఖిలేశ్ చెప్పిన వైపే తమ ఓటంటున్నారు. ఈ సానుకూలత సాయంతో కాంగ్రెస్ తన కంచు కోటను తిరిగి కై వసం చేసుకుంటుందా, స్మృతీయే మళ్లీ గెలుస్తారా అన్నది ఆసక్తికరంగా మారింది.

గ్రామీణ ఓటర్లు 96 శాతం	
పట్టణ ఓటర్లు	4 శాతం
హిందువులు	85 శాతం
ముస్లింలు	15 శాతం
ఎస్సీలు	26.6 శాతం

ఎప్పుడెవరు గెలిచారు

ఏడాది	విజేత	పార్టీ
1967	విద్యాధర్ బాజ్‌పేయ్	కాంగ్రెస్
1971	విద్యాధర్ బాజ్‌పేయ్	కాంగ్రెస్
1977	రవీంద్ర ప్రతాప్ సింగ్	జనతా పార్టీ
1980	సంజయ్ గాంధీ	కాంగ్రెస్
1981	రాజీవ్‌గాంధీ	కాంగ్రెస్
1984	రాజీవ్‌గాంధీ	కాంగ్రెస్
1989	రాజీవ్‌గాంధీ	కాంగ్రెస్
1991	రాజీవ్‌గాంధీ	కాంగ్రెస్
1991	సతీశ్ శర్మ (ఉప ఎన్నిక)	కాంగ్రెస్
1996	సతీశ్ శర్మ	కాంగ్రెస్
1998	సంజయ్ సింగ్	బీజేపీ
1999	సోనియా గాంధీ	కాంగ్రెస్
2004	రాహుల్ గాంధీ	కాంగ్రెస్
2009	రాహుల్ గాంధీ	కాంగ్రెస్
2014	రాహుల్ గాంధీ	కాంగ్రెస్
2019	స్మృతీ ఇరానీ	బీజేపీ

ఓటర్లు.. ఓట్ల శాతం..

అమేథీ లోక్‌సభ స్థానం పరిధిలో జిల్లాలోని అమేథీ, తిలోయి, జగదీశ్‌పూర్, గౌరీగంజ్, రాయ్‌బరేలి జిల్లాలోని సలోన్ అసెంబ్లీ స్థానాలున్నాయి. నియోజకవర్గ జనాభా 20 లక్షల పైచిలుకు. 1999, 2004, 2009ల్లో కాంగ్రెస్ అత్యధిక ఓట్ల శాతంతో గెలిచింది. 2014లో బొటాబొటిగా గట్టెక్కింది. 2019లో 49.7 శాతం ఓట్లతో బీజేపీ గెలిచింది. స్మృతి ఇరానీ 55,000 ఓట్ల మెజారిటీతో రాహుల్‌ను ఓడించారు. అమేథీలో ఏకంగా 96 శాతం ఓటర్లు గ్రామీణులే!

స్మృతి టెంపుల్ రన్...

ఇక ఈసారి స్మృతి ఇరానీ ఆరునెలల ముందునుంచే ఎన్నికల ప్రచారం మొదలుపెట్టారు. అమేథీలో అత్యధిక సంఖ్యాకులైన గ్రామీణ ఓటర్లను ఆకట్టుకునేందుకు నవరాత్రి సందర్భంగా ఆలయాలు సందర్శించారు. అమేథీలోని ఐదు అసెంబ్లీ సెగ్మెంట్లలో ఉన్న ప్రముఖ దేవాలయాలన్నీ దర్శించుకున్నారు. నియోజకవర్గంలోని దాదాపు 42 దేవాలయాలకు తన ఫొటోతో కూడిన బహుమతి ప్యాక్‌లను పంపి ఓటర్లను ప్రసన్నం చేసుకునే ప్రయత్నం చేశారు. ఢిల్లీలో ఉంటూ అమేథీకి ప్రాతినిధ్యం వహించబోనంటూ గతంలో చేసిన ప్రకటనకు అనుగుణంగా ఇటీవలే అమేథీలో ఇల్లు కొని గృహ ప్రవేశం చేశారు. నియోజకవర్గంలో శాశ్వత చిరునామా ఏర్పాటు చేసుకున్నారు. నెహ్రూ–గాంధీ కుటుంబం వల్లే నియోజకవర్గం ఇంత కాలం వెనుకబడి ఉందంటూ ప్రత్యర్థిపై మాటల దాడి తీవ్రతరం చేశారు. బీజేపీ అయితే రాహుల్ తమకు భయపడే అమేథీ వదిలి రాయబరేలీ పారిపోయారంటూ ప్రచారం చేస్తోంది.

నోటా.. కోరల్లేని పులి!

దశాబ్దం క్రితం దేశ ఎన్నికల్లో వినూత్న ప్రయోగానికి తెరలేచింది. పోటీలో ఉన్న అభ్యర్థులు, పార్టీల్లో ఎవరూ నచ్చకపోతే ఏం చేయాలనే ఓటర్ల సందిగ్ధతకు తెరదించుతూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల (ఈవీఎం)లో ప్రత్యామ్నాయం లభించింది. అదే 'నోటా'. బరిలో ఉన్న అభ్యర్థుల్లో ఎవరూ నచ్చలేదని చెప్పే బటన్. అయితే దీన్ని ఎంచుకుంటున్న ఓటర్ల సంఖ్య అంతంతే ఉంటోంది. అభ్యర్థులపై వ్యతిరేకత ఉన్నా నోటాకు వేసే ఓట్లతో ఫలితాలపై ఎలాంటి ప్రభావం ఉండకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. దీంతో ఇది కోరల్లేని పులిగా మారిందనేది విశ్లేషకుల వాదన. ఇండోర్ లోక్‌సభ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి చివరి నిమిషంలో పోటీ నుంచి తప్పకుని షాకివ్వడం, దాంతో నోటాకే ఓటేయాలని పార్టీ పిలుపునివ్వడం తెలిసిందే. దాంతో నోటా మరోసారి చర్చల్లోకి వచ్చింది...

- సాక్షి, నేషనల్ డెస్క్

ఆదరణ అంతంతే



ప్రయోజనం.. ప్చ్!

పార్టీలు ఎన్నికల్లో నేరచరితులు, కళంకితులైన అభ్య**ర్థులను నిలబెట్టకుండా** చూడటమే లక్ష్యంగా పీపుల్స్ యూనియ**న్ ఫర్ సివిల్ లిబర్టీస్** (పీయూసీఎల్) అనే స్వచ్ఛంద సంస్థ **సుప్రీంకోర్టు తలుపు తట్టిం**ది. పోటీలో ఉన్నవారెవరూ ఓటర్లకు **నచ్చని పక్షంలో తాము ఎవ**రికీ ఓటువేయాలనుకోవడం లేదని **చెప్పేందుకు బ్యాలెట్ పేపర్లు**/ఈవీఎంలలో తగిన ఏర్పాటు **చేయాలని ఎన్నికల సంఘాన్ని** ఆదేశిస్తూ 2013 సెప్టెంబర్‌లో **కోర్టు తీర్పు వెలువరించింది.** అలా ఈవీఎంలలోకి నోటా **బటన్ వచ్చి చేరింది. ఈవీఎం** బ్యాలెట్ యూనిట్‌లోని 16 **బటన్లలో చివరి ఆప్షన్‌గా నోటా** ఉంటుంది. దీనికి కూడా **ప్రత్యేకంగా ఇంటూ (X) మార్కు** కూడా కేటాయించారు. **2013లో జరిగిన ఐదు రాష్ట్రాల అ**సెంబ్లీ ఎన్నికల్లో నోటా **గుర్తును తొలిసారి ప్రవేశపెట్టారు.** 2014 సార్వత్రిక ఎన్నికల్లో **దీనికి మరింత ప్రాచుర్యం లభించిం**ది. గత ఐదేళ్లలో జరిగిన **అన్ని ఎన్నికల్లో కలిపి నోటాకు 1.29 కో**ట్ల ఓట్లొచ్చాయి. అయినా **కళంకితులకు టికెట్లిచ్చే విషయంలో పా**ర్టీల తీరులో మార్పేమీ **రాలేదు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న నేరచ**రితుల సంఖ్య అంతకంతకూ పెరు**గుతూనే ఉంది. అయితే ఎస్సీ, ఎస్టీ రిజ**ర్వ్‌డ్ లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవ**ర్గాల్లో మాత్రం నోటాకు ఎక్కువ ఓట్లు ప**డుతుండటం విశేషం!

ఆ పవర్ ఇస్తేనే...

ప్రస్తుత నిబంధనల ప్రకారం నోటాకు అభ్యర్థులందరి కంటే ఎక్కువ ఓట్లొచ్చినా ఎన్నికపై ఎలాంటి ప్రభావమూ ఉండదు. ఆ ఓట్లన్నింటినీ పక్కనపెట్టి అభ్యర్థుల్లో ఎక్కువ ఓట్లు వచ్చిన వారే విజేత అవుతారు. అలా నోటా కేవలం అభ్యర్థులపై ఓటర్లు అసమ్మతిని వ్యక్తం చేసే ఆప్షన్‌గా మిగిలిపోతోంది. అలాగాక నోటాకే ఎక్కువ ఓట్లు పోలైతే తిరస్కరణకు గురైన అభ్యర్థులు మళ్లీ పోటీ చేయకుండా నిషేధించాలి. అప్పుడే పార్టీలు నేరచరితులను పక్కన పెడతాయి'' అని యాక్సిస్ ఇండియా చైర్మన్ ప్రదీప్ గుప్తా అభిప్రాయపడ్డారు. నోటాకు నిర్దిష్ట శాతానికి మించి ఓట్లు పోలైతే అభ్యర్థులను మార్చడం, మళ్లీ ఎన్నిక నిర్వహించడం వంటి మార్గాలను నిపుణులు సూచిస్తున్నారు.

- ఏడీఆర్ డేటా ప్రకారం ఎన్నికల్లో నోటాకు 0.5 శాతం నుంచి 1.5 శాతం మేర ఓట్లు పోలయ్యాయి.
- 2019 లోక్‌సభ ఎన్నికల్లో నోటాకు ఏకంగా 1.06 శాతం ఓట్లు రావడం విశేషం!
- లోక్‌సభ ఎన్నికల చరిత్రలో నోటాకు లక్షద్వీప్‌లో అతి తక్కువగా 100 ఓట్లే పడ్డాయి.
- బిహార్‌లోని గోపాల్‌గంజ్ ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానంలో నోటాకు అత్యధికంగా 51,660 ఓట్లు వచ్చాయి.
- 2018 ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధికంగా నోటాకు 1.98 శాతం ఓట్లు దక్కాయి.
- మహారాష్ట్రలోని లాతూర్ రూరల్ అసెంబ్లీ స్థానంలో నోటాకు అత్యధికంగా 27,500 ఓట్లు పడ్డాయి. మొత్తం ఓట్లలో ఇవి ఏకంగా 13 శాతం! అక్కడ 67 శాతం ఓట్లతో గెలిచిన ధీరజ్ దేశ్‌ముఖ్ తర్వాత నోటాకే రెండో స్థానం దక్కడం విశేషం.
- ఇటీవలి ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో 20 స్థానాల్లో నోటా మూడో స్థానంలో నిలిచింది!
- మధ్యప్రదేశ్, రాజస్తాన్, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో 47 స్థానాల్లో గెలిచిన అభ్యర్థి సాధించిన మెజారిటీ కంటే నోటాకు ఎక్కువ ఓట్లు పడ్డాయి!
- క్రిమినల్ కేసులున్న ముగ్గురికి మించి అభ్యర్థులు పోటీ చేసే రెడ్ అలర్ట్ నియోజకవర్గాల్లో 2018 నుంచి నోటాకు 27.77 లక్షల ఓట్లు పోలయ్యాయి.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943